

శుభప్రదమైన ఈ దీపావళి
మంగళహారతి తో మంగళప్రదంగా మొదలై
మీరు ఎన్నెన్నో కట్టడాలకు పునాదులు వేయాలని
ఆశిస్తూ శుభాకాంక్షలు తెలుపుతుంది...
IS 269
OPC
ORDINARY PORTLAND CEMENT
NETT WT 50 KG
WEEK NO YEAR
NON-LEVY
VISHNU CEMENT
SRI VISHNU CEMENT LTD
SITAPURAM-508246
విష్ణు సిమెంట్

# మనలో మాట

మా పాఠకులు, రచయితలు, రచయిత్రులు, ఏజంట్లు, ప్రకటన కర్తలందరికీ దీపావళి శుభాకాంక్షలు.

ఈ సంవత్సరం ఆంధ్ర సచిత్రవారపత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీలో ఎంతో ఉత్సాహంతో పాల్గొని దానిని జయప్రదం చేసిన వారందరికీ మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము

సంపాదకుని ఎన్నికలో ఈ ఏడాది ఉత్తమంగా వచ్చి, ఒక్కొక్కటీ రు 700/–లు చొప్పున బహుమతిని అందుకున్న ఆరు కథల పేర్లని అక్షర క్రమంలో ఈ దిగువ ఇస్తున్నాము

**★ ఆయమ్మ ★ క్షీరధార ★ కుండీలో పూలమొక్క ★ జాతస్యహి ధృవో మృత్యు... ★ మమతల శిఖరం ★ వీడ్కోలు**

ఈ ఆరు కథలలో మూడింటిని అదే క్రమంలో ఈ వారం సంచికలో వేసాము మిగతా మూడు కథలనీ పై వారం సంచికలో ప్రచురిస్తాము

బహుమతి పొందిన ఈ ఆరుగురు కథా రచయిత(త్రు) లకి మా ప్రత్యేక అభినందనలు

బహుమతి పొందిన ఈ ఆరు కథలలో పాఠకులు అత్యుత్తమంగా ఎన్నుకున్న కథకి మరో రు. 750/–లు అదనపు బహుమతిగా లభిస్తుంది.

పాఠకుల బాలట్‌లో రెండవ స్థానం పొందిన కథకి మరో రు. 650/–లు, మూడవ స్థానంలో వచ్చిన కథకి మరో రు. 550/–లు అదనపు బహుమతులుగా లభిస్తాయి.

మిగతా మూడు కథలకీ ఒక్కొక్క దానికీ రు 350/– చొప్పున కన్సొలేషన్ బహుమతులుగా అంద జేస్తాము

పాఠకుల, బాలట్, వ్యాసరచన పోటీ వివరాలని పై వారం సంచికలో ప్రచురిస్తాము

దీపావళి కథల పోటీకి వచ్చిన కథలలో కొన్నిటిని సాధారణ ప్రచురణకి స్వీకరించాము ఆ విషయాన్ని తెలియ జేస్తూ ఆయా కథారచయిత(త్రు) లకి ఉత్తరాలు రాసాము.

పోటీ నిబంధనలని అనుసరించి ప్రచురణకి స్వీకరించని కథలని ఎటువంటి పరిస్థితిలో నూ తిప్పి పంపటం సాధ్యంకాదు కాబట్టి వాటి విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకీ అవకాశం లేదని మరొకసారి మనవి చేస్తున్నాము –సం




### వేయి పడగలు

పత్రికలో ధారావాహికంగా వస్తున్న విశ్వనాథవారి వేయి పడగలు చదువుతున్నందువలన కలిగిన భావావేశమే నా ఈ ఉత్తరం అంత విలువయిన పుస్తకం కొని చదవలేని వారికి ఆ పుస్తకం అంటే తెలియని వారికి, అసలు సాహిత్యమంటే యిదీ అని చూపించినట్లుగా యాభయి సంవత్సరాల తర్వాత ప్రచురించడం చాలా బాగుంది

సి హెచ్ కామేశ్వరి, సికింద్రాబాద్

### సీరియల్స్

రాజేంద్రప్రసాద్ రజని ముఖ చిత్రంతో వెలువడిన ఆంధ్రసచిత్ర వారపత్రిక చాలా

ఆకర్షణీయంగా ఉంది రావి నూతల సువర్నాకన్నన్ గారి సీరియల్ మంజీరనాదం' చాలా బాగుంటున్నది.

ఆడారి కేశవరావు, అనకాపల్లి

(82 వ పేజీ చూడండి)


## ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు : (1938-1972)
23-29 అక్టోబర్ '87
శ్రీ ప్రభవ నామ సం కార్తీకశు పాడ్యమి
సంపుటము 80 : సంచిక 9
ముఖ్య సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
కార్యనిర్వాహక(యాక్టింగ్) సంపాదకుడు :
మతుకుమల్లి మాధవరావు


| | | |
|---|---|---|
| విడి ప్రతి వెల | రు | 2 75 |
| పోస్టులో 6నెలల చందా | రు | 80 60 |
| పోస్టులో 12నెలల చందా | రు | 161 20 |

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003


### విషయానుక్రమణిక

ముఖచిత్రం .
నటి : భానుప్రియ
(ఫొటో : ఈశ్వర్)

# రమణీయ సుందరుడు శ్రీకృష్ణుడు



ప్రపంచాన్నంతా జయించాలనీ, తొక్కి పట్టాలనీ నాశనం చేయాలని రాక్షసులు ఉద్భవించేవారు. విష్ణుమూర్తి మోహినిగా నృత్యంతోనే భస్మాసురుడ్ని భస్మం చేశాడు. రాముడిగా రావణ సంహారం చేశాడు. కృష్ణుడిగా సత్యభామచే నరకుడ్ని వధించాడు.

ఆశని నాశనం చేసుకోమని, వ్యామోహాన్ని జయించమనీ చెప్పిన కృష్ణుడు, బాల్యంలోనే ఎన్నో చేష్టల ద్వారా వెల్లడించాడు.

మన్ను తిన్నావని తిట్టిన తల్లి యశోదకి నోటిలో బ్రహ్మాండాన్ని చూపాడు. ఈ సృష్టిలో మనిషి జీవితం ఎంత చిన్నదో తెలిపాడు.

అలాగే పదహారు వేలమంది గోపికలకు మానస చోరునిగా వాసిగాంచాడు. అంతటి తుంటరిని వారు ఎంతో మృదు మధుర హృదయునిగా వర్ణించుకున్నారు. వారి ప్రేమలో జన్మాంతర బంధముందో, వేదాంతసారముందో, నిర్మల భక్తితత్వముందో తరచి చూచిన కొద్దీ అమృతప్రాయంగా తోస్తుంది. పద్మ పత్రముల వంటి నేత్రముల గలవాడూ, మల్లె పొదల మాటున దాగాడా అని అడిగారు. సుందర సుకుమారమైన మల్లె పొదలని అంత తుంటరి ఆశ్రయించాడని అనుకోటంలోనే వారిహృదయము తెలిసింది.

కృష్ణుడు వెన్న మీగడలే గానీ పక్తి జనములు ముట్టలేదు కంసుడు స్వంత మేన మామయైనా తల్లిని చెరలో ఉంచాడని సంహరించాడు. ద్రౌపదికి పలువలు పంపి మాన సంరక్షణ చేశాడు. అసహాయురాలై కబురు చేసిన రుక్మిణిని చేపట్టాడు.

తనలో అర్ధభాగమంత ప్రియమైన అర్జునుడు పుత్రశోకంతో అలమటించి శస్త్రాస్త్రాలను విసర్జించితే గీత బోధించాడు. ఆత్మకి మరణం లేదన్నాడు. పరమాత్మ స్వరూపమయిన తనే అందరి ఆత్మలయందూ వసించి ఉన్నానని చెప్పాడు.

అధర్మం పెరిగినపుడు శత్రు సంహారం తప్పదన్నాడు. నావారు అనే పక్షపాతం విడనాడమన్నాడు. పాపాలతో భూదేవి క్రుంగి పోతుంటే వారిని నిర్మూలించి ఆమె భారాన్ని తగ్గించమన్నాడు.

ఈ ధీర గంభీర రసం ఒక్కటే గాక నవరసములు నయనానందకరంగా స్వంతం చేసుకున్న దివ్య మంగళమూర్తి శ్రీకృష్ణుడు. విష్ణువు ఈ అవతారంలోనే సృష్టిలోని అందం, ఆనందం, ప్రేమ, త్యాగం, బాల్య, యవ్వన కౌమార దశలో కృష్ణుని ద్వారా చూపాడు.

స్త్రీ రూపంలో హరి మోహినిగా భువనైకసుందరి. అలాగే కృష్ణ రూపంలో భువనైక మోహనుడు. ఎవరి నామాన్ని గానం చేసినా ఒక్కసారైనా కృష్ణ నామాన్ని గానం చేస్తేనే పరిపూర్ణత. ఏ వేషం కట్టినా, కృష్ణ వేషధారే కన్నుల పండుగ చేస్తాడు. ఎన్ని నృత్య సంప్రదాయాలున్నా, కృష్ణ ముద్దు చేష్టలు వర్ణించే తరంగ నృత్యం పళ్లెంపై చెంబుతో చేసినదే ఆకర్షణగా ఉంటుంది.

అంతటి కృష్ణుడు కూడా సత్యభామా విధేయుడై ఆమె పాదంతో తన్నినా భరించాడు. స్త్రీలోని శక్తికి తలవంచాడు. ఆమెను నరకుడ్ని చంపమని తను మూర్ఛపోయాడు. అంటే స్త్రీకి ఎందులోనూ లోటు చెయ్యకూడదనే భావాన్ని చేతల ద్వారా చూపాడు. అలాగే తర్వాత ఆమె అహంకారాన్ని అదగించాడు. అంతటి కృష్ణుడు భక్తితో రుక్మిణి వేసిన తులసి దళంకి తూగాడు.

మదం, మత్సరం, ఈర్ష్య, అసూయ, ఒకరిని దోచాలనే దురాశ ఇవన్నీ వినాశనానికి హేతువులని కృష్ణుడు బోధించినట్లు ఇంకే పురాణాలూ గ్రంథాలూ చెప్పలేదు. ప్రేమనే అమృతమేగానీ, కామమనే అగ్ని, అనుమానమనే గాలి మనకు కృష్ణావతారంలో గానీ, భాగవతంలో గానీ కనిపించవు.

సంవత్సరంలో కృష్ణుని పూజించే పండగలెన్నున్నా, సత్యభామా విధేయుడై చీకటిని తొలగించే ఈ దివ్వెల పండుగ కృష్ణుని మరీ మరీ కొలిచేట్లు చేస్తుంది. లోక శోక వినాశకుడైన కృష్ణుడే అజ్ఞానమనే చీకటిని తొలగించి జనులను జ్ఞానులుగా చేయాలి. మోహన రూపుడైన గోపాలుడు రమణీయ సుందరమూర్తి.

–కె నాగేశ్వరి

# అమెరికాలో హింసా కేంద్రం

## న్యూఆర్లీన్స్ లేఖ



డా. జయదుబాషి

న్యూఆర్లీన్స్ ఇది మార్క్ట్వైన్ వ్రాసినటు వంటి దేశం ఇక్కడ ఇంకా నగరం చుట్టూ మిసిసిపీ నది పరవళ్ళు తొక్కుతున్నది భారీ నీటి చక్రాలతో పాత నావలు నది మీద ఇంకా తిరుగుతున్నాయి కాని నేనిక్కడికి వచ్చినది అందుకోసం కాదు నేనిక్కడికి డిసైర్ అనే పేరుగల కారును చూడడానికి వచ్చాను. డిసైర్ అనే పేరుతో టిన్నెస్సీ విలియమ్స్ రాసిన నాటకాన్ని కాదు అసలు వాస్తవానికి ఆ పేరుతో ఒక కారు ఉండగా అయన ఆ పేరుకు ప్రఖ్యాతి తెచ్చాడు ఆ కారు సిమెటరీస్ అనే పేరుగల మరొక కారుతో కలిసి నగరంలో ఇంకా తిరుగుతూనే ఉన్నది

టిన్నెస్సీ విలియమ్స్ అసలు పేరు మరేదో ఉంది ఆయన కుటుంబం దాదాపుగా ఆయనను బహిష్కరించినప్పుడు ఉత్తరాదిన గల సెంట్ లూయిస్ నుంచి ఆయన ఇక్కడికి వచ్చాడు యుద్ధం కన్నా ముందు న్యూఆర్లీన్స్‌లో చౌకగా జీవితం గడిచిపోయేది ఇప్పటికీ న్యూయార్క్ కన్నా శాన్‌ఫ్రాన్సిస్కో కన్నా ఇక్కడ జీవితం చౌకే అందుకే ఇక్కడికి వచ్చిన విలియమ్స్ ఫ్రెంచ్ క్వార్టర్‌లో ఒక గది తీసుకున్నాడు ఈ నగరాన్నీ, దానితో పాటు లూసియానా రాష్ట్రాన్నీ నెపోలియన్ అమెరికన్లకు కారు చౌకగా అమ్మివేసే వరకూ ఈ ప్రాంతంలో ఫ్రెంచివాళ్ళు నివసిస్తుండేవాళ్ళు నిజానికి నేను కూడా ఫ్రెంచి క్వార్టర్‌లోని ఒక చిన్న హోటల్లో గది తీసుకున్నాను ఆ హోటల్లో నౌకర్లు ఇంకా ఫ్రెంచి బాషే మాట్లాడుతున్నారు ఐతే పారిస్‌లో మాట్లాడేటటు వంటి ఫ్రెంచ్ కాదనుకోండి అది వాళ్ళు మాత్రమే అర్థం చేసుకోగలిగి నటువంటి తప్పుల తడక ఫ్రెంచి విలియమ్స్ నివసించిన చోటికి నా గది కొన్ని భవనాల దూరంలోనే ఉంది అయన బట్టలు ఉతికించుకున్న లాండ్రీ షాపు నా గదికి పొరుగుననే ఉంది ఐతే విలియమ్స్ చనిపోయాడనుకోండి అయన ఆత్మహత్య చేసుకున్నాడని అంటారు కాని అయన చనిపోయే నాటికి అమెరికాలోని రచయిత లందరిలోకీ అతి సంపన్నుడు. అయన కోటి డాలర్ల ఆస్తికి స్వంతదారు


జాజ్ సంగీతం పుట్టినది కూడా న్యూఆర్లీన్స్‌లోనే. మొట్టమొదటి జాజ్ సంగీత బృందాలు తమ సంగీతం వినిపించిన హోటల్ ఇంకా అక్కడే ఉంది. అక్కడ ప్రతి రాత్రీ జాజ్ సంగీతం వినిపిస్తుంటారు నగరంలో మంచి భోజనం అక్కడేదొరుకుతుందని అంటారు అది మీరూ నేనూ ఇష్టపడదగినటు వంటిది కాదనుకోండి ఫ్రెంచ్ క్వార్టర్‌లోని ప్రతి రెండో భవనమూ ఒక భోజనశాలే అక్కడ మీకు ఎటువంటి భోజనమైనా దొరుకుతుంది కాని నేను చూసినంత వరకూ నాకక్కడ బారతీయ భోజనశాల కనబడలేదు తర్వాత అక్కడి మంచి భోజనశాలలు వియత్నామీయులవి. ఎందుకంటే న్యూఆర్లీన్స్‌లో చాలామంది వియత్నామీయులున్నారు వాళ్ళు చిన్నవి, చౌకయినటువంటి భోజనశాలలు నడుపుతుంటారు

జనాభా చాలా తక్కువ అయినప్పటికీ న్యూఆర్లీన్స్ దాదాపు ఒక అంతర్జాతీయ నగరమే ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన యాత్రికులతో కిక్కిరిసి ఉన్నట్టు కనపడుతుందది బారతదేశం నుంచి కూడా యాత్రికులు వస్తారనుకోండి నేను మిసిసిపి నదిమీద ఒక చిన్న బోటు షికారుకు వెళ్లాను అది దాదాపుగా గంగ మీదనో గోదావరి మీదనో షికారుకు వెళ్ళినట్టుగానే ఉంది పడవ నిండా అన్ని ప్రాంతాల యాత్రికులూ ఉన్నారు ఒక గుజరాతీ కుటుంబం కూడా ఉంది గుజరాత్ నుంచి వచ్చిన వాళ్ళు కాదు లాస్‌ఎంజెల్స్ నుంచి వచ్చిన వాళ్ళే అమెరికాలో ముఖ్యంగా తూర్పు ప్రాంతంలో వేలాది గుజరాతీ కుటుంబాలు స్థిరపడ్డాయి వాళ్ళు మోటిల్స్ అని పిలవబడే చిన్న హోటళ్ళను నడుపుతుంటారు నేనెప్పుడూ ఆ మోటిల్‌లలో ఉండలేదు గాని, ఉన్నవాళ్ళు మాత్రం అవి చాలా అసౌకర్యంగా ఉన్నాయని చెప్తారు ఐతే అవి లాబసాటిగానే ఉండి ఉండవచ్చు ఎందుకంటే ఆ కుటుంబాలలో అత్యధిక బాగం ఇప్పుడు కోట్లకు పడగలెత్తుతున్నాయి

ఇక అక్కడ నీగ్రోలున్నారు వాళ్ళనిక్కడ నల్లవాళ్ళని పిలుస్తారు నీగ్రోలని పిలిస్తే వాళ్ళు ఇష్టపడరని కూడా అంటారు న్యూఆర్లీన్స్‌లో ప్రతి రెండో వ్యక్తి నల్లవాడే కొన్ని పొరుగు ప్రాంతాలలో అయితే అందరూ నల్లవాళ్ళే కానీ ఆశ్చర్యకరంగా నల్లవాళ్ళవి గాని నల్లవాళ్ళు నడిపించేవి గానీ అయినటువంటి దుకాణాలు భోజనశాలలు చాలా తక్కువ ఐతే టాక్సీలు నడుపుతూ భోజనశాలల బల్లల దగ్గరనో బార్‌లలోనో సర్వ్ చేస్తూ జాజ్ సంగీతం వినిపిస్తూ నల్లవాళ్ళు చాలా చోట్ల కనపడతారు పెద్ద పెద్ద నల్లవాళ్ళ బృందాలు పార్కులలో బహిరంగ స్థలాలలో జాజ్ వాయించి చుట్టూ నిలబడ్డ వాళ్ళ ముందర టోపీ తిప్పుతారు వాళ్ళలో చాలామంది తాగి ఉంటారు వాళ్ళతో కనుక జాగ్రత్తగా వ్యవహరించనట్టయితే ఎక్కువగా ప్రమాదకరంగా కూడా ఉంటారు ఐతే వాళ్ళతో వ్యవహరించటం అంత సులభం కాదు ఎందుకంటే వాళ్ళు భారీ మనుషులు, పొడుగ్గా, కండలు పెంచి ఉంటారు చాలా హింసాత్మకంగా కూడా ఉంటారు

నేను ఒక చిన్న భోజనశాలలో కూచుని ఉన్నాను దాన్ని ఒక బక్కపలుచని వియత్నామీస్ అమ్మాయి నడుపుతున్నది అక్కడ నేను కాఫీ కేకు తీసుకుంటూ ఉండగా లావుగా మొరటుగా ఉన్న ఒక నల్ల యువకుడు లోపలికి తోసుకొచ్చాడు అప్పుడు బైట వర్షం కురుస్తున్నది గనుక తల దాచుకోవడానికి వచ్చాడనుకున్నాం కాని మా ఊహ తప్పు

ఆ భోజనశాల దాదాపు ఖాళీగానే ఉన్నప్పటికీ



ఆయన నా బల్ల దగ్గరే కూచున్నాడు ఒక బీరు ఫ్రైడ్ రైస్ రోస్ట్ మాంసం తెమ్మని చెప్పాడు అప్పటికి బైట ఇంకా చీకటిగా చలిగా ఉన్నది గనుక నేను మరి కాస్త కాఫీ తెమ్మని చెప్పి అట్లాగే కూచున్నాను ఆ నీగ్రో కూడా అట్లాగే కూచుని ఉండిపోయాడు

ఇక అక్కడి నుంచి వెళ్ళిపోయే సమయం అయ్యేసరికి నాదగ్గరేమన్నా డబ్బుందా అని ఆ వ్యక్తి అడిగాడు నా దగ్గర బిల్లుకు సరిపోయేటన్ని డాలర్లు ఉండి ఉంటాయన్నాను

అప్పుడే దివాళా తీశారా? ఇండియా నుంచి ఇంత దూరం వచ్చారు మీరు దివాళా తీయడానికి వీలులేదు అన్నాడాయన

ఆయనకు సరిగ్గా ఏం కావాలో చెప్పమని అడిగాను ఆయనను బిల్లు కట్టకుండానే బైటికి వెళ్ళనివ్వమని ఆ అమ్మాయితో చెప్తానన్నాను కాని ఆయనకు కావలసిందది కాదు ఆయనకు మాదక ద్రవ్యాల కోసం పది డాలర్లు కావాలట

నా దగ్గర పది డాలర్లు లేవని నేను చెప్పాను కనీసం రెండు డాలర్లు కూడా లేవని నా దగ్గర డబ్బు ఉండి ఉంటే ఇటువంటి చౌకబారు స్థలంలో ఎందుకు భోంచేస్తూ ఉండి ఉంటానని అన్నాను ఆయన తన పట్టుదల వదలలేదు

అప్పుడే ఒక పోలీసు లోపలికొచ్చాడు అమెరికాలో పోలీసును కాప్ అంటారు ఆయన లోపలికొచ్చాక కూడా ఆ నల్ల యువకుడు కదలలేదు కాని




దీపావళి సందడి

చిత్రం వెల్లటూరి పూర్ణానందశర్మ

ఆయనక్కడ ఉండడం అవకాశంగా తీసుకుని నేను నా బిల్లు చెల్లించి బైటపడ్డాను అప్పుడా కాప్ అక్కడ లేకపోయి వుంటే నా పని పట్టి ఉండేవాడని తర్వాత తెలిసింది న్యూయార్క్‌లోని హార్లెమ్‌లో నగర పోలీసుల కళ్ళ ముందరే ఇటువంటి పనులు జరిగిపోతుంటాయి

ఇది తెల్లవాళ్ళకూ నల్లవాళ్ళకూ మధ్యనున్న విషయం కాదు ఎందుకంటే ఆ దేశంలో తెల్లవాళ్ళు కూడా అట్లాగే హింసాత్మకంగా ప్రవర్తిస్తారు అమెరికా నైతిక విలువలలో హింస ఒక భాగం అందుకే దాన్ని మీరు ప్రతి చోటా ముఖ్యంగా అమెరికన్ సాహిత్యంలో చూడగలుగుతారు టెన్నెస్సీ విలియమ్స్ స్వయంగా ఒక హింసాత్మక నాటక రచయిత హెమింగ్వే కూడా అంతే ఆయన ఉత్తమ కథల నిండా హింస ఉంటుంది డిసైర్ అనబడే వీధి కారు అనే రచనలో నాయిక బ్లాంచ్ డుబోయిని ఆమె స్వంత బావ చెరుస్తాడు చివరకి ఆమె పిచ్చి దవుతుంది మానసిక రోగుల చికిత్సాలయానికి చేరుతుంది

నేను ఒక సాయంత్రం ఆ స్ట్రీట్ కార్‌లో షికారు కెళ్ళాను అప్పుడు అందులో ఎక్కువమంది లేరు నేను చౌకగా ఆ షికారుకు వెళ్ళగలిగాను నాకు ఖర్చయింది ఒక డాలరే కాని అందులో అప్పుడు ఒకే ఒక్క ప్రయాణీకురాలుంది ఆమె ఒక ముసలి స్త్రీ బాగా తాగినట్టున్నది ఆ సమయంలో ప్రయాణించడం మంచిది కాదని క్షేమం కాదని నేననుకున్నాను అప్పుడప్పుడు చొప్పున విలియమ్స్ న్యూఆర్లీన్స్‌లో పది సంవత్సరాలపాటు నివసించాడు ఆయన ఇల్లు ఒక రకమైన ప్రదర్శనశాల ఆయన ఆ ప్రాంతపు హింసనంతా తన అత్యుత్తమ అద్భుత నాటకాల్లోకి అవాహన చేసుకున్నట్టున్నది □



1987 దీపావళి కథల పోటీలో రు.700/-లు బహుమతి పొందిన కథ

# రాజమ్మ

## 'సుజాతా, నేను కూడా రానా తల్లీ?'

## మెట్లు దిగుతున్న సుజాత క్షణం ఆగి, వెనక్కి తిరిగి

## 'మీరా? మీరెందుకు?' అంది అదోలా నవ్వి.

### 'డాక్టరమ్మ పరీక్షలేవో చేస్తుంది కదా? భయం లేదా మరి?'

### అత్తగారి అమాయకత్వానికి ఫకాల్న నవ్వింది సుజాత.....

ఆ నవ్వుకి మనసు చిన్నబుచ్చుకున్నా వెంటనే సర్దుకు పోయింది రాజమ్మ అయినా తను సత్తెకాలపు మనిషి తనకేం తెలుసు గనుక?

రిక్షాయెక్కి వెళ్ళిపోతున్న కోడలిని చూస్తూ అలాగే వీధి అరుగుమీద చతికిలబడి పోయింది చాలాసేపు

ఆమె మనసు నిండా ఒకటే ఆలోచన తను నానమ్మ కావాలి వచ్చీరాని మాటలతో తన మనవడు మమ్మమా మ్మ అంటూ తనవైపు ప్రాకుకుంటూ వస్తే తను అక్కున చేర్చుకుని ముద్దులతో ముంచెత్తి నిలువెల్లా పులకించి పోవాలి తన యీ చిన్న కోరిక తీరుతుందా?

రాత్రి సుజాత నాలుగు రోజులుగా నలతగా ఉంటోంది రేపు డాక్టర్‌కి చూపించు కోవాలన్నప్పుడు ముందు యెంతగానో కంగారు పడిపోయింది రాజమ్మ కాని అసలు విషయం గ్రహించుకున్నాక ఆనందం పట్టలేక పూజా మందిరంలోకి పరుగున వెళ్ళి భగవాన్ యిన్నాళ్ళకి నా పూజలందుకున్నావా తండ్రీ? అంటు సాష్టాంగపడిపోయింది ప్రక్క నే గోడకి తగిలించిన ఫోటో వైపు తిరిగి ఏమండీ



మీరు తాతయ్యా కాబోతున్నారండీ చూడండి తాతయ్యా అని పిలిపించుకునే అదృష్టం మీకు లేకపోయినా నేను నానమ్మా అని పిలిపించు కుంటానండీ ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న రాజమ్మ కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి

తెల్లవారి లేచిన దగ్గర్నుంచీ రాజమ్మకు భూమ్మీద కాలు నిలవడం లేదు పదిగంటలు యెప్పుడవు తుందా సుజాత ఆసుపత్రికి వెళ్ళివచ్చి తన చెవిన ఆ శుభ వార్త ఎప్పుడు వేస్తుందా అని యెదురు చూస్తోంది ముందు తను కూడా సుజాతకి తోడుగా వెళ్ళాలనే నిశ్చయించుకుంది కాని తర్వాత యేమాలోచించుకుందో యేమో విరమించుకుంది. మళ్ళీ పాతికేళ్ళ తర్వాత తన యింట్లోకి తప్పటడుగులు వేసే చిన్నారి కృష్ణుడు వస్తాడు ఇంక మళ్ళీ గోరుముద్దలు జోలపాటలు లాలిపాటలు

రాజమ్మ ఆలోచనలు అలా అలా గతంలోకి ఒక్కసారిగా పాతికేళ్ళు వెనక్కి వెళ్ళి పోయాయి

* * * * *

కన్ను మూసే లోపల నిన్నొక బిడ్డతల్లిగా చూడాలనుకున్నాను తల్లీ నా కోరిక నెరవేర కుండానే ఆ భగవంతుడి పిలుపు వచ్చేసింది జగన్నాదంగారు రాజమ్మ తల నిమురుతూ రాజమ్మ చెంపల మీదుగా జాలువారుతున్న కన్నీరు తుడిచారు

తండ్రి చేతిని రెండు చేతులలోకి తీసుకుంది రాజమ్మ నాన్నా నాకు పిల్లలు లేరని మీరెందుకనుకుంటున్నారు? అక్కయ్య పిల్లలు నా వాళ్ళు కారా? నా మరిది పిల్లలు నా వాళ్ళు కారా? బాధపడకండి నాన్నా తండ్రిని అనునయించా లని అంటున్నా మనసులో యేదో తీరని వెలితిగానే ఉంది రాజమ్మకి

వాళ్ళంతా నీ వాళ్ళు యెలాగవుతారుతల్లీ నాది అన్న నలుసు నీ కడుపున పుట్టాలని నా ఆరాటం కాని మరి ఆ దేవుడు కరుణించలేదు ఏ అక్కయ్య పిల్లలనో నువ్వు అభిమానంతో చేరదీసినా 'ఎరవు' ఎరవే అవుతుంది గాని నీది కాదుగదా?' జగన్నాధంగారి గొంతు బాధతో పూడుకు పోయింది

చిన్నప్పటి నుండి జగన్నాదం గారికి పిల్లలంద రిలో 'రాజమ్మ అంటేనే ఒక విధమైన ఆప్యాయత పంచ ప్రాణాలు రాజీకి యే చిన్న కష్టం కలిగినా అతని మనసు విలవిల్లాడి పోయేది

జగన్నాదం గారి పెద్ద కొడుకు ప్రసాద్ బొంబాయిలో ఇంజనీరు పెద్దకూతురు హైమ ఎమెస్సీ చేసి డాక్టర్ శేఖర్ బార్యగా స్థిరపడింది. కడసారి కూతురు రాజమ్మ చదువు లేని కారణంగా రాజమ్మ పెళ్ళి కూడా ఒక పెద్ద సమస్యగా తయారయ్యింది తల్లిదండ్రులకి ఇరవై యేళ్ళు నిండుతున్నా సంబందం కుదరకపోయే సరికి దిగులుతో మంచం పట్టిన తల్లి తీరని కోరికతోనే కన్ను మూసింది. చివరి ఘడియ వరకు ఏమండీ మన రాజి తల్లిని ఒక యింటి దానిగా చూడాలని ఉందండీ అంటూనే ప్రాణం విడిచింది

తల్లి పోయిన తర్వాత తండ్రితో రాజమ్మ అనుబంధం మరీ యెక్కువైంది ఒక తల్లిగా ఆ తండ్రిని సాకింది. కూతురిగా సపర్యలు చేసింది

మరో రెండేళ్ళకి రాజమ్మ పెళ్ళి గోపాల్రావుతో జరిగి పోయింది గోపాల్రావు పెద్దగా చదువు కోక పోయినా తల్లి దండ్రులు సంపాదించిపెట్టిన తరతరాల ఆస్తి ఉంది తండ్రి పరపతితో సంపాదించుకున్న చిన్న గుమాస్తా ఉద్యోగం ఉంది ఈ అన్నింటినీ మించిన మంచితనం అతని ఆస్తి రాజమ్మకు కలిసొచ్చిన యీ అదృష్టానికి నలుగురూ ఈర్ష్య చెందినా జగన్నాదం గారు మనసారా సంతోషిం చారు ముక్కోటి దేవతల ఆశీస్సులను తమ ఆశీస్సులుగా అందించారు

పిల్లాపాపలతో దీర్ఘ సుమంగళిగా కలకాలం వర్ధిల్లు తల్లీ అంటూ దీవించారు

ఆ తండ్రి దీవెనలే సారెలుగా అత్తవారింట అడుగుపెట్టిన రాజమ్మ కాలచక్రంలో అయిదేళ్ళు గడిచి పోయినా తల్లి అయే అదృష్టానికి నోచుకోలేదు తమ తర్వాత పెళ్ళి అయిన మరిది యేడాది తిరక్కుండానే తండ్రి అయ్యాడు ఒక మగబిడ్డకి తనకింక జన్మలో ఆ అదృష్టం లేదని తెలుసుకున్న రాజమ్మ కుమిలి కుమిలి యేడ్చింది వంశోద్ధారకుడు కలగలేదనే బాదతో అత్త మామల సూటీ పోటీ మాటలు గొడ్రాలిగా ముద్ర వేసిన సంఘం కాకుల్లా పొడుచుకు తినే లోకుల మాటలు ఆమెనెంతగానో కృంగదీసాయి దుఃఖాన్ని యెంత గుండెల్లోనే అదిమి పెట్టినా మనసు అట్టడుగు పొరల్లో దాగిన ఆ మాతృత్వపు కోరిక ఉన్నట్లుండి పైకి పెల్లుబికి రాజమ్మ చెంపలను తడిపేసేది తన మనసులోని కోరిక ఓసారి భర్త ముందు బయట పెట్టింది. కాని ఎవర్నో పెంచుకుంటే వాడు మన కొడుకు యెలాగవుతాడు రాజీ? అన్న భర్త అబిప్రాయంతో ఏకీబవించ లేక పోయింది

ఈ దిగులుకు తోడు తండ్రి మరణంతో మరింతగా కృంగిపోయింది రాజమ్మ

మరో ఆర్నెల్లకి రెండవ కాన్పులో భార్య బిడ్డ



మరణించగా మరిది జీవితం క్రొత్త మలుపు తిరిగింది మరిది పెద్దకొడుకు ఏడ్వర్ధం రఘు పెద్ద తండ్రి దగ్గరికి చేరాడు ఏక్షణాన రఘును రాజమ్మ అక్కున చేర్చుకుందో గాని ఆ యిద్దరి మధ్య విడదీయరాని బంధం పెన వేసుకు పోయింది రఘు రాజమ్మ గోపాల్రావులు యిద్దరికీ బాగా మాలిమి అయ్యాడు బిడ్డకి సవతి తల్లి పెంపకం యిష్టం లేని మరిది రఘుని శాశ్వతంగా అన్న వదినల దగ్గర వదిలి పెట్టాడు ఇప్పుడింక రాజమ్మకి యేలోటూ లేదు అసలు ఆలోచించే తీరికే లేదు చేతినిండా పని రఘు ఆటపాటలతో చిన్నారి చేష్టలతో ఆ దంపతులకి కాలగమనమే తెలియలేదు రాజమ్మ తాను గొడ్రాలినన్న విషయమే మర్చి పోయింది. రఘు అమ్మా అని పిలిచినప్పుడు రాజమ్మ శరీరంలోని అణువణువూ పులకించి పోయేది. అరక్షణం రఘు కంటబడకపోయినా అరికాలు వెచ్చగా ఉన్నా రాజమ్మ మనసు విలవిల్లాడేది

కాలక్రమేణా రఘు రాజమ్మ కొడుకైపోయాడు

* * * * *

ఉన్నదానితో తృప్తిగా బ్రతుకుతున్న రాజమ్మ బ్రతుకు గుండెపోటుతో భర్త మరణించడంతో మరో మలుపు తిరిగింది అప్పటికి రఘు స్కూల్ ఫైనల్‌లో ఉన్నాడు

చుక్కాని లేని పడవ అయింది రాజమ్మ స్థితి రఘు కోసం రఘు భవిష్యత్తు కోసం కొండంత ధైర్యంతో నిలబడింది తండ్రి దీవెన గుర్తొచ్చి నప్పుడల్లా తనలో తానే నవ్వుకునేది రాజమ్మ పిచ్చి నాన్నా పిల్లా పాపలతో దీర్ఘ సుమంగళిగా జీవించమన్నావు కదూ? అంతటి అదృష్టం కూడానా యీ రాజమ్మకి? అని

* * * * *

అత్తయ్యా నాకేదో భయంగా ఉంది ఆయన కూడా ఊళ్ళో లేరు' కళ్ళల్లో నీరు నింపుకున్న సుజాత బేల ముఖం చూసి రాజమ్మ కళ్ళు కూడా చెమ్మగిల్లాయి ఏం చేయాలో తోచక ఆతృతగా ముందుకి వచ్చి సుజాత యెత్తైన పొట్టని చేత్తో తడిమి చూసింది తన కంటికి వెలుగు తన ఆశల ప్రతిరూపం మరికాస్సేపట్లో తన చేతుల్లోకి రాబోతున్నాడు అంతటి ఆవేదనలోను రాజమ్మ కళ్ళు ఆనందంతో మెరిసాయి

పర్వాలేదమ్మా కాస్త ఓపికపట్టు పనసపండు లాంటి కొడుకు పుడతాడు కోడలికి ధైర్యం చెప్పిందే గాని మనసంతా అధైర్యంగానే ఉంది ఇది సుజాతకి రెండవ కాన్పు. ఈసారైనా పుట్టిన బిడ్డ దక్కితే యేడు కొండలు నడిచి యెక్కుతానని మ్రొక్కుకుంది రాజమ్మ డాక్టర్ చెప్పిన మాటలు యింకా చెవుల్లో గింగురు మంటున్నాయి అమ్మాయికిదే ఆఖరి కాన్పు కావాలి లేకపోతే తల్లికి ప్రాణగండం

ఆ మాటలు గుర్తొచ్చినప్పుడల్లా రాజమ్మకి ముచ్చెమటలు పోస్తున్నాయి ఈ ఒక్క అవకాశం చేజారిపోతే సుజాత కింక తల్లి అయే అదృష్టంలేదు... భగవాన్ అలా జరగకూడదు . నా కోడలికి నా పోలిక రాకూడదు...

సుజాత అనుభవిస్తున్న ప్రసవ వేదన ఒకవైపు, మరో వైపు యేదో అవ్యక్తమైన భయం రాజమ్మ పిచ్చి పట్టిన దానిలా డాక్టర్ సౌజన్య గదివైపు పరుగుతీసింది కాళ్ళు పట్టుకు బ్రతిమాలింది పరిస్థితి సర్ధం చేసుకోమని అర్థించింది డాక్టర్ యిచ్చిన అభయం ఆమెకు కొండంత ధైర్యాన్నిచ్చింది

* * * * *

గదిలోకి అడుగు పెట్టబోయిన రాజమ్మ సుజాత మాటలకి టక్కున గుమ్మంలో నే ఆగిపోయింది

'ఏమండీ . . బాబు అచ్చం మీ లాగే ఉంటాడు కదండీ '

ఊహూ . నీ పోలికే... రఘు అంటున్నాడు

ఏం పేరు పెట్టాలనుకుంటున్నారు"

నువ్వు చెప్పు

ముందు అడిగినది నేను మీరే చెప్పాలి

గోపాలకృష్ణ అని పెడదాం ఊపిరి బిగబట్టి కొడుకు సమాదానం కోసం యెదురు చూస్తున్న రాజమ్మ తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది ఆ పేరు విన్న సుజాత మాత్రం ముఖం ప్రక్కకి త్రిప్పుకుంది అర్ధాయుష్షుతో పోయిన ఆయన పేరెందుకు? ఇంకేదైనా పెట్టండి ఆపై సంబాషణ వినలేక రాజమ్మ ప్రక్కకి తప్పుకుంది

బాలసారెనాడు మనవడికి వంశీ' అని నామ కరణం చేయడం చూసి నిర్లిప్తంగా ఉండి పోయింది రాజమ్మ ఏ పేరు పెట్టుకుంటేనేం? పదికాలాల పాటు చల్లగా ఉంటే చాలు ' అనుకుంది మనసులో నే

ఇంకొక వారం రోజుల్లో కొడుకు కోడలుతో బయల్దేరాలి ఆ ఊళ్ళో తనకున్న వ్యవహారాలవీ త్వరత్వరగా సెటిల్ చేసుకుంటోంది మనవడితో ఊరికి ప్రయాణమంటే ఆవిడకి ఆకాశాన్నందుకున్నట్లుగా ఉంది చుట్టు ప్రక్కల అమ్మలక్కలు హాస్యమాడారు మళ్ళీ ఎప్పుడు రాక? మనవడి దగ్గరే సెటిలై పోతారా" అంటూ

రాజమ్మ ఉంటున్న యిల్లు అద్దెకివ్వడానికి నిర్ణయించుకుంది వారం రోజులు ముందునుంచీ సామాన్లవీ సర్దుతూనే ఉంది ఆ హడావుడి యింతా అంతా కాదు వంశీ కి కావల్సినవన్నీ ఒక పెట్టిలో విడిగా సర్దింది పట్టె మంచం కూడా పట్టుకు వెడితే బాగుండును తల్లీ పిల్లడు పడుకునేందుకు బాగుంటుందను కుంటూ రఘు నా విషయం అడుగుదామని బయల్దేరింది రఘు సుజాత యేదో ఘర్షణ పడుతున్నట్లు గమనించి గుమ్మం బయటే ఆగిపోయింది

అత్తయ్య కూడా వస్తున్నారా మనతో?'

అవును ఏం? నేనే రమ్మన్నాను ఒంటరిగా యిక్కడ యెన్నాళ్ళని ఉంటుంది పైగా యిప్పుడు మనవడితో కాలక్షేపం కూడా ఉంటుంది నువ్వూ, నేనూ యిద్దరం బయట ఉద్యోగాలకి వెళ్ళిపోతే వంశీ ని కంటికి రెప్పలా చూసుకుంటుంది '

వంశీ ని చూసుకునేందుకు అక్కడ చాలా కేర్ సెంటర్‌లున్నాయి


సుజాతా! దాదాపు అరిచినట్లుగా అన్నాడు రఘు

ఎందుకలా అరుస్తారు? పైగా ఆవిడకి పిల్లలని యెలా పెంచాలో యేమిటో యేం తెలియదు ' అంతా పాతకాలం పద్ధతులు ఏమైనా చెప్తే ఊరంత కోపం నీట్‌నెస్ లేదు ఏ చేతులతో పడితే ఆ చేతులతోనే యెత్తుకుంటూ ఉంటారు ' 'వద్దం'టే మానరు అలా చేస్తే బాబుకి ఇన్ఫెక్షన్స్ అవీ వస్తాయంటే అర్ధం చేసుకోరు వంశీ పెద్ద వాడయే వరకు ఆవిడ నిక్కడే ఉండనివ్వండి ఆ తర్వాత తీసుకువెళ్దాం

'సుజాతా నన్ను పెంచి పెద్ద చేసింది అమ్మకి పిల్లల పెంపకం తెలియదంటావా? ఇంటికో పెద్ద దిక్కు, వంశీ' కి సంరక్షణ బాగుంటుంది అమ్మని తీసుకువెళ్దాం,

మిమ్మల్ని పెంచారు మోసి కనలేదుగా అందుకే అంటున్నాను ఆవిడకేం తెలియదని '

కోడలి నోటంట ఆ చివరి మాటలు రాజమ్మ చెవులకు కర్ణకఠోరంగా విన్పించాయి తను





దీఏక
చిత్రం ఎ ఉష

# దీపమాత

కాటుకలు దిద్దు కారు చీకటులలోన
కొట్టుమిట్టాడు చున్న లోకులను గాంచి
వెలుగు రేఖలు ప్రసరింపవే శుభాంగి
జాలిగల తల్లి! దివ్య దీపాల వెల్లి!

గుండెలను కోరి దహియించుకొనుచు మంద
హాస చంద్రిక లందించు నమృతమూర్తి
ఈ యమావాస్య చీకటు లెన్ని యేని
నిలువగలవటే నీదు సాన్నిధ్య మందు!

విమల విజ్ఞానమునకు దీపికవు నీవు
నవ్యభావనంబులకు చిహ్నంబు నీవు
శాంతి సౌభాగ్యముల కలశంబు నీవు
దివ్యజీవన సందాత! దీపమాత!

—ఎం పి జానుకవి

పాతికేళ్ళుగా మర్చి పోయిన తన వంధ్యత్వాన్ని వెలికి తీసాయి దుఃఖమంతా ఉండ చుట్టుకున్నట్లు గొంతులో అడ్డుపడి ఆమె కళ్ళు శ్రావణ మేఘాల్లా వర్షిస్తున్నాయి తను పిల్లాడిని పెంచ లేదా? తను శుభ్రంగా లేదా? తనకు తెలియని యెన్ని విషయాలు తెలియజెప్పింది ?

అలా గదిలో గోపాల్రావు గారి ఫోటో ముందు ఎంతసేపు యేడ్చిందో తెలియదు గాని రాజమ్మ కళ్ళు ఎర్రగా ఉబ్బి పోయాయి భుజంమీద యెవరిదో చేయిపడటంతో ఉలిక్కిపడి తలెత్తింది ఎదురుగా రఘు కళ్ళనిండా నీళ్ళతో తల్లినే తదేకంగా చూస్తున్నాడు 'అమ్మా' అతని గొంతు దుఃఖంతో పూడుకు పోయింది

రాజమ్మ మనసు రాయి చేసుకుంది రఘు రేపే ప్రయాణం కదా యేర్పాట్లు చూడు అలా కూర్చుంటే యెలా?' రఘుని మాటలలో పెట్టడానికి ప్రయత్నిస్తు లేచింది

'అమ్మా' – ఏదో చెప్పబోయి నోరు రాక అర్థోక్తిలోనే ఆగిపోయాడు

రాజమ్మ వెనుదిరిగి నవ్వింది . నాకు తెలుసురా నువ్వు చెప్పబోయేది అక్కడికి వెళ్ళి యిల్లు అదీ కాస్త పెద్దది చూసుకుని వచ్చి నన్ను తీసుకు వెళ్తానంటావు అంతే కదా? నాకు కూడా యిక్కడ చక్కబెట్టుకోవలసిన పనులు కొన్ని ఉన్నాయి ప్రస్తుతానికి మీరిద్దరూ వెళ్ళండి పిల్లాడు మాత్రం జాగ్రత్త'

తల్లి మాటలకి పెద్ద బరువు దిగిపోయినట్టుగా ఫీలయాడు రఘు ఫర్వాలేదమ్మా నేను ఆఫీసుకి వెళ్ళే త్రోవలోనే 'అశ్విని బేబీ కేర్ సెంటర్ ఉంది రోజూ వెళ్ళే ముందు అక్కడ దిగబెట్టి ఆఫీసు నుంచి వెళ్ళేటప్పుడు పికప్ చేసుకుంటాం అక్కడ పిల్లల్ని చాలా బాగా చూస్తారమ్మా ' రఘు లేచి ప్రయాణం యేర్పాట్లలో మునిగి పోయాడు

రాజమ్మ జీవచ్ఛవంలా తిరుగుతోంది మనవడితో ముచ్చటగా ఆడుకోనేలేదు దూరంగా వెళ్ళి పోతున్నారు మళ్ళీ యెన్నాళ్ళకో? మనసంతా అల్లకల్లోలంగా ఉంది మళ్ళీ తనకి ఒంటరితనం తప్పదు... ప్రాణాలన్నీ వంశీ మీదే ఉన్నాయి సుజాతా, పిల్లాడు జాగ్రత్తమ్మా వాడి ఆట పాటలన్నా ఉత్తరాలు రాస్తూ ఉండండి చదువుకుని సంతోషిస్తాను రాజమ్మ కళ్ళు వర్షిస్తూండగా మనవణ్ణి గాఢంగా ముద్దు పెట్టుకుని కోడలి కందించింది సుజాత వెంటనే కర్చీఫ్ తో పిల్లాడి ముఖం అంతా తుడవడం ఆమె హావభావాలు గమనించి పేలవంగా నవ్వుకుంది వాళ్ళు వెళ్ళి పోయిన గంట వరకు 'వంశీ' లేని యింట్లో అడుగు పెట్టడం యిష్టం లేక అక్కడే అరుగుమీద కూలబడి పోయింది రాజమ్మ

* * * * *

సంవత్సరం గిర్రున తిరిగింది ఈ మధ్యకాలంలో రఘు మూడు నాలుగు ఉత్తరాలు రాసాడు రాజమ్మకి కాని జాబు లేదు మొట్ట మొదట రాసిన దానికి మాత్రం వెంటనే సమాదానం రాసింది 'బాబుని జాగ్రత్తగా చూసుకోమని చెప్పండి నా మనసంతా వాడి మీదే ఉంది అంటూ ఆ తర్వాత మరి యెన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదు ఎంత కాదనుకున్నా తల్లిని చూడా లన్పించి బయలు దేరాడు రఘు సుజాత రానంది కాని రాజమ్మ అక్కడ లేదని సంవత్సరం క్రితమే తన దగ్గరికి బయల్దేరి వచ్చిందని చుట్టు ప్రక్కలవాళ్ళు చెప్పడంతో రఘు కంగారు పడ్డాడు దగ్గర, దూరపు బంధువులనందరినీ బొగట్టా చేసాడు కాని ప్రయోజనం లేకపోయింది నిరాశతో యింటికి తిరిగి వచ్చాడు


ఏమండీ బాబుని చాలా బాగా చూసుకుంటున్నారండీ సెంటర్ లో నాకంటే కూడా శ్రద్ధగా చూస్తున్నారు సుజాత మాటలు యాంత్రికంగా వింటున్నా రఘు మనసంతా తల్లి చుట్టూనే తిరుగుతోంది సవతి తల్లి నీడలో పెరగవలసిన తనకు కన్నతల్లి ప్రేమ రుచి చూపించిన ఆ మాతృమూర్తికి తనేం మిగిల్చాడు మనఃక్షోభ తప్ప? పశ్చాత్తాపంతో అణువణువూ దహించుకు పోతోంది అసలు అమ్మ బ్రతికే ఉందా? లేక ? ఒక్కసారిగా ఆ ఊహకే రఘు ఒళ్ళు జలదరించింది

వంశీ మూడేళ్ళ వాడయ్యాడు కాన్వెంటులో జాయిన్ చేసారు

ఏమండీ రేపే వంశీని సెంటర్ నుండి ఆఖరి సారిగా తీసుకు రావడం అక్కడ ఆయాల కేమైనా పంచి పెడదామండీ సుజాత గోముగా భర్త నడిగింది రఘు అన్యమనస్కంగానే 'నీ యిష్టం' అన్నాడు

మూడేళ్ళుగా బాబుని చాలా జాగ్రత్తగా చూసుకున్నందుకు చాలా థాంక్సండీ రఘు 'బేబీ కేర్ సెంటర్ యజమాని శ్రీమతి సరోజినిని కలిసి తన దన్యవాదాలర్పించాడు

ఆమె నవ్వింది 'ఇందులో నా గొప్పతన మేముందండీ అంతా ఆయాలదే అండ్ దే అర్



## దీపావళి

తారాపథంలో ధరలు
తారాజువ్వలై తాండవిస్తుంటే

అవనిలో అరాచకాలు
ఆటంబాంబులై పేలుతూ వుంటే

అన్యాయాలు అక్రమాలు
సిసింద్రీలై చిందు లేస్తుంటే

కలహాలు కార్పణ్యాలు
చిచ్చు బుడ్లై ప్రజ్వలిస్తుంటే

దీపావళి కాదు

క్రాంతి పథాన పయనించినప్పుడే
మానవాళికి నిజమైన దీపావళి
నరకాంతక దరహాస రేఖావళి

—వేమూరి మాధవ

## ఆయమ్మ

ఫైడ్ ఫరిట్

రఘు సుజాత తాము తెచ్చిన చీరలను సరోజిని కిచ్చి ఆయాలకి పంచి పెట్టమని చెప్పారు. 'వంశీ' రఘుతో వెళ్ళనని మొరాయిస్తున్నాడు. ఏడుపు లంకించుకున్నాడు ఆ యమ్మ కావాలి (కావాలి)' అంటూ మొండి పట్టుపట్టి కూర్చున్న వంశీని చూసి సుజాతకి ఒళ్ళు మండింది గట్టిగా వీపు మీద చరిచింది దాంతో వంశీ గుక్క త్రిప్పుకోకుండా యేడ్వడం ప్రారంభించాడు లోపల నుంచి అయమ్మ పరుగున వచ్చి వంశీని అందుకుంది... వాడు ఆ య మ్మా అంటూ ఆమె నల్లుకు పోయాడు

రఘు ఆశ్చర్యంతో నోరు తెరిచి 'అ... మ్మా' అన్నాడు సుజాత అత్తయ్యా అంది.

క్షమించండి మనవడికి దూరంగా ఉండలేక ... యిలా వచ్చేసాను వాడితోడిదే లోకం అనుకున్న నాకు వేరే దిక్కు తోచలేదు రాజమ్మ కళ్ళనిండా నీళ్ళు

అమ్మా యింటికి వెళ్దాం రామ్మా...' రఘు అర్థించాడు


'నేను యిప్పుడు అమ్మను కాదురా ఆయమ్మను... నన్నిలాగే ఉండనీ రాజమ్మ గొంతు జీరపోయింది.

'అది కాదమ్మా వంశీ కోసం నీ మనవడి కోసం.. రావా? రఘు కన్నీటికి చలించలేదు రాజమ్మ. వేదాంతిలా నవ్వింది నాకు వంశీ ఒక్కడే మనవడు కాదురా.. యిక్కడికి రోజూ వచ్చే పిల్లలంతా నా మనవలే... కన్నతల్లికి ఒక్కడే గాని పెంచిన తల్లికి ప్రపంచమంతా పిల్లలే! 'వంశీ' కోసం వీళ్ళందరినీ దూరం చేసుకోమంటావా?' వంశీని మరోసారి గాఢంగా ముద్దులాడి రఘు చేతి కందించింది

'అత్తయ్యా మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను నన్ను మన్నించి యింటికి పదండి సుజాత రాజమ్మ పాదాలను తాకింది కోడలిని లేవనెత్తి రాజమ్మ కళ్ళు రెండూ తుడిచింది ఇందులో నీ తప్పేముంది? అంతా నా దురదృష్టం

ఇంకేదో చెప్పాలనుకున్న రాజమ్మ మాటలు నోటిలోనే ఆగిపోయాయి నీ కన్నకొడుకు అనుకుంటున్న యీ వంశీ నీ పేగు తెంచుకుని పుట్టలేదు సుజాతా రెండవసారి కూడా బిడ్డ చనిపోయాడన్న వార్త నీకు చెప్తే యే పరిణామాలకి దారి తీస్తుందోనని నేను డాక్టర్ని బ్రతిమాలి అప్పుడే పుట్టిన ఒక అనాదని నీ ప్రక్కలో పడుకోబెట్టాను ఈ చేదు నిజం రఘుకి కూడా తెలియదు నాలో నేను దిగమ్రింగుకున్నాను ఈ రహస్యం లోకానికి తెలిస్తే నా లాగే నీ జీవితం కూడా దుర్భరమవుతుందని సుజాతా బంధాలకీ అనుబంధాలకీ పేగు పంచుకునే పుట్టక్కర్లేదమ్మా పెంచిన మమకారం చాలు అని చెప్పాలనుకున్న రాజమ్మ నోట మాట రాక మౌనంగా కన్నీరు కారుస్తూ నిలబడిపోయింది

కనుమరుగై పోతున్న ఆటో లో నుంచి రాజమ్మకి 'ఆయమ్మా – ఆయమ్మా అన్న యేడుపు వినిపిస్తుంటే చెవులు మూసుకుని వెనుదిరిగింది 'ఆయమ్మను కాదురా నానమ్మను అనాలనుకుంది అన్నాననుకుంది కాని అనలేకపోయింది ! □



# వివిధ ప్రాంతాలలో దీపావళి

మనం ప్రతీ సంవత్సరం జరుపుకునే అనేక పండుగల్లో దీపావళి అత్యంత ప్రముఖమయినది ఈ పండుగ ఏ ఒక్క ప్రాంతానికీ పరిమితమైనది కాదు ఇది జాతీయ పండుగ మన దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ తక్కిన పండుగల కంటే ఆనందంగా ఉత్సాహంగా ఉల్లాసంగా జరుకునే పండుగ దీపావళి

## రాజస్థాన్‌లో

రాజస్థాన్‌లో దీపావళిని దన్‌తిరాల్ అని పిలుస్తారు దీపావళి రోజున అక్కడి స్త్రీలు తమ నగలను నదుల్లో కడుగుతారు నదుల్లో దీపాలు వెలిగించి నృత్య బృంద గానాలు చేస్తారు

## గుజరాత్‌లో

గుజరాత్‌లో దీపావళిని అయిదు రోజుల పండుగగా జరుపుకుంటారు దీపావళి ముందు వచ్చే నవ రాత్రి ఉత్సవాలను ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటారు అక్కడి ప్రజలు ఆ తొమ్మిది రోజులు నిద్రపోరు రాత్రిళ్ళు ఆ సమయంలో వారు ప్రసిద్ధ గుజరాతీ నృత్యమైన 'గరబా ను ఎంతో చక్కగా ప్రదర్శిస్తారు ఇక్కడ దీపావళిని అయిదు రోజులు జరుపుకుంటారు మొదటి రోజున దనపూజ జరుపుకుంటారు వెండి బంగారాలనూ డబ్బునూ పూజించడాన్ని దన్న పూజ గా వ్యవహరిస్తారు మూడవ రోజున ప్రతి ఇంటినీ దీపాలతో చక్కగా అలంకరిస్తారు ఆ రోజు అక్కడి బ్రాహ్మణులు నేలపై పెద్ద పెద్ద ముగ్గులు వేసి మంత్రాలు జపించుతూ దీపాలు వెలిగిస్తారు అలా చేస్తే భూత ప్రేత పిశాచాలు రావని వారి నమ్మకం

## బెంగాల్‌లో

బెంగాల్‌లో దీపావళినాటి రాత్రి కాళికాదేవిని పూజిస్తారు ఇంచు మించు ప్రతీ వీదిలోనూ ఒక్కో కాళీ మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజిస్తుంటారు ఈ పూజకు ముందు వారు కరణ్‌హర్ అనే మద్యాన్ని సేవిస్తారు ఇక్కడ దీపావళినాడే జ్యేష్టాదేవి ని పూజిస్తారు జ్యేష్టాదేవి దారిద్ర్యానికి శోకానికి నిర్వచనంగా బావించి ఆమెకు పూజలు చేసి ఆమెను తమ గృహాల ఛాయలకు కూడా రావద్దని ప్రార్థిస్తారు

## మధురలో.

మధురలో దీపావళి రోజున 'అన్నకూటి పూజలు' జరుగుతాయి

అన్నాన్ని గుట్టగా వుంచి ఆ గుట్టపై పూలు చల్లుతారు పూజ అంతా పూర్తి అయిన తరువాత ఆ అన్నాన్ని పువ్వుల్ని ఒకరి మీద ఒకరు జల్లుకుంటారు

## తమిళనాడులో

తమిళనాడులోని కొన్ని ప్రాంతాలలో దీపావళి వ్యవసాయదారులకు ప్రత్యేకమయిన పండుగగా తెలుస్తోంది కురవై సంబా అనే రెండు పంటల్లో ఒకటి దీపావళికి, మరొకటి సంక్రాంతికి చేతికి వస్తాయి ఎంట చేతికందిన రైతన్నలు ఎంతో ఉత్సాహంగా ఈ 'దీపావళి పండుగను జరుపుకుంటారు

## ఉత్తర భారతంలో.

ఉత్తర బారత దేశంలో ఈ దీపావళిని మిలాప్ అనీ బారత్ మిలాప్ అనీ వ్యవహరిస్తారు శ్రీ రాముడు రావణాసురుని చంపిన తరువాత బరతుని కలుసుకున్న శుబ సమయానికి చిహ్నంగా అక్కడ ఈ దీపావళి పండుగను జరుపుకుంటారు దక్షిణాదిలో ఈ పండుగని రెండు రోజులు జరుపుకొంటారు ఉత్తర ప్రదేశ్ బీహార్ రాష్ట్రాల్లో ఈ పండుగను 5 రోజులు జరుపుకొంటారు

-మోడేకుర్తి సత్యనారాయణ

సీరియల్

# ఈతరం యువతి

## వడ్లమన్నాటి కుటుంబరావు



(గత సంచిక తరువాయి)

సిద్ధార్థ కాలేజీకి సిటీబస్సులో వెడుతుంటే జమ్మిచెట్టు అనే స్టాపుంది అక్కడ నిలబడి ఎవరిని అడిగినా ఏమాత్రం బెట్టు చేయకుండానే చెబుతారు ఆర్ పి ఓ అదినేత అవతారం గురించి

అవతారం ఇదివరకు – అంటే గత జన్మల్లో ఏ అవతారం ఎత్తాడో ఎవరికీ తెలియదు గానీ ప్రస్తుతం మాత్రం చింపాంజీ అవతారంలో ఉన్నాడని అనుకోవడానికి ఎలాంటి సందేహం లేదు అదిగో అలా కుడివేపుకి వెళ్ళి ఎడం చేతికి మళ్ళి మళ్ళీ కుడి వేపున రెండో ఇంటి తలుపు కొడితే అవతారమే వచ్చి తలుపు తీస్తాడు ఒక్క లుంగీ మాత్రమే ధరిస్తాడు బొచ్చుతో దట్టంగా ఉన్న బాన పొట్ట , గుబురు పొదలా ఉన్న ఛాతి జీబురు ముఖం జుట్టు దట్టంగా లేని బట్టతల రోమాల మయంగా ఉన్న చేతులు మాత్రం గాలి కొదిలేసి అప్పుడప్పుడూ సన్నగా ఈల వేస్తుంటాడు

అతను ఏం వ్యాపారం చేస్తుంటాడో ఎవరికీ తెలియదు ఏం ఉద్యోగం వెలగ బెడుతుంటాడో అదీ తెలియదు అతని దగ్గరికి మనుషులు వచ్చి పోతూ మాత్రం ఉంటారు ఏవో ఇచ్చి ఏదో పుచ్చుకు పోతూ ఉంటారు అదేమిటో మళ్ళీ అతి రహస్యమే!

బలమైన వ్యక్తి గట్టిగా తంతే పడిపోయే ఇంటి గోడలు ప్లాస్టరింగు పెచ్చులు రాలుతూ అవతారం కన్నా భయంకరంగా కనుపిస్తుంటాయి ఇంట్లో సామాను పెద్దగా ఉన్నట్టు అనిపించదు ఇంటి ఇల్లాలు మాత్రం కంటికి కనుపించదు. నూటికో కోటికో తప్ప దానిక్కారణం అవతారం చింపాంజీ లా ఉంటే ఆమె ఎర్రగా అందంగా ఉండటమే ననుకుంటారూ చుట్టుపక్కల వాళ్ళు

ఇంతకీ అవతారం దేనికి అదినేత అనే విషయం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది ఆర్ పి ఓ అంటే అదేదో పేద్ద కంపెనీ అనో సంస్థ అనో అనుకుంటే పప్పులో కాలేసి నట్లే! పోనీ , ఏదన్నా పేద్ద ఆఫీసా అంటే కాదు గానీ అలాగని ఖండిస్తే అవతారం ఊరుకోడు కొన్నాళ్ళు జనానికి బాగా సస్పెన్సు పెట్టాడు ఆర్ పి ఓ అంటే తెలియకుండా ఎంత మంది ఎన్నిసార్లు గొంతు చించుకు అడిగినా చెప్పనే చెప్పలేదు విసిగి వేసారి పోయిన వాళ్ళు చెపుతావా లేకపోతే నువ్వు లేనప్పుడు ఒంటరిగా నీ బార్యని అడగమంటావా అని పాశుపతాస్త్రం ప్రయోగించారు దాంతో నవనాడులు కుంగి – లొంగి రాక తప్పలేదు అవతారానికి అప్పుడు విప్పాడు సస్పెన్సు చెప్పాడు వెంటనే ఆర్ పి ఓ అంటే రూమర్ ప్రివెన్టింగ్ ఆఫీసు అని అంతేకాదు తన ఓల్డ్ డర్డ్‌పారమ్ ఫెయిల్డ్ ఆంగ్ల బాషా పరిజ్ఞానం ఉపయోగించి దాన్ని తెలుగులో కూడా అనువాదం చేసి మరీ చెప్పాడు నిందా నివారణా కార్యాలయం అని

ఈ ఆపీసులో కుర్చీలు బల్లలు డ్రాయర్లు వగైరాలు ఉండవు ప్రత్యేకించి స్టాపు కాగితాలు ఫైళ్ళ దొంతరలూ గట్రా ఉండవు దీనికి ఒక నిర్ణీత మైన సమయంగానీ శెలవు దినాలు గానీ ఏమీ ఉండవు

అవతారమే హెడ్ ఆఫ్ ఆఫీస్ వచ్చే పోయే వాళ్ళే ఆపీసు స్టాపు మెంబర్లు

పల్లెటూళ్ళలో పనీ పాటా పెద్దగా లేని పెద్దలు ఊరి మధ్యలో చుట్టూ గుండ్రని ఎత్తైన అరుగు మధ్యలో చెట్టు ఉన్న గచ్చు బంద వద్దకు చేరి – తీరి కూర్చుని నోటి కొచ్చిన వన్నీ చర్చిస్తుంటారు వాటినే గచ్చు బండ కబుర్లు అంటుంటారు దాన్ని స్వల్పమైన మార్పులు కూర్పులతో ఆర్ పి ఓ గా మోడరనైజ్ చేశాడు అవతారం రచ్చబండ బదులు తన ఇంటిని రీప్లేస్ చేసుకున్నాడు

ఎప్పుడు తన ఆఫీసు మెంబరు వచ్చినా సిద్ధంగానే ఉంటాడు వింటానికి వాళ్ళ మధ్య జరిగే సంబాషణ కూడా చాల్లా గమ్మత్తుగా ఉంటుంది ఇంట్రెస్టింగా ఉంటుంది

నమస్కారం అవతారం గారూ!

నమస్కారం న మ స్కా ర ం రావోయ్ ఊకదంపుడు రావ్! కూర్చో

అలాగే కూర్చున్నాను సార్ మీరు కూర్చోండి సార్ నిలబడే ఉన్నారు!

ఓ కె నయ్యా ఏమిటి విశేషాలు? విజయవాడ ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లు తున్నారా?

అహ! ఏం ప్రజాసేవ ఏం ప్రజాసేవ! మీకు దానిమీదున్న అబిమానం చూస్తుంటే అనుమానం లేకుండా మీ మీద ఈగ వాలితే చాలు చెప్పుచ్చుకు కొట్టాలని పిస్తోందండీ!

ఎవర్నీ? నన్నా 'నీ బండపడ నేను ఆర్ పి ఓ అదినేతనయ్యా!'

అబ్బే! మిమ్మల్ని కాదండీ ఈగనండీ!

చెప్పుచ్చుకు కొట్టగానే ఈగ ఎగిరిపోతుందయ్యా! నా ఒళ్ళు పేలిపోతుందయ్యా బాబూ!

అయ్ బాబోయ్! అలాగంటండీ సర్లే కొట్టను లెండి!

ఇక సుత్తి కొట్టటం ఆపి అసలు సంగతి మొదలు పెట్టు నీ ఏరియా సూర్యారావు పేటకదా?

అవునండీ

మరి విశేషాలు చెప్పు?

జరిగిన కథ– 1 నిర్మల సుశీల కమల మృదుల, గజబాల మిత్ర బృందం మృదుల తండ్రి మదుసూదనం ఆటోస్పేర్ పార్ట్సు వ్యాపారం చేస్తుంటాడు మదుసూదనం గారికి మృదుల కాక మరొక కూతురు, ఇద్దరు కొడుకులు అందంగా ఉండే మృదులకు వచ్చిన పెళ్ళి సంబంధాలన్నీ తిరిగి పోతుంటాయి

ఏమిటయ్యా ఊకదంపుడురావ్ ఊకేమయినా గొంతుకడ్డం పడి నీకీ భూమి మీద నూకలు చెల్లిపోయే తరుణం వచ్చిందా? అలా పిల్లిలా మెల్లగా చూస్తున్నావేమిటి ? విజయవాడ లాంటి మహానగరంలో బార్యాబర్తలు తండ్రీకొడుకులు అన్నావదినలు అక్కాబావలు బంధువులు

స్నేహితలు  వీళ్ళ మధ్య ఎలాంటి నిందారోపణలు లేకుండా సజావుగా బాగున్నారంటావా? నా బొంద  నమ్మమంటావా నీ బొంద!

ఆపండి సార్! బాస్ అవతారుగారూ! మీ కోపావతారం గొంతు నొప్పిగా ఉండి ఒక గుటక వేసి తేరుకుని మొదలు పెట్టే లోపుగానే  మీరు కొట్టేశారు పరమ సుత్తి  ఏమీ లేకుండా ఉంటే  ఇది విజయవాడ మహానగరం ఎలా అవుతుందండీ? అందులో ఆరేడు లక్షలకు పైచిలుకు జనాబానయ్యే! గుళ్ళూగోపురాలు షామియానాలు  పందిళ్ళు పురాణాలు  పూజలు హరికథలు  అన్నదానాలు వస్త్ర దానాలు లాంటి పుణ్యకార్యాలతో పాటు దొంగతనాలు దోపిడులు కక్షలు కార్పణ్యాలు హత్యలు మానభంగాలు లాంటి కిరాతకాలకి కూడా పేరు పడ్డ విజయవాడలో  మన కార్యాలయం నిర్వహణకి కావలసిన సమాచారం లేకుండా ఎలా ఉంటుందండీ?

ఊకదంపుడు రావ్! నిజంగా నువ్వు సార్థక నామదేయుడవయ్యా నిదులు చాలకో  లేక రాజకీయాలు తేలకో  కార్పొరేషన్ వారే పట్టించుకోవటం లేదు విజయవాడ గురించి పూర్తిగా  అలాంటిది నీ కెందుకయ్యా ఇంత నిశితమైన పరిశీలన అనవసరమైన కాలయాపన చేయక ఇక  త్వరగా పాయింటుకి వచ్చెయ్యి! నేను నిందా నివారణా కార్యాలయం అదిపతివయ్యా!

అలాగే సార్! సూర్యారావుపేటలో జరిగిన విశేషాలు  తమకి సవివరంగా సశేషంగా మనవి చేస్తానండీ  ఎందుకంటే  ఇవి పత్రికల్లో వారం వారం కొస్తంత వేసి చటుక్కున ఆపేసే తెలుగు సీరియల్ నవలల్లా నడుస్తూనే ఉంటయ్ కదండి

అబ్బా! ఊక దంపుడు రావ్ పడుతుంది నీ ఉద్యోగం మీద దెబ్బ

ఎల్లలు గల వాణ్ణండీ బాబూ! వద్దండీ మీరు చల్లగా చూడాలండీ

చూడూ! తెలుగు సినిమా కన్నా ఎక్కువ తలనొప్పి తెప్పిస్తున్నావ్ టాబ్లెట్ ఏదన్నా ఉంటే ఇవ్వు

అక్కర లేదండి ఏకరువు పెడుతున్నాను చక్కెర తిన్నట్టుగా ఉంటుంది వినుకోండి

ఊ  మూలిగాడు అవతారం.

ఎమ్ ఎస్ సి పాసయిన ఒక యువకుడు  ఆ ఆఫీసు నుంచి పిలుపొస్తే ఇంటర్వ్యూకి వెళ్ళాడండి గోల్డు మెడలిస్టుని గదా నాకివ్వక ఉద్యోగం ఇంకా ఎవరికిస్తారు లే! అనుకుని బోల్డంత ధీమాగా బయట బల్ల మీద కూర్చున్నాడండి

ఇంతకీ ఉద్యోగం వచ్చిందా?

రాలేదండి

ఎవరికొచ్చింది?

అదే బల్ల మీద ఈ కుర్రాడికి ఆరుగురి తరవాత కూర్చున్న వాడిని పూలదండ వేసి పిలిచి తీసుకెళ్ళి ఇచ్చారండీ

అతను ప్లాటినమ్ మెడలిస్టేనేమోనయ్యా నీకేం తెలుసు?



# ఈతరం యువతి

నా బొందండీ! అత్తెసరు మార్కుల సల్దిరాజం

'సరే! దీన్ని గురించిన నింద ఏం విన్నావ్?

ఆయన మంత్రిగారి వేలు విడిచిన మేనమామ గారి బామ్మరిది గారి షడ్రకుడి గారి తమ్ముడండీ అందుకని మంత్రిగారి ఫోను రాగానే రూల్సు గీల్సు మెరిట్ గిరిట్ పక్కన గిరాటేసి మంత్రించినట్టుగా ఉద్యోగం అతనికిచ్చే శార్టండి!'

ఇలాటివి జరుగుతాయంటే నాకు నమ్మకం చాలటం లేదోయ్ ఇంకా చెప్పు

ఇంకో ఉద్యోగానికి అన్ని అర్హతలూ ఉన్న ఒకబ్బాయి తెలుగు సినీ డాన్సర్ని అనుకరిస్తున్న అలంకరణలో ఉన్న ఒకమ్మాయి వెళ్ళారటండి ఇంటర్వ్యూకి

ఏమయింది ఆ అబ్బాయినేగా ఇవ్వాలి ఉద్యోగం

అబ్బాయినేమో తబ్బిబ్బు పడకుండా ఇంటి కెళ్ళమన్నారటండీ "

మరి అమ్మాయిని

నిన్ను స్పెషల్‌గా ఇంటర్వ్యూ చెయ్యాలి రాత్రి తొమ్మిదింటికి గెస్ట్‌హవుస్‌కి రమ్మన్నారంటండీ'

ఎందుకు?' "

నా తలకాయకి మర్నాడు ఉదయం ఆ అమ్మాయికి పోస్టింగ్ ఆర్డరు టైప్ చేసి ఇచ్చారండీ ఆ ఆఫీసరుకి అలాటి ఆడపిల్లలంటే . ప్రత్యేకమయిన అభిమానంటలిండి

ఊర్కో ఊకదంపుడురావ్ ఆఫీసర్ల మీద అన్యాయంగా అలా నింద వెయ్యరాదయ్యా తప్పు ఇంకా చెప్పు

ఒక కోడలు నిన్నటి మధ్యాన్నం వరకూ బాగానే ఉందంటండీ రాత్రికి రాత్రి చికెన్ రోస్టు వండుతుండగా. గాస్‌స్టౌ మంట అంటుకుని ముందు పమిట కొంగు కాలి ఆ తరవాత ఒళ్ళంతా కాలి చనిపోయిందండీ

దాంట్లో ఆశ్చర్యమేముంది రోజుకిలాంటి సంఘటనలు ఎన్ని జరగటం లేదు? అయినా ఈ కాలపు గృహిణులు కాస్త జాగ్రత్తగా ఉండాలయ్యా'

అసలు సంగతి అది కాదండి'


మరేమిటిట? ఆఁ!'

'అర్థ రాత్రి పూట పతిదేవుడొచ్చి సతి బుగ్గమీద చిటికేశాడుట'

"ఆఁ!

"ఠే! నాతోరా! అన్నాడట గుసగుసగా'

ఇంతమంది ఉన్న ఈ ఇరుకులో కుదరదు అందుకని అలా పెరట్లోకి




రమ్మంటున్నాడేమో నని గుమ్మయి పోయి హుషారుగా లేచి వచ్చిందటండీ

ఊకదంపుడూ! నీ మాటల నిండా రసికత్వమే నయ్యా

'ఆగండి సార్ పానకంలో పుడకలా అడ్డు రాకండి

ఆఁ! చెప్పు

బాత్ రూంలోకి తీసుకెళ్ళి గట్టిగా కౌగిలించు కున్నాట్ట'

నీ వర్ణన ఆపి తొరగా చెప్పి తగలడు

అది ప్రేమ కౌగిలి కాదు, ధృతరాష్ట్రుని కౌగిలి

ఈ లోపుగా అత్తగారు, మావగారు మరిది బిలబిల లాడుతూ వచ్చేశారట కిరసనాయిలు డబ్బాతో నిప్పు పెట్టితో అంతే! ఖతమ్ ఇంకా కావాలన్న కట్నం డబ్బు తేకపోవటమే ఆమె చావుకు కారణమట!

నాకు నమ్మకం కలగటం లేదయ్యా మన దేశంలో కోడల్ని కూతురిలా చూసుకునే అత్తమామలు భార్యని అనురాగంతో రంజించే భర్త వదినని తల్లిలా చూసుకునే మరిది ఆడపడుచులు ఇంత ఘాతుకానికి తలపడతారంటే నేను నమ్మలేక పోతున్నానయ్యా అనవసరంగా వాళ్ళ మీద నిందవేసి ఆడిపోసు కుంటున్నా రేమోనని నా అనుమానం ఈ వార్తా పత్రికల వాళ్ళకి సర్క్యులేషన్ మీద ఆత్రం ఎక్కువ గదా, అందుకని- అవాకులు చెవాకులు రాసి చలాకీగా తమ సరుకు చెలామణీ చేసుకొంటున్నరని నా అభిప్రాయం ఇంకా చెప్పు!

ఒక అత్తగారు తనకి అస్థి రాయలేదన్న కోపంతో అల్లుడు ఆమె తలని గొడ్డలితో భళ్ళున పగల గొట్టాడట

"ఈ నింద కూడా నేను నమ్మలేనయ్యా కష్టపడి కని, పెంచి, పెద్ద జేసి తియ్యటి తాయిలం లాటి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేసిన అత్తగార్ని నెత్తి పగల గొట్టటానికి అల్లుళ్ళకి మానవత్వం లేదంటే నేను నమ్మను ఇంకా చెప్పు

ఒక కంట్రాక్టరు ఒక బ్రిడ్జిని కట్టటం పూర్తి అయ్యేసరికి తన రెండంతస్థుల మేడ కూడా పూర్తి చేశాడట

"నో నో. ! నేనమ్మను ప్రగతిశీలకులు . రాష్ట్ర నిర్మాణ కారకులు అయిన కంట్రాక్టర్ల మీద ఇలాంటి నిందలు వేయటం అన్యాయం అక్రమం ఇంకా చెప్పు

ఒక ప్రభుత్వోద్యోగికి నాల్గు ప్లాట్లు రెండు ఫ్లాట్లు ఉన్నాయట

'ఏమిటయ్యా ఊకదంపుడు రావ్? వింటున్నాను గదాని నీ యిష్ట మొచ్చినట్టు పేలు తున్నావ్ రెక్కాడితే గాని డొక్కాడని ప్రభుత్వోద్యోగి అప్పులు చేస్తే తప్ప రోజులు గడవక తిప్పలు పడే ఎన్ జి వో అన్ని ఎస్సెట్స్ సంపాయించాడా? ఇంపాసిబుల్ అవినీతి అంటే పక్షిపేరా? అని అడిగే వైట్ కాలర్ వ్యక్తి మీద ఇంత అభాండం వేస్తారా? నిజంగా లోకులు పలు గాకులేనయ్యా ఊఁ! ఇంకా చెప్పు చాలా విశేషాలు కొట్టుకొచ్చావే !

ఒంటరిగా ఉంటున్న ఒక అందమైన ఆడది జంట భవనాలు కట్టించి రోడ్డు మీద భాగమంతా కొట్లు పెట్టు కోవటానికి ఇచ్చి, లోపలి భాగమంతా, సంతోషంగా గడప టానికి కావలసిన సరంజామాతో నింపేసిందట'

'ఛ! నోర్ముయ్! ఎక్కడ ఆడది పూజింప బడుతుందో అక్కడ దేవతలు ఉంటారని, అంతా సుభిక్షంగా ఉంటుందని ఒక పక్క శాస్త్రాలు ఘోషిస్తుంటే, అన్యాయంగా ఒక దిక్కులేని ఆడదాని మీద ఇలాంటి వ్యభిచారం నింద వెయ్యటానికి జనానికి మనసెలా ఒప్పిందయ్యా అపచారం కదూ! నేన్నమ్మనయ్యా .. ఇంకా"

"ఒకమ్మాయికి అనేక సార్లు పెళ్ళి చూపులు జరిగాయి ఆ అమ్మాయికి- అందం, ఆస్తి ... ఐశ్వర్యం అన్నీ ఉన్నాయి అయినా ఇంకా పెళ్ళి సంబంధమే కుదర లేదు."

"ఏమిటయ్యా! చాలా గమ్మత్తుగా ఉంది నువ్వు చెప్పేది? అలాంటమ్మాయిని. ఈ రోజుల్లోని పెళ్ళి కొడుకులు, బందరు లడ్డులా ఎగరేసుకు పోరూ?'

'అలా జరగలేదు మరి

"ఇంతకీ ఎవరా అమ్మాయి అడ్రసు చెప్పు వివరంగా

అమ్మయ్య! బాస్ గారికి ఇదొక్కటే సంచలనం కలిగించి నట్టుంది ఆ అమ్మాయి పేరు మృదుల, ఆటో స్పేర్ పార్ట్స్ షాపు ప్రొప్రయిటర్

మధుసూదనంగారి అమ్మాయి. జనగం వారి వీధి

అయనా ?! తన కూతురికి లక్షల కట్నం విసిరెయ్య గలడే ? మరి ఎందుకని పెళ్ళి కావటం లేదు ? నాకేం అర్థం కావటం లేదు ఇరుగు పొరుగు వాళ్ళు ఏమని అనుకుంటున్నారు?

అది సేకరించటమే గదా నా పని చెప్పమంటారా?

ఊఁ!

ఆ అమ్మాయి మాసకమ్మట! ఆడతనం లేనిదట

'ఇదుగో ఊకా ! పిసుకు తాను నీ పీక! గట్టిగా అరిచాడు అవతారం

బాస్‌గారి కోపం చూసి అదిరి పడ్డాడు ఊకదంపుడు రావ్ ఏమిటి సార్? బిక్కు బిక్కుమంటూ చూశాడు

ఒక పెళ్ళి కావలసిన కన్నె పిల్ల మీద అందులో ఒక అందమైన ధనవంతుల అమ్మాయి మీద ఇలాంటి నింద వేస్తుందటయ్యా ఈ కుళ్ళు సమాజం? దీన్ని సమూలంగా నాశనం చెయ్యాలయ్యా నేన్నమ్మనంటే నమ్మనయ్యా

ఈసారి ఊకదంపుడుకి కోపం వచ్చేసింది అదికాదు సార్ నేనేది చెప్పినా నమ్మనప్పుడు ఆ నింద– నా బొంద– అని మీరు తేలిగ్గా కొట్టి పారేస్తున్నప్పుడు సూర్యారావుపేట నేను వెళ్ళ నేల? ఈ విషయాలు సేకరించ నేల? మీకు నివేదించనేల? మీతో మొట్టించుకో నేల? ముక్కు లెగ బీల్చాడు

ఇదిగో ఊక శాంతించిక

తింవాను

మన కార్యాలయం పేరేమిటి?

నిందా నివారణా కార్యాలయం

బాగు! అంటే మన మేం చెయ్యాలి

ఆకలేసినపుడు భోంచెయ్యాలి

తిండి గురించి కాదు నేనడిగింది నిందల గురించి

అదీ మీరేసెలవివ్వండి మీరే గదా బాస్

నిందని బొందిలో ప్రాణం ఉండగానే పాతెయ్యాలి దాన్ని నివారించాలి నిర్మూలించాలి ఆవేశంగా అన్నాడు అవతారం

అవునా?

అంతే! వెళ్ళిరా రేపు సాయంత్రం ఓసారి కనుపించు

అలాగే

ఊకదంపుడు రావ్ వెళ్ళి పోగానే వీధి తలుపులు గడియ పెట్టి లోపలికి వచ్చాడు అవతారం ఒక్కసారి ఈలవేసి

మంచం మీద పయ్యారంగా పడుకుని ఉంది అతని భార్య– ఆమె పేరు తాయారు

ఆమెనలా చూడగానే మనసులో ఏదో బావం పుంజుకోగా చింపాజీలా మంచం మీదకు దూకాడు

ఇతరుల సొంత విషయాల్లో జోక్యం కల్పించుకుని మీరు , మీ అనుచరులు చేసే పని ఏమీ బాలేదండీ హిత బోధ చేస్తున్నట్టుగా అన్నది తాయారు

ఎందుకని?

'ఎప్పుడేం కొంప ములుగు తుందోనని నా భయం

నేనెంత ప్రజాసేవ చేస్తున్నానో నీకేం తెల్సు? అదేమన్నా సగ్గు బియ్యం జావనుకున్నావా కాయటానికి నోరు మూసుకుని పడుకో కసిరాడు అవతారం

అలాగేనండీ' అటు తిరిగింది తాయారు

* * * * *

కమలకు పెళ్ళి చూపులు జరిగాయి ఆ తర్వాత తన ఫ్రెండ్సందరికీ హోటల్ అనుపమ ఎ సి లో పార్టీ ఇచ్చింది నిర్మల కబుర్లు జోకులు వేసుకుంటూ అంతా పూర్తయ్యేసరికి రాత్రి ఎనిమిదిన్నర గంట లయ్యింది స్నేహితురాళ్ళకి బై చెప్పి స్కూటరు మీద బయలు దేరింది మృదుల అలస్య మయిందని కంగారొక పక్క, ఆడవాళ్ళని తేడా కూడా చూపించకుండా స్కూటర్ లాంటి వాహన చోదకులకు కంప ల్సరీ చేసిన హెల్మెట్ చికాకొక పక్క

అయినా అలాగే . యాంత్రికంగా స్పీడుగా డ్రైవ్ చేస్తోంది స్కూటర్ని

ఎంతదృష్టవంతురాలు కమల నిజంగా? పెళ్ళి చూపులయిన మరు క్షణమే పిల్ల నచ్చిందని చెప్పారు మొగపెళ్ళి వారు పది నిముషాల్లో కట్న కానుకలు పైసలు అయిపోయాయి లగ్న పత్రిక రాయించటమే తరవాయి కార్యక్రమం


మరి తన దురదృష్ట మేమిటి అంగట్లో అన్నీ ఉంది నోట్లో శని అన్నట్టుగా అసలు పెళ్ళి సంబంధం కుదిరే రోజు త్వరలో ఉందా తనకి లేదా? పెళ్ళయిన తన స్నేహితురాళ్ళు రాత్రి పూట తమ శ్రీవారు చేసే చిలిపి పనులు చిలవలు పలవలుగా చెపుతూంటే తన గుండె మూరు మూలల్లో ఏదో స్పందన ఏదో అలజడి

లైఫ్ పార్ట్నర్ గురించి కన్నెపిల్ల కలలు కనటం తప్పా?

ఎలాఅవుతుంది? కానేకాదు

అందుకనే కవులు కన్నె ఊహల గురించి కావ్యాలు కావ్యాలే రాశారు

హఠాత్తుగా వాస్తవంలోకి వచ్చిన మృదుల కంగారు పడిపోయింది సడన్‌బ్రేక్ వేసినా ఫలితం లేకపోయింది గిర్రున తిరిగి క్రేచ్‌మంటూ ఆగింది స్కూటరు అమ్మో! అన్న గావుకేక వినిపించింది పడిపోయిన స్కూటరుకి ఒక గజం దూరం అవతలగా పడ్డ మృదుల కంగారుగా లేచి దులుపుకుంది హెల్మెట్ పుణ్యమా అని




తన తలకేమీ దెబ్బలు తగల్లేదు దాన్ని తీసి స్కూటరు పక్కన పెట్టింది. మోకాళ్ళు మోచేతుల దగ్గర కొట్టుకుపోయి చిన్న చిన్న బ్రూయిజు లయ్యాయి తప్ప పెద్దగా దెబ్బలేమీ తగల్లేదు థాంక్‌గాడ్! అనుకొంటూ అతని కేసి చూసింది ఆతృతగా

అమ్మా! అయ్యో! అంటూ మూలుగు తున్నాడతను చేతులకు కాళ్ళకి బలంగా దెబ్బలు తగిలినట్టున్నాయి గాయాల్లోంచి రక్తం స్రవించటం చూసి కళవళపడి పోయింది మృదుల

ఆమెకేం చెయ్యాలో పాలుపోలేదు అప్పటికే ఒకరిద్దరు పోగయ్యా రక్కడ ఎదురుగా ఉన్న మెడికల్ షాపులోకి పరుగెత్తి ఒక నంబరుకు రింగ్ చేసింది

హలో!' అంది అవతలి కంఠం

డాడీ! నేను మృదులను మాట్లాడు తున్నాను నా స్కూటరుకు యాక్సిడెంటయింది

మైగాడ్! అర్‌యూ సేఫ్ బేటీ? ఆందోళన ప్రతిఫలించింది మధుసూదనంగారి గొంతులో

నాకేం ఫరవాలేదు డాడీ స్కూటరు కింద పడ్డతనికి బాగా దెబ్బలు తగిలాయి ఏమవుతుందో ఏమో? మీరూ అన్నయ్య వెంటనే బయలుదేరి రండి క్వికే! అంటూ తనున్న చోటు చెప్పింది

(ఇంకాఉంది)




**ఎన్ ఎస్ ఆర్ ఖర్గపూరు**

★ మీరు ఖర్గపూరు వస్తారా? మిమ్మల్ని చూడాలని వుంది

● వచ్చేదాన్నే – కాని నా ముద్దుల కోడలు – శ్యామలారాణి ఇప్పుడిక్కడ లేదు అంచేత రాబుద్ధి కాడం లేదు

**ఎస్ ఎస్ ఆర్. చీరాల**

★ మనిషి బ్రతకడానికి డబ్బు కావాలి ఉద్యోగం చేసి డబ్బు సంపాదించడం గొప్పా? వ్యాపారం చేసి సంపాదించడం గొప్పా ఈ సమాజంలో వీరిలో విలువ ఎక్కువ ఎవరికి?

● డబ్బు మీద రాసి వుండదు – అదెలా సంపాదించారన్నది అదీ వచ్చిన చిక్కు. డబ్బుంటూ చేరాక – అదెలా వచ్చిందని ఎవరూ అడగరు అంచే మీరే – తేల్చుకోండి – ఎలా సంపాదించాలన్నది!

**జి బి. హైదరాబాదు**

★ కడుపు తీపి నవల నాకెంతో నచ్చింది నిజంగా చాలా అద్భుతంగా వ్రాసారు ఈ మధ్యలో ఏ పత్రికలో నూ రాయకపోవడం బాగులేదు

● నిజమే. కానికాస్త సీరియస్‌గా పని చేశాను – ఓ రెండేళ్ళు! దుర్గబాయి దేశ్‌ముఖ్ బయోగ్రఫీ రాశాను అంచేత ఇతర వ్యాపకం అపాను అంతే ఒక వేశ్య డబ్బుకి పిల్లని కనిస్తానని అగ్రిమెంటు కుదుర్చుకుని తీరా పిల్లని కన్నాక ఇవ్వనని మొరాయించింది డబ్బిచ్చిన వాళ్ళు కేసు పెట్టారు ఆ కేసు జడ్జిమెంటు చెప్తూ అగ్రిమెంటుకి తలొగ్గినప్పుడు యీమె వేశ్య గాని తల్లి కాదు, కాని యిప్పటి పరిస్థితి వేరు మీ రామెపై కావలిస్తే డబ్బు మోసానికి కేసు పెట్టుకోవచ్చు గాని ఇతరత్రా కాదు – అని తీర్పు చెప్పారు జడ్జిగారు ఈ వార్త గార్డియన్ పేపర్లో చదివాక కడుపు తీపి రాయడం జరిగింది మీకది నచ్చినందుకు కృతజ్ఞతలు

**బి వి ఆర్ రాయగడ**

★ క్రీస్తు పాపులను తన దగ్గిరకి చేర్చుకుంటాడు పరమాత్ముడు మానవుల కర్మల ననుసరించి వాళ్ళు చేసే పాపాలకి శిక్ష విధించి – మరో జన్మనిస్తాడు మరి భగవంతుడు ఒక్కడే అంటారు అలాంటప్పుడు – ఇదెలా సాధ్యం?

● భగవంతుడు ఒక్కడే – జీవులు అతన్ని చేరే మార్గాలే వేరు వేరు – అంతే

**కె ఎస్ గూడూరు**

★ పడుపు వృత్తి వల్ల సుఖ రోగుల సంఖ్య విపరీతంగా పెరిగి పోతోందంటున్నారు వీరికి గుర్తింపు కార్డులు యిస్తేను వీరికై సంక్షేమ పథకాలు తలపెట్టినా ప్రయోజనం వుండదా?

● పడుపు వృత్తిని సమూలంగా పోగొట్టడం అన్నది కుదరని పని – ఇది వ్యక్తిగత వృత్తి ఇక పడుపు వృత్తి చేసుకునే స్త్రీలకి గుర్తింపు కార్డులిచ్చి ఏం ప్రయోజనం విటుల మాట ఏమిటి? వీరి ద్వారా వీరి భార్యలకీ– సంతతికీ రోగాలు పాకవా?! మనిషి నైతికంగా బ్రతకుని కోరుకోవాలి గాని – బలవంతంగా అలా బ్రతికించ కలరా?!

**జి పి ఎస్. శ్రీశైలం**


★ మీరు రాసే వాడికి చదివేవాడు లోకువ అన్నట్టు రాస్తున్నారు కట్నాలు కట్నాల చావులు ఆడవారి భావాలు, స్త్రీ బ్రతుకు ఇలాంటి కబుర్లు ఎన్నో రేడియోల్లోనూ, పుస్తకాలలోను చివరికి ఆదివారం అనుబంధంలోను చెపుతూంటారు వాళ్ళకి మళ్ళీ మీరు చెంప కింద చెయ్యి పెట్టుకొని చెప్పి రాయించడం కాదు – అలా చెప్పేవాళ్ళు సంఘంలో ఎంత వరకు ఉపయోగపడుతున్నారని?


● మీలాంటి బండరాయిలా ఆలోచించే వారి మనస్సులు ఎప్పటికైనా కాస్త వాటి వైపు మరలవా అన్న చిన్న ఆశ యిలా పదే పదే మిమ్మల్ని విసిగించే పై సమస్యల గురించి రాయడం జరుగుతుంది అంతేగాని ఒక వార్త కో మనిషి మారినట్టు చూపించకల్గడం – అసంభవం మార్పు కళ్ళకి కనబడేది కాదు జీవితంలో కల్గేది, వార్త అని చదివి విసుక్కునే మీరెప్పుడేనా ఆ వార్త వెనుక పీడించబడిన ప్రాణం గురించి క్షణం సేపు ఆలోచించే అలవాటు చేసుకోండి ముందు అదీ మానవత్వానికి పునాది పదే పదే జరిగే కట్నం చావులు, మానభంగాలు, స్త్రీల అవమానలూ చైతన్యం కల ఎవరూ విసుక్కునే విషయాలు కావే!

**ఎం ఎస్ బాపట్ల**

★ ఆడదానికి జీవితం అంతే పెళ్ళి ఒక్కటే కాదనీ, అది జీవితంలో ఒక భాగం అనీ, పెళ్ళయ్యే దాకానే అనే ధోరణి మానుకోవాలి అని మీరు జవాబిచ్చారు (జూన్ 31) బాగానే వుంది కాని అనుభవంలోకి వచ్చేసరికి చాలా మందికి చాలా సమస్యలు ఎదురౌతున్నాయి. (1) 15 ఏళ్ళనా రాక ముందే సెక్సు వూహలు పుడుతున్నాయి ఆడపిల్లల్లో ప్రకృతి సహజమైన వాటికితోడు నేటి పత్రికలు, సినిమాలు వీటి ప్రభావం చాలా వుంటూంది ఇంట్లో ఎంత కంట్రోల్ చేసినా బయట ఎలాగో చదువుతారు ఇటువంటి పరిస్థితులలో సరైన వరుణ్ణి తేలేక, కట్నాలు పొయలేక 'బాగా చదువు ఆర్థికంగా నిలబడమ్మా' అని చెప్తే అది వారి బుర్ర కెక్కడంలేదు ఆకర్షణ ప్రేమ అనుకుని పెళ్ళి చేసుకుని సరియైన అవగాహన వచ్చేసరికే మానసికంగా కృంగి పోతున్నారు ఇది అరికట్టడం ఎలా? (2) ఎటువైపైకి వెళ్ళినా పరిచయిస్తులు మొదట వేసే ప్రశ్న అమ్మాయి పెళ్ళెప్పుడనే చిన్న చూపు.

● మనుషులెన్ని రకాలో సమస్య లన్నిరకాలుగా వుంటాయి సులోచనగారూ, అందరి సమస్యలూ ఒక్కలాగే వుంటే సంఘ సంస్కరణ చట్టాలు బిగిస్తే సరిపోయేది కదా!! ఆడపిల్లలకి ధైర్యం చెప్పాలి ఒకవేళ పొరపాటు చేస్తే దాన్ని సరిదిద్దుకునే అవకాశం యివ్వాలి ఇక సినిమాలు పత్రికలు– అంటురోగంలా వ్యాపించినప్పుడు– నిరోధక ప్రయత్నంగా జాగ్రత్తలు తీసుకుందుకు ప్రయత్నిస్తాం అది రాకుండా వుండవన్న గ్యారంటీ లేదు అంచేత వైలమా కొమ్ముల చిక్కుకున్న కంటే దాని కొమ్ములందుకుని జాగ్రత్తపడే ప్రయత్నమే– పెద్దలు చేయకల్గినది ఏమైనా– పిల్లలు యింటి దగ్గర పెరిగిన వాతావరణం వారిపై చాలా బలమైన ముద్ర వేస్తుందని నేను నమ్ముతాను అందుకే ఆ వాతావరణం కలుషితం గానిదిగా చూడటం తల్లి తండ్రుల బాధ్యత 'బాగా చదువుకో' అని చెప్పడం వేరు దెప్పడం వేరు మార్కులతో పిల్లల జీవితాలని కొలవడం మానాలి వారి ఎదిగే మనస్సుతో ఆరాటం తెలుసుకుందుకు యింట్లో వారు ప్రయత్నం చేయకపోతే– పై వాళ్ళు చిన్న చూపు చూస్తారు □




McDowell's
McDowell
ఫస్ట్ క్లాస్!
McDowell
నాటికీ, నేటికీ ఎన్నటికీ ఇది No.1

# మహిళా పాఠకుల శీర్షిక!

# ఈకాలం పెళ్ళిళ్లు

## అవగాహన వుంటే కులాంతర వివాహం మంచిదే

కులాంతర వివాహాలనగానే యువతరంలో చాలా మంది ఉత్సాహం చూపు తుంటారు. కానీ ఆచారాలను, సాంప్రదాయాలను వెనకేసుకొచ్చే పాతతరం వాళ్ళకిది ఘోరమైన తప్పుగా కనిపించవచ్చు

కానీ ఈ తరంలో కూడా ఇంకా కులమతాల పట్టింపు లున్నాయంటే ఎంతైనా సిగ్గుపడ వలసిందే కానీ మరో వైపు నుండి చూస్తే కొంత మంది మనుష్యులు కులాంతర వివాహాలు అనే స్థాయికి ఎదిగారంటే వాళ్ల ఆలోచనలు చాలా పరిణితి చెందినట్టుగా భావించ వచ్చు.

ఈ రోజుల్లో కులాంతర వివాహం ప్రసక్తి వస్తే చాలా మంది అదేం పెద్ద సమస్య కానట్టుగా మాట్లాడతారు. కానీ ఆచరించ వలసిన సమయం వచ్చేసరికి ఏవో కుంటి సాకులు చెప్పి తప్పుకుంటారు.

యువతీ, యువకుల మధ్య పరిచయం స్నేహంతో మొదలై, అది కాస్త ముదిరి ప్రేమగా మారుతుంది. ఆ అనుబంధం ఇంకా గాఢమైతే పెళ్ళి వరకు వస్తుంది అసలు సమస్యల్లా అప్పుడే మొదలవు తుంది. అప్పుడు వాళ్ళు తమ యింట్లో పరిస్థితి గురించి ఆలోచిస్తారు ఇంట్లో ఈ విషయం చెప్పటానికి భయపడతారు. దీని క్కారణం కులాల సమస్యే ఏదో విధంగా కష్టపడి తల్లి దండ్రులకు తమ అభిప్రాయం చెప్పారే అనుకోండి. వాళ్ళు పిల్లలు ఇష్టపడినట్టు చేస్తే సమస్యే వుండదు. సంప్రదాయం, పరువు ప్రతిష్టల గురించి ఆలోచించే పెద్దలు దీన్ని హర్షించరు దీనితో యింట్లో గొడవలు ప్రారంభ మవుతాయి




నూటికి 90% వరకు యింట్లో వత్తిడికి లోబడి పోతారు ఇలాంటి మనస్తత్వం వున్న వాళ్ళు అసలు అలాంటివి తలపెట్టనే కూడదు దీనివల్ల ఆడపిల్లలు అపహాస్యం పాలవటం తప్ప ప్రయోజనం వుండదు



సమస్యలను, ముందుగానే బేరీజు వేసుకుని, ఎటువంటి అడ్డంకులనైనా ఎదుర్కొనే ధైర్యం వున్నవారే కులాంతర వివాహం చేసుకోవచ్చు అయితే దీనికి ముందుగా ఏ ఫలితం ఆశించని స్వార్థరహిత ప్రేమ ఇద్దరిలో వుండాలి

కులాంతర వివాహాల వల్ల "జెనిటిక్స్" పరంగా చూసినా అంతగా నష్టాలు కనిపించవు 'మేనరికపు వివాహాల వల్ల అంగ వైకల్యం లాంటివి సంభవించ వచ్చును గానీ, కులాంతర వివాహాల వల్ల వీటిని చాలా వరకు అరికట్ట వచ్చును

కులాంతర వివాహాల వల్ల కొత్త సమస్యలు తలెత్త వచ్చును ముఖ్యమైన సమస్యల్లా పుట్టే పిల్లల వివాహ సమస్య. అయితే అలాంటప్పుడు ఆ పిల్లలు ఏ కులం వాళ్లని చేసుకున్నా అడ్డు చెప్పకూడదు. ఈ విధంగా తల్లి దండ్రులు పిల్లలకు మార్గ దర్శకులు కాగలరు.


పెళ్ళికి ముందే యువతీ, యువకులు ఇద్దరు భవిష్యత్ గురించి చక్కని ప్రణాళిక వేసుకోవాలి లేకపోతే ముందు ముందు కులాల సమస్య అడ్డురాక పోయిన ఇతర ఆర్థిక సమస్యల వల్ల వివాహం ఆశయం నెర వేరదు ఇద్దరికీ తాము స్వతంత్రంగా బ్రతక గలమనే ధీమా వుండాలి. ఆత్మ విశ్వాసం వుండాలి. వివాహం చేసుకున్న వారికి చక్కని అవగాహన వుండాలి. ఇద్దరూ కూడా ఎప్పుడూ అవతలి వారి ఆత్మ గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాలి. అప్పుడే కులాంతర వివాహాలకు సార్థకత.

— యం. సత్యకళ, విశాఖపట్నం

* * *

## భర్తలను హింసించే భార్యలు

సర్వ సాధారణంగా కన్యలు తమ సంసార జీవితం గురించి ఎన్నెన్నో పగటి కలలూ, రాత్రి కలలు కంటూ ఉంటారు. పెళ్ళి కాగానే సినిమా స్టార్ లాంటితన భర్త వెనుక స్కూటరుపై కూర్చుని, భర్తను లతలా పెనవేసుకొని "ఝాం ఝాం"మంటూ సినిమాలకు, షికార్లకు తిరిగి రావాలని ఇలా ఎన్నో ఎన్నెన్నో గాలిమేడలు కట్టుకుంటారు. కాని జీవితం అందరికి వడ్డించిన విస్తరి కాదు వారికి ఎంత ప్రాప్తముంటే అంతే సంప్రాప్తమౌతుంది. అందర్నూ అందల మెక్కాలనుకుంటే మోసేవారు ఎవరుంటారు? కావున ఆమె కట్టుకున్న గాలిమేడలన్నీ కూలిపోతే, తాను ఊహించిన ఊహలన్నీ తారుమారైతే? అప్పుడు ఉన్న దాంతోనే తృప్తిపడాలి. భర్తకు చేదోడువాదోడుగా ఉండాలి భర్తకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు తాను కలుగజేసుకుని, సరి అయిన సలహా యిచ్చి, ఆ సమస్య తొలగి పోవుటకు తోడ్పడాలి అప్పుడే వారి జీవితంలో ఎలాంటి అరమరికలు ఉండవు కాని కొందరు గృహిణులు తన భర్త తానూహించుకొన్నట్టు రాజకుమారుడు కానందుకు చింతిస్తూ, తాను మహారాణి భోగాలను అనుభవించలేక పోయినందులకు భర్తను శాపనార్థాలు పెడ్తూ, చీటికి మాటికి ప్రతి దానికి పెద్ద రాద్ధాంతం చేస్తూ, భర్తను హింసిస్తూ ఉంటారు అలా చేయటం ఆ గృహిణుల మూర్ఖత్వమే అనాలి. (భర్తను హింస పెట్టడం అంటే భర్తను అప్పడాల కర్రతో చావబాద నవసరంలేదు పైన తెల్పిన కార్యక్రమాలు అమలు జరిపినా చాలు అభర్త మానసికంగా కృంగి పోవటానికి) అందుకే ప్రతి గృహిణి తమకన్నా పై అంతస్థులో ఉన్నవారిని చూసి, వారికున్న రాజభోగాలు తమకు లేవని బాధపడకూడదు ఎందరో నిర్భాగ్య జీవులు వారి సంసార సాగరాన్ని ఈదలేక కడు పేదరికాన్ని అనుభవిస్తున్నారు అట్టివారికన్నా మనం వేయి రెట్లు మెరుగని తృప్తిపడి, అట్టి వారికి చేతనైనంత సహాయం చేయటం ఆ గృహిణి ధర్మం అలా ఆ గృహిణి ఎందరో మహిళలకు ఆదర్శప్రాయం కావాలి. కాని మనం తరచు చూస్తూ ఉంటాం. కొందరు స్త్రీలు, భర్త పండక్కి క్రొత్త



చీర కొనలేదనో, సినిమాకు పంపలేదనో, ఒకటేమిటి ఏదో ఒక వంకతో, ఏదో ఒక మిషతో భర్తను అస్తమానము సాధిస్తూనే ఉంటారు పక్కింటి పంకజాక్షిగారు పట్టుచీర కొంటె తానూ కొనుక్కోవాలి ఎదురింటి ఎం ఎల్ ఏ గారు టి వి కొంటే అదీ కొనాలి అలా ప్రక్కవారితో సమానంగా తూగాలనుకుంటూ, తమ అంతస్తునే మరచి ప్రవర్తిస్తూ, అలాంటి గొంతెమ్మ కోర్కెలు తీర్చలేదని భర్తను అనుక్షణం హింసిస్తూ అతనికి ఊపిరి కూడాసరిగ్గా ఆడనివ్వకుండా చేస్తారు అప్పుడు ఆ మధ్య తరగతి యజమాని తన భార్య పెట్టే హింసను భరింపజాలక ఎలాగో తిప్పలుపడి అలాంటి అనవసరమయిన, ఖరీదైన 'ఫర్నిచరు' అంతా అమర్చాడే అనుకోండి, చివరకు ఏమౌతుంది? ఆ భర్త, అప్పుల బాధ భరించజాలక ఆత్మహత్య గావించుకొనుటయో లేక ఇలాంటి అనవసరమయిన అవసరాల నిమిత్తమై ముందు ఆఫీసు సొమ్ము ఖర్చు చేసి, తరువాత ఆ సొమ్మును సకాలంలో చెల్లింపలేని కారణంగా ఉన్న ఉద్యోగము కాస్తా ఊడిపోవటమో జరుగుతుంది అందుకే ప్రతి గృహిణి ఉన్నదాంతో నే తృప్తిపడూ, తాను అతి ఆడంబరాలకు పోకుండా, తన భర్తను కూడా అలాంటి అనవసరమయిన ఖర్చులను చేయనీకుండా, నేర్పుగా భర్తను అదుపులో పెడూ, అతనికి చేదోడు వాదోడుగా ఉంటే అప్పుడు ఆ గృహిణి జీవితం బృందావనమే అవుతుంది కోటికి పడగలెత్తిన కోటీశ్వరుడు కూడా పొందలేని ఆత్మ సంతృప్తి వారికి కలుగుతుంది జీవితం ఒకఏస్సులాంటిది భర్త డ్రైవరు, భార్య కండక్టరు వారిద్దరూ ఐకమత్యంగా ఉంటేనే ఆ సంసారమనెడి బస్సు సవ్యంగా, ఏ ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుంది వారికి అప్పుడు ఎలాంటి అవరోధాలు ఉండవు అప్పుడే- వారి జీవితం బంగారపు తూగుటుయ్యాల అవుతుంది వారి ఐకమత్య మార్గమే వారి జీవితానికి వెన్నెలబాట అవుతుంది అందుకే ప్రతి గృహిణి ఉన్నదాంతో తృప్తిపడూ, పొదుపుగా జీవితాన్ని కొనసాగిస్తూ, భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ తన సంసారాన్ని నేర్పుగా, ఓర్పుగా, తెలివిగా తీర్చిదిద్దుకోవాలి అప్పుడు వా జీవితానికి అంతే ఉండదు ఎంత చెట్టుకు అంతే గాలి అని గ్రహించి మంచి తరుణం కోసం కొన్నాళ్లాగాలి

చిలకలపూడి అనంతలక్ష్మి,
మచిలీపట్నం

* * *

# ఎందుకీ పెళ్ళిళ్ళు?

సామాజిక పరిస్థితులదృష్ట్యా స్త్రీ, పురుషులు జాతి, మత వయసుల ప్రాతిపదికపై ఒక బంధనం ద్వారా యిరువురిని కట్టడి చేయడమే వివాహం ఈ విధంగా పెళ్ళి పేరుతో స్త్రీ, పురుషుల పరస్పరాశ్రయ పద్ధతిని ఉన్నత విలువలు ఆపాదించటంద్వారా వారి వైవాహిక జీవితాన్ని ప్రోత్సహించటం జరుగుతోంది

మారుతున్న సామాజిక పరిస్థితులలో వివాహాలు యాంత్రికంగా జరిగిపోతున్నాయ్ యువతీ యువకులలో, పెళ్ళి జీవితంలో ఒక బాగం మాత్రమేనని పరిపూర్ణమైన జీవిత పరమావధికాదనే నమ్మకం బాగా ప్రబలింది

దీనికి కారణాలు అనేకం వున్నాయ్ ముఖ్యంగా యువతులలో వివాహం పట్ల నిరాశ, నిస్పృహలు అధికంగా కనిపిస్తున్నాయ్ ఆకాశాన్ని అంటుతున్న కట్నం ధరలు యిచ్చుకోలేక తల్లి తండ్రులు పడే కష్టాలు, అందం, ఉద్యోగం రెండూ కావాలనే యువకుల కోర్కెలు – వీటి మధ్య సమిధల్లా నలిగిపోతున్న అమ్మాయిలలో పెళ్ళిపట్ల వైరాగ్యం, ఆవేదన క్రమంగా చోటుచేసుకొంటున్నాయ్

పెళ్ళి పేరుతో జరిగే ఈ కట్నాల మార్కెట్‌లో యువతీ యువకులు బజారు వస్తువుల్లా అమ్ముడుపోతున్నారు తరువాత యిరువురి మధ్య సఖ్యతవున్నా, లేకపోయినా కామార్థ అనుభూతులు ద్వారా పిల్లల్ని కనటం, వారిని పెంచడం – యిలా వంశాభివృద్ధి వీరి జీవితాలలో స్పందన కనిపించదు సాంప్రదాయక కట్టుబాట్లకు తలవంచి తప్పదన్నట్లుగా జీవిస్తూ, ఒకరిపై ఒకరు కసితో వ్యవహరిస్తారు పెత్తనం సాగిస్తారు పురుషాహంకారం రాగద్వేషాలతో మిళితమైన యిలాంటి పెళ్ళిళ్ళు కాపురాలు చూస్తూ జీవితమంటేనే విరక్తిగా మాట్లాడే వ్యక్తులు ఎంతమందో వున్నారు

దీనికి ముఖ్యకారణం ఏమిటి? పెద్దల మూర్ఖత్వానికి, మూఢత్వానికి బలి పశువుల్లా ఆహుతి అవుతున్న యువతీ యువకులు, పెళ్ళికోసం తల్లి తండ్రులు చేసే అప్పులు తలచుకొంటూ బాధపడే అమ్మాయిలు, మనసులో వున్న ఆశలపందిరిని స్వహస్తాలతో ధ్వంసం చేసి ఇష్టంలేని అమ్మాయికి తాళికట్టే యువకులు – ఇలాంటి మనుషుల మనసుల్లో పెళ్ళి అంటే పవిత్రమైనది, ఉన్నతమైనది అన్న భావం క్రమంగా కరిగిపోవడంలో ఆశ్చర్యంలేదు


ఎన్నో విపత్కర పరిస్థితులు దాటి వివాహం జరిగిన తరువాత కట్టుకొన్న భార్యలో తనాశించిన అందం, ఆకర్షణ లేకపోతే ఇంకొక అమ్మాయిని పెళ్ళి-చేసుకోవడానికి సిద్ధపడుతున్నాడు పురుషుడు బజార్లో వస్తువుల్లా భార్యల్ని మారుస్తున్న యువకుడికి వివాహంలో జరిగే సప్తపదికి అర్థం ఏవిటో బహుశా తెలియకపోవచ్చును

"ఏడు అడుగులు నాతో నడచిన నీవు నా సహధర్మచారిణివి" చివర్న అరుంధతీ నక్షత్రం చూపెట్టడం ముఖ్య ఉద్దేశ్యం కూడా ఇదే 'ఆకాశం, ప్రకృతి, సమస్త జగత్తు స్థిరమైనవి అలాగే నువ్వు నాలోను, నా కుటుంబంలోను స్థిరమైన దానివి"

ఇలాంటి పవిత్ర ఆశయాలున్న వివాహం నేడు సాంఘిక మూఢత్వంలో కొట్టుకుపోతోందంటే ముఖ్యకారకులు యువతీ యువకులే పెళ్ళయిన యువకులు భార్యల ఉద్యోగాన్ని పెద్ద ప్రయోజనంగా వాడుకొని వారిని మానసికంగా హింసిస్తుంటే యువతులలో జీవితమంటేనే ఏహ్య భావం కలుగుతోంది సమాజానికి వెన్నెముకల్లాంటి యువతీ యువకుల ఆలోచనాసరళిలో సరైన మార్పురావాలి ఇద్దరిలో ఆలంబన, అవగాహన కలగాలి ఒకరి అభిప్రాయాలకు ఒకరు విలువనిచ్చే ఉన్నతమైన వ్యక్తిత్వం ఏర్పరుచుకోవాలి మనసుకి నచ్చిన వ్యక్తిని నిరాడంబరంగా పెళ్ళిచేసుకునే ఆత్మస్థయిర్యం పెంపొందించుకోవాలి

అప్పుడే వివాహం మధురానుభూతిగా యువతీ యువకుల మనసుల్లో నిలిచిపోతుంది సంపూర్ణ జీవిత పరమావధి చేకూరుతుంది కామార్థ అనుభూతి కన్నా అలౌకికమైన మానసిక అనుభూతే శాశ్వతమనే భావన యిరువురిలో కలిగినప్పుడే జీవిత రథం ప్రగతిపథంలో ముందుకి దూసుకుపోతుంది

విశ్వనాథ రమ,
విజయనగరం ☐





కూపన్
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

## ఈ కాలం పెళ్లిళ్లు

పంపిన వారి పేరు

పూర్తి చిరునామా

పిన్ కోడ్


నైసర్గిక పుష్పాలతో ఏది కాదో సాధ్యం
నైసర్గికమైన స్వస్తిక్ శీకేకాయ్ సబ్బుతో అది సాధ్యం
అధికమవుతుంది మీ కేశ సౌందర్యం
SHIKAKAI
BEAUTY SOAP FOR THE HAIR
స్వస్తిక్ శీకేకాయ్ సబ్బు ఇప్పుడు మళ్లీ లభిస్తోంది.
Shilpi DM 1/87 TEL

# మన సంస్కారాలు ఓం విశేషాలు

ఖండవిల్లి సూర్యనారాయణ శాస్త్రి

## నామకరణం –

బాల బాలికలకు వారు పుట్టిన పదకొండవ రోజున 'నామకరణ'' సంస్కారం చేయడం శిష్టాచారమై ఉంది

(''ఏకాదశే హని నామ కరణం కుర్యాత్ అని – అపస్తంబ గృహ్య సూత్రం)

స్త్రీల పేరులోని అక్షరాలు బేసి సంఖ్యలోను పురుషుల పేరులోని అక్షరాలు సరి సంఖ్యలోను ఉండాలి

పిల్లలు పుట్టినప్పటి మాసం పేరు, పుట్టినప్పటి నక్షత్రం పేర్లు మొదట పెట్టాక తండ్రితన బిడ్డలకు లౌకిక వ్యవహారానికి పనికివచ్చే ''వ్యావహారిక నామ పిమ్మట పెట్టవలసి ఉంది

ఈ నామకరణ సమయంలో తల్లి దండ్రులు పఠించవలసి ఉన్న వేద మంత్రాన్ని బట్టి వారు పుత్రునికి ' వేద' నామకరణం ముందుగా చేయడం, దానిఫలితంగా పుత్రుడు బావికాలంలో బ్రహ్మజ్ఞాన సంపన్నుడై నూరేళ్ళు జీవించడం అనే మహత్తర ప్రయోజనం కూడా ఈ సంస్కారం వలన ప్రాప్తిస్తుందని

' వైదో వైపుత్ర నామాసి సజీవ శరదశ్శతం' అనే వేద మంత్రం తెలుపుతుంది మాస, నక్షత్ర వ్యావహారిక నామాల కంటే ముందుగానే తమ పుత్రునికి ఈ వేద, నామధేయం పిల్లవాని కుడి చెవిలో రహస్యంగా చెయ్యవలెనని ''పుత్రస్య నామ దదాతి తద్రహస్యం భవతి '' అనే వైదిక కారిక వ్యక్తం చేస్తుంది

''వేద యతీతి వేదః అనే నిర్వచనమును బట్టి ''వేద'' శబ్దం ధర్మమును, బ్రహ్మను ప్రతిపాదించ డమే కాకుండా ఇది వేద వేద్యుడగు పరమాత్మను కూడా బోధిస్తుంది

ఇంకా ''విద్ఌలాభే' అనే ధాతువు కూడా వేదశబ్దం పుట్టడానికి మూలం కనుక 'వేదం' అనేది నాల్గు పురుషార్థముల యొక్క లాభమునకు కూడా సాధన మౌతుంది దీనివలన కలిగే మహత్తర ప్రయోజనం ఇది ''వేదః'' అనగా వేదనం, అంటే జ్ఞానం అని అర్థం మొత్తం మీద జ్ఞాన స్వరూపమైన పరమాత్మ తత్వం అని భావం ఈ తత్వమే ప్రతి జీవుని యొక్క వాస్తవ స్థితి ఈ స్థితిని తెలుసుకున్న నాడే జీవియొక్క జీవితానికి ధన్యత చేకూరుతుంది ఇంతటి పరమార్థం కల పరమాత్మ తత్వాని శిశువుగా ఉన్నప్పుడే జీవికి ఉపదేశించడమనే ఆర్ష సంప్రదాయంతో, జగత్కళ్యాణకరమైన– పర మేశ్వర భావనా భాసితమైన– లోక శ్రేయస్సు ఇమిడి ఉందనడంలో ఏ మాత్రము సందేహంలేదు ఇట్లు తల్లి తండ్రులు తమ పుత్రులకు వారి వ్యావహారి జీవితంలో కూడా మంచి పేరు ప్రఖ్యాతులు దీర్ఘాయుర్దాయం కలగాలనే సద్భావనతోనే వార

(గత సంచిక తరువాయి)

ఈ నామకరణ సంస్కారం చేస్తూన్నట్లు
మమ కుమారస్య ఆయుష్యాభి వృద్ధ్యర్థం
సద్వ్యవహారార్థం నామధాస్యావహే

అనే నామకరణ సంస్కార గత సంకల్పమే స్పష్టం చేస్తుంది

ఇక పుత్రుల పేరులో మొదటి 2 అక్షరాలు, 3–4 అక్షరాలు ఎటువంటివై ఉండాలో ' అపస్తంబ గృహ్య సూత్రాలు అభి వ్యక్తం చేశాయి కనుక మానవుల భావ్య భ్యుదయం అనేది వారి పేరులో గల అక్షరాల శక్తి మీదను ఆ అక్షరముల కూర్పు నేర్పు మీదను కూడా అధారపడి ఉన్నట్లు స్మృతి వాక్యాలు చాటుతూన్నాయి

ఇంకా మహర్షులు దేవతలు వంశంలోని ప్రఖ్యాత పురుషులు ఇట్టి మహనీయుల పేర్లు తమ పుత్రులకు పెట్టడమనే సత్సంప్రదాయం కూడా, బావి కాలంలో పిల్లల పేరు ప్రఖ్యాతులకు కారణా లౌతాయని మహర్షుల మతం (' ఋష్యణూకం దేవతా ణూకం దాయా వైషాం పూర్వ పురుషాణాం నా మానిస్యుః'' అణూకం అనగా పేరు అని అర్థం ) ఇక ఈ 'నామకరణ సందర్భంలో తల్లి తండ్రులు సమంత్రకముగా పిల్లవాని కుడి చెవిలో మెల్లిగా మంత్రం పఠించడం, పిల్లవాని శిరస్సును ముద్దు పెట్టుకొనడం వంటి వైదిక సంప్రదాయాలు కూడా భావికాలంలో బాలుర ఆయురభి వృధ్యాదులకు మంచి సాధనా లౌతున్నాయని ఇందలి మంత్రాలలోని అర్థాలు తెలుపుతున్నాయి

## అన్నప్రాశనః–

' అన్నప్రాశన మర్భకస్య శుభదం మాస్యేవ యుగ్మేశుభే షష్ఠాదావథ పంచమాది విషమే మాసేవ ధూనాం శుభే

అనే 'పూర్వకాలా మృత ' గత వాక్యాన్ని బట్టి మగ పిల్లలకు సరినెలల్లోను, ఆడపిల్లలకు బేసి నెలల్లోను (సంవత్సర కాలం దాటకుండా) అన్న ప్రాశన సంస్కారం జరిపించవలెనని తెలుస్తుంది ముఖ్యంగా మగ పిల్లలకు 6వ మాసంలోనే అన్న ప్రాశనం చేయడం ముఖ్యమనీ ఈ ముఖ్య కాలంలో ఈ సంస్కారం చేయని శిశువు బావికాలంలో గుణహీనుడై బలహీనత వంటి దోషాలు కలవాడౌతాడని స్మృతి వాక్యాలు తెలుపుతున్నాయి ముఖ్య కాలంలో చేసే మంచి పని అచిర కాలంలోనే సిద్ధించి విశేషంగా అది ఫలప్రద మౌతూన్న విషయం మన అనుభవంలో నిదే కదా!!


ఈ అన్నప్రాశన సంస్కారంలో తల్లి దండ్రులు తమ బిడ్డలకు పెరుగు, తేనె నెయ్యి అనే ఆయుర్దాయకర ద్రవ్యాలు మూడూ కలిపిన అన్నమును బంగారపు టుంగరముతో సమంత్రక ముగా ప్రాశన ' చేయించాలి ఇందలి మంత్రాల అర్థాన్నిబట్టి పిల్లలకు మీది నాలుగు ద్రవ్యాలు దీర్ఘాయుర్దాయ ప్రదాలు, మంగళకరాలు అని తెలుస్తూంది

## చౌలం –

''చౌలం' అనగా పిల్లవాని తలపైని శిఖలు ఉంచడం అని అర్థం పుట్టినది మొదలుకొని మూడవ సంవత్సరంలో తండ్రి పిల్లవానికి ఈ సంస్కారం చెయ్యాలి ప్రస్తుత కాలంలో ఏ పాతికేళ్ళ వయస్సులోనో చేస్తున్న ఉపనయనంకి ముందు చేస్తున్న ఈ చౌల సంస్కారంలో వటువునకు తండ్రి పంచ శిఖలు పెడుతున్నాడు

ఈ సంస్కారాన్ని ''ఆయుష్కర్మ ' అని కూడా అంటారు కారణం దీని సంకల్పంలో – నా కుమారు నికి ఆయుర్దాయాభివృద్ధి కొరకు ఈ చౌల సంస్కారం చేస్తున్నానని తండ్రి సంకల్పిస్తాడు

(ఇంకా ఉంది)



1987 దీపావళి కథల పోటీలో రు.700/-లు బహుమతి పొందిన కథ

# క్షీరధార

## ఆ చిన్ని ఊరవతల, మిన్నేటికివతల....

వేద మంత్రాల ఘోషను పోలిన అంబారవాల మ్రోతతో, దూది గుట్టలవంటి జలదాల జట్టుల నందుకోను పైకెగిసిపోతున్న హోమ ధూమంలా ఆ గోధూళి సమూహం సాగిపోతూ, వో చిన్ని పాయగా చీలి క్రమేపీ సన్నబడి ఆ యింటి ముంగిట ఆగిపోయింది.

"అంబా" ప్రీతిగా గోమాత పిలుపు!

ప్రతిగా లేగదూడ అరుపు!

"రామాలాలీ.... మేఘశ్యామా లాలీ" వో మాతృ గొంతుక! "ఊంగా... ఊంగా...." వో పసి భాష లోని పాప కేరింత!

అన్నీ కలగలిసి యేకమైన ప్రతినాటిలాగే ఆ నాటి సంధ్యా రాగాన్నికూడా అందంగా ప్రతిబింబిస్తున్నాయి.

ఆరుబయట నులకమంచంపై పొత్తిళ్ళు సరిజేసి చంకలోని పసివాణ్ణి పడుకోబెట్టింది అనసూయ.

బుట్టలో తడిపిన కాసింత దాణాతెచ్చి ఆవు ముందుంచింది. సగానికోసి ఎండబెట్టిన బీరకాయ ముక్కతో దాని వొళ్ళంతా రుద్దసాగింది కృతజ్ఞతతోనో, మూగప్రేమతోనో అపుడపుడూ



మోర పైకెత్తి ఆమెకేసి చూసే ఆవు గంగడోలు ఆప్యాయంగా తడిమింది.

దూడ తెంచుకోను సిద్ధపడుతూ వురకలేస్తున్న లేగదూడ పలుపు విప్పిందామె.

పొదుగు కుమ్ముతూ పాలు తాగుతున్న లేగను చూస్తూ, మంచంపై కేరింతలుకొడుతున్న కొడుకును చూస్తూ గడపలో అలా కూర్చుండిపోయిన అనసూయ బ్రతుకులోని బాధలన్నీ ఆ క్షణం మర్చిపోయేలా హాయిగా ఆనందంగా నవ్వింది.

ఇవాళ పాలన్నీ దూడకే వదిలేస్తున్నావేంటి అనసూయా?" భర్త రామచంద్రం పిలుపుతో వులిక్కిపడింది.

రానని మొరాయిస్తున్న దూడను లాక్కెళ్ళి కట్టేసి పొదుగుకడిగి పాలు పితకసాగింది.

మనిషికి అవసరమైన, మనసుకేదో ఆనందమైన, వో వింత శబ్దంతో కూడిన సుమధుర సంగీతంతో కురుస్తున్న ఆ పాలధారలు అమృతంకాని అమృత ధారలైన జీవధారలై బ్రతుకుదారులైనట్లు తోచింది అనసూయకు.

పాలు తీయటం పూర్తిచేసి. ప్రేమగా ఆవు నుదుట తనుంచిన పొద్దుటి తాలూకూ కుంకుమ ఛాయలపై మెల్లగా మూర్కొంది.

తల్లీ..... నీ కిద్దరు బిడ్డలు! కన్నానేకాని మూడు నెల్లకే బిడ్డకు పాలు కరువుచేసిన బలహీనపు తల్లిని! కడుపారా కూడైనా తినలేని బడుగు తల్లిగా గుండెలనిండా మురిపాలు తప్ప పసివాడికి పాలే కొరవడ్డ అమ్మను! వేసే గరిక పరకలతోనే కడుపేకాదు పొదుగుకూడా నింపుకుని నీ బిడ్డకేకాదు నా బిడ్డకూ ఆధారమైన నీ ఋణం ఎలా తీర్చుకోను?"

పాత్రలో పైకి తేలిన పాల నురగలాంటి భావమేదో గుండెలనిండా చోటుచేసుకోగా యింట్లోకి నడిచిందామె.

"అనసూయా."

అంతలోనే భర్త పిలుపుతో బయటికొచ్చిందామె. తాము అప్పుచేసిన పక్కవూరి షావుకారు-తమ్ముడు కాంతయ్య కూర్చుని వున్నాడు మంచంమీద!

"బాకీ తాలూకూ డబ్బు వసూలుకై వచ్చిండాడు." పిల్లాణ్ణి భుజంపై వేసుకున్న ఆమె మనసులో భయం చోటుచేసుకుంది.

"కాంతయ్యకు వో కప్పు కాఫీపెట్టు."

"కాఫీ వొద్దుగాని బాకీ సంగతి తేల్చుముందు! యేదోటి సెటిల్‌కాందే తిరిగి రావొద్దన్నాడన్నయ్య."

ఖచ్చితంగా అన్నాడు కాంతయ్య.

"ఏం చెయ్యను కాంతయ్యా! నాకుమాత్రం అప్పు పెంచుకోటం యిష్టమా? యెప్పటికప్పుడు తీరుద్దాం అనుకుంటూనే యేవోటిబ్బందులు! తిండికీ బట్టకే బతుకు కరువైపోతోంది."

"అంటే నీ వుద్దేశం? కాళ్లావేళ్లా బతిమాలి అప్పు తీసుకున్న నాటి పరిస్థితి మర్చిపోయావా?"

"అంతమాటనకు బాబూ.... తల తాకట్టు పెట్టయినా మీ బాకీ అణా పైసల్తోసహ తీరుస్తాను! మరొక్క నెల రోజులు...."

."ఆఁ యీ మాట యేయేటికాయేటిగా వింటూనే వున్నాం! ఆగిన అలాంటి నెలలెన్నో.... కానీ కలలో కూడా మా బాకీ తీరలేదు. అయినా అప్పిచ్చిన అయిదేళ్ళపైగా యెవరూరుకుంటారు? అన్నయ్యసలే ఖచ్చితమైన మనిషి! ఆయనదాకా రానివ్వొద్దు! వెంటనే.... అంటే వో వారంలోగా అప్పుతీర్చేస్తే సరి... లేదా, తాడోపేడో తేల్చుకోవల్సిందేనంటున్నాడు! ఆపై మీ యిష్టం! అయినా....."

అంటూ అర్థోక్తిలో ఆగిపోయి అంతలోనే మళ్ళీ అన్నాడు "తీర్చే స్తోమతే లేనపుడు యే ధైర్యంతో అప్పుచేశావయ్యా అదీ యింత రేటు వడ్డీ మీద?"

చివుక్కుమంది రామచంద్రం మనసు! బదులేమీ యివ్వలేకపోయాడు.

"ఇదిగో రామచంద్రం, యీరోజు సోమవారం. వచ్చే సోమవారంలోగా డబ్బు చెల్లించకపోయావో...... ఆపై మీ యింటికొచ్చేది నేనుకాదు. సరాసరి మా అన్నయ్యే వచ్చి తేల్చుకుంటాడసలు సంగతి! ఆఁ...."

చరచరా వెళ్ళిపోయాడు కాంతయ్య,

చరాచర జగత్తూ తల్లక్రిందులైనట్టనిపించింది రామచంద్రానికి. "తీర్చే స్తోమత లేనపు డే ధైర్యంతో అప్పుచేశావ్?" కాంతయ్య మాటే మళ్ళీ మళ్ళీ మనసులో.... బాధ, అవమానం వొకదానితో నొకటి జతకట్టాయి. "అవును.... యే ధైర్యంతో ఆ అప్పు చేశాడు తను?" బరువుగా నిశ్వసించాడు.

"ఏటికేటికీ కరువూ కాటకాల ధాటికాగలేక, వున్న రెండెకరాల పొలం యెన్నడో చెల్లెలి పెళ్ళికోసం అమ్ముడుపోయింది. యింక పనేముందని, బ్రతుకు తెరువేముందని మిగిలిన ఆ గొడ్డూగోదా బాధగా, తిండిగింజల గాధగా మారిపోయింది. మరికొద్ది కాలంలోనే, తానూ వో వ్యవసాయి కూలీగా మారనున్న తరుణంలో, తల్లిప్రాణం కాస్త తల్లక్రిందులవటంతో, తట్టుకోలేకపోయాడు తను! నవమాసాలు మోసి కని పెంచిన తల్లి మంచంపైబడి చావుబతుకుల్లోవుంటే, చేతిలో చిల్లిగవ్వలేని స్థితిలో, యే వొక్కరి సాయం దొరకని పరిస్థితిలో.... ఆమె వైద్యంకోసం....



# క్షీరధార

కొడుకునుండి ఋణం తీర్చుకుంటూ తన పాత్ర విరమించుకుంటూ ఆ తల్లి యీలోకం నుండే సెలవుతీసుకుంటుంటే ఆ మాతృమూర్తికోసం ఆఖరుసారిగా తను పెట్టాల్సిన కాటి ఖర్చులకోసం కర్మకాండలకోసం

అప్పుడు అప్పుడు చేశాడీ అప్పు

ఏ ధైర్యంతో చేశాడు మరి?

కొడుకుగా తను తను బ్రతికేవున్నాడన్న ధైర్యంతో తనువిచ్చిన తల్లికోసం తనువు చాలించిన తల్లికోసం చేశాడు! అంతే!

భారమైన రామచంద్రం గుండెలనుండి సరాసరి రెండు కన్నీటి బిందువులు దారకట్టాయి

బాధపడకండి! ఆ భగవంతుడున్నాడు!

బాధ తనలోనే భద్రపరుస్తూ లేని ధైర్యం కనబరుస్తూ అసహాయుడైన భర్త కన్నీరు తుడిచింది అనసూయ

* * * * *

వారం రోజులుగా బంధుమిత్రులూ తెల్సినవాళ్ళ అన్ని వూళ్ళూ తిరిగి నిరాశతో తిరిగివచ్చాడు రామచంద్రం

వారం దాటి ఆ మర్నాడు

ఆ యింటిముంగిట వో కొత్త అడుగులచప్పుడు!

రామచంద్రం!

ఉలిక్కిపడ్డాడు రామచంద్రం

వో మనిషితో పాటు తనింటికే వచ్చిన అప్పిచ్చిన పెద్దమనిషి నారాయణను చూసి ,

రండిబాబుగారూ రండి మంచం వాల్చాడు

అప్పుసంగతి తేల్చమన్నాడాయన

కళ్ళు తేలవేశాడు రామచంద్రం

ఈనాడు యిటో అటో తేలందే నే కదిలేదిలేదు

గట్టిగా అన్నాడు

పెదవులు తడారిపోయాయి గొంతులోనే మాట లాగిపోయాయి రామచంద్రానికి

అయిదేళ్ళక్రింత చేసిన అయిదొందల అప్పు వడ్డీతో సహా వెయ్యిదాకా అయిందాకా పెంచుకున్నావ్! యిప్పటికీ తీర్చలేకుంటే యింక ఆపై నీవల్ల యేమవుతుంది? నాకేం చెల్లవుతుంది? వల్లకాదు!

ఎన్ని తంటాలుపడ్డా యీ వారంలోగా నావల్ల కాలేదుబాబూ!

నిలసనగా చూశాడాయన.

ఇహ అప్పుచెల్లించేలా లేదు నీ తీరు. నాకు తెల్సు! అందుకే అప్పుకిందికి యిదుగో... యీ ఆవుని తోలుకుపోతున్నాను అన్నాడతను

బాబుగారూ గాబరాపడ్డాడు రామచంద్రం

ఆ ఆవు పాలదారలేబాబూ మా పిల్లాడి కిప్పుడాదారం

అర్థిస్తున్నాడు రామచంద్రం! ససేమిరా అంటున్నాడు ఆ నారాయణ

ఇంట్లోంచి అంతా వింటున్న అనసూయ నవనాడులూ కుంగిపోయాయి

మా లక్ష్మిలాంటి ఆవునా అప్పుకింది కప్పజెప్పేది? తన బిడ్డ కడుపు నింపుతున్న ఆ తల్లి ఋణమిలాగా తాము తీర్చుకునేది? ఏనాటి అనుబంధం దానితో తనకు?

ఏ కట్నం కానుకలివ్వలేని నిరుపేద తండ్రి తన్నత్తింటి కంపుతూ చిన్ననాటినుండీ తల్లిలేని పిల్లదూడగా తన ఆలనాపాలనాలో పెరిగిన యీ గో లక్ష్మినే పసుపుకుంకాలక్రింద మళ్ళూ మాన్యాలుగా భావించమని దీవించి తనతో పంపాడు

ఎన్నిబ్బందులున్నా యీ లక్ష్మిని మాత్రం తాములక్ష్యంచేయలేదు బిడ్డ తల్లయిన ఆ గో మాత పాలే తన బిడ్డ కాహారం! ఆ లక్ష్మి తమ ఆరోప్రాణం! పొద్దునలేచి ఆ గో ముఖం చూడందే తనేపనీ చెయ్యందే

భరించలేకపోతోందామె!

చెవులూ చేతులూ కాళ్ళూ ముక్కూ తడుము కుంది బాధగా!

ఊహూ! ఆ తల్లిని నిల్పుకోను వొక్క నగైనా యెక్కడుంది! ఆ గో లక్ష్మిని మించి మరే సంపదాలేని పేదరాలిగా తనకు?

గోడకి చేరగిలబడి మౌనంగా రోదించసాగింది

అనసూయా

అనునయంగా ఆమె భుజంపై చేయి వేశాడు లో పలికొచ్చిన రామచంద్రం

ఏమండీ మన లక్ష్మి మన బాబుకి మరో తల్లి బాల్యంనుండీ నా నేస్తం! యెలాగండీ దాన్ని పంపటం?

బావురుమందామె

తప్పదు అనసూయా పరువుకన్నా పాశం ముఖ్యంకాదు!

అత్తింట అడుగుపెట్టే నాతో పాటేగా అదిక్కడ కాలుపెట్టింది? ధ నిస్థానమిక్కడేకాదా? ఆ జన్మాంతం దాని అనుబంధం మనతో నేకాదా?

మళ్ళీ రుద్ధమైం. అనసూయ కంఠం ఆగని దుఃఖంతో

ఆర్తిగా ఆమె తల నిమిరాడు రామచంద్రం

సర్దుకో అనసూయా కళ్ళు తుడుచుకో

అఖరుగా ఆ గో మాతనుకూడా నిల్పుకోలేని పసిబిడ్డ ఆకలికూడా తీర్చుకోలేని దౌర్భాగ్యుల మౌతున్నాం యేంచేస్తాం? చివరిస్సారిగా మన లక్ష్మిని కళ్లారా చూసుకుందువుగాని రా అవతల ఆయన వేచివున్నాడు

డగ్గుత్తికతో అంటూ అడుగు బయటకువేశాడు రామచంద్రం

ఏమిటయ్యా యింకా ఆలస్యం?

విసుక్కున్నాడు నారాయణ

ఆయన కూడా వచ్చిన మనిషి ఆవు పలుపు విప్పి చేతబట్టుకున్నాడు

అంతలోనే యింట్లోంచి పరుగున వచ్చింది అనసూయ

తడిసిన కుంకుమపూవుల్లాంటి కళ్ళు తుడుచుకుంటూ చేతిలోని కుంకుమభరిణతో ఆవు ముందునిల్చింది

చివరిసారిగా దాని వొళ్ళంతా నిమిరి ఆవు నుదుట బొట్టుపెట్టి దండంపెట్టింది

అంతా చూస్తున్న నారాయణ హటాత్తుగా వొక్కంగలో ఆమెను సమీపించాడు

మళ్ళీమళ్ళీ ఆమె ముఖంలోకి చూశాడు

ను నువ్వు అనాటి ఆమెవికదూ ?


అకస్మాత్తుగా వో మూణ్నెల్లక్రితం నాటి సంఘటన జ్ఞాపకమొచ్చిందాయనకు

* * * * *

మరి పల్లెకాని పట్నంకాని ఆ వూరి నుండి బయల్దేరిన వో ప్రైవేటు బస్సు కదిలిన కాసేపటికి వో పసిబిడ్డ మేల్కొన్నాడు చిన్నపాటి యేడ్పురాగంతో

అది గమనించిన ఆమె బుట్టలోని పాలసీసా నందుకుని దాన్ని చుట్టిన ప్లాస్టిక్ కవర్ విప్పబోయింది

వొక్కసారిగా వూపేసిన బస్సు కుదుపుతో వొళ్లోని పిల్లాడు కిందపడకుండా పట్టుకోబోయే తొందర్లో



చేతిలోని పాలసీస క్రిందపడి భళ్ళుమని బద్దలై పోయిందామెక్కళ్ళ నీళ్ళు మళ్ళించగా!

ఎలా? యిప్పుడెలా? బాబులేచాడు! ఆకలి వేస్తుందొచ్చు! అదేపనిగా నిద్రపోతూ పాలు తాగలేదు పొద్దుటకూడా! నిద్దట్లో అలాగే తీసుకొచ్చేశాను బాగా యేడుస్తున్నాడు

యేడ్పుమొహంతో అందామె

పిల్లాడి యేడ్పుకంటే ఆకలికంటే యెక్కువా? సీసాపోతేపోయింది నిండా కొంగుకప్పుకొని పాలుపట్టకూడదూ?

ఎవరో పెద్దావిడ అన్నదానికి యెఱ్ఱబడ్డదామె మొహం

ఈ అమ్మాయి నా చెల్లెలు! యింకాపెళ్ళే కాలేదు! యీ పిల్లాడు నా కొడుకు పెద్దమ్మా! వూళ్ళోని ఆస్పత్రిలో పోలియో మందయి పోవటంతో, పిల్లాడికి గడువు దాటి పోతుందని టౌన్ కెళ్ళి వేయించుకు రావొచ్చుని నా చెల్లి బయల్దేరింది వో పనిబడి వెళ్తున్న నా వెంట! జ్వరంగా వుండి నా భార్య రాలేకపోవటంతో యిలా జరిగింది!

ఊరుకో నాన్నా వూరుకో అంటూ పిల్లాణ్ణి పక్క సముదాయిస్తూనే సమాధానం చెప్పాడామె పక్కన కూర్చున్నాయన

అంతకంతకూ అధికమౌతున్న ఆ పసివాడి రోదనంతో నేవో స్పీడ్ దాటింది బస్సు

బస్సు హోరునూ జనం మాటామంతీ తీరునూ మించి విన్పిస్తుందా పిల్లాడి ఆకలి పోరే!

ఎందుకొచ్చిన బాధరా బగవంతుడా అంటూ వేదన పడిపోతుందా అమ్మాయి

ఒరే బాబూ కాస్త ఆగరా పిల్లాణ్ణెత్తుకుంటూ చిచ్చికొడుతూ, ఎలాగో వోపిక పట్టాలి! వచ్చినంత సేపట్లో టౌన్లో వుంటాం! అటు పిల్లాణ్ణీ, యిటు చెల్లినీ యేక కాలంలో సమాధాన పరుస్తున్నాడా తండ్రి

క్షణ క్షణం వేగం దూరం కొల్లుకుంటున్న వాళ్ల ఆశల్ని కూల్చుతున్నట్టుగా హటాత్తుగా బస్సాగిపోయింది

ఆ నిశ్శబ్దంలో యిప్పుడా పసివాడి రోదనం రోదసి నంటుతోంది

ఏవేవో సామాన్లతో కాసేపు రిపేరు చేసి ప్రిపేరు కాలేదని యీ సర్వీసు నడవదని మరోటి వచ్చే దాకా ఆగాలని చెప్పటంతో కుప్పకూలినంత పనయింది ముఖ్యంగా ఆ అన్నా చెల్లెళ్ళకి! -

పిల్లాడి యేడుపాగటం లేదు!

ఆగటం ఆగటం వూరు దాటి నట్టనడి అడవిలోనే ఆగాలా యీ పాడు బస్సు. కన్నీళ్ళాగ లేదా చెల్లికి

కిందికి దిగి చెట్టూ పిట్టా చూపారు! బుజమ్మీదేసుకు వూపారు! మంచినీళ్ళు తాపారు! ఊహూ!! లాభం లేకపోయింది

పెదవులు తడుపుకుంటూ దేని కోసమో తడుముకుంటూ గుక్కపట్టి యేడుస్తున్నాడు పసివాడు

ఆ తండ్రి జేబు నిండా నోట్లున్నాయి!

పిల్లాడి కడుపు నిండా ఆకలి వుంది!

ఆ స్థితిలో ఆయన కన్పించింది ఆ నోట్లన్నీ పోయినాసరే పిల్లాడి ఆకలీ యేడుపూ పోతే చాలని!

దిక్కు తోచక నాల్గు దిక్కుల కేసి చూస్తున్నారా యిద్దరూ బిక్క మొహాల్తో

ఆకలి తీరనంతవరకూ వంట్లో వోపికున్నంత వరకూ యేడుస్తాడు! అల్లా యేడ్చి యేడ్చి ఆపై యేమౌతాడు పిల్లాడు?! దిగులుగా వుంది వాళ్ళకి

దిక్కు లిగరేస్తూ ఆయాసపడుతూ, ప్రాణాను నీరసంలోకి దిగుతూ కూడా అలా యేడుస్తూనే వున్నాడా చంటాడు

ఏం చెయ్యాలి? బాధగా భయంగా యెన్నడూ తలంచని దీనావస్థలోకి దిగిపోతూ నీళ్ళు నిండిన కళ్ళని కూడా దాచుకోలేక నిస్సహాయంగా చూస్తున్నాడా తండ్రి అంతలోనే

ఏమండీ అన్న పిలుపు విన్పించి తిరిగి చూశారు అందాకా బస్సులో తమ ముందు సీట్లో వో చంటి పిల్లాడితో కూర్చున్న ఆడమనిషి ఆమె

వో చెట్టు కింద పర్చి వున్న టవల్పై కాళ్ళూ చేతులాడిస్తూ ఆడుకుంటున్నామె పిల్లాడు

మీ బాబు నిటివ్వండి!! అడిగింది.

ఎంత వేసారి వున్నాడో, మరెంత టెన్షన్ భరించి వున్నాడో గాని, రక్కున ఆమె చేతికందించాడు బాబుని

ఆప్యాయంగా ఆ పిల్లాణ్ణందుకున్న ఆమె కదిలిపోయిందట నుండి.

గట్టిగా. మెల్లగా... చిన్న మూల్గుగా బాబు యేడ్పు వో చెట్టు చాటుగా ఆగిపోయినట్టన్పించింది

అలవోకగా అటు చూశాడాయన!

ఒళ్ళో వుంచుకున్న బిడ్డ చుట్టూ పైట కొంగు నిండుగా కప్పుకొని కూర్చుని వున్న ఆమె కన్పించిందతడికి లీలగా! జరుగుతున్నదర్థం చేసుకున్నాడు

ఆ క్షణంలో ఆయన కన్పించింది అందని శిఖరా లందుకున్నట్టుగా!

మరి కాసేపటికి తిరిగొచ్చిన ఆమె చేతుల్లో ఆకలి ఆరాటం అలసట తీరిన బాబు ఆదమరచి హాయిగా నిద్రిస్తూ కన్పించాడు

ఎంతో రిలీఫ్‌గా పీలౌతూ ఆమె వేపు చూశాడా తండ్రి కట్టూ బొట్టూ తీరు చూస్తే కడు పేదరాల్లా వుంది

బాబునిచ్చి వెనుదిరిగి వెళుతున్న ఆమె నుద్దేశించి అన్నాడాయన

నువ్వెవరో గాని వూహించని వుపకారం చేసిన నీ మేలు మర్చిపోలేను!! ఇదిగో చూడమ్మా ఫరవా లేదు యీ డబ్బు నీ దగ్గరుంచు

ఆ డబ్బెంతుందో ఆమె చూడలేదు

నేలచూపుల్తోనే యిలా అంది చిన్నగా

చిన్నికృష్ణుడికి వెన్నపెట్టిన ఒక్కనాటి కాదు కాదు వొక్కపూట యశోదమ్మతల్లి మనసుకైనా వెలకట్టగలరా బాబుగారూ

నిరుత్తరుడయ్యాడతను!

ఆమే అనసూయ! ఆయనే నారాయణ!


* * * * *

అమ్మా! నువ్వా అనసూయా

సన్నగా వణికింది నారాయణ కంఠం

నీటిలో పడవుండొచ్చుగాని పడవలో నీరుండరాదన్నట్టు మనిషికి డబ్బుండొచ్చుగాని డబ్బుకోసం మనిషుండరాదని ఆనాడే నీ మాటతో గ్రహించాల్సింది! ఆలస్యమైందమ్మా! నన్ను మన్నించు!

అంటూ వెనుదిరిగి వెళ్ళిపోయాడు నారాయణ ఆ యింటిముంగిటే నిలిచి ఆనందంగా తలూపుతున్న గోమాత పాదధూళి క్రిందపడి నలిగిపోయాయి నారాయణ చించిపారేసిన తీరని అప్పు తాలూకు కాగితం ముక్కలన్నీ!



# ఫాల్గుణి డైరీ

## నైజీరియాలో ఆకలి చావులు!

నైజీరియాలో రోజుకు రెండు వేల మంది పిల్లలు చనిపోతున్నారట ఇవన్నీ ఆకలి చావులేనట ప్రతి పది మందిలో ముగ్గురు పిల్లలు అయిదేళ్ళు వచ్చే లోగానే చనిపోతున్నారట

## ఆడ పిల్లలకు వయస్సు వస్తే అధికారులకు విందు!

ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కియోంజహార్‌కు చెందిన జోడు-బార్బిల్ సెక్టారులలోని గనులలో పని చేసే కార్మికులలో ఆడ పిల్లలు పెద్ద మనుష్యులవడమే వో పెద్ద వుపద్రవమట ఆడ పిల్లలకు వయస్సు వస్తే చాలట వాళ్ళు అందంగా వున్నా అసభ్యంగా వున్నా సరే అక్కడి గనులలోని అధికారులకు, తదితరులకు, బుజ్జి బుజ్జి రాజకీయ నాయకులకూ విందేనట చౌకలో కామోద్రేకాన్ని తగ్గించుకునే వ్యాపారాలక్కడ ముమ్మరంగా జరుగుతున్నాయట గనులలోని పెద్ద వుద్యోగులు తమ కిష్టం వున్నన్నాళ్ళూ తమకిష్టమైన అమ్మాయిని అనుభవించి, ఆనక వదిలేసి మరొకత్తెను తెచ్చుకుంటూ వుంటారట

## ప్రపంచంలో అతి పెద్ద కేకు!

పశ్చిమ యూరప్‌కు చెందిన పోర్చుగల్‌లో జోస రివెజ్ అనే ఆయన 14 మీటర్ల ఎత్తు, ఎనిమిది టన్నుల బరువు కల వో కేకును తయారు చేశారట చర్చి అధికారిగా వున్న యీయన తన కూతురు పెళ్ళికి యీ బృహత్ కేకు తయారు చేయించారట వధువు, వరుల పెళ్ళి తంతు యీ కేకు మధ్యలో జరిగిందట ఈ కేకుకు 12000 గ్రుడ్లు, 2150 కిలోల పంచదార 900 కిలోల పిండీ ఖర్చయ్యాయట ఈ కేకు ప్రపంచంలో కల్లా అతి పెద్దదట

## ప్రపంచంలో రోడ్డు ప్రమాద మరణాలు!

ప్రపంచంలో ఏటికి రోడ్డు ప్రమాదాలలో రెండున్నర లక్షల మంది చనిపోతున్నారట ఇందులో మన దేశంలో 25 వేల మంది చనిపోతున్నారట రోజుకు సుమారుగా ఎనభై మంది మన దేశంలోని రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారట

## పోలీసులకి బహిరంగ ఉరి!

చైనా బీజింగ్‌లో ఒక పోలీసాయన మరో నలుగురి సహాయంతో ఓ లక్ష రూపాయల రొఖ్ఖం ఒక వుంగరం కొన్ని ఖరీదయిన వస్తువులూ దొంగతనం చేశాడట ఈ నేరం ఋజువై, చైనా చట్టం ప్రకారం న్యాయస్థానమతన్ని బహిరంగంగా ఉరి తీయించిందట

## మధుమేహానికి మెంతుల వైద్యం

పచ్చి మెంతులు మనిషి ఆరోగ్యానికి చాలా సహాయం చేస్తాయట అన్నం తినడానికో పావు గంట ముందు పచ్చి మెంతులు కొన్ని నోట్లో వేసుకుని కస పస నమిలి మింగేస్తే, రక్తంలోనూ, మూత్రంలోనూ గ్లూకోజు స్థాయి తగ్గించి, మధుమేహ రోగాన్నుంచి రక్షణనిస్తుందట.

## అత్తగారితో అక్రమ సంబంధం!

కంచికచర్లకు చెందిన బడేటి నాగేశ్వరరావు అనే ఆయన తన అత్తగారితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడట ఇది ఇంట్లో అందరికి తెలిసినా అతనేమాత్రం సంకోచం లేకుండా ఆ సంబంధాన్ని మరింత పటిష్టం చేసుకున్నాట్ట మామగారు చనిపోయాక అత్తా అల్లుళ్ళ కలయిక మరింత పెట్రేగి పోయే సరికాతని భార్య 20 ఏళ్ళ పద్మావతి కిరోసిన్ పోసుకు నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుందట అయితే ఆమెది ఆత్మహత్య కాదని తమ బావ నాగేశ్వర్రావే తమ చెల్లెలను చంపేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసి యీ రంకు పురాణమంతా బయట పెట్టారట ఆమె సోదరులు - పద్మావతి కిద్దరాడ పిల్లలూ వో మగపిల్లాడూ వున్నారట

## కుర్రవాని అఘాయిత్యం!

అమెరికాలోని మిస్సోరికి చెందిన కిర్కొబక్‌నర్ అనే వో కుర్రాడు 25 సెప్టెంబరుదయం నిద్ర లేస్తూనే తుపాకీ తీసుకుని తన గదిలో నిద్ర పోతూన్న తన ముగ్గురు తమ్ముళ్ళనూ కాల్చి చంపి ఛెంగున పెరట్లోకి వెళ్ళి అక్కడ పని జేసుకుంటున్న తలిదండ్రులను ధమాల్న కాల్చి చంపి అంతతో ఆగక కొంచెం దూరంలో వున్న తన మామగారింటికి వెళ్ళి ఎదురొచ్చిన అత్తగార్ని చంపి మామగారి కోసం వెతుకుతుండగా ఆ మామగారు ఇష్ట దైవాన్ని తల్చుకుంటూ వో కత్తితో అల్లుడి మీద లంఘించి, అతన్ని కసకస పొడిచి చంపేశాడట

## భార్య కాళ్ళు నరికిన భర్త!


నైజీరియాలో నిహుకిర్వా అనే వో పశువుల కాపరి భార్య చీటికి మాటికి పుట్టింటి కెళ్తూ ఇదేమని అడిగితే ఆ అడిగిన్నాడు అలిగి మరో సారి కూడా పుట్టింటికెళ్తోందట ఈ వరసకు విసిగిన ఆ కిర్వా గండ్ర గొడ్డలి తీసుకుని ఆమె కాళ్ళు తెగనరికి పారేశాట్ట ఆమె ఆసుపత్రిలో మరణించిందట అతనికి చట్టం యావజ్జీవ శిక్ష ప్రసాదించిందట

## 110 సంవత్సరాల నవయువకుడు!

జాన్ ఇవాన్స్ అనే 110 సంవత్సరాల నవయువకుడు తాను పుట్టి పెరిగిన బ్రిటను దాటి ఎక్కడికి పోలేదట బ్రిటన్ రైల్వేవారాయన కన్ని ఖర్చులూ పెట్టి ఆయనను లండన్ చూడ పంపార్ట 76 సంవత్సరాల కొడుకుతో ఆయన లండన్‌లో దిగే సరికి కార్య నిర్వాహకులాయన కోసం వో చక్రాల కుర్చీని పట్టుకు వచ్చారుట అది చూసి మండి పడిన ఆ జాన్ నేనేమన్నా ముసిలాణ్ణనుకున్నారా అనరిచి, విసవిసా నడిచెళ్ళి పోయాట్ట - వార్నీ!



శ్రీకాంతి చిత్ర
శారదాంబ
PADMALAYA PUBS
శారదాంబ
క్రాంతికుమార్

భవన నిర్మాతల
సంజీవిని
హనుమాన్ బ్రాండ్ సిమెంట్
సాంకేతిక నిపుణుల పరిజ్ఞానముతో అడుగడుగునా పరీక్షించి, ఆధునిక కట్టడములకు మేటిగా తయారు
చేయబడిన సాటిలేని సిమెంట్ హనుమాన్ బ్రాండ్ సిమెంట్ కట్టడములు కలకాలము దిట్టముగా,
పటిష్ఠంగా నిలవాలంటే ఉపయోగించండి హనుమాన్ బ్రాండ్ సిమెంట్
సాంకేతిక నిపుణులచే మీ కట్టడములకు అనుకూలముగా తయారు చేయబడిన
సిమెంట్ హనుమాన్ బ్రాండ్ సిమెంట్
SCC
సోమేశ్వర సిమెంట్స్
అండ్ కెమికల్స్ లిమిటెడ్
రిజిష్టర్డ్ ఆఫీసు నెం 6-3-609/15
ఆనంద్‌నగర్ కాలనీ
ఖైరతాబాద్
హైదరాబాద్ - 500 004 (ఆం.ప్ర.)
ఫోన్ 36347
HANUMAN
SCC
PORTLAND CEMENT
MAYURA




# రావినూతల సువర్ణాకన్నన్

(గత సంచిక తరువాయి)

సూర్యుడు పడమటి కొండల్లోకి జారుతున్నాడు వేటకెళ్ళిన రాజా పాంధూ ఇంకా ఇల్లు చేరనేలేదు

ఏదో ఆలోచించి ఓ నిర్ణయాని కొచ్చిన మమతాదేవి నౌకర్లందర్నీ పంపేసి, ద్వారం దగ్గర దాయమ్మని కాపుంచి మెల్లగా కూతురి గదిలో కొచ్చింది

హంసతూలికాతల్పం మీద పడుకుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది చందన

మనిషి బాగా నీరసించిపోయింది

తల్లిరావడం గమనించినా గమనించనట్టుండి పోయింది

"చందనా! మెల్లగా పిల్చింది మమతాదేవి

చందన పలకలేదు

మళ్ళీ పిల్చింది తల్లి

చందన ఈసారీ పలకలేదుగానీ కళ్ళెత్తి ఓసారి తల్లికేసి చూసింది

ఆపిల్ల కళ్ళు జ్యోతుల్లా వున్నాయి దుఃఖం పొర్లి పొర్లి వస్తోంది

"ముందో సారి లేచి కూర్చో! తర్వాత తీరిగ్గా ఏడుద్దువుగాని కఠినంగా అంది మమతాదేవి

చటుక్కున లేచి కూర్చుంది చందన

మీ అత్తా, బావా వస్తున్నారు ఆమె పక్కగా కూర్చుంటూ అంది తల్లి

తుళ్ళి పడింది చందన

అవును నీ నిరాకరణ సంగతి తెలిసినా, విషయం తెలియని మీ అత్త నిన్ను క్షమించింది! త్వరలో మీ ఇద్దరికీ పెళ్ళి చేసేద్దామని కూడా అంది!

"నేనతన్ని పెళ్ళి చేసుకోనని చెప్పాను! మొండిగా అంది చందన

మమతాదేవి మొహం మరింత కఠినంగా అయిపోయింది

నువ్వు అతన్ని చేసుకుంటావా చేసుకోవా అని అడగడానికొచ్చింది నేనిప్పుడొచ్చింది రేపు అత్తా వాళ్ళొస్తే పిచ్చిగా ప్రవర్తించద్దని హెచ్చరించడానికొచ్చాను అంది గంభీరంగా

చందన మాట్లాడలేదు

అలా ఏడుస్తూనే వుంది

ఆపిల్ల ఏడుపుకి జాలియ్యలేదు తల్లికి మరింత ఆగ్రహాన్ని తెప్పించింది

చందా! మూర్ఖంగా ప్రవర్తించకు! కోపాన్ని అతికష్టంతో అణచుకుంటూ అంది

"నాకు విక్రమ్‌ని చేసుకోవడం ఇష్టం లేదని ఇప్పటికి వందసార్లు చెప్పాను మరోసారి చెప్తాను ఒకసారి కాదు వందసార్లు చెప్తాను నేనతన్ని చేసుకోను!" చందన కూడా కోపంగానే అంది

రేపు మీ అత్తా వాళ్ళతో కూడా ఇలాగే మాట్లాడతావా?"

"ఆ!"

సరే! నాన్నగారితో కూడా నువ్వే చెప్పుకో!"

అవసరం అయితే కచ్చితంగా చెప్తాను!

అంటే నీ మూర్ఖత్వానికి ఓ అమాయకుణ్ని బలిచేస్తావన్న మాట!" దవడలు బిగించి అంది మమతాదేవి

అంటే? అర్థంకానట్టు చూసింది చందన

నీ మనసులో ఎవరున్నారో నాకు బాగా తెలుసు కానీ అది జరిగేపనికాదు! నువ్వింకా అతన్నే ఆరాధిస్తూ కూర్చుంటే అతను పిడికెడు బూడిదవడం ఖాయం!"

అమ్మా! అరిచినట్టు అంది చందన

అవును రేపు జరగ బోయేదదే! కానీ! అతని చావు అలా రాసిపెట్టి వుంటే నీ మనసెందుకు మార్చుకుంటావ్?" అదోలా అంది మమతాదేవి

ఒణికి పోయింది చందన

అలా అనకమ్మా! అంది ఏడుస్తూ

"ఏం? నేనన్నదాంట్లో అబద్ధం ఏమైనా వుందా? మనదేశ సాంప్రదాయం గురించి, ముఖ్యంగా మీ నాన్నగారి గురించి నేను నీకు కొత్తగా చెప్పాలా?"

"అదికాదమ్మా! రసన్

"చందా! ఇంక మాట్లాడద్దు నిన్ను ప్రేమించిన నేరానికి తను వురికంబం ఎక్కాల్సిందే రాజాశ్రయం దొరికినందుకు పొంగిపోయిన అతని తలితండ్రులు కుళ్ళికుళ్ళి చావల్సిందే! దీన్ని ఆ దేవుడు కూడా తప్పించలేడు " విష్వన లేచింది

**జరిగిన కథ– 12:** రసన్‌కు, చందనకు మధ్య విడదీయలేని స్నేహాన్ని చూసి రసన్‌ను రాజ్యం నుంచి పంపేయడానికి మమతాదేవి చేసిన ప్రయత్నాలు ఫలించి ఆమె పుట్టింటి రాజ్యంలో దేవాలయ అలంకరణకు రసన్‌ను తీసుకు పోతారు చందన, విక్రమ్‌ల పెళ్ళి ప్రయత్నాలు మొదలవుతాయి చందన విక్రమ్‌ను చేసుకోనని చెప్పేస్తుంది రసన్‌ను ప్రేమిస్తున్నానని దాయమ్మతో చెపుతుంది రసన్ తల్లి దండ్రులను కూడ అతనున్న దగ్గరికే పిలిపిస్తారు

మమతాదేవి

అలా శపించకమ్మా! రసన్‌కి ఏదైనా జరిగితే నేను బతకలేనమ్మా! తల్లిని చుట్టేసి బావురు మంది చందన

అయితే నిర్ణయాన్ని మార్చుకోక తప్పదు!

అమ్మా!

"అవును చందా! అతన్ని కాపాడ్డమో, లేక మృత్యుసన్నిధికి పంపడమో నీచేతుల్లోనే వుంది బాగా ఆలోచించుకో!

చందన మౌనంగా ఏడుస్తూ ండి పోయింది

అతన్ని రక్షించుకుంటావా, చంపుకుంటావా? రెట్టించింది తల్లి చందన దీనంగా చూసింది

ఆ చూపుకి తల్లి మనసు కరగలేదు

ఆ ఏడుపు ఆపి జరగాల్సింది చూడు ఇంకొన్నేపట్లో మీ నాన్నగారొచ్చేస్తారు ఆయన నీ ప్రవర్తనకి మరేదేదో వూహించు కుంటున్నారు ఆయనకి అనుమానం రాకుండానే మనం ఏదో ఓ నిర్ణయం చేసుకోవాలి

అతని మీద ప్రేమకురిపించి వురికంబానికి పంపుతావో అతన్ని మర్చిపోయి ప్రాణభిక్ష పెడతావో నువ్వే ఆలోచించుకో! అంటూ విసురుగా వెళ్ళి పోయింది మమతాదేవి

కుప్ప కూలిపోయింది చందన

తల్లి మాటలు ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి రసన్ అందమైన మొహం కళ్ళముందు చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తోంది

నా రసన్ని వురితీస్తారా? ఒద్దు! ఒద్దు! అతని మీద ఈగవాలినా భరించలేని నేను అతన్ని వురితీసి చంపేస్తే సహించగలనా? ఉహూఁ! నారసన్ పది కాలాలపాటు చల్లగా వుండాలి అంటూ ఆక్రోశించిందామె హృదయం

ఆలోచించింది

గంటల తరబడీ ఆలోచించింది

చివరికి ఓ దృఢనిశ్చయాని కొచ్చింది

అప్పుడు ఆమె మొహంలో దిగులు మాయమయింది చివ్వున లేచి తల్లి దగ్గరికొచ్చింది

ఏం నిర్ణయించుకున్నావ్! గంభీరంగా అంది మమతాదేవి

నేను రసన్ని పూర్తిగా మర్చిపోతాను

ఏవిఁటి?' గభాల్న లేచి నిల్చుంది తల్లి

నేను రసన్ విషయం ఎత్తను జీవితంలో అతన్ని గురించి మాట్లాడను! నేల చూపులు చూస్తూ అంది చందన

నిజమా?' మమతా దేవి కళ్ళలోకి వెలుగొచ్చింది

అవును! నా నిర్ణయం అదే! ఒణికింది చందనగొంతు

మమతాదేవి ఆనందంతో కూతుర్ని కౌగిల్లోకి తీసుకుంది వుద్వేగంతో ఆ పిల్లతలనీ నుదుటినీ ముద్దాడింది

అత్తా వాళ్ళకి ఈ విషయం కబురు చెయ్యనా? అంది వుత్సాహంగా

అలాగే అన్నట్టు తలూపింది చందన

నా బంగారు తల్లి! చెప్పిన మాట కాదనదు కూతుర్ని మరోసారి ముద్దాడింది మమతాదేవి

చందన తనగదిలో కెళ్ళి పోయింది

మమతాదేవి వుత్సాహంగా దాయమ్మ దగ్గరికెళ్ళి విషయమంతా వివరించింది

"నిజంగానా? అందామె కూడా ఆశ్చర్యంగా

అవును నాకూ అలాగే అనిపించింది ముందు తర్వాత ఒకటికి పదిసార్లు చెప్పాక నమ్మకం కుదిరింది అమ్మయ్య! ఇంకనాకే దిగులూ లేదు రేపు విక్రమ్ వాళ్ళొస్తే ఎలాగా అని హడిలిపోతున్నాను అంది మమతాదేవి ఆనందంగా

నిజమే అంది దాయమ్మ

ఆమెకీ ఆనందంగానే వున్నా ఎందుకో నమ్మకం కుదరడం లేదు

ఏది ఏమైనా ప్రస్తుతం మాట్లాడకుండా వుంటే రేపు విక్రమ్‌తో పెళ్ళయ్యాక అన్నీ మర్చి పోయి హాయిగా వుంటుంది అనుకుంది తృప్తిగా

* * * * * * * * * *

అర్ధరాత్రి అయింది


ఠాణాలో పన్నెండు గంటలు కొట్టారు

చందన పరుపుమీద వెల్లకిలా పడుకుని ఆలోచిస్తోంది ఆమె రెప్ప లంటుకోవడం లేదు ముయ్యాలని ప్రయత్నించనూ లేదు

ఓ సారి చుట్టూ చూసింది

ఓ మూలగా కాగడా వెలుగుతోంది

ఆమె మంచం పక్కగా నేల మీద పడుకున్న దాయమ్మ గాఢనిద్రలో వున్నట్టు ఆమె తీసే వూపిరి వల్ల తెలుస్తోంది





# మంజీర నాదం

ఊరంతా నిద్రావస్థలో వున్నట్టు అతి నిశ్శబ్దంగా వుంది

చందన మళ్ళీ ఓసారి చుట్టూచూసి మెల్లగా లేచికూర్చుంది ఆమెకళ్ళు ఎర్రగా మంకెన పూల్లా వున్నాయి మొహంలో మాత్రం ఏదో దృఢనిశ్చయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది

మెల్లగా మంచం దిగింది చందన

ఆమె పాద మంజీరాలు చిన్నగా మోగాయి

వాటి శబ్దం వినిపించకుండా వుండేలా మడమల పైకి పెట్టింది ఆపై దిండుకిందినించి ఓ చిన్న పొట్లాం తీసింది రాత్రి దాయమ్మ ఆమె కోసం పెట్టిన పాలు తాగనేలేదు

మెల్లగా పాల పాత్ర మీది మూత తీసి ఆ పొట్లాంలోని పొడిని అందులో పోసి కలిపింది

ఓ సారి పాల పాత్రఎత్తి అందులోకి చూసింది ఆ పాలలో రసన్ మొహం నవ్వుతూ కనిపించింది ఆమె పంటికింద కింది పెదవి నలిగింది ఓసారి కళ్ళు మూసుకుంది మూసిన ఆకళ్ళలోంచి వెచ్చని కన్నీరూరి ఆపాల గిన్నెలో నూ ఎదమీదా రాలుతున్నాయి

"నా రసన్! నన్ను క్షమించు! నేను నిన్ను చేరలేని అశక్తురాలను! వంశం పేరిట మారణహోమాలు జరిగే ఈ రాజ్యంలో రాజా పాంథూ వంశంలో పుట్టిన దురదృష్ట వంతురాల్ని నిన్ను పూర్తిగా మర్చిపోవాలట! లేకపోతే నిన్ను వురి తీస్తారట


చూశావా రసన్! ఈ పెద్దలు ఎంత దుర్మార్గులో? నా రసన్! నేను నిన్ను మర్చిపోగలనా? అది నావల్లవుతుందా? అలా అని నిన్ను ఆ కిరాతకులు చంపేస్తుంటే చూసి భరించగలనా? లేదు రసన్! ఆ వూహ భరించలేను

అందుకే అందుకే రసన్ నేనీ నిర్ణయాని కొచ్చింది నీకన్నా ముందుగా స్వర్గం చేరుకుని, నీ రాక కోసం ఎదురు చూస్తుంటాను పారిజాతపు పూమాల పట్టుకొని నీ కోసం ద్వారం దగ్గర నిల్చుని వుంటాను

స్వర్గమైనా, నరకమైనా ఇద్దరం ఒకే చోట వుందాం ఈ వరం దేవుడినించి పోట్లాడైనా సరే పొందుతాను

కానీ రసన్! మరుజన్మంటూ వుంటే ఇద్దరం ఏఅడవుల్లోనో ఏ నిరుపేద ఇళ్ళల్లోనో పుట్టి పెళ్ళి చేసుకుని హాయిగా నిశ్చింతగా నూరేళ్ళూ బతుకుదాం సెలవిక, నీకన్నా ముందుగా స్వర్గానికి వెళ్తున్న ఈ నీ చెలిని క్షమించు! అనుకుంటూ ఒణుకుతున్న చేతులతో పాల పాత్ర పెదవుల దగ్గర పెట్టుకుంది చందన.

మరుక్షణం ఆ పాలు ఆమె గొంతుదాటి కడుపులోకి చేరేవే! కానీ చేరలేదు




పాల పాత్ర పాలతో సహా అల్లంత దూరాన పడింది తుళ్ళిపడి చూసింది చందన

ఎదురుగా దాయమ్మ!

ఏం పనితల్లీ ఇది? ఆమె తల నిమురుతూ అంది

చందనకి పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చింది

'ఇంతకన్నా మరోమార్గం కనిపించలేదు దాయమ్మా ఆమె గుండెల్లో తలదాచుకుంటూ అంది

చచ్చిపోతే సమస్యలన్నీ సమసి పోతాయా చందమ్మా

ప్రస్తుత సమస్య సమసి పోతుందిగా?

పిచ్చిదానా! చావు దేనికి పరిష్కారం కాదు! గంభీరంగా అంది దాయమ్మ

ఎందుక్కాదు! మీ రాజుగారి వంశ ప్రతిష్ఠ నిలుస్తుంది మీ రాణిగారి మనసు చల్లబడుతుంది! ఆవేశంగా అంది చందన

లేదు రాజవంశానికి మాయని మచ్చ ఏర్పడుతుంది రాజా పాంథూ గారమ్మాయి ఏదో నేరం చేసి అది బైటపడుతుందన్న భయంతో ఆత్మహత్య చేసుకుంది అంటారు ఇంకా రకరకాల కథలు ప్రచారంలో కొస్తాయి అప్పుడు మీ తల్లి దండ్రులు అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంటారు!

దాయమ్మా!

అవునుతల్లీ! నా మాటవిని తమాయించుకో! చచ్చేంసాధిస్తావు చెప్పు! అంది దాయమ్మ అనునయంగా

స్వర్గాని కెళ్ళి నా రసన్ కోసం ఎదురు చూస్తుంటాను!

దాయమ్మ నవ్వింది

ఎందుకు నవ్వుతావ్? చిరాగ్గా చూసింది చందన

నవ్వకేం చెయ్యను చందమ్మా! నీ మాటలు వింటే నేనేకాదు ఎవరైనా నవ్వుతారు లేక పోతే ఏవిటి చెప్పు! ముక్కుపచ్చలారని పిల్ల ఇన్ని ప్రేమ వాక్యాలు వల్లిస్తోందంటే ఇది అమాయకత్వం కాదూ?

అమాయకత్వమా? నేనేం పాపాయిని కాదు! కోపంగా అంది చందన

మళ్ళీ నవ్వింది దాయమ్మ

చురచుర చూసింది చందన

పోనీ ఒకటి చెప్పు రసన్ అంటే నీకు ప్రాణం కదూ? సూటిగా అడిగింది దాయమ్మ

అది నీకు తెలియదా? కస్సుమంది చందన

తెలుసు అందుకే అడుగుతున్నాను రేపు నీ విషయం మీనాన్నగారికి తెలుస్తుంది వెంటనే మారు మాట్లాడకుండా అతనికి మరణశిక్ష విధిస్తారు ఆ తర్వాత నువ్వు హాయిగా వుండగలవా?

లేదు దాయమ్మా! అందుకే నేను చచ్చిపోదామనుకునేది!" మళ్ళీ బావురుమంది చందన

జాలిగా చూసింది దాయమ్మ

"పిచ్చితల్లీ! అలాంటి ఆలోచనలు మానెయ్యి కాస్త నీ కన్నె మనసుని అదుపులో వుంచుకొని నాన్న గారి ఇష్టప్రకారం ఆ విక్రమ్ బాబుని చేసుకో! కొన్నాళ్ళకి అన్నీ మర్చిపోయి అతనితో దివ్యంగా అయిపోతావ్! నా మాట నమ్ము!" అంది ఆమె తల నిమురుతూ

అదోలా నవ్వింది చందన

ఆ నవ్వు దాయమ్మ ఒళ్ళు భయంతో జలదరించేలా చేసింది మనసులోకి కాఠిన్యం తెచ్చుకుంది

"రసన్! రసన్ అంటావ్ ఎవడతను మన దగ్గర పనిచేసే ఓ చిత్రకారుడు! అతనికి మన ఎదుటికి వచ్చే అర్హతకూడాలేదు అలాంటివాళ్ళని తీసుకొచ్చి అందలంఎక్కిస్తానంటే మీ నాన్నగారేకాదు ఎవరూ ఒప్పుకోరు అసలు ఆ రసన్ నిన్ను కాదు ప్రేమించింది నీ రాజ్యాన్ని! ఆ రాజ్యం లేక పోతే నీచాయలక్కూడ వచ్చేవాడుకాదు! ఒకవేళ నువ్వతన్ని కాదన్నా నిన్ను మర్చి పోయి మరోపిల్లని చేసుకుని హాయిగా వుంటాడు!" అంది గంభీరంగా

చందన నవ్వింది

పడి పడి నవ్వింది

కొత్త శీర్షిక

# రచయిత్రి



# జవాబులు

జానిబేగం డోర్నకల్

ప్ర నేను ఒక ప్రముఖ రచయిత్రిని అనుకున్నప్పుడు మీరెలా ఫీలవుతారు?

జ అందరూ అంటున్నా నేను ప్రముఖ రచయిత్రిని అని నేననుకోవడం లేదు

శ్రీపాద శ్రీనివాస్ బొబ్బిలి

ప్ర సమాజ పరిస్థితులకు అద్దం పట్టే నవల్లు కరువయ్యే ఈ రోజుల్లో కొత్త (మా లాంటి) రచయితలకి అవకాశం ఇవ్వచ్చుగా! మమ్మల్ని ఎందుకు అణగదొక్కుతున్నారు?

జ మీరు రాస్తానంటే అడ్డు పడ్డామా? రోజు.కో నవల రాయండి కాదన్న దెవరు?

ఎస్ అమ్మాజీ అక్కిరెడ్డిగూడెం

ప్ర నాడు యద్దనపూడి నవలలంటే క్రేజ్! ఇప్పుడు సువర్ణాకన్నన్ నవలలకి క్రేజ్ అంటాను. మీరే మంటారు? మంజీరనాదం చాలా బావుంటోంది. ఈ నవలకి ప్రేరణ ఏమైనా వుందా?

జ ఏమంటాను మీ అభిమానానికి కృతజ్ఞత లంటాను మంజీరనాదానికి ప్రేరణ" అంటూ పెద్దగా ఏం లేదు

పాట్నేడి చక్రరావు విశాఖపట్నం

ప్ర మంజీరనాదం అని మీ నవలకి నామకరణం చేయడంలో గల ఔచిత్యం?

జ నవల మొత్తం చదవండి

ఎం వి గోపాలకృష్ణ గూడూరు

ప్ర ఎరుపు ప్రమాదానికి చిహ్నం కదా మరి ఆడవాళ్ళు దానినే నుదుట ఎందుకు పెట్టుకుంటారు?

జ ఆడది అబలలా కనిపించినా అవసరం అయితే ఆదిశక్తి కాగలదు సుమా! అని హెచ్చరించడానికి అనుకోవచ్చు

ఎన్ రవి సత్తుపల్లి

ప్ర మీ నవలల్లో స్త్రీ పాత్రల్ని చాలా సాహసోపేతంగా మలచుతా రెందుకు మీరు కూడా స్త్రీయే కనుకనా?

జ నిజమే అంతేకాదు స్త్రీ సాహసాన్ని అభినందించే స్త్రీని కాబట్టి కూడా

ఎగినాటి రవీందర్ అమ్మాపాలెం

ప్ర ఉత్తమ రచయి(త్రు)త తన రచనల ద్వారా ఏం కోరుకుంటారు?

జ తన రచనలు కొంతలో కొంతైనా సమాజానికి మేలు చెయ్యాలని!

## ఉత్తమ ప్రశ్న

సర్దార్ పాష, పుల్లూరు

ప్ర: మానవుడు ఆర్థికంగా, సామాజికంగా, వైజ్ఞానికంగా, ఎంత ప్రగతిని సాధిస్తున్నా ఆత్మ సంతృప్తి విషయంలో రోజు రోజుకీ దూరమౌతున్నాడు కారణం?

నా అనే స్వార్థంతో తనని తాను బందీ చేసుకోవడమా! కాలంతో పాటు మారుతూ పెరిగిన అవసరాలా? వివేకం మరచిన కోరికలా? ఇంకా?

**జ మీ ప్రశ్నకి జవాబు కూడా మీరే చెప్పుకున్నారు పాషా! మీ రన్నది అక్షరాలా నిజం!! వీటికి తోడు అత్యాశ, అవినీతి విస్తరించుకుని ఎటు వెళ్తున్నామో కూడా తెలియ కుండా పరుగులు తీస్తున్నారు పలితంగా ఆశించింది పొందలేక అసంతృప్తికి లోనవు తున్నారు**

వన్నెం రెడ్డి నాగ వెంకటకృష్ణ కంకిపాడు

ప్ర అక్కయ్యగారూ! మీకు పోటీగా కొత్త సీరియల్ ప్రారంభించా లనుకుంటున్నాను మీ అభిప్రాయం?

జ మీ అభిప్రాయమే నా అభిప్రాయం తమ్ముడూ! విష్ యు బెస్టప్ లక్!

ఎమ్. బి. కళ్యాణి, బెండమూర్లంక

ప్ర: అక్కయ్య గారూ! మీ నవలలంటే నాకు చాలా ఇష్టం. బహుమతి పొందాలనుంది ఎలాంటి ప్రశ్న వేస్తే బహుమతి ఇస్తారు?

జ: నాకు నచ్చే ప్రశ్న చెల్లాయ్!

బి. దత్తాత్రి, హైదరాబాద్

ప్ర: "కాంచన సౌధం ను త్యాగం రాగంతో "మరచిపోకు నేస్తం"ను ట్రాజడీ రాగంలో క్లిక్- క్లిక్- క్లిక్"ను సాహస రాగంలో వెన్నెల నీడ ను ధైర్య రాగంలో, "కరిగిన శిల ను వినోద రాగంలో "పాతాళ గంగ"ను, "అలకల కొలికి ని సస్పెన్స్ రాగంలో నూ మాకు వినిపించిన మీరు మా అభిమాన పత్రిక "ఆంధ్ర సచిత్ర వార పత్రిక కు కానుక గా ఇస్తున్న "మంజీరనాదం ను ఏ రాగంలో వినిపించ బోతున్నారు?

జ: ప్రణయ రాగంలో!

చోడవరపు నాగేశ్వరరావు రమాదేవి లక్ష్మీ శశాంక హైదరాబాద్

ప్ర: సువర్ణాకన్నన్ గారూ! మీరు పెట్టే పేర్లలో ఏదో ఆకర్షణ వుంది. రచన పూర్తయ్యాక టైటిల్ పెడతారా లేక టైటిల్ ముందే నిర్ణయించుకుని రచనలు చేస్తారా?

జ కొన్ని అలా కొన్ని ఇలా! కానీ ఎక్కువగా రచన పూర్తయ్యాకే టైటిల్ నిర్ణయిస్తాను

వై చాముండేశ్వరి అదిలాబాద్

ప్ర అక్కా! మీరంటే నాకు చాలా చాలా ఇష్టం మిమ్మల్ని చూడాలనీ మీతో మాట్లాడాలనీ నా చిరకాల వాంచ! నా కోరిక తీరుతుం దంటారా? మీ ఫోటో కావాలి ఇస్తారా?

జ అదేవిఁటమ్మా! నేనేమైనా దివిలో వుండే దేవతనా కనిపించక పోవడానికి! తప్పకుండా కలుసు కుందాం సారీ డియర్! ఫోటోలు పంపడం నా కిష్టం వుండదు

కె పద్మజ ముద్‌ఖేడ్ (మహారాష్ట్ర)

ప్ర సువర్ణాకన్నన్ గారికి మంజీరనాదం చాలా సాహసవంతం గానూ వుత్కంఠతోనూ సాగుతోంది మీ రచనల్లోని హీరోయిన్స్ పేర్లు ఎక్కువగా నదుల పేర్లు వుంటాయి కారణం ఏమిటి?

జ థాంక్స్! నదులంటే నాకు ఇష్టమని లోగడ చాలా సార్లు చెప్పాను □

---

కడుపు చేత్తో పట్టుకుని మరీ నవ్వింది.

ఏవిఁటే మతి పోయిందా? అంది దాయమ్మ చిరాగ్గా.

దాయమ్మా! ఎందుకు నటిస్తావ్! రసన్ చాలా మంచివాడని నీకు తెలుసు. అతనిది పవిత్రప్రేమనీ ఆరాదన అనీ నీకు బాగా తెలుసు! ఒకరకంగా చెప్పాలంటే మా అమ్మ మనసుకన్నా నీ మనసే నాకు బాగా తెలుసు! నువ్వు నటిస్తున్నావ్! కేవలం రసన్ మీద నా మనసు విరిగి పోవాలని తాపత్రయ పడున్నావ్!..." చందన గొంతు రానురానూ గద్గద మయింది. కళ్ళు నిండుతటాకాలయ్యాయి.

"దాయమ్మక్కూడా దుఃఖం వచ్చింది. అయినా బైటపడకుండా ... ఇంతకీ ఏవఁటావ్?" అంది చిరాగ్గా.

"నా మూలంగా అమాయకుడైన రసన్ శిక్షించ బడకూడదు!... అందుకే నేనీపని చేస్తున్నాను."

"మరో మార్గం లేదా?"

"ఉంది! కానీ అదీ సాధ్యం కాదు?..."

"అంటే....?"

"మేమిద్దరం కలిసి ఈ రాజ్యం పొలిమేరలు దాటితే మమ్మల్ని ఎవరూ ఏం చెయ్యలేరు!"

"అంటే .... లేచిపోతావన్న మాట!" వ్యంగ్యంగా అంది దాయమ్మ

"నువ్వేమైనా అను!... మాలాంటి ప్రేమికులకి అదే మంచి మార్గం! కాని అదీ మాకు సాధ్యంకాదు. అందుకే . ఎంతో ఆలోచించి నేనీ నిర్ణయం తీసుకున్నాను. సమయానికొచ్చి అంతా పాడు చేశావ్! చిరాగ్గా అంది చందన

# మంజీర నాదం

నువ్వలాంటి పనేదో చేస్తావని నాకు బాగా తెలుసు! అందుకే నిన్ను కనిపెట్టి వున్నాను నువ్వు రాత్రి భోజనానికి ముందే వజ్రాన్ని నూరటం, ఇంతకుముందా పొడిని పాలల్లో కలపడం అంతా చూస్తూనే వున్నాను అందువల్లే సమయానికి వచ్చి నిన్ను కాపాడుకో గలిగాను!" భారంగా నిట్టూరుస్తూ అంది దాయమ్మ

బానే ఉంది! అయితే ఎన్నాళ్ళిలా కనిపెట్టి ఉంటావ్?

నా ప్రాణం వున్నన్నాళ్ళూ!

లేదు! నా ప్రయత్నాన్ని నువ్వే కాదు! ఆదేవుడు కూడా ఆపలేడు ఇది కాక పోతే మరోమార్గం! అంతే గానీ, నా రసన్ కాకుండా మరో వ్యక్తిని పెళ్ళి చేసుకోవడం అసంభవం! గంభీరంగా అంది చందన

క్షణం ఆమె మొహంలోకి అలా చూస్తుండి పోయింది దాయమ్మ ఆ పిల్ల మనస్సు మార్చడం కష్టమని కూడా గ్రహించింది రెండు నిమిషాల తర్వాత–

సరే! అయితే విషయం నాన్న గారిదాకా వెళ్తుంది! ఇన్నాళ్ళూ అమ్మగారూ, నేనూ ఈ విషయాన్ని ఎంతో గోప్యంగా ఉంచాలని ప్రయత్నించాం! ఇంక అది సాధ్యం కాదని తేలిపోయింది! విషయం పూర్తిగా తెలిస్తే నిన్నెలా కాపాడుకోవాలో ఆ రాజాగారే ఆలోచిస్తారు! నీకళ్ళముందే నీ రసన్ ఉరితియ్య బడాలని నీకు కోరికగా వుంటే అలాగే కానీ! అంటూ చటుక్కున లేచింది దాయమ్మ మరో సారి బెదిరిస్తూ

దాయమ్మా! కంగారుగా పిల్చింది చందన

ఏమిటి?

దాయమ్మా! రసన్‌కి ఏ హానీ జరక్కూడదు! ఆమె చేతులు పట్టుకుంటూ అంది చందన

ఆమెకి పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చింది

అది నాచేతుల్లో లేదు!

నాన్న గారికి చెప్పద్దు!


మరి గత్యంతరం?

ఓ పనిచేద్దాం!

ఏమిటి?' అనుమానంగా చూసింది దాయమ్మ

నేను నిజంగానే రసన్ని మర్చి పోతాను!

నమ్మను!




నిజం దాయమ్మా! కానీ ఒక్క షరతుమీద!

ఏమిటా షరతు?"

రసన్ వద్ద శాశ్వతంగా వీడ్కోలు తీసుకునే ముందు అతనితో ఒక్కసారి మనసు విప్పి మాట్లాడాలి! అందుకు నీ సహాయం కావాలి! వేడికోలుగా అంది చందన

ఎవరైనా ఒకేసారి మోసపోతారు!

అంటే ?

మునుపు తువ్విలాగే అని

ఆమె మాట పూర్తి కానే లేదు–

అహ! లేదు! నిజంగానే వచ్చేస్తాను! నన్ను నమ్ము! ఒక్కసారి విషయమంతా విప్పి చెప్పి నన్ను మర్చిపొమ్మని ఆ అమాయకుడికి చెప్పి వస్తాను

అతన్ని చేసుకుంటానని మాట ఇచ్చావా?

ఉహూ!

మరి?

నోరు మెదపక పోయినా ఒకరి మనసు ఒకరికి తెలుసు! అందుకే అతని ఆశల్ని చంపేసి వచ్చేస్తాను అంది చందన ఆమె మాటలో నిజాయితీ వున్నట్టు అనిపించింది దాయమ్మకి అయినా అనుమానంగా చూస్తూ–

నిజమేనా? అంది

ఒట్టు!

దాయమ్మ మొహం లోకి జీవం వచ్చింది

సరే! ఆ ఏర్పాట్లేవో నేను చేస్తాను! ఏదో ఆలోచిస్తూ అంది

ఎలా?

చెప్తాను! కానీ నువ్వు నాకోమాట ఇవ్వాలి!

ఏమిటి?"

నేను త్వరలో రసన్‌ని కలుసుకుని మాట్లాడే ఏర్పాటు చేస్తాను కానీ, నువ్వీలోగా ఎలాంటి అఘాయిత్యం చేయ్యనని నాకు మాటివ్వాలి!

చందన తియ్యగా నవ్వింది

నాకు మాత్రం చచ్చిపోవాలంటే ఇష్టమా దాయమ్మా? అందులోనూ నారసన్ దగ్గరికి తీసికెళ్తానని చెప్పాక కూడా చచ్చి పోతానా?

ఆమె కళ్ళలోని వెలుగును చూసి ముఖం చిట్లించింది దాయమ్మ నువ్వతనిదగ్గరి కెళ్ళేది అతన్నుంచి శాశ్వతంగా వీడ్కోలు తీసుకోవడానికి! గుర్తుందికదూ? అంది తీక్షణంగా

బాగాగుర్తుంది ఒక వేళ నేను మర్చిపోయినా గుర్తు చెయ్యడానికి నువ్వున్నావుగా మళ్ళీ నవ్వింది చందన

తర్వాత విక్రమ్ బాబుని చేసుకుంటావుగా? అనుమానంగా అడిగింది దాయమ్మ

తప్పకుండా!

సరే! ఇంక వెళ్ళి పడుకో! తెల్లవారాక నా ఆలోచన చెప్తాను

అలాగే నువ్వూపడుకో! అంటూ మంచం మీది కొరిగింది చందన

ఆమె మెడవరకు దుప్పటి కప్పి–

హాయిగా నిద్రపో! అంది దాయమ్మ

చందన కళ్ళు మూసుకుంది

దాయమ్మ పాల పాత్ర కడిగి పెట్టి అక్కడంతా శుభ్రంచేసి పక్కమీదికి చేరింది

ఇద్దరూ కళ్ళు మూసుకున్నారు

అయితే ఇద్దరూ నిద్ర నటిస్తున్నారే తప్ప నిద్ర పోవడం లేదు చిత్రం ఏమిటంటే ఇద్దరిలో ఎవరూ నిద్రపోవడం లేదనీ ఇద్దరూ మర్నాడు రసన్ దగ్గరికి వెళ్ళడం గురించే ఆలోచిస్తున్నారనీ ఇద్దరికీ తెలుసు

ఠాణాలో రెండు గంటలు కొట్టారు

ఇంక ఆలోచనలు మాని నిద్రపోవాలి అనుకున్నారు ఎవరికి వారే

(ఇంకా ఉంది)

“



ప్రెషర్ కుక్కర్స్ డీలర్‌నైన నేను, ఏది భద్రతగల కుక్కరో ఏది మరింత భద్రతాయుక్తమైనదో చెప్పగలను **అయితే వాటి అన్నింటిలోను అత్యంత** భద్రమైనది న్యూ ప్రెస్టీజ్ కనుక మీరు మీ శ్రీమతికి న్యూ ప్రెస్టీజ్‌ని కొనిపెట్టారంటే, మీకు ఆమెపట్ల మిక్కిలి మక్కువ కలదని నిరూపిస్తున్నారన్న-మాట మరియు ఆమె శ్రేయస్సుకే అత్యధిక ప్రాధాన్యాన్ని యిస్తున్నారన్న మాట-సర్వదా

## న్యూ ప్రెస్టీజ్ ఎంత భద్రమైనదో చూడండి


100% SAFE

నూటికి నూరు పాళ్ళు భద్రతను చేకూర్చే **అద్వితీయమైన** గాస్కెట్ రిలీజ్ సిస్టం (జి ఆర్ ఎస్) ఒక్క న్యూ ప్రెస్టీజ్‌కి మాత్రమే కలదు 'వెయిట్ వెంట్'




పూడుకొనిపోయినట్లయితే, కుక్కర్ లోపల మితిమించిన ఒత్తిడి ఏర్పడుతుంది ఇది కుక్కర్‌కు **అత్యంత** సమీపములో వున్న వ్యక్తికి ప్రమాదకరంగా పరిణమించవచ్చును.

న్యూ ప్రెస్టీజ్ **అయితే**, మితిమీరి ఏర్పడిన సీటి ఆవిరి జి ఆర్ ఎస్‌ను బయటకు నెట్టుతుంది తత్ఫలితంగా జి ఆర్ ఎస్ ఆవిరిని



భద్రంగా, రూఢిగా క్రిందికి విడిచిపెడుతుంది గాస్కెట్‌ను ఒక స్ప్రూన్‌**తో లో**పలికి నెట్టండి

**అంతే**, ప్రెషర్ కుక్కర్ తిరిగి వినియోగానికి సిద్ధంగా వుంటుంది న్యూ ప్రెస్టీజ్ **అయితే** ఎన్నడూ **అణు**మాత్రంకూడా ప్రమాదం వుండదు **అందుచేత**నే ఎట్టి పరిస్థితులలో**నై**నప్పటికి **అది అత్యంత** భద్రమైనది- సర్వదా ”

# భార్యపై నిజమైన ప్రేమగలవారు ప్రెస్టీజ్ వద్దని ఎట్లా అంటారు




**ప్రెస్టీజ్**

ttk తయారి.

Prestige 25 SILVER JUBILEE 1984-85

న్యూ ప్రెస్టీజ్ ఒక్కటి మాత్రమే **100%** భద్రమైనది. న్యూ ప్రెస్టీజ్ ఒక్కదానికి మాత్రమే జి.ఆర్.ఎస్. కలదు

MAA (S) TTP 3B TEL 85

1987 దీపావళి కథల పోటీలో రు 700/-లు బహుమతి పొందిన కథ

# కుండీలో పూల మొక్క

నేను యువకుణ్ణి. నాకు యువతరమంటే అసహ్యం.

మాలో నిజాయితీ లేదు. అవకాశవాదం ఎక్కువ.

మేము కులాల్ని నిరసిస్తాం. కులం పేరుతో సంస్థలూ స్థాపిస్తాం.

కులం వాళ్ళ నాకట్టుకునేందుకు కులం పేరుతో వాళ్ళను రెచ్చగొడతాం. స్వార్థం కోసం కులం వాడినే వెన్నుపోటూ పొడుస్తాం.

మాకున్న ఆదర్శాలిన్నీ అన్నీ కాదు అవన్నీ మామాటకారితనాన్ని ప్రదర్శించడానికేతప్ప ఆచరణకు కాదు

ఆదర్శాలకోసం జీవితం త్యాగం చేయాలన్నది నా అబిమతం కాదు కానీ ఆచరణయోగ్యమైన ఆదర్శాలను పాటించడానికేం?

అందుకే నేను కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవాలనుకున్నాను

అందులో నూ హిపోక్రసీలేదు కట్న మిచ్చుకోలేని పేదింటి పిల్లనే పెళ్ళి చేసుకోవాలను కుంటున్నాను

మగజీవితానికి ఆడతో డెంతో ముఖ్యం ఆతోడును మగాడు చేతులు సాచి ఆహ్వానించాలి పరస్పర సహకారంతో సహజీవనం నెరపాలి

ఆడదాన్నుద్ధరించడం కోసం కాదు పెళ్ళి!

నేను నా భార్య నుంచి కోరేదేమీ లేదు నా చూపులకు నచ్చే అందమామెకుండాలి నన్నర్థం



చేసుకుని సహకరించే మంచితన ముండాలామెకు

అందుకే నా బార్యను నేనే ఎన్నుకోవాలను కున్నాను

అనుకోకుండా నాకా అవకాశం వచ్చింది

ఉద్యోగ రీత్యా కాకినాడలో పోస్టయ్యాను

అక్కడ పరిచయ మయింది నాకు రాగిణి

రాగిణిని చూడగానే ఆమె నా స్వప్నసుందరి అనిపించింది ఆమెకోసం నా ఆదర్శాలన్నీ మర్చిపోవాలనిపించింది కానీ నాకా అవసరమూ రాలేదు

ఆ ఊళ్ళో మా దూరపు బంధువులున్నారు. అమ్మకు వరసలో అన్నయ్యవుతాడాయన కాకినాడ వెళ్ళగానే ఆయన్ను కలుసుకోమందమ్మ నాన్న మాత్రం ఆయన్ను కలుసుకోవద్దని రహస్యంగా నన్ను హెచ్చరించాడు

ఆమామయ్య పేరు రంగనాదం ఆయన కిద్దరు కూతుళ్ళు పెద్దమ్మాయి సరోజ రెండో అమ్మాయి పేరు రాగిణి ఊళ్ళో ఉద్యోగాని కొచ్చిన బంధువులబ్బాయిని తెలివిగా పట్టి వలేసి -కట్నం లేకుండా పెళ్ళి జరిపించేశాడాయన పెద్దమ్మాయికి నా విషయంలోనూ ఆయనంతే చేయగలడని నాన్న బయం

నా ఆదర్శాలు నాకున్నాయి గానీ వలలేసే వాళ్ళంటే నాకసహ్యం అందుకని నేను వాళ్ళని కలుసుకోలేదు

ఒకరోజు రాగిణి మా ఆఫీసుకు వచ్చి నన్ను కలుసుకుని ప్రసాదరావుగారు మీరేనా? అనడిగింది

ఆమె రూపానికి స్వర మాదుర్యానికి ముగ్ధుణ్ణి వెంటనే ఊఁ అని కూడా అనలేకపోయాను

రంగనాదం మామయ్య రెండో కూతుర్నెప్పుడో చిన్నప్పుడు చూశాను అప్పుడామెను గుర్తుంచుకునే విశేషమేమీ కనబడలేదు ఇప్పుడు చూసి వెంటనే మామయ్యను కలుసుకోనందుకు బాద పడ్డాను

నేను వచ్చి నెల్లాళ్ళయింది. నేను కాకినాద వస్తున్నట్లు అమ్మ మామయ్యకుత్తరం వ్రాసింది. నేను వాళ్ళను తప్పకుండా కలుసుకుంటానని వ్రాసింది నా ఆఫీసడ్రసు కూడా తనే వ్రాసింది చూసి చూసి ఆయన రాగిణిని పంపాడు నా ఆఫీసుకి ఆయన ఆఫీసులో చిన్న గుమాస్తా ఆఫీసుటైములో ఆయన బైటకు కదలడు. ఆఫీసునుంచి ఫోన్ చేయడం ఆయన కిష్టం లేదు. మేనల్లుడి నాయన స్వయంగా ఇంటి కాహ్వానించాలను కుంటున్నాడు. చివరికాయన రాగిణిని పంపాడు

నేను మామయ్యింటికి వెళ్ళాను ఆ దంపతులు నన్నెంతో ఆప్యాయంగా ఆదరించారు.

నేను ప్రస్తుతం కంపెనీ గెస్టు హౌసులో ఉంటున్నాను.

మామయ్యింటి పక్క వాటా కాళీగా ఉంది ఆయన నన్నందులోకి మారమన్నాడు నేను వెంటనే అంగీకరించాను

నువ్వు నాకు ముందుగా కబురెట్టాల్సింది మామయ్యా? ఆఫీసు పనుల హడావిడిలో ఇల్లు చూసుకుందుకు కూడా సమయం లేదు నాకు. మీ యింటి కింత వరకూ రాలేక పోయినందుకేమీ అనుకోకు-" అన్నాను.

మీ యింటి పద్ధతులు నాకు తెలుసు పిలిస్తే గానీ రారు మీ అమ్మ ఉత్తరం రాగానే పిలవాలను కున్నాను కానీ అమ్మాయి అబిమానవతి ఒ పట్టాన అదొప్పుకోలేదు దాన్నొప్పించ డానికిన్నాళ్ళు పట్టింది' అన్నాడు మామయ్య

నేను చిన్న బుచ్చుకున్నాను నన్ను వాళ్ళింటికి పిలవడం రాగిణి కిష్టం లేదు నేనేం తప్పు చేశాను?

నేను మాట్లాడక పోవడం గమనించిన మామయ్య నా ముఖ బావాలు చదివినట్టున్నాడు - ఇందులో నీ తప్పేమీ లేదు తప్పంతా ఆడపిల్లల్ని కన్నవాళ్ళది- అన్నాడాయన

అంటే?

మామయ్య వివరించాడు

పదహారేళ్ళు నిండినప్పట్నించీ ఆడపిల్ల పెళ్ళి గురించి తలిదండ్రులాలో చింతక పోయినా చుట్టు పక్కల వాళ్ళ సణుగుడు ప్రారంభమవుతుంది పెళ్ళి సంబంధాలు చూస్తే - పెళ్ళికొడుకులు సంతలో పెట్టిన ఖరీదైన పశువులవుతున్నారు ఆవిషయ మలాగుంచితే ఆడపిల్లల తలిదండ్రులేం చేసినా విపరీతార్థాలు బంధువుల్నీ స్నేహితుల్నీ అబిమానంతో ఆదరిస్తే దానికేమేమో అంటగట్టి - వాళ్ళను సీ ఐ ఏ ఏజెంట్లలా కేజీబీ మనుషుల్లా బావిస్తారు

సరోజ అందంగా ఉంటుంది ఆమెనో యువకుడిష్టపడి ప్రేమించి కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాడు రంగనాదం విసిరిన వలలో అతడు పడిపోయినట్టు వియ్యాలవారే కాదు - చుట్టు పక్కల వారు కూడా చెప్పుకుంటున్నారు వాళ్ళ యీడూ జోడూ బాగుందని కానీ - వాళ్ళు సుఖంగా కాపురం చేసుకుంటున్నారని కానీ ఎవరూ పట్టించుకోవడంలేదు రంగనాదం విసిరిన పాత వల గురించీ విసరబోయే కొత్త వల గురించీ వాళ్ళు చెప్పుకుంటున్నారు



అందుకే రాగిణి – మనింటికి పెళ్ళయిన దంపతు లాహ్వానించు– ఆడవాళ్ళ నాహ్వానించు పెళ్ళి కాని మగాళ్ళనీ, పెళ్ళాం లేని మగాళ్ళనీ – వాళ్ళు ముసలాళ్ళయినా సరే– దగ్గర బంధువులైనా సరే– ఆహ్వానించవద్దు – అని తలిదండ్రులకు కచ్చితంగా చెప్పేసింది కానీ మా అమ్మ ఉత్తరం వ్రాయడం వల్ల రంగనాథం నా పట్ల ప్రత్యేక బాధ్యతను ఫీలై– రాగిణిని బ్రతిమాలుకున్నాడు ఆమె తండ్రి మాటల నర్థం చేసుకున్న దన్నందుకు సూచనగా – తనే అతడి నింటి కాహ్వానించింది అందుకామె విధించిన షరతేమిటంటే – తను నాతో మాట్లాడదు నన్ను కలుసుకోదు

పరిస్థితి తెలుసుకుంటావని చెప్పాను బాబూ! మన సమాజంలో ఆడపిల్లలను కన్నవారు మానసికంగా అస్పృశ్యులు అది మా ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు కావచ్చు కానీ ఆ కాంప్లెక్సును తొలగించే బాధ్యత నెవరూ స్వీకరించడం లేదు నీవేమీ అనుకోకు మా యింటికి దగ్గర్లోనే ఉన్నా – నిన్ను మేమాదరించక పోతే అది ఘాతప్పు కాదు నీ అంతటనీవే చొరవ తీసుకుని తరచు మా యింటికి వస్తూంటే మా కాంప్లెక్సు తొలగి పోవచ్చు రాగిణి నీతో మాట్లాడక పోతే అది చిన్నతనంగా భావించకు వ్యక్తిత్వం గల పిల్ల అది దురదృష్ట వశాత్తూ యీ పేద వాడింట్లో పుట్టింది– అన్నాడు మామయ్య

రాగిణి అందం నన్నాకర్షించి ఉండకపోతే నేనా కుటుంబాన్ని అపార్థం చేసుకునే ఉండేవాణ్ణి నా కిప్పుడు రాగిణితో పరిచయం పెంచుకోవాలమంది

మామయ్య పక్కింట్లో ప్రవేశించాను చొరవ తీసుకుని తరచుగా మామయ్యింటికి వెడుతూండే వాణ్ణి ఎన్నోసార్లు రాగిణితో మాట్లాడాలని ప్రయత్నించాను ఆమె నాకు ముక్తసరిగా సమాధానా లిచ్చి తప్పించుకునేది

ఆమెకు పద్దెనిమిదేళ్ళు నిండాయి బీయస్సీ రెండవ సంవత్సరం చదువుతోంది ఆమె గ్రూపు సైన్సు, లెక్కలు

నేను నీకు లెక్కల్లో సందేహాలుంటే సాయపడ గలను' – అని ఆమెకు చెప్పాను

# కుండీలో పూల మొక్క

క్లాసులో శ్రద్ధగా పాఠాలు వింటాను అప్పటికీ అర్థం కాకపోతే – అర్థమయ్యే దాకా మళ్ళీ మళ్ళీ చదువుతాను నా అంతట నేను విషయాన్నర్థం చేసుకోవడమే నాకిష్టం– అని రాగిణి నాకు బదులిచ్చింది.

రాను రాను నాకు రాగిణి అంటే ఆకర్షణ పెరిగి పోతోంది.

నేను రంగనాథం మామయ్య ఇంటి పరిస్థితి, మానసిక పరిస్థితీ – మా యింటి కుత్తర్వం వ్రాసి– "నేను రాగిణిని పెళ్ళి చేసుకోవాలను కుంటున్నాను మామయ్య మనసుకు కష్టం కలుగని విధంగా ఈ సంబంధం మీరు స్థిరపరచాలి నాకై నేను పెళ్ళి పెద్దను కాదల్చుకోలేదు ఈ పెళ్ళి జరక్కపోతే మీకూ నాకూ సంబంధం తెగిపోదు, కానీ నేనిక పెళ్ళి చేసుకోను. నా పెళ్ళి మీరేచేయాలి. అదీ రాగిణితో!" అని స్పష్టం చేశాను

ఉత్తరానికి సమాధానంగా అమ్మ, నాన్న వచ్చారు.

నాన్న నాతో – నీ ఉత్తరం చదివాను – నేనూ ఆడపిల్ల తండ్రిని అయినా ఆకోణం నుంచి సమస్య నాలోచించ లేదు పిల్ల మనసు కష్టపడని విధంగా ఈ పెళ్ళి నిశ్చయం చేస్తాను–" అన్నాడు

ఆయన మంచి మనసు కాశ్చర్య పోయాను

అమ్మ తనకు మొదట్నించీ ఈ సంబంధం చేసుకోవాలని ఉన్నట్టు, అబ్బాయికి పిల్లతో పరిచయం కావడం ముఖ్యమనే – తను వాళ్ళ పరిచయాన్ని ప్రోత్సహించాననీ – వీధిలో ప్రచారం చేసింది

ఆవిధంగా నన్ను కొందరు అనుమానించే పరిస్థితి కూడా ఏర్పడింది నాలో ఏమైనా లోపాలున్నాయా అన్న చర్చ కూడా జరిగింది

దానికి నేను సిగ్గుపడలేదు

ఆడపిల్ల భరించే అవమానాల ముందిది ఏపాటి?

పైసా కట్నం లేకుండా సింపుల్‌గా ఓ గుడిలో మా పెళ్ళి జరిగింది

నాకెంతో సంతోషంగా ఉంది

# దీపావళి దృశ్యాలు

వన్నె తరిగి
చిన్నబోయిన మొహాలు
గుండెల్లో దిగుళ్ళ ముళ్ళు
దిగుతున్న అనుభూతి
ఉల్లాన్ని ఝుల్లుమనిపించే
ఉల్లి ధర
గజగజ లాడించే
తైలం పేట్రేగిపోతూ
కరువు కాటకాల
కరాళ నృత్యం
మత మౌఢ్యాల హింసా జ్వాలలు
టెర్రరిజం పారించే రక్తపుటేరులు
అవినీతి అక్రమం విశ్వరూపం
కల్తీల కల్లోలంలో
ముత్యాలు రాల్చని మతాబులు
వెన్నెల్లు విరజిమ్మని చిచ్చుబుడ్లు
నక్షత్రాలు కురిపించని కాకరపువ్వొత్తులు
పేలని టపాసులు
లేని ఉత్సాహం తెచ్చుకుని
కష్టాల తిమిరంతో సమరం జరుపుతూ
కొత్త ఆశల ఊపిరితో జ్యోతులు వెలిగిస్తూ
మనిషి!

-కొడిమెల శ్రీరామమూర్తి

నేనొక ఆడపిల్ల నుద్ధరించాననుకోవడం లేదు

నేను కోరిన అందం నా స్వంత మయింది నా భార్యను నేను మనిషిగా గౌరవించి – నాజీవితంలోకి ఆహ్వానించాను

నా ఆదర్శం నిలబెట్టుకున్నాను

పెళ్ళయిన మర్నాడు శోభనం

ఒక చిన్న గదిలో ఆమె , నేను

ఆమె తలనిండా మల్లెపూలు – నా మనసునిండా కోరికలు

ఆమెను తాకగానే నావళ్ళు పులకరించింది దగ్గరకు తీసుకుంటే ఈ లోకాన్నే మరిచి పోయాను

నా కంటికి నచ్చిన అందం, మనసుకు నచ్చిన ప్రేయసి – తొలిరాత్రి నన్ను స్వర్గ వీధుల్లో విహరింప జేశాయి

ఆమె కూడా నన్నెంతగా ప్రేమిస్తోందో అప్పుడే నాకర్థమయింది

నేనామె అందాన్ని పొగిడితే – ఆమె నావ్యక్తిత్వాన్ని పొగిడింది


మధ్య మధ్య చిన్న చిన్న పొగడ్తలతో శృంగార మయ ప్రపంచంలో తేలిపోయాం – వారం రోజులు


రిసెప్షన్లో నన్ను చూసిన నా కొలీగ్సందరూ ఆఫీసులో నా అదృష్టాన్ని పొగుడుతున్నారు అన్నాను నేనామెతో – ఒక రోజున


రాగిణి ముక్తసరిగా నవ్వి ఊరుకుంది

నీ స్నేహితురాండ్రు నీ అదృష్టం గురించేమీ అనలేదా? అన్నాను కుతూహలంగా

రాగిణి మళ్ళీ నవ్వింది తప్ప మాట్లాడలేదు





చెప్పవా? అన్నాను బ్రతిమాలు తున్నట్టు రాగిణి నాతో వివాహం గురించి ఏమనుకుంటోందో తెలుసుకోవాలనుంది నాకు

నా స్నేహితురాలు పద్మ మనపెళ్ళి కిచ్చిన ప్రెజంటేషన్ చూశారుగా? అంది రాగిణి

ఆ పెయింటింగు నాకు బాగా గుర్తుంది. ఎందుకంటే నాకదెంతో నచ్చింది

పద్మ స్వయంగా వేసిందిట ఆ పెయింటింగు

అది ఒక మేడలో బాల్కనీ ఆ బాల్కనీలో నాలుగు పూలకుండీలు ఒకో కుండీలో ఒకోరకం పూలమొక్క అన్నింటికీ పూలున్నాయి ఆ మొక్కల వంక ఓ యువకుడు చూస్తున్నాడు అతడి కనులలో స్పష్టంగా కనిపించే సంతృప్తి!

పద్మ ఆ బొమ్మల కుపయోగించిన రంగుల మిశ్రమం అద్భుతం!

అది నేను రాగిణికి మొదటిసారి పెయింటింగు చూసినప్పుడే చెప్పాను

నా పెళ్ళి గురించి పద్మ అభిప్రాయం అదే! అంది రాగిణి చటుక్కున

అంటే? అన్నానాశ్చర్యంగా

కుండీలోని పూల మొక్కలు- ఓ ఎత్తుకి మించి పెరగ కూడదు సాధారణంగా పూల కుండీల కోసం- ఎవరైనా అట్టే ఎదగని మొక్కల నెన్నుకుంటారు లేదా ఎదిగినప్పుడల్లా కత్తిరిస్తుంటారు ఆ మొక్కలు చక్కగా పెరగడం కోసం మట్టి మార్చడం ఎరువులు వేయడం చేస్తుంటారు తమ అంచనాకు మించి ఎదగకుండా కత్తిరిస్తుంటారు అవి అందంగా అగుపడవచ్చు ఆరోగ్యంగా ఉండవచ్చు ఆకర్షణీయమైన పూలు పూయవచ్చు అంతా యజమాని సంతోషానికే

నేను దెబ్బతిని- 'రాగిణీ! నీ స్నేహితురాలి కలాంటి అభిప్రాయ మెందుకు కలిగింది? నా యింట్లో నీకు స్వతంత్ర ముండదను కుందా? త్వరలోనే ఆమె తన ఆలోచన తప్పు- అని గ్రహిస్తుందిలే నీవు నా యింటికి మరో రాణివి నన్నే శాసించ గల సర్వాధికారిణివి- అన్నాను

రాగిణి తల వంచుకుని- పద్మ ఏ అభిప్రాయంతో

## కుండీలో పూల మొక్క

ఆ పెయింటింగు వేసిందో నాకు తెలియదు కానీ అది చూడగానే నాక్కలిగిన అభిప్రాయమది..' అంది

నేను మళ్ళీ దెబ్బతిని- అయితే యిప్పుడు నీ అభిప్రాయం మారి ఉండాలి' అన్నాను

రాగిణి లేదని అనలేదు కానీ తల అడ్డంగా తిప్పింది

రాగిణీ- నేను నీకు నచ్చలేదా? అన్నాను బాధగా

'మీరు నచ్చారు కాబట్టే- నేనీ పెళ్ళి కాదనలేక పోయాను...

మరైతే నీ అసంతృప్తికి కారణం?

మీలో సంస్కార ముంది మీ వారిలో సంస్కార ముంది మీరంతా ఈ పెళ్ళి నిర్ణయించిన పద్ధతిలో సంస్కార ముంది. నేను పెళ్ళి చేసుకుంటే నా తలిదండ్రులు సంతోషిస్తారు నాకు జీవితంలో మళ్ళీ యిలాంటి సంబంధం దొరికే అవకాశం లేదు మీ సంస్కారానికీ పరిస్థితులకూ తల వంచి ఈ పెళ్ళి అంగీకరించాను. లేకుంటే యిప్పట్లో పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం లేదు నాకు-"

నేను తెల్లబోయి- "పెళ్ళి చేసుకోకుండా ఏం చేద్దామని?" అన్నాను

చదువు కుందామనుకున్నాను-

చదివి ఏం చేద్దామని?

ఏం చేద్దామని అంతా చదువుతారు? అంది రాగిణి

ఉద్యోగం- అన్నాను

కానీ- నేను చదువు కోసమే చదవాలనుకుంటున్నాను సైన్సు సబ్జక్టు చదువుతూంటే- నాకు సైంటిస్టు కావాలని పిస్తుంది పరిశోధనలు చేసి ఎన్నో కొత్త విశేషాలు కనిపెట్టాల నుంది-

అనుకున్న వన్నీ అంతా చేయగలరా?

ఏమో- ప్రస్తుతానికి క్లాసు మొత్తం వంద మందిలో- నేనే ఫస్టు నేను గొప్ప సైంటిస్టు నవుతానని కాలేజీలో లెక్చరర్లంతా అంటారు నాకు బీయస్సీ పూర్తి చేసి- ఆ పైన యింకా యింకా చదువు కోవాలనుంది

నీకు చదువు కోవాలనుంటే నాతో చెప్పొచ్చుగా!

ఏమో- చెప్పాలంటే భయం వేసింది మీ రప్పుడే నాతో చాలాసార్లు మీరు కంటున్న కలల గురించి చెప్పారు ఆ కలల్లో మీ సంసార ముంది మీ సంసారాన్ని తీర్చి దిద్దడంలో నా పాత్ర ఉంది నా చదువు లేదు

"పోనీ- ఒక్కసారి నువ్వు చెప్పొచ్చుగా

రాగిణి తడబడుతూ- ఒక్కసారి కూడా మీరు నన్ను నా చదువు గురించి అడగ లేదు- అంది

తెల్లబోయాను ఆమె చెప్పింది నిజం నాకసలామె చదువు గురించి స్ఫురించనే లేదు ఆడపిల్లకు పెళ్ళే పరమావధి అన్న సామాన్యపు టభిప్రాయంలోకి నేనూ దిగజారి పోయాను

పెళ్ళయ్యాక కూడా ఎందరో పురుషులు చదువు కొనసాగించడం జరుగుతుంది పై చదువులకు వెళ్ళడం జరుగుతుంది ఆడదాని చదువు పెళ్ళితో ఆగిపోతుంది

వచ్చిన అవకాశం వదులుకోలేక రాగిణి నన్ను పెళ్ళి చేసుకుంది కానీ ఆమెకు పెళ్ళి కంటే చదువు మీదే ఆసక్తి ఎక్కువ!

నా ఆదర్శంలో - ఆడదాన్ని పెళ్ళి చేసుకుని ఎలా ఉద్ధరించాలో ఉంది కానీ చదువంటే ఆసక్తి ఉన్న ఆడపిల్లనెలా ప్రోత్సహించాలో లేదు

ఆలోచిస్తూ- నేను నా డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాను

అక్కడ పద్మ పెయింటింగ్ కనబడింది

ఒక చిన్న బాల్కనీలో నాలుగు పూలకుండీలు వాటిలో నాలుగు పూల మొక్కలు వాటిని చూస్తూ సంతృప్తిని ప్రకటిస్తున్న యువకుడు!

ఆ దృశ్యం చూద్దానికెంతో సహజంగా ఉంది

ఆ సహజత్వం నా కలల్లో మార్పు రానిస్తుందా? సంసార జీవితం గురించి నేను తొంగి చూస్తున్న భవిష్యత్తులో రాగిణి చదువును ప్రవేశించ నిస్తుందా?

ఏది ఏమైనా- కట్నం లేకుండా ఓ పేద పిల్లను పెళ్ళి చేసుకోవాలన్న నా ఆదర్శం మాత్రం ఎప్పుడో చిన్నబోయింది □

# సందిగ్ధావస్థలో అమెరికా తెలుగువారు

ఉత్తర అమెరికాలో వున్న తెలుగువారిలో నూటికి తొంభై అయిదుకు పైగా అమెరికాలో స్థిర నివాసం ఏర్పరచుకుందామన్న ఉద్దేశ్యంతో వెళ్ళలేదు. అప్పటి పరిస్థితులలో తాము అభ్యసించిన విద్యకు తగిన గుర్తింపు గాని, మంచి ఉద్యోగం గాని దొరకని స్థితిలో మాత్రమే వీరు అమెరికా చేరారు. అయితే క్రమేణా అక్కడి జీవన ప్రమాణాలు, ధనార్జనకున్న అవకాశాల దృష్ట్యాను, తమ కుటుంబ సభ్యులను కూడా అమెరికా తీసుకు రావాలనే ఉద్దేశ్యంతోనూ వీరితో ఎక్కువమంది అమెరికన్ పౌరసత్వం తీసుకున్నారు. అమెరికన్ గ్రీన్ కార్డుకు ఆంధ్రప్రదేశ్‌లోని పెళ్ళిళ్ళ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ వుంటూవచ్చింది. వీటన్నిటి దృష్ట్యా అమెరికాలో కొంత కాలంవుండి కావలసినంత డబ్బు గడించి భారతదేశానికి తిరిగిరావచ్చునే ఆలోచనలతో చాలామంది వుండేవారు. అయితే ప్రస్తుతం అమెరికాలో విదేశీ డాక్టర్లకు అవకాశాలు చాలా వరకు తగ్గి పోవటంతో, గ్రీన్‌కార్డు డిమాండ్ పడిపోయింది.

ఈ నేపథ్యంలో చాలామంది అమెరికన్ తెలుగు వారు అక్కడ తాము సంపాదించిన డాలర్లను ఆంధ్రప్రదేశ్‌లో ఆస్తుల కొనుగోళ్ళకు, పారిశ్రామిక పెట్టుబడులకు వినియోగిస్తూ తాము తిరిగి వచ్చేసరికి గట్టి ఆర్థిక పునాదులు వుండేటట్లు ఏర్పాటు చేసుకున్నారు. 1983లో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరమైన మార్పులు జరిగి యన్. టి. ఆర్. ప్రభుత్వం అధికారంలోకి రావటం, యన్. టి. ఆర్. అమెరికా పర్యటన జరిపి అక్కడి తెలుగువారిని ఆంధ్రప్రదేశ్‌కు తిరిగివచ్చి పరిశ్రమలు స్థాపించమని, ఆహ్వానించటంతో రెండేళ్ళ క్రితం అమెరికన్ తెలుగు వారిలో స్వదేశానికి తిరిగి రావాలనే సమధికోత్సాహం వెల్లివిరిసింది.



భరతనాట్యంలో సభికులని అలరించిన తెలుగు బాలికలు.

అయితే 1986వ సంవత్సరాంతం నాటికే అమెరికన్ తెలుగు వారిలో తెలుగు దేశం ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు నీరుకారి పోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు స్థాపించే విషయంలో, వ్యాపారాలు చేసే విషయంలో, ఆసుపత్రులు నిర్మించే ఉద్దేశ్యంలోనూ అమెరికన్ తెలుగువారు ఊహించుకున్నదానికి, ఇక్కడి వాస్తవానికి పొంతన లేని కారణంగా వారు హతాశులయ్యారు. ఇందుకు ఎవరినీ నిందించవలసిన పనిలేదు. ఇక్కడి పరిస్థితుల పట్ల సరిఅయిన 'అవగాహన కలిగి వుండక పోవటమే దీనికి కారణం.

అమెరికన్ తెలుగువారిలో కొంతమంది తమ పిల్లలను ఆంధ్రప్రదేశ్‌లో డొనేషన్లు కట్టి ఇంజనీర్లు, డాక్టర్లుగా తీర్చి దిద్దుకుందామని పథకాలు వేసుకున్నారు. ఐదారు సంవత్సరాలు పిల్లలు ఆంధ్రప్రదేశ్‌లో వుంటే, అక్కడి వారినే వివాహాలు చేసుకుంటే అక్కడే స్థిర పడటానికి అవకాశాలు వుంటాయని కొందరు ఆలోచనలు చేసారు. అయితే యన్. టి. ఆర్. ప్రభుత్వం డొనేషన్లు, కాపిటేషన్ ఫీజులు రద్దు చేయటంతో వీరు దిక్కుతోచని పరిస్థితులలో పడిపోయారు.


ఈ పరిస్థితులీ విధంగా సాగితే అప్పుడప్పుడు తల్లి దండ్రులతో ఆంధ్రప్రదేశ్ దర్శించే అమెరికన్ తెలుగు బాలబాలికలలో ఎక్కువమంది అక్కడి, ఇక్కడి పరిస్థితులను తులనాత్మకంగా విశ్లేషించి ఇక్కడకు తిరిగిరావటానికి విముఖత చూపిస్తున్నారు.


ఒకవైపు తాము పుట్టి పెరిగిన ఆంధ్రప్రదేశ్ పట్ల, తమను పెంచి పెద్ద చేసిన తల్లి దండ్రులపట్ల, బంధువులపట్ల వ్యామోహం తెంచుకోలేక, అమెరికాలో అమెరికన్ పౌరులుగా పుట్టిన తమ పిల్లల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, ఆంధ్రదేశానికి తిరిగి రావాలా, అక్కడే వుండాలా అనే విషయంలో సందిగ్ధావస్థలో కొట్టుకుంటున్నారు అమెరికన్ తెలుగువారు. పరిస్థితులన్నీ అంచనా వేస్తే ఎక్కువమంది అక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకొంటారనేది వాస్తవంగా పరిణమించేటట్లుంది.

—డా. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

ప్రదర్శనల విశేషాలు.






బొమ్మ సజీవంగా మాట్లాడుతున్నప్పుడు
అది ఆప్టానికా అయితీరాలి
OPTONICA
COLOUR TELEVISION
Tru-Life Vision

# సినిమా విశేషాలు


_జి.వి.జి.

## కె ఎస్ ఆర్ దాస్ దర్శకత్వంలో రమేష్ సాహసయాత్ర


అక్టోబర్ ఆఖరి వారం నుంచి షూటింగ్ మొదటి షెడ్యూల్ అండమాన్ నికోబార్ దీవుల్లో ఇరవై రోజుల పాటు జరుగుతుంది డిసెంబర్లో పది రోజులు జనవరిలో పది రోజుల తదుపరి షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది అన్నారు కె ఎస్ ఆర్ దాస్ ఈయన దర్శకత్వంలో టి ఏ ఎస్ రెడ్డి సూరా నరేంద్ర రెడ్డి నిర్మించే కల్యాణ్ మూవీస్ వారి పై చిత్రంలో రమేష్ నవ నటి రూపిణి కన్నడ ప్రభాకర్ ఆదిగా గల వారు పాలొంటారు పరుచూరి సోదరుల రచన వేటూరి గీతాలు రాజ్–కోటి సంగీతం లక్ష్మణ్‌గోరే ఛాయ శివశంకర్ నృత్యాలు సాహుల్ సాహసాలతో మజ్జు చంద్రశేఖర రెడ్డి సమర్పణ

## కృష్ణ దర్శకత్వంలో రమేష్‌కు జోడీగా నవ నాయిక మీనా

ఎనిమిది హిందీ చిత్రాలలో నటిస్తున్న మీనా అనే చలాకీ యువతి మా రమేష్ సరసన నాయికగా నటిస్తోంది రెండో షెడ్యూల్ సెప్టెంబర్‌లో పది రోజుల పాటు జరిగింది. అక్టోబర్‌లో కాశ్మీర్‌లో వారం రోజుల షెడ్యూల్‌లో రమేష్, మీనాలపై మూడు పాటలు పిక్చరైజ్ చేస్తాం. నవంబర్ విడుదల," అన్నారు కృష్ణ. ఈయన చిత్రానువాదం, సంకలనం, దర్శకత్వంతో పాటు ప్రధాన పాత్ర నిర్వహిస్తున్న శ్రీ వెంకట పద్మావతి పిక్చర్స్ చిత్రంలో జయప్రద, మోహన్‌బాబు, గొల్లపూడి మారుతీరావు, కోట శ్రీనివాసరావు, పద్మనాభం, రాజసులోచన, రాజ్యలక్ష్మి, ఓ కీలకమైన పాత్రలో మురళీ మోహన్ నటిస్తున్నారు. పరుచూరి సోదరుల రచన, వేటూరి గీతాలు, చక్రవర్తి సంగీతం, ఎ. ఎస్. ఆర్. స్వామి ఛాయ, సలీమ్– రఘు నృత్యాలు, ఎ. జగదీశ్ నిర్వహణతో డి. కాశీ విశ్వనాధరావు నిర్మాత.



"కలియుగ కర్ణుడు"లో కృష్ణ, జయప్రద



దొంగరాముడు లో బాలకృష్ణ, రాధ

## విజయ నిర్మల దర్శకత్వంలో కృష్ణ సమర్పించే కలెక్టర్ విజయ

సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 31 వరకు మద్రాసు పరిసరాలలో 35 లొకేషన్స్‌లో షూటింగ్ "అంతం కాదిది ఆరంభం అనంతరం నేను స్కోర్ చేయడానికి తగిన డైనమిక్ రోల్ ఈ కలెక్టర్ విజయ అన్నారు విజయనిర్మల ఈమె స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో కృష్ణ సమర్పించే శ్రీ విజయ కృష్ణా మూవీస్ వారి పై చిత్రంలో మురళీ మోహన్ నరేష్ రమ్యకృష్ణ ముచ్చెర్ల అరుణ గుమ్మడి కోట శ్రీనివాసరావు సుదాకర్ వేలు వీరభద్రరావు వినోద్ మహారది తరుణీ కె కె శర్మ రమాప్రభ వై విజయ నిర్మల పండరీబాయి బిందుఘోష్ ఆదిగా గలవారు పాలొంటున్నారు గిరిజశ్రీ బగవాన్ కథకు మహారథి సంభాషణల కర్త రమేష్‌నాయుడు స్వరకల్పనలో వేటూరి గీతాలు రాశారు పుష్పాల గోపీకృష్ణ చాయ తోటయాదు శిల్పం శీను– సరోజ్ (బొంబాయి) నృత్యాలు సత్యం– మాధవ రెడి – ఉదయభాస్కర్ సహకార దర్శకత్వం టి సత్యనారాయణ ప్రొడక్షన్ ఎస్ రవికుమార్ నిర్వహణతో ఎస్ రఘునాద్ సహ నిర్మాత ఎస్ రమానంద్ నిర్మాత

## పరుచూరి సోదరుల దర్శకత్వంలో "ప్రజాస్వామ్యం

'భర్తను అన్నని కోల్పోయి జీవితంలో దెబ్బతిన్న ఓ ఉదాత్తమ మైన లెక్చరర్‌గా శారద సంపన్నురాలై కూడా అభ్యుదయ పంథా అవలంబించిన రేపటి తరానికి ప్రతినిధిగా రాజశేఖర్ నిజాయితీ పరుడైన పోలీస్ అఫీసర్‌గా శివకృష్ణ లాయర్‌గా



"దొంగపెళ్ళి"లో శోభన్‌బాబు, విజయశాంతి

జీవిత అభ్యుదయ కవిగా పరుచూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు ప్రజాస్వామ్యానికి సరైన నిర్వచనమిచ్చే చిత్రం అన్నారు పోకూరి వెంకటేశ్వరరావు ఈయన నిర్మించిన ఈ తరం ఫిలిమ్స్ వారి పై చిత్రంలో నూతన్‌ప్రసాద్ రాజ్‌వర్మ పి ఎల్ నారాయణ నర్రా నల్లూరి రమణారెడ్డి సంజీవి కిరణ్ మహారథి ఏమూరి వై విజయ రాగిణి తాతినేని రాజేశ్వరి హిరా భీమేశ్వరరావు నటించారు చక్రవర్తి సంగీతం, మహీధర్ ఛాయ, సోమనాథ్ శిల్పం, ఎం. శివప్రసాద్ సంయుక్త దర్శకత్వం, పి. శివకుమార రెడ్డి- బి. శ్రీనివాసరావు సహకార దర్శకత్వం, సి. హెచ్. కోటీశ్వరరావు నిర్వహణతో బెజవాడ కోటేశ్వరరావు ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. పరుచూరి సోదరులు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించిన ఈ చిత్రం పోకూరి బాబూరావు సమర్పణ.

## నవంబర్ 12న దాసరి దర్శకత్వంలో జయసుధ సమర్పించే "కాంచన సీత"

"ఇదొక విప్లవ రామాయణం. ఊహించని ముగింపు ఈ కథలో ముఖ్యాంశం." అన్నారు డాక్టర్ దాసరి నారాయణరావు. ఈయన స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వంలో నితిన్‌కపూర్ నిర్మించిన జె. ఎస్. కె. కంబైన్స్ వారి పై చిత్రంలో జయసుధ, శరత్‌బాబు, రఘువరన్, గుమ్మడి, రావి కొండలరావు, అల్లు రామలింగయ్య, ప్రసాద్‌బాబు, భాస్కరబాబు, వరలక్ష్మి, నిర్మల, వేలు వగైరా తారాగణం. సత్యమూర్తి కథకుడు. సత్యం సంగీతం, పి. ఎల్. రాయ్ ఛాయ, బి. చలం శిల్పం, ఎ. రవికుమార్ సంయుక్త దర్శకత్వం. అరవింద్ ప్రొడక్షన్. వి. ఎస్. వి. నరసింహారావు నిర్వహణ, కృష్ణంరాజు కూర్పుతో జయసుధ సమర్పణ.


## దొంగపెళ్ళి చిత్రంలో శోభన్‌బాబు విజయశాంతి సుమలత

బాలు (శోభన్‌బాబు) అతని మేనకోడలు శాంతి (విజయశాంతి) అనుకోని పరిస్థితుల్లో దొంగ చాటుగా వివాహం చేసుకుంటారు కాని ఆమెను భార్యగా ఏలుకోడానికి బాలు ఎంచేతో ఇష్టపడ లేదు. ఆ తర్వాత జరిగేదే అసలు సిసలైన ఈ చిత్ర కథ," అన్నారు రవి రాజా పినిశెట్టి. ఈయన దర్శకత్వంలో శ్రీ వెంకట కృష్ణా ఫిలిమ్స్ అధినేత ఆనం గోపాల కృష్ణారెడ్డి నిర్మిస్తున్న "దొంగ పెళ్ళి" చిత్రం చివరి షెడ్యూల్ సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు జరిగింది శోభన్‌బాబు విజయశాంతి సుమలత గొల్లపూడి మారుతీరావు గిరిబాబు వేలు, భీమేశ్వరరావు మాస్టర్ అలీ అన్నపూర్ణ ఆదిగా గలవారు పాల్గొన్నారు సెల్వకుమార్ కథకు సత్యానంద్ సంభాషణల కర్త ఎ నారాయణ రెడ్డి గీతాలకు చక్రవర్తి స్వరకర్త వి సురేష్ ఛాయ కళాధర్ శిల్పం రాజా సాహసాలు కె ఎస్ రాజేంద్ర సంయుక్త దర్శకత్వం రామకృష్ణంరాజు సహకార దర్శకత్వం గాది సత్యం- కె వి నారాయణ ప్రొడక్షన్ నిర్వహిస్తున్నారు

## "భానుమతి గారి మొగుడు నవంబర్‌లో

"ఇది వినోదాత్మక చిత్రం అన్నారు డి వి ఎస్ రాజు. ఈయన ఎ కోదండరామి రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన డి వి ఎస్ ఎంటర్ ప్రైసెస్ వారి పై చిత్రంలో బాలకృష్ణ విజయశాంతి అశ్విని ముచ్చర్ల అరుణ నిర్మల రేఖ శ్రీలక్ష్మి రంగనాథ్ గిరిబాబు, నాగేష్ వేలు రాజేష్ బాలాజీ మోహనకృష్ణ రజనీష్ మల్లికార్జునరావు వీరభద్రరావు ప్రభృతులు నటించారు కల్యాణి కథకు పరుచూరి సోదరులు స్క్రీన్‌ప్లే సమకూర్చి సంభాషణలు రాశారు వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకర్త. నందమూరి మోహనకృష్ణ ఛాయ శ్రీనివాసరాజు శిల్పం, రఘు నృత్యాలు, చలసాని రామారావు సంయుక్త దర్శకత్వం, గోపాలకృష్ణ ప్రొడక్షన్. పి. ఎన్. రాయ్ సహకార దర్శకత్వం, బాబూరావు కూర్పుతో డి. వి. కె. రాజు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

"భామాకలాపం"లో రాజేంద్రప్రసాద్, రమ్యకృష్ణ





"భానుమతిగారి మొగుడు"లో విజయశాంతి, బాలకృష్ణ

## బాలకృష్ణ కొత్త చిత్రాలు

వై హరికృష్ణ రూపొందించే కృష్ణ చిత్ర వారి తాజా చిత్రం తొలిషెడ్యూల్ అక్టోబర్ 2 నుంచి 20 వరకు జరుగుతుంది ముత్యాల సుబ్బయ్య దర్శకుడు


అక్టోబర్ 21 నుంచి రామకృష్ణా ఎసీ స్టూడియోస్‌కి అనుబంధ సంస్థ అయిన తేజస్వి ప్రొడక్షన్స్ చిత్రం ప్రారంభమవుతుంది ఇందులో బాలకృష్ణతో పాటు భానుప్రియ రావుగోపాలరావు జగ్గయ్య జీవిత గిరిబాబు చలపతిరావు వరలక్ష్మి రమణారెడ్డి ప్రభృత నటవర్గం ఎ కోదండరామిరెడ్డి దర్శకుడు

డిసెంబర్ 11న సెట్స్‌కు వెళ్ళే సత్యం ఎసీ ఎంటర్ ప్రైజెస్ వారి తొలిచిత్రంలో బాలకృష్ణ సరసన రజనితో పాటు మరో నాయిక ఉంటుంది కె మురళీ మోహనరావు దర్శకత్వంలో ఎ హెచ్ వి వి సత్యనారాయణ నిర్మాత

## నవంబర్ 10న అంతిమ తీర్పు

కత్తిపోటు కన్నా కలంపోటు గొప్పదని నిరూపించే జర్నలిస్ట్ జి కె గా కృష్ణంరాజు వసంతగా సుమలత జి కె చెల్లెలు ఉమగా

## సినిమా



దీపావళి పండుగ రోజున ఇవి మీ సౌందర్య రక్షణ సాధనాలు!

ఊర్వశి, ఈమె ప్రియుడుగా సురేష్ గోపి, రాజకీయ ప్రాబల్యం ఉన్న బలవంతులుగా రంగనాథ్ ప్రభాకరరెడ్డి అమోఘంగా నటించారు న్యూఢిల్లీ నైనిటాల్ తిరువనంతపురంలో ఔట్‌డోర్ షూటింగ్‌లు జరిపాం అన్నారు జోషి ఈయన స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో తయారైన సైనిమా స్కోప్ చిత్రానికి డెన్నిస్ జోసెఫ్ కథకుడు జంధ్యాల సంభాషణల కర్త శ్యామ్ సంగీత దర్శకుడు జైసన్ విన్సెంట్ ఛాయాగ్రాహకుడు హరి శిల్పం సంతున్ని కూర్పు ఆర్ కె ధర్మరాజు– సహకార దర్శకత్వం నిర్వహించారు కల్యాణి ఫిలిమ్స్ నిర్మాణం

## కోదండరామి రెడ్డి నాగార్జునలతో శ్రీ కామాక్షి కమర్షియల్స్ చిత్రం

యండమూరి వీరేంద్రనాథ్ అపూర్వమైన కథను ఇచ్చారు ఫిబ్రవరి నుంచి షూటింగ్ అన్నారు శ్రీ కామాక్షి కమర్షియల్స్ అధినేత డి శివప్రసాద రెడ్డి ఈయన నిర్మించే చిత్రంలో నాగార్జున హీరో చక్రవర్తి సంగీతం సుధాకర రెడ్డి ఛాయ వెంకట రత్నం కూర్పుతో ఎ కోదండరామిరెడ్డి దర్శకుడు ■

# ఈ దీపావళి – విజయశాంతి

ఒక్కొక్కరి జీవితంలో ఒక్కో విధంగా ఉంటుంది దీపావళి.

మొత్తంమీద అందరూ ఎంతో ఉత్సాహంగా, ఉషారుగా జరుపుకునే పండుగ దీపావళి.

మూడేళ్ళ తర్వాత నేనీ ఏడు దీపావళి పండుగ జరుపు కుంటున్నాను. మూడేళ్ళ క్రితం మా నాన్నగారు, ఆ తర్వాత మా అమ్మగారు మరణించారు.

అందుకే ఈ పండుగ కొందరికి ఆనందాన్ని, మరి కొందరికి విషాదాన్ని ఇస్తుంది.


ప్రతి ఏడూ ఈ పండుగ పేరిట కాలి నుసి అయ్యే మందుగుండు సామాను కోసం ఎన్నో కోట్ల రూపాయలు వ్యయమవుతోంది. కొన్ని ఇళ్ళు అగ్నిప్రమాదానికి లోనవుతున్నాయి.

ఏ యుగంలోనో నరకాసుర వధ జరిగిందని ఈ యుగంలో మనమిలా బాధ పడడమా?

కొత్త బట్టలు, పిండి వంటలతో సరిపెట్టుకుంటే చాలదూ?

ఈ విషయంలో బాలలూ, యువతరం వారూ ఏకీభవించక పోవొచ్చు.

ఐతే, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తే, బాణాసంచా ప్రేల్చడం సబబే అని కూడా అనుకోవచ్చు. ఆ పొగవల్ల దోమలు వగైరా విషక్రిములు నరకాసురుడిలా నాశనమౌతాయి.



అందుకే ఆటంబాంబు లాంటివి ప్రేల్చకుండా మతాబాలు, చిచ్చుబుడ్లతో దీపావళి జరుపుకుంటే బావుంటుందనిపిస్తుంది.

నిజానికి నాకు ఆటంబాంబు అంటే చాలా భయం సుమండీ!

అందరికీ నా దీపావళి శుభాకాంక్షలు!

# శ్రీకృష్ణుడి పాట్లు – రాజేంద్రప్రసాద్

చిన్నప్పు డెప్పుడో హరికథా కాలక్షేపంలో ఒక భాగవతారు చెప్పిన విషయం నా కిప్పటికీ గుర్తుంది....

అల్లరి కృష్ణుడి కన్నా మాటల్లో ఆరితేరిందట సత్యభామ. నరకాసుర వధ అనంతరం ఒకసారి సత్యభామ గృహానికి వచ్చిన కృష్ణుడు తలుపు తట్టాడు. కంఠం మార్చి, "భామా!" అన్నాడు.

"ఎవరు?" అంది సత్యభామ తలుపు తీయకుండానే.

"మాధవుడ్ని," అన్నాడు కృష్ణుడు.

"మాధవుడంటే వసంతం.... వసంత కుడా?" అడిగింది సత్యభామ.

"ఊహుం.... కాదు. చక్రధారిని."



"చక్రధారి అయితే, కుమ్మరివాడా?" అంటూ సత్యభామ లోలోపల నవ్వుకోసాగింది.

"కాదు కాదు; ధరణీధరుడ్ని."

"ఓహో! భూమిని మోసే ఆదిశేషుడివా?"

"అబ్బా! నీ కెలా చెప్పాలో తోచడం లేదు.... నేను హరిని."

"హరి.... అంటే కోతి అని కూడా అర్థముంది.... హనుమంతుడివా?"

కృష్ణుడు ఇక తన పేరు చెప్పక తప్పింది కాదు. మామూలు కంఠంతో "శ్రీ కృష్ణుడ్ని," అన్నాడు.

"ఆ మాట ముందే చెప్పొచ్చుగా?" అంటూ అప్పుడు తలుపు తెరిచిందట సత్యభామ!

# దీపావళి శుభాకాంక్షలు – బేబీ శాలిని



నేను నటించే కొన్ని సినిమా కంపెనీల నుంచి నాకు ప్రతి దీపావళికి రంగు రంగుల మతాబాలు, టపాకాయలు పంపిస్తుంటారు సుమండీ! నా ఫ్రెండ్స్ అందర్నీ పిలుస్తాను. వాళ్ళందరికీ ఆ పటాసులు పంచుతాను. నాకు ఇష్టమైన స్వీట్ ఏదో తెలుసాండీ! బాదంహల్వా!

మాది క్రైస్తవ మతం అన్న విషయం చాలా మందికి తెలీదు. అందుకే అభిమాను లందరూ నాకు దీపావళి జేజేలు పంపుతూంటారు. నేనూ వాళ్ళకు గ్రీటింగ్స్ పంపుతూంటాను.

నేను తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ చిత్రాలలో నటించాను. డైలాగులు నేనే మాట్లాడ్తాను సుమండీ. డైలాగ్‌ను ఎలా చెప్పమంటే అలాగే చెప్పేస్తాను. ఒక కన్నడ చిత్రంలో ఓ పాట పాడాను కూడా.

నేను ఇన్ని సినిమాలలో నటిస్తూన్నా చదువును అశ్రద్ధ చేయలేదు.

ఒకప్పటి బాల నటీనటులు ఇప్పుడు హీరో హీరోయిన్‌లు అయ్యారు.

మీ ఆశీస్సు లుండగా నేను మాత్రం ఎందుకు హీరోయిన్ అవను?

మీ అందరికీ నా దీపావళి జేజేలు.

(జి. వి. జి.)



# శతచిత్ర నటి సుమలత సమాధానాలు!

యు షెరీఫ్, కర్నూలు

మీ బవిష్యత్తు లక్ష్యమేమిటండీ సుమగారూ!

చక్కని నటిగా ఇంకా మంచి పేరు తెచ్చుకోవాలని

బాబు, బెంగళూరు

మీ వివాహం ఎవరితో? ఎప్పుడు?

సద్గుణ సంపన్నుడైన ఒక వరునితో ఆ ఘడియ వచ్చినప్పుడు

సి హెచ్ మారుతీశర్మ, నిజామాబాద్

మీరు కూడా రాజకీయాలలో ప్రవేశిస్తారా?

రాజకీయాలా? అంటే ఏమిటండీ?

వి సుబ్బారావు, వాడ్రేవుపల్లి

లతగారూ! ఈ సినిమారంగంలో మీరు నేర్చుకున్నదేమిటి?

శ్రమించి కృషి చేస్తే, దానికి అదృష్టం తోడైతే, మరింత ముందంజ వేయడానికి వీలవుతుందని

కందా రామకృష్ణ, నందిగామ

మీకు ఏఏ భాషలు తెలుసు?

తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, ఆంగ్లం ఇకపోతే, నాకు తెలుగు తెలుసని మీకు తెలుసు

జి పుల్లారావు, వినుకొండ

మీ జీవితంలో మీరు ఎదురు చూడనిది ఏదైనా జరిగిందా?

జరిగింది అది నేను తారనవడమే

జె మాణిక్యాలరావు, బందరు

మీకు వంద కార్డులు రాయాలని ఉంది రాస్తే ?

ఇంకా ఎక్కువగా రాస్తే మీ పేరు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో ఎక్కుతుందేమో!

కుంచం రమణారావు, తిరుపతి

రైతు చెమటోడుస్తాడు సైనికుడు రక్తాన్ని అర్పిస్తాడు మరి రాజకీయవేత్తలు ?

ఆ రెండిటినీ జుర్రుకుంటారు

చెంగల వెంకటేశ్, ద్రాక్షారామం

ధనానికి, ప్రశాంతతకు సంబంధమున్నదాండి!

లేదు ధనం పెట్టిలో మూలుగుతూంటుంది మనసులో నెల కొనేది శాంతి

హేమసుందర్‌రావు, డోర్నకల్

శ్రుతిలయలు లాంటి చిత్రాలు విరివిగా రావాలి ఏమంటారు?

తందాన తాన

కొత్తపల్లి బాలరాజు, అన్నవరం

కన్న తల్లిదండ్రులకు ఇంట్లో ఆశ్రయమివ్వని వారిని ఏమనాలి?

అనాల్సింది వాళ్ళను కాదు తమ సుపుత్రుల్ని ఆ రీతిగా పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులనే అనాలి

వై శకుంతల, మోదుకూరు

నా జీవితమంతా ఓటమి ఆ ఓటమిని విజయంగా బావించడానికి ప్రయత్నించే కొద్దీ మళ్ళీ ఓటమే మరెలాగండీ, సుమలతగారూ!

ఓటమి, గెలుపు కాదు ముఖ్యం పోరాటమే కర్తవ్యం

కొత్తా నాగేశ్వరరావు, అచ్చంపేట

ఈ శీర్షికను నిర్వహించటంలో మీకు సహాయపడువారెవరైనా ఉన్నారా?

మీరే మీలాంటి పాఠకులు ప్రశ్నలు పంపి సహకరించకపోతే, నేనెలా సమాధానాలివ్వగలను

డి శిరీష, ప్రొద్దుటూర్

ప్ర సుమలతగారూ! మీ – మా అబిమాన క్రికెటేర్ సూపర్ ఆల్ రౌండర్ కపిల్ నాయకత్వంలో ఇండియా తప్పక రిలయన్స్ కప్ గెలుస్తుందని నమ్మకం మరి మీ అబిప్రాయం?

జ అదే

ర్యాలి దక్షిణామూర్తి, తిరుపతి

ప్ర మీరిటీవల ఔట్‌డోర్ షూటింగ్‌కు కాశ్మీర్ వెళ్ళారటకదా? అక్కడ క్లయిమేట్ చిల్ గా ఉందా? మీరెప్పుడైనా ఇల్ అయ్యారా?

జ ఆఁ ఒకసారి ఆ 'చిల్' వెదర్ నన్ను 'కిల్' చేసినంత పనైంది డాక్టర్‌కి 'బిల్' చెల్లించి ఒక 'పిల్' తీసుకునే సరికి జ్వరం 'నిల్' అయింది దానికేం గాని, వాతావరణం ఎలా ఉంది మీ 'హిల్'లో?

టి పతంజలి, జడ్చెర్ల

ప్ర : నా అబిమాన తారగారూ! కన్నీరులో ఏముంది ?

జ కొన్ని పాళ్ళు ఫాస్ఫరస్ లవణాలు, కొద్దిపాటి సోడియమ్ క్లోరైడ్ మిగతా అంతా నీళ్ళు □

### గమనిక

ఈ వారం ఉత్తమ ప్రశ్న'గా ఏదీ ఎంపిక కాలేదు –సం

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

## సుమలత సమాధానాలు

ప్రశ్న............................................................

............................................................

............................................................

పంపినవారి పేరు............................................................

పూర్తి చిరునామా............................................................





# ఇతర్లు గుర్తించేలాంటి తెల్లని వంటి చాయను రాధకి సహజంగా, మృదువుగా సమకూర్చింది ఫెయిర్ అండ్ లవ్లీ... అదెలాగో చదవండి.


దీపం వెలిగించి ప్రార్థించింది రాధ... తన మీద బంగారు జల్లు కురిపించినందుకు కృతజ్ఞతతో మెరిసిందామె మేను. ఫెయిర్ అండ్ లవ్లీ మహత్యంతో ఆమెకి వచ్చింది తెల్లని, నునుపైన వంటి చాయ. ప్రతీ అమ్మాయీ కనే కలే అది. రాధ ఫెయిర్ అండ్ లవ్లీని వాడటం ప్రారంభించి కేవలం రెండు నెలలే అయింది. "ఎంత పసిడి వన్నెతో వికసించింది నీ సొగసు" అంటూ గునగునలాడిన రమేష్ మాటలే ఇప్పుడామె చెవుల్లో ఇంకా మారుమోగుతున్నాయి.

రాధ లాగే మీరు కూడా 'తెల్లని వంటి చాయ' అనే కలని నిజం చేసుకోవచ్చు—ఫెయిర్ అండ్ లవ్లీతో.


## ఓ ముఖ్యమైన వైజ్ఞానిక విజయం

ఫెయిర్ అండ్ లవ్లీ... మీ వంటిని సహజమైన రీతిలో తెల్లబరచటానికి దీనిలో వుంది ఓ సాటిలేని ఫార్ములా—ఇది ముఖ్యంగా రెండు విధాల పనిచేస్తుంది. ఒకటి, ఇది చర్మం అడుగున పనిచేసి శరీరం స్వతహాగా లోలోనే నల్లబడటాన్ని


ఫెయిర్ అండ్ లవ్లీ వాడక ముందు


ఫెయిర్ అండ్ లవ్లీ వాడిన తర్వాత

అరికడుతుంది—ఇంకే క్రీమూ చెయ్యలేని తీరులో.



రెండు, దీని డబల్ సన్‌స్క్రీన్ చర్య, నల్లబరిచే సూర్య కిరణాల నుంచి చర్మాన్ని కాపాడుతుంది. అంచేత 6 నుంచి 8 వారాల్లో పైకొచ్చే కొత్త చర్మ పొరలు మరింత మెరుగైన చాయ కలిగి వుంటాయి. మీరు ఫెయిర్ అండ్ లవ్లీని నియమానుసారంగా రోజుకు రెండుసార్లు ఉపయోగిస్తూంటే, మీ వంటి చాయ ఎంతో అందంగా, మృదువుగా, తెల్లగా అలాగే నిలిచి వుండటం ఖాయం.

## ఉపయోగించే పద్ధతి:

ముఖం, మెడ, చేతులు కడుక్కున్నాక, వాటి మీద ఫెయిర్ అండ్ లవ్లీ క్రీము చుక్కచుక్కలుగా రాయండి. ఇప్పుడు వేళ్లను ఎగువకు రుద్దుతూ నెమ్మదిగా మాలిష్ చేయండి. ఫెయిర్ అండ్ లవ్లీ పనిచేయటం ప్రారంభించగానే మీకు కొద్దిగా జిమజిమలాడవచ్చు. భయపడకండి, అది తొందరగా తగ్గిపోతుంది.

## సులభంగా లోనికి ఇంకుతుంది

ఫెయిర్ అండ్ లవ్లీ ఇంతకు ముందుకన్న ఇప్పుడు మృదువుగా, నేవళంగా ఉంటుంది. అది చర్మం అంతటా మరింత సమానంగా పరుచుకొని, మరింత సులభంగా లోనికి ఇంకుతుంది. త్వరలోనే ఆ తేడాని మీరు అనుభూతి చెందుతారు... కంటితో చూస్తారు కూడా!

మీరు ఫెయిర్ అండ్ లవ్లీ గురించి ఇంకా ఏమైనా అడిగి తెలుసుకోవాలనుకుంటే, ఈ చిరునామాకు వ్రాయండి: శ్రీమతి కవితా కుమార్, ఫెయిర్ అండ్ లవ్లీ అడ్వయిజర్, పి.ఓ. బాక్స్ 758, బొంబాయి-400 021.

కొత్తది! మరింత మృదువైన
**ఫెయిర్ అండ్ లవ్లీ**
వంటి చాయని తెల్లబరిచే క్రీమ్




## వంటి చాయను తెల్లబరుస్తుంది సహజంగా, మృదువుగా... ఇతర్లు గుర్తించేలాగ!

LINTAS FAL 50 2720 TL

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

సీరియల్

# రేపటి మహిళ

## సి. ఆనందారామం

(గత సంచిక తరువాయి)

సావేరి రాగంలో శ్యామశాస్త్రి కీర్తన శంకరి శంకురు అందుకున్నాడు బాగవతార్ త్రిశ్రగతిలో నడుస్తోంది తాళం బాగవతార్ గానంతో పోటీపడుతూ మృదంగం వాయిస్తున్నాడు ఏండెటో గాన కళా సరస్వతి బంగారు మువ్వలా అడుగులు కదుపుతూన్నట్లున్నది మృదంగ వాయిద్యం

ఎక్స్‌క్యూజ్‌మీ!

పురుష కంఠం వినిపించి ద్యాన్న బంగం అయినట్లు తలలెత్తి చూసారు ఏండెటో బాగవతార్ ఎవరో అపరిచిత వ్యక్తి

ఏం కావాలి? కొంచెం చిరాగ్గాఅడిగాడు ఏండెటో అతడు తన్మయత్వంతో మృదంగం వాయిస్తున్నప్పుడు ఎవరేనా డిస్టర్బ్ చేస్తే తగని చిరాకనిపిస్తుంది

మీ సంగీత సాధనకి బంగం కలిగించినందుకు క్షమించండి మృదులగారుండేది ఇక్కడేనా?

ఈసారి చిరాకుపడటం బాగవతార్ వంతయింది

మృదులతో మీకేం పని? కరుస్తూన్నట్లు చూస్తూ అడిగాడు

కొంచెం కాన్ఫిడెన్షియల్‌గా మాట్లాడాలి

ఏం మాట్లాడాలో నాకు చెప్పండి

సారీ! ఎవరితో పడితే వాళ్లతో మాట్లాడే విషయాలు కావవి

నేనావిడ భర్తని

గ్లాడ్ టు మీట్ యూ

అంచేత మృదులకు చెప్పవలసిన విషయాలేమిటో నాకు చెప్పొచ్చు

అఫ్‌కోర్స్– కాని నేనడిగే ప్రశ్నలకి మీరు సమాధానాలు చెప్పలేరు అంచేత మీతో మాట్లాడినా ప్రయోజనం ఉండదు ఇంతకీ మృదులగారు లేరా? ఆ సమయానికి అక్కడికి కాఫీ తీసుకొచ్చిన వంటమనిషి ఆ వచ్చిన వ్యక్తిని చూసి మృదులగారు లోపలున్నారు పిలుస్తాను అని లోపలికెళ్లింది రెండు నిముషాల్లో మృదుల బయటికొచ్చి అపరిచిత వ్యక్తికి నమస్కారం చేసి కూర్చోండి నాతో మీకేం పని? అంది

అతడు మొహమాటంగా నవ్వి కాన్ఫిడెన్షియల్‌గా మాట్లాడాలి అన్నాడు మృదుల వెంటనే లేచి, నా గదిలో కూర్చుందాం రండి, అంది మృదుల వెంట ఆ కొత్త మనిషి మృదుల గదికి వెళ్తోంటే బాగవతార్ చెయ్యి జుట్టు పైకి వెళ్లింది ఏండెటో దాన్ని పట్టుకుని కిందికి దింపేశాడు తన గదిలో కొత్త వ్యక్తికి కూర్చోవడానికి కుర్చీ చూపించి, ఇప్పుడు చెప్పండి అంది

నా పేరు మహావీర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టుని దేవకిగారికి సంబంధించిన సమాచారం కోసం వచ్చాను

నేను చెప్పగలిగేదేముంది? ఇప్పుడు తను హోటళ్లలోను క్లబ్‌ల్లోనూ డాన్స్ చేస్తోందని అందరికీ తెలిసిన విషయమే గదా!

అది కాదు దేవకిగారు డాన్సర్ కావడానికి ముందు జరిగిన విషయాలు కావాలి ఆమె డాన్సర్ కావడానికి దారితీసిన పరిస్థితులు ఫ్లెమింగ్ ఇండియాకి రావడానికి కారణాలు– ఇవి కావాలి

అవి నాకెలా తెలుస్తాయి నేను కూడ దేవకిని చాలా రోజుల తర్వాత మొన్ననే కలుసుకున్నాను

ఈ మధ్యనే మీరు కుసాయిగుడాలో ఆమె ఇంటికి వెళ్లినట్లున్నారు కదా!

అవును! అయితే నేనామెను తన వ్యక్తిగత విషయాల గురించి ఏమీ అడగలేదు

అయినా ఆ ఇంటి వాతావరణం గురించి ఎంతో కొంత తెలిసి ఉండొచ్చు కదా! నాకు అందిన సమాచారాన్ని బట్టి ఫ్లెమింగ్ ఇక్కడొక నర్సింగ్ హోమ్ లాంటిది నడుపుతున్నాడు అక్కడికి ప్రధానంగా గర్భిణీ స్త్రీలు వెళుతున్నారు ఏం జరుగుతోందక్కడ? ఎబార్షన్స్ ఇప్పుడు లీగలైజ్ చేసారు కదా! ప్రత్యేకించి ఫ్లెమింగ్ చేస్తున్నదేమిటి? అక్కడికి అందరికీ ప్రవేశం లేదని కూడా విన్నాను ఫ్లెమింగ్ ఏదో రీసెర్చి చేస్తున్నాడని అందుచేత ఇతరులకి ప్రవేశం లేదని చెప్తున్నారు అక్కడ జరుగుతున్న రీసెర్చి ఏమిటో మీకేమైనా తెలుసా?

తెలియదు రీసెర్చి చేస్తున్నాడని అందుకు ఫండ్స్ కావాలని మాత్రం తెలిసింది నన్ను కూడా లోపలికి రానీయలేదు

పోనీ ఫ్లెమింగ్ గురించి మీకేమైనా వివరాలు తెలుసా??

తెలియదు అతడితో నాకు అతి కొద్ది పరిచయం బిహేవియర్ నార్మల్‌గా లేదని మాత్రం ఊహించాను

అలా ఎందుకనుకున్నారు?

నన్ను కిడ్నాప్ చేసి బాగవతార్ దగ్గిర రేన్‌సమ్ డిమాండ్ చేస్తానని బెదిరించాడు చాలా ఫూలిష్‌గా తోచింది అతడి ధోరణి

'ఇంతకీ మించి మీకేమీ తెలియదన్న మాట

తెలీదు ఎవరితను ?

ఏ దేశానికి చెందినవాడో మాకూ తెలియదు అమెరికన్ గవర్నమెంట్ స్కాలర్‌షిప్ సంపాదించి అక్కడ రీసెర్చి చేసేవాడని తెలుసు ఏ కారణం వల్లనో అరెస్టు అయ్యాడు దేవకి ఎలాగో డబ్బు సంపాదించి చాలా యాతనపడి అతడ్ని విడుదల చేయించగలిగింది ఆ తరువాత అతడు ఇండియాకి ఎలా వచ్చాడో, ఇక్కడ ఏ రకమయిన రీసెర్చి చేస్తున్నాడో తెలియడంలేదు

గమ్మత్తుగా వుంది అయితే ఈ విషయంలో నేనేం చెయ్యగలను? మీరు

జరిగిన కథ– 11 మృదుల మీద బాగవతార్‌కు తీవ్రమైన అనుమానాలుంటాయి– ఆ అనుమానాలు తీర్చుకోవడానికి డిటెక్టివ్ వీడియో కేసెట్ సహాయం తీసుకుంటాడు వీడియోలో సొట్టకాలు కనిపించి సొట్టకాలు గల వ్యక్తి కోసం వెతుకుతూ తాపులకు గురై పంది ముఖం తొడుగు అమర్చుకుంటాడు దేవకి కోసం వెళ్ళిన మృదుల ఆమె ఏదో వలలో ఇరుక్కొని ఉన్నదని అనుమానిస్తుంది ఫ్లెమింగ్ చేయబోయిన కిడ్నాప్ ప్రయత్నాన్ని తప్పించుకుంటుంది

పోలీసు డిపార్ట్‌మెంట్‌కి రిపోర్టు చెయ్యొచ్చుగదా?

మీరు సరిగా అర్థం చేసుకోవడంలేదు అసలు విషయం తెలుసుకోకుండా విషయం పోలీసుల దాకా వెళ్ళకూడదు అతనికిక్కడ ఎవరో పెద్దవాళ్ళ అండదండలున్నట్టుగా తోస్తోంది చెప్పాను గదా! నేను ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌నని సెన్సేషనల్ విషయాలు వ్యాసంగా వ్రాసి తగిన ఆధారాలతో పత్రికల్లో ప్రచురించడమే నా ధ్యేయం పోలీసు రిపోర్టు ఇచ్చిందానికంటే సమర్థంగా పరిష్కరింపబడతాయి కేసులు

దేవకి నా స్నేహితురాలు తనని ఈ వ్యూహం నించి బయటపడేయటం నా ధ్యేయం అయితే ఇది నిజంగా వ్యూహమేనా? దేవకి నిస్సంశయంగా ఇందులో చిక్కుకుందా? లేక ఆమెకి కూడా జరుగుతున్న దాన్లో భాగముందా– ఇవన్నీ నాకు తెలియవు

దేవకి మింగియార్ బసకి లేదా అతని మఠానికి వెళ్ళివస్తున్నట్టు తెలిసింది మీరుకూడా అక్కడికి వెళ్తున్నారని విన్నాను మింగియార్ ద్వారా ఏమైనా తెలుసుకోగలరా?'

ఉలిక్కిపడింది మృదుల మింగియార్ మఠానికి చాలామంది తమ ముఖాలు కనబడకుండా వస్తారని తెలుసు వాళ్ళంతా ఏవో అతీంద్రియశక్తుల సాధనకోసం వ్యక్తిగత సమస్యల పరిష్కారాలకోసం, డాక్టర్లవల్ల నయంకాని రోగాలనివారణకోసం వస్తున్నారనుకుంటోంది యిన్నాళ్ళూ ఇలాంటివన్నీ ఇండియాలో మామూలే ఎటొచ్చి మొహాలు కనబడకుండా ముసుగుల్లో వుండడమేయిక్కడి విశేషం అయితే దేవకి ఎందుకొస్తున్నట్టు? దీనిలో మింగియార్ పాత్ర ఎలాంటిది? అతడ్ని కుచ్చితంగా ఊహించుకోడానికి మనస్కరించడంలేదు

నేను మింగియార్ దగ్గరికి వెళ్తున్నమాట నిజమే అయితే నేను ఏ గ్రూపులోనూ కలవను అక్కడికి వెళ్ళడంలో నా ప్రయోజనం వేరు అయినా మింగియార్‌గారితో మాట్లాడి విషయమేమిటో తెలుసుకోడానికి ప్రయత్నిస్తాను

థేంక్యూ! ఇదిగో నా విజిటింగ్‌కార్డు మీకేదేనా సమాచారం దొరికినా నా సహాయం అవసరమైనా నాకు ఫోన్ చెయ్యండి సోమనాథ్ ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీస్ ప్రొప్రయిటర్ సోమనాథ్ నా ఫ్రెండ్ అవసరమైతే అతని సాయం తీసుకోండి బిల్లు నాకు పంపమనండి

నమస్కారంచేసి వెళ్ళిపోయాడు మహావీర్ అతడు వెళ్ళగానే సుడిగాలిలా లోపలికొచ్చాడు బాగవతార్ జేవురించిన మొహంతో ఏమిటి? అతడు మాట్లాడిన కాన్ఫిడెన్షియల్ విషయాలు? అడిగాడు

దేవకి జీవితానికి సంబంధించినవి

జేవురించిన బాగవతార్ మొహం పాలిపోయింది

పిడికిళ్ళు బిగించి దేవకి! దేవకి! దేవకి జోలి ఒదిలేయి ఆ ఫ్లెమింగ్‌గాడు కేబరేడాన్సులు – నువ్వు ఏదో ఒకనాడు ప్రమాదంలో చిక్కుకుంటావు అన్నాడు

భయంలేదు అవసరమైతే సోమనాథ్ ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీస ప్రొప్రయిటర్ సోమనాథ్ సహాయం తీసుకోమన్నాడు మహావీర్

దబ్బున నేలమీద కూలబడ్డాడు బాగవతార్

* * * *

మీదగ్గరకొచ్చేవాళ్ళల్లో దేవకి అనే క్లబ్ డ్యాన్సర్‌కూడా వుందా? ఏరకమైన ఉపోద్ఘాతంలేకుండా సూటిగా అడిగేసింది మృదుల

క్రిస్టియన్స్‌లో మరణశయ్యమీది రోగులు మతగురువుల ముందు జీవితంలో తాము చేసిన తప్పులను ఒప్పుకుంటారు వాటిని కన్ఫెషన్స్ అంటారు క్రిస్టియన్ ఫాదర్ ఎట్టిపరిస్థితుల్లోనూ ఆ కన్ఫెషన్‌ని బయటపెట్టరు మా నియమాలుకూడా యించుమించు అలాంటివే తమ సమస్యలతో, భయాలతో బాధలతో మాదగ్గిరకొచ్చేవాళ్ళ రహస్యాలను బయటపెట్టము

కాని లోక కళ్యాణంకోసం అవసరమైతే బయటపెడ్తానని మీరే అన్నారు దేవకితో ముడిపడివుంది ఫ్లెమింగ్ రహస్యం అతని దోరణి సభ్య సమాజానికి ప్రమాదకరమైనదిగా తోస్తోంది

ఆలోచనల్లోపడ్డాడు మింగియార్

ఇంతకూ మీ కేం కావాలి?'

మీ దగ్గరకొచ్చే వ్యక్తుల్లో దేవకి వుందా?

నేను చెప్పబోయే విషయాలు సమాజ శ్రేయస్సుకి అవసరమైన తప్పని పరిస్థితుల్లో తప్ప బయటపెట్టనని ప్రమాణం చెయ్యగలరా?

దేనిమీద ప్రమాణం చెయ్యను?

మాట యివ్వండి చాలు మీ మాటలో నాకు నమ్మకముంది

థేంక్యూ! దేవకిమీద నాకు నిజమైన అభిమానముంది ఆమె ఫ్లెమింగ్‌తో సంతోషంగా వుంటే క్లబ్‌లో డ్యాన్సులుచేసినా మరేంచేసినా నేను పట్టించుకోను కాని ఫ్లెమింగ్ ఏదేనా వ్యూహం పన్నుతోంటేమాత్రం నేను తప్పకుండా ఎదుర్కోవడానికే ప్రయత్నిస్తాను ఈ ప్రయత్నంలో ఒకవేళ దేవకికికూడా కష్టం కలిగినా లక్ష్యపెట్టను

దేవకి ఇక్కడికొచ్చేవారిలో వున్నారు ఆవిడ అభ్యర్థనమీదనే నే నారోజు రాజభూషణంగారిచ్చిన పార్టీకొచ్చాను ఆ పార్టీకి ఎందరో వి ఐ పి లొస్తారని వాళ్ళకి పరిచయం చేస్తానని చెప్పింది

మీ కెందుకు వి ఐ పి లతో పరిచయాలు?

అది వేరే విషయం మీ ప్రశ్నకి సంబందించినంతవరకు చెప్తాను

దేవకి ఏ సమస్య పరిష్కారంకోసం మీదగ్గరకొచ్చింది?

సమస్యకాదు సోమ గురించి తెలుసుకోవాలని వచ్చింది



# రేపటి మహిళ

అంటే?

నవ్వాడు మింగియార్

అదొక మిథికల్ ప్లాంట్, వేదాలలో దీనిగురించిన వర్ణనవుంది యజ్ఞ యాగాదులలో ఆర్యులు ఈ సోమరసాన్ని తాగేవారట ఇది తాగినవాళ్ళకి అద్భుతమైన దర్శనాలు కలిగేవట శరీరానికి నూతనోత్తేజం వచ్చేదట

రంభా, ఊర్వశీ, మేనకా తిలోత్తమలు - మాంచి నిషాయిచ్చే అమృతభాండం – కావలసినప్పుడు అప్పులిచ్చే కుబేరుడిలాంటి బేంకరు మొదలైన హంగులన్నిటితోనూ వున్న స్వర్గం ఆర్యులు సోమరసం స్వీకరించాక కలిగిన దర్శనమేనేమో?

నవ్వేడు మింగియార్

కావచ్చు దేవకిగారు ఈ సోమ మూలిక గురించి నాకు తెలుసేమో కనుక్కోవాలని వచ్చారు అది నేను కనిపెట్టగలిగితే ఎంత డబ్బైనా యిచ్చి కొనుక్కుంటారట దానివల్ల అమరత్వం సిద్ధిస్తుందనే నమ్మకం ఆమెకు కూడా కలిగినట్టుంది

ఓ గాడ్! దేవకిని ఈ రకంగా ఊహించలేకపోతున్నాను నే నెరిగిన దేవకి వేరు ఇంతకీ ఈ సోమ మూలికలు దేవకికి ఎందుకట? ఆ సోమరసం తాగి చిరంజీవిగా వుండాలనుకుంటోందా?

సరిగ్గా చెప్పలేను ఆమె భర్త దీనికి సంబంధించిన రీసెర్చిచేస్తున్నాడను కుంటాను మృత్యువులేకుండా వుండటానికో లేక చాలాకాలం జీవించడానికో మందు కనిపెట్టాలని అతని ప్రయత్నం


ఇంపాసిబుల్ ఎలా సాధ్యం అది?

చెప్పలేము సైంటిఫిక్‌గా రుజువయ్యేవరకూ అన్నీ అసాధ్యంగానే తోస్తాయి పూర్వ యుగాల వాళ్ళు నిజంగా సాధించారో లేక తమ ఊహలని వర్ణించారోకాని దూరదృష్టి – దూరశ్రవణం – ఆకాశగమనం మొదలయినవన్నీ పేర్కొన్నారు శాస్త్రీయంగా రుజువయ్యేవరకూ అన్నీ అభూతకల్పనలే అనుకున్నాము ఇప్పుడవన్నీ సైంటిఫిక్‌గా నిజమని రుజువై మన నిత్య జీవితంలో అనుభవించడంలేదూ నయంకావడం అసంభవం అనుకున్న ఎన్నో రోగాలకి మందులు కనిపెట్టలేదూ! మానవ శరీరపు సగటు ఉష్ణోగ్రతని 98 4 ఫారన్‌హీట్ కంటె తక్కువలో వుంచగలిగితే ఎక్కువకాలం జీవించే అవకాశాలున్నాయనే సిద్ధాంతం ఒకటుంది . ఈవిషయంలో చాలామంది ప్రయోగాలు చేస్తూనే వున్నారు

ఫ్లెమింగ్‌కూడా అలాంటి ప్రయోగాలు చేస్తున్నాడంటారా?

'అనుకుంటాను దేవకి సజెస్టివ్‌గానే తప్ప వివరంగా చెప్పలేదా విషయాలు

అయితే గర్భిణీ స్త్రీలు అతడు హాస్పిటల్ అనేపేరుతో నడుపుతోన్న లేబ్‌కి ఎందుకు వెళుతున్నట్టు? గర్భంలో వుండగానే తమ బిడ్డలని దీర్ఘాయువులుగా చేయడానికా?




మాట్లాడలేదు మింగియార్ ఏదో ఆలోచిస్తున్నట్టుగా వుంది అతని మొహం

మీ కేమైనా తెలుస్తే చెప్పండి సంకోచించకండి ప్లీజ్

చెప్పడమే మేలేమో లాండివిటీ (దీర్ఘకాలిక జీవితం) మీద జరుగుతున్న ప్రయోగాలలో మరొక కొత్త ప్రయోగం కూడా చేస్తున్నారని విన్నాను మానవ శరీరంలో రోగనిరోధక శక్తిని కలిగించేవి రక్తంలోని తెల్లకణాలు ఇది శక్తిమంతంగా వున్నంతవరకూ మానవుడు రోగాలబారినుంచి కాపాడుకోగలడు ఆరకంగా మృత్యువుని దూరంగా నెట్టగలడు ఈ సిద్ధాంతంమీద ఆధారపడి ఒక వ్యక్తి శరీరంలోని బ్లడ్ గ్రూప్‌కి సమానమైన మరొక బ్లడ్ గ్రూప్‌లోని తెల్లకణాలను మనిషి శరీరంలోనికి ప్రవేశపెట్టగలిగితే రోగ నిరోధకశక్తి తద్వారా ఆయుర్దాయం మరింతగా పెంపొందించవచ్చేమోనని ప్రయోగాలు చేస్తున్నారు ఈ పద్ధతిని క్లోనింగ్ అని వ్యవహరిస్తున్నారు

గర్భిణీ స్త్రీలు అక్కడికి వెళుతున్నది తమ గర్భంలోని శిశువుల ఆయుర్దాయం పెంచడానికి కాదు తమ గర్భంలో వున్నది ఆడశిశువో మగశిశువో తెలుసుకోడానికి

తెల్లగా పాలిపోయింది మృదుల మొహం

ఒకవేళ స్త్రీశిశువైతే అబార్షన్ చేయించుకోడానికి?

మాట్లాడలేదు మింగియార్

అంటే – ఫ్లెమింగ్ చేస్తున్న ప్రయోగం సజీవంగా వున్న ఫీటస్‌లోని

మళ్ళీ మాట్లాడలేదు మింగియార్ తల దించుకున్నాడు

హారిబుల్ – అమానుషం – కిరాతకం ఇవా ప్రయోగాలు? బహుశా ఈ కారణంగానే అమెరికాలో అరెస్ట్ అయ్యాడేమో?

కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి మృదులకి ఇంకా భూమ్మీద పడకుండానే ఎలాంటి అత్యాచారాలు తలపెడుతున్నారు స్త్రీజాతిమీద? అందుకు తల్లులే పూనుకుంటే ఈ తల్లులు వ్యక్తిత్వమున్న మనుషులా? తరతరాలుగా బ్రెయిన్ వాష్ చేయబడ్డ మరలు సమాజానికి పనిముట్లు!

★ ★ ★ ★

మృదుల రానురానూ మరీ యిల్లు పట్టకుండా తిరుగుతోంది భాగవతార్‌లో ఉక్రోషం రోజురోజుకీ పెరిగిపోతోంది

నువ్వు నా మాట లక్ష్యపెట్టడంలేదు నువ్విలా తిరగడం నే నెంతమాత్రం సహించను సీరియస్‌గా అన్నాడు ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడే మృదుల కూడా సీరియస్‌గా అయింది

ప్రస్తుతం కొన్ని పనులమీద నేను తిరగకతప్పదు అంతగా నువ్వు సహించలేకపోతే నేను వెళ్ళిపోతాలే.

గుండె గుభేల్లుమంది భాగవతార్‌కి అతడేమాత్రం సహించలేని విషయం అది మృదుల తన్ని ఒదిలివెళ్ళిపోవడం – ఆ తరువాత వచ్చే స్కాండల్స్ తన బ్రతుకు నవ్వులపాలుకావడం నో' అలా జరగడానికి వీల్లేదు

మీ అమ్మా నాన్నా నువ్వేంచేస్తే దానికి తందానతాన అంటారుకాబట్టి వాళ్ళదగ్గరకి వెళ్ళిపోతానంటున్నావుకదూ!

కాదు నేను మా అమ్మా నాన్నల దగ్గరికి వెళ్ళను మరో వ్యక్తిదగ్గరకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను

స్థాణువైపోయాడు భాగవతార్ ఎంత ధైర్యంగా తెగేసి చెప్తోంది? ఏం చేస్తే పాపముంది యిలాంటి వాళ్ళని?

ఎవరా వ్యక్తి?

ఇప్పుడు చెప్పను సమయం వచ్చినప్పుడు తెలుస్తుంది

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవాలి? అందుకు ఒక ఉపాయం ఆలోచించాడు మృదుల స్నేహితుల్ని ఒక్కొక్కర్నీ యింటికి పార్టీకి ఆహ్వానించాలి మాట్లాడుతూ మధ్యలో ఏదో పని ఉన్నట్టు బయటికెళ్ళాలి వెళుతూ వెళుతూ అంతకుముందే రహస్యంగా దాచిన టేప్‌రికార్డ్ ఆన్‌చేసి తను లేనప్పుడు వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో రికార్డు చెయ్యాలి అప్పుడు తెలిసిపోతుంది అసలు రహస్యం ఆలోచించినకొద్దీ ఈ ప్లాను అద్భుతంగా తోచింది ఇంపోర్టెడ్ మినీ టేప్‌రికార్డర్ ముందుపెట్టుకుని సరిగ్గా రికార్డు అవుతుందో లేదోనని చూడాలని నోటికొచ్చినట్టు వాగి టెస్ట్‌చేసుకున్నాడు తరువాత రీవైండ్‌చేసి ఆ

టేప్‌రికార్డర్‌ని టీపాయ్‌కింద పాత న్యూస్‌పేపర్ల కట్టమీద దాచి అనంగ్‌కి ఫోన్‌చేసాడు పార్టీకి రమ్మని

ఇప్పుడు ఈ పార్టీలూ యివన్నీ ఏవిటి? నా కసలు టైమ్‌లేదు అని విసుక్కుంది మృదుల

ప్లీజ్ నాకోసం – సరదాగా ఒకరోజు – నీ పన్లు ఎప్పుడూ వుండేవేగా? భాగవతార్ యిటీవల దిగాలుగా వుంటున్నాడని అతనికోసం ఒప్పుకుంది మృదుల

ఎవరెవర్ని పిలుస్తున్నావు? అడిగింది

అనంగ్‌ని

అతడ్ని ఒక్కడినేనా? ఇదేంపార్టీ?

ఫరవాలేదు ఎక్కువమంది అయితే గంద్రగోళంగా వుంటుంది

ఎక్కువగా వాదించలేదు మృదుల ఈ పార్టీలో ఆ అమ్మాయికి పెద్దగా అంత ఉత్సాహంలేదు భాగవతార్ ఫోన్‌కాల్ అందుకుని వచ్చాడు అనంగ్ అతడికి మృదులమీద కోపం పోలేదు అయినా వచ్చాడు ఆమె నెలాగైనా సాధించాలని వుందతనికి ఉపాయం తోచటంలేదు

అనంగ్ – భాగవతార్ – మృదుల ముగ్గురూ హాల్లో కూర్చున్నారు అనంగ్ – భాగవతార్‌లు ఛీర్స్ చెప్పుకుని విస్కీ తాగుతూంటే మృదుల ఫ్రూట్ జ్యూస తెచ్చుకుంది

ఇప్పుడు మీ రేం రాస్తున్నారండీ? అడిగాడు భాగవతార్

అంతర్జాతీయ రాజకీయరంగం నేపథ్యంగా చేసుకుని రాద్దామనుకుంటున్నాను

"అలాగా ఎన్ని పాత్రలుంటాయి?

తెల్లబోయి చూశాడు అనంగ్

అలా లెఖ్ఖపెట్టలేమండీ! అయినా ముందుగానే ఎలా చెప్పగలను?

ఓహో! నవల పూర్తిగా రాసేసాక ఆలోచించడం మొదలు పెడ్తారన్నమాట మరోసారి తెల్లబోయాడు అనంగ్

భాగవతార్‌కి నవలలగురించి ఏమీ తెలియదని తెలిసిన మృదుల నవ్వు ఆపుకోలేక పైకి నవ్వేసింది అనంగ్ ముఖం ఎర్రబడింది మృదుల వెంటనే ఐయామ్ సారీ! నవల ప్లానింగ్ అంటే ఎలా వుంటుందో భాగవతార్‌కి తెలియదు అతనిది పూర్తిగా మ్యూజికల్ లైన్ భాగవతార్ మాటలకి నవ్వేను మిమ్మల్ని చూసికాదు అంది భాగవతార్ గుటకమింగి ఇంతకీ యిప్పుడేం రాస్తున్నారు? 'అని అడిగాడు మళ్ళీ

అనంగ్ మృదుల ఒకరి ముఖం ఒకరు చూసుకుని నవ్వుకున్నారు

వీళ్ళు నా ముఖం ఎదురుగానే ఒకళ్ళనిచూసి ఒకళ్ళు నవ్వుకుంటున్నారు నేను లేనప్పుడు ఏం మాట్లాడుకుంటారో చూడాలి కసిగా అనుకున్నాడు మనసులో లేచి నిలబడి చిన్న పనుంది ఇప్పుడే పదినిముషాల్లో వస్తాను మీరు మాట్లాడుకుంటూ వుండండి అని పేపర్ తీసుకుంటున్నట్టుగా టీపాయి కింద ఒంగి అక్కడ దాచిన టేప్ రికార్డరు ఆన్‌చేసాడు

యూ ఫూల్ – రోగ్ – బిచ్ – నన్నే మోసం చేద్దామనుకున్నావా? నాకు తెలియదనుకుంటున్నావా? ఐవిల్ ప్రూవిట్ – ఐవిల్ కిల్ యూ!

టేప్‌రికార్డర్‌లోంచి భాగవతార్ మాటలు పిచ్చివాడి ప్రేలాపనలాగ రూమ్‌లో ఖంగున మార్మోగాయి టెస్టింగ్ కోసం భాగవతార్ మొదట రికార్డుచేసిన మాటలు తుడిపేయడం మర్చిపోయాడు రికార్డర్ ఆన్ చేసినప్పుడు అవేమాటలు రికార్డర్‌లోంచి వినిపించాయి

సడన్‌గా భాగవతార్ తిట్లు గదిలో ఖంగున వినిపించేసరికి వులిక్కిపడ్డారు మృదుల, అనంగ్, భాగవతార్ ముచ్చెమటలు పోస్తుండగా హడావిడిపడిపోతూ టేప్‌రికార్డర్ ఆఫ్‌చేసేసి ఆ ఖంగారులో దాన్ని చేతోనేపట్టుకుని నిటారుగా నిలబడి హి – హి – హి" అని అర్ధరహితంగా నవ్వేడు

ఈ జోక్ ఏమిటో నా కర్ధంగాలేదు మీ తిట్లు ఎవర్ని? రికార్డ్ చేసి మరీ వినిపిస్తున్నా రెందుకు?" కోపంగా అడిగాడు అనంగ్

భాగవతార్ తడబిడలాడుతూ అదీ అదీ నవల నవల బాగుందా? అన్నాడు

చాలా బాగుంది మన పాఠకులకి నవల ప్రారంభంలో నే ఈమాత్రం కిక్ అవసరం" చెప్పాడు అనంగ్. (ఇంకావుంది)



# తొలి కోరిక

**అడుసుమల్లి మల్లికార్జున**

చిరు సంధ్యా సమయం

సూర్యుడు వొదిలిన బంగారు రంగుతో అక్కడక్కడ నిలిచి వున్న మేఘాలు మెరుస్తున్నాయి పడక కుర్చీలో కూచొని హృద్యమైన ఆ దృశ్యాన్ని చూస్తున్న నాకు కమ్మగా ఓ సిగరెట్ వెలిగించాలనిపించింది

వెంటనే చిన్నగా నవ్వుకున్నాను

సరిగ్గా మూడు రోజుల క్రితం జరిగిన సంఘటన కళ్ళ ముందు కదలాడింది

ఆ రోజు– నా పెళ్ళి నాటి తొలి రాత్రి

ఇష్టమైన భార్యను ముద్దు పెట్టుకోటానికి ప్రయత్నించి విఫలమైనాను

ప్రేమగా అడిగాను

అందంగా ఎర్రగా మెరిసి పోతూవున్న పెదవుల మీద చూపుడు వ్రేలు పెట్టి తల అడ్డంగా వూపింది– నా భార్య

'ఎందుకని? అన్నాను

'మీరు సిగరెట్లు మానండి అప్పుడు అంది

ఆడవాళ్ళు చాలా తెలివి గలవాళ్ళు ఎప్పుడు ఏ బాణం వేయాలో వాళ్ళకే తెలుసు

వెంటనే ఆప్యాయంగా నా జుత్తులోనికి వేళ్ళు పోనిస్తూ ప్రేమగా అంది

నాకు ఆ వాసన గిట్టదండి ప్లీజ్ నా కోసం మానేయండి "

ఆ మాటలకు బ్రహ్మదేవుడైనా దంగై పోవాల్సిందే!

అల్ప్రాల్ నే నెంత

"అట్లాగే అని హామీ ఇచ్చేశాను

అదీగాక నేనేమీ చైన్ స్మోకర్‌నికాదు కులాసగా వున్నప్పుడు ఎప్పుడైనా ఓ సిగరెట్ తగలేసేవాన్ని అది బాగా అలవాటై పోయాక మా ఇల్లాలు కోరివుంటే– అప్పుడు పరిస్థితి ఎట్లా వుండేదో! ఏమో!!

సరే! ఇల్లాలి తొలి కోరిక

మణులా? మాన్యాలా?

అందుకే శుభ్రంగా మానేశాను

ఆలోచనతో తియ్యని జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆకాశం వొంక చూస్తూన్న నేను ఉలిక్కిపడి ఇటు చూశాను

గుండ్రంగా, దిబ్బ రొట్టిలా వున్న శేషుగాడు భూమిని దడ దడ లాడిస్తూ వస్తున్నాడు

వాడ్ని చూడగానే నా మనసు ఆనందంతో నిండిపోయింది

కీకారణ్యంలో తోడు దొరికినట్లైంది

ఇద్దరం ఆషాడమాసం అల్లుళ్ళమే!

మా పెళ్ళిళ్ళు జరిగిన ఓ వారం రోజులకల్లా ఆషాడమాసం భూతంలా వచ్చి పడింది

చచ్చినట్లు మేమిక్కడైతే– భార్యామణులు అక్కడ

ఒకే మాసపు పక్షులం కాబట్టి హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు

అక్కణ్ణించే చిరునవ్వులు చిందిస్తూ వచ్చాడు

ఓ కుర్చీ లాక్కుని ప్రక్కనే వేసుకుని నా భుజం మీద చేయి వేసి ముసి ముసిగా నవ్వాడు

కొత్త పెళ్ళి కొడుకు కళ వాడిలో స్ఫుటంగా కనిపిస్తోంది

నిజం చెప్పాలంటే శేషుగాడు కొంచెం అమాయకుడనే చెప్పుకోవాలి కాని చాలా మంచివాడు ఎదుటి వారిని బాధపెట్టడం చాతకాని ఉత్తముడు

ఏమిట్రోయ్! అత్తగారిల్లు గుర్తు వొస్తోందా! అన్నాను నవ్వుతో

ఆ మాటతో వాడు గబగబ నవ్వేస్తూ–

నాకో సాయం చేయాల్రా అన్నాడు

ఈ ఆషాఢ మాసం వెళ్ళేవరకూ ఏదైనా చేస్తాను చెప్పు

అటు ఇటు చూసి– చప్పున నా చెవిని లాక్కున్నాడు

చచ్చాను గట్టిగా కేక వేద్దామనుకున్నంతలో చెవిలో రహస్యంగా సిగ్గుగా చెప్పాడు

నాకు సిగరెట్ త్రాగటం నేర్పించు

ఆ మాటతో బిత్తరపోయాను చెవి నొప్పి కాస్తా మాయమైపోయింది

వాడి వంక ఎగాదిగా చూశాను

ఇబ్బందిగా ముఖం పెట్టి వీపు మీద చరిచాడు

బాధ అనిపించలేదు కాని వీపు మాత్రం పూరీలా పొంగి పోయి వుంటుంది

నేను ఎప్పుడో ఒకటి కాలుస్తుంటే– నా ముందు తాగకురా ఇడియెట్ అని ప్రేమగా మందలించే శేషుగాడు ఇట్లా అడిగేసరికి వండరై పోయాను

లోకాన్ని పాలించటానికి నల్లగా తయారై చీకటి రాజు బయల్దేరుతున్న సమయం వీధి దీపాలు వెలుగుతున్నాయి

ఇద్దరం కాలినడకన అట్లా బయల్దేరాం

ఈ విపరీత కోర్కెకు కారణం ఏమిటా? అని బుర్ర బద్దలు చేసుకుని– ఇహ లాభం లేదనుకొని వాన్నే అడిగేశాను

ఎందుకో నేర్చుకోవాలనిపించిందోయ్ అన్నాడు కులాసగా నవ్వుతూ

ఆ మాటలో నిజం లేదని వాడికి తెలుసు నాకూ తెలుసు

కాసేపు బ్రతిమాలించుకుని తీరిగ్గా అసలు రహస్యం బైట పెట్టాడు ఈ రహస్యం ఎక్కడయినా చెప్తే నా తల వేయి వక్కలై పోతుందని కూడ శాపం పెట్టాడు

పడక గదిలో వాడి భార్య అడిగిందట

ఏమండి మీరు సిగరెట్లు తాగుతారా?

లేద ని కాలర్ ఎగరేసి చాలా గొప్పగా చెప్పేడట శేషు

తెలుస్తూనే వుంది మీ పెదాలు ఎర్రగా ఉన్నాయి సిగరెట్ కాల్చే వాళ్ళ పెదాలు నల్లగా నిగనిగలాడుతూ వుంటాయి

శేషుగాడు గొప్ప జనరల్ నాలెడ్జి బిట్ దొరికిందని సంతోషపడుతున్నంతలో మళ్ళీ తనే అందట

నేర్చుకోండి ప్రిస్టేజియస్‌గా వుంటుంది

నాకు అలవాటు లేదు

అందుకే నేర్చుకోండి అని బుగ్గ మీద ముద్దు పెట్టిందట

శేషుగాడి భార్య పేరు రంగనాయకి బాగా చదువుకున్న అమ్మాయి అందంగా అంతకంటే చలాకిగా వుంటుంది ఆ అమ్మాయికి ఈ కోరిక పుట్టడం ఏమిటో నాకు అర్థం కాలేదు

చెప్పలేం కదా!!

ఎవరి వూహలు వాళ్ళవి

ఎవరి కోర్కెలు వారివి

మొత్తానికి ఒకందుకు నాకు ఆనందం కలిగింది శేషుగాడు ఒక విధమైన వుత్సాహంతో వురకలు వేస్తున్నాడు అది సిగరెట్ మీద ఇష్టం కాదు– భార్య మీద ప్రేమ కావొచ్చు

అట్లా నడుస్తూ వూరి బైటకు వెళ్ళాక–

తక్కున సిగరెట్ ప్యాకెట్, అగ్గిపెట్టి తీసి– నా చేతిలో పెట్టి

నేర్పించు అన్నాడు

గురుడు మందుగుండు సామగ్రితో రెడీ ఐ వచ్చాడు

సారీ రా అన్నాను– వాడి చేతిలో సిగరెట్ పెట్టి, అగ్గిపెట్టి పెడుతూ

కోడి పిల్ల వంక గ్రద్ద చూసినట్లు నా వొంక చూశాడు

తర్వాత ఎలుక వొంక పిల్లి చూసినట్లు కూడా చూశాడు

ఇంకెట్లా చూస్తాడోనని భయపడి నిజం చెప్పేశాను

నేను మానేశాను

ఎందుకని అదేదో నేరంలాగా ప్రశ్నించాడు

తనకోసం త్రాగమని బ్రతిమాలాడు ఇహ లాభం

లేదనుకుని ఆ పొజిషన్ వగైరా నేర్పమని కూలబడ్డాడు

ద్రోణాచార్యుడిలా ఓ ఫోజిచ్చి- సిగరెట్ అంటించటం మొదలు- ఆఖరి దమ్ము వరకు వివరంగా విపులంగా ఆ నిశ్శబ్ద రాత్రిలో వాడికి బోధించాను

వాడు అర్జునుడి కంటే ఏకాగ్రతతో విన్నాడు గురువు దగ్గర వున్న విద్య అంతా నేర్చుకోవాలన్న తృష్ణ వాడి కళ్లలో ప్రతిఫలించింది

అట్లా ఆ రాత్రి వాడికి 'సిగరెటోపదేశం చేశాను

శిష్యుడి ప్రావీణ్యత చూసి ముచ్చటపడాలనే మక్కువతో ఒక సిగరెట్ తగలెట్టమన్నాను

వాడిలో అప్పుడే గురుభావం పెల్లుబికింది కాబోలు-

అటు తిరిగి పది పుల్లలు గీచి సిగరెట్ అంట్టించాడు-

అంతే!!

కళ్లలో కారం పడ్డ వాడిలా గిలగిల్లాడిపోయాడు

పొగతో వాడి ముక్కూ నోరు ఏకమై పోయింది

విపరీతమైన ఎగ్గు

రవంతసేపు తర్వాత తెప్పరిల్లి నా వొంక చూశాడు

కన్నీళ్లు చెంపల మీదుగా జారుతున్నాయి

అయ్యో! అనుకున్నాను

వాడు మాత్రం పట్టు వదలని విక్రమాదిత్యుడిలా వున్నాడు దీని సంగతేమిటో తేల్చుకోవాలన్న స్థిరత్వం వాడి చూపుల్లో కదలాడింది

ఇవాల్టికి చాలువెళ్దాం అన్నాను

నువ్వెళ్లు నేను రాను అన్నాడు

చచ్చినట్టు కూలబడ్డాను

* * * * * *

నెల రోజులు గడిచిపోయాయి

మా బాధల్ని తోడు తీసుకుని ఆషాఢం కాస్తా వెళ్లిపోయింది

కొత్త భార్యలు క్రొత్త సంసారాలు

రోజులు ఆనందంగా గడిచి పోతున్నాయి

శేషు కనిపిస్తున్నాడు నోట్లోనో చేతిలోనో ఎర్రగా కాలుతూ సిగరెట్ అగుపిస్తూనే వుంటుంది

అది మామూలు విషయమై పోయింది

శేషు రంగనాయకి ూ కలిసి ఓ రోజు లంచ్‌కి వచ్చారు కబుర్లాడుతూ బైట కూచున్నాం లంచ్ రెడీ అయ్యేసరికి నాలుగు సిగరెట్లు తగలేశాడు

నాకెందుకో బాధేసింది

రంగనాయకి మాత్రం శేషు సిగరెట్ కాలుస్తున్నప్పుడల్లా చాలా గర్వంగా ఫీలవటం గమనించి మౌనంగా వుండిపోయాను

శేషులో చిన్న చిన్న మార్పులు గమనించాను

అంతకు ముందు నుదుట చిన్న బొట్టు పెట్టుకుని, ప్రశాంతంగా చక్కని చిరునవ్వుతో వుండేవాడు ఇప్పుడు వాడి ముఖంలో అంతటి ప్రశాంతత కరువైందనే చెప్పాలి ముఖంలో రవంత చీకాకు కూడ ద్యోతకమవుతోంది

కాని సిగరెట్ కాలుస్తున్నప్పుడు మాత్రం చాలా ఇష్టంగా సుఖంగా ఫీలైపోతున్నాడు

రోజులు గడిచిపోతున్నాయ్

శేషుగాడికి సిగరెట్ ఆరో ప్రాణమైపోయింది

ఎంతమందిలో వున్నా ఎలాంటి పనిలో వున్నా వాడు సిగరెట్ త్రాగాల్సిందే ఆఖరికి సినిమాహాల్లో కూడా పిక్చర్ మధ్యలో ఒకటికి నాలుగుసార్లు బైటకు వచ్చి సిగరెట్ కాల్చి వెళ్లేవాడు

ఏ అలవాటు లేని వ్యక్తి ఏదైనా ఒక దానికి అలవాటు పడితే దాని ప్రబావం ఆ వ్యక్తి మీద ఎంతగా వుంటుందో- శేషుని చూస్తే అర్థమయిపోతుంది

ఒక రోజు రంగనాయకి హఠాత్తుగా మా ఇంట్లో ప్రత్యక్షమైంది

కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పింది

అన్నయ్యా! ఆయన విపరీతంగా సిగరెట్లు



తగలేస్తున్నారు! ఆరోగ్యం ఏమవుతుందోనని భయంగా వుంది మీరెట్లాగైనా వారి చేత ఆ అలవాటు మాన్పించండి

"నేనా?"

అవును మీరుచెప్తే వింటారు

నాకు ఏమాత్రం నమ్మకం లేదు ఆ మాట ఆవిడతో చెప్పి బాధపెట్టడం ఇష్టంలేక–

అట్లాగే తప్పకుండా ప్రయత్నిస్తాను అని హామీ యిచ్చి పంపించాను

ఆ సాయంత్రం శేముగాన్ని కలిశాను

ఐపోయిన సిగరెట్‌తో మరో సిగరెట్ అంటించుకుని, నవ్వుతో పలకరించాడు

అప్పుడప్పుడు చిన్నగా దగ్గుతున్నాడు

ఏమిట్రా ఇది? అన్నాను– ట్రాజిడీగా ముఖం పెట్టి

ఏమిటి?

ఇది అంటూ సిగరెట్ ప్యాకెట్ చూపించాను

పొగ త్రాగనివాడు దున్నపోతై పుట్టున్ అంటూ పెద్దగా నవ్వేశాడు

తాగి మానినవాడు?

మనిషై పుట్టున్

బ్రతికించావ్" అన్నాను నవ్వుతూ

ఏమిట్రా కబుర్లు అన్నాడు మరో సిగరెట్ కాలుస్తూ

శేమూ! ఇహ నువ్వు సిగరెట్లు కాల్చటం మానెయ్యాలిరా" అన్నాను వాడి ముఖంలోకి చూస్తూ

ఎందుకు?

ఆరోగ్యం కూడ చూసుకోవాలి కదా!"

నా ఆరోగ్యానికి ఇప్పుడు ఏం ప్రమాదం వచ్చి పడింది అసలు మనం త్రాగే నీరు పీల్చే గాలి, తినే తిండి ఆరోగ్యకరంగానే వున్నాయంటావా? అంతా కల్తీ ఇదొక్కటే కల్తీ లేనిది అన్నాడు ప్రేమగా సిగరెట్ వొంక చూస్తూ

మాటలు బాగా నేర్చావురా

'సిగరెట్ కాలిస్తే కవిత్వం కూడ రాయొచ్చు– శ్రీశ్రీ లాగా"

## ప్రేలని బాణసంచా

దీపావళికి వింత వింత
బాణాసంచా వచ్చింది
ప్రతిపక్షాలు అధికారంలో
ఉన్నవారూ ప్రయత్నిస్తున్నారు
వాటిని కాలుద్దామని
అవి ప్రేలడం లేదు కాని
పత్రికలకు కావలసినంత
మందు గుండు దొరికింది
బోఫోర్సు శతఘ్నులు
నిశ్శబ్దంగా మోగుతున్నాయి
దళారీలు ఎవరో అన్వేషణ
'రామ్ సీతాన్వేషణ
చెకోస్లవేకియా పిస్తోళ్ళు
వచ్చాయి అవి 'టాయ్'
ఆయుధాలు అంటున్నారు
పిల్లలకు శివకాశిసరుకు
రావడం కుదరదు
ఎక్సైజ్ అధికారులకు
ఉత్పత్తిదార్లకూ
సుంకంపై జగడం
ఈసారి తాటిగిలక
టపాసులు కట్టండి
గోగు కాడలు కాల్చండి
రోలు, రోకళ్ళు ప్రేల్చండి
అవే నయం ఉండదు భయం

–ఎం ఎస్ ఎం

## తొలి కోరిక

సంతోషించాం గాని– నేను వొస్తాను

అప్పుడే

సమాధానం చెప్పకుండా బైటపడ్డాను

వాడ్ని గురించిన ఆలోచనలతో నా మనసు కకావికలం అయిపోయింది రంగనాయకి మీద కోపం కూడా వచ్చింది ఐనా తన తప్పు మాత్రం ఏముంది? భర్త ఎంచక్కా సిగరెట్ కాలిస్తే చూచి ఆనందించాలనుకుంది వీడేమో అదే లోకంగా ప్రవర్తించటం మొదలుపెట్టేడు

ఇప్పుడు చెప్పినా వినే స్థితిలో లేడు అందుకే మౌనంగా వొచ్చేశాను నాకే ఇట్లా వుంటే– పాపం రంగనాయకి పరిస్థితి ఎట్లా వుంటుందో!

తర్వాత ఓ వారం రోజుల వరకు శేముని కలవటానికి వీలుపడలేదు ఈలోపు రంగనాయకి తన ప్రయత్నాలు తను చేస్తూనే వుంది పాపం

వాడి చేత ఆ అలవాటు మాన్పించటానికి వక్కపొడి అలవాటు చేసిందట వాడు వక్కపొడి వేసుకుని ఎంచక్కా సిగరెట్ తగలెట్టటం మొదలెట్టాడట కొద్ది రోజులు పడక గదిలో రానీయకుంటే– ఒక్కడే చక్కగా బైట చాప వేసుకుని, ఆకాశం వొంక చూస్తూ కమ్మగా సిగరెట్లు తగలెట్టేసే వాడట

ఆ ఇల్లాలు చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసి, ఇంకా ఏమి చేయాలో తెలీక గమ్మగా వుండిపోయింది

నేను ఏ పని చేస్తున్నా శేముగాడి గురించిన ఆలోచనలే చుట్టుముట్టేవి

ఆ ఇల్లాలి సమస్యను ఎట్లా పరిష్కరించాలి?

శేముగాన్ని ఎలా రక్షించాలి?

ఆ అలవాటు మానుకోవడం నిజంగా అంత కష్టమా? సమయానికి నా భార్య రక్షించింది గాని లేకుంటే నేను కూడ ఇట్లాంటి స్థితిలోనే వుండేవాణ్నేమో!

అందుకేనేమో! ఓ ప్రముఖ రచయిత అంటాడు–


సిగరెట్ మానివేయటం చాలా సులభం నేను ఎన్నోసార్లు మానివేశాను


అనుభవజ్ఞుడు ఎంత చక్కగా చెప్పాడో!

శేముగాడి గురించిన ఆలోచనలు ఒక కొలిక్కి రాక ముందే– వినకూడని వార్త విని ఆసుపత్రికి పరుగెత్తాను

రంగనాయకి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఎదురు వొచ్చింది

చిరునవ్వులు చిందిస్తూ బెడ్ మీద పడుకుని వున్నాడు– శేము



నా కళ్లల్లో చప్పున నీళ్లు తిరిగాయి

దగ్గరగా వెళ్లి వాడి నుదుటి మీద చెయ్యి వేసి-

శేషు అన్నాను

ఇదంతా నా తప్పు అన్నయ్యా! నాకు ఇట్లా జరగాల్సిందే అని రంగనాయకి ఏడుస్తోంది

అసలేం జరిగింది? అన్నాను

నిన్న సాయంత్రం వరకు బాగానే వున్నారన్నయ్యా భోజనం చేసే ముందు కొంచెం గుండె నొప్పిగా వుందన్నారు అప్పుడే డాక్టర్ దగ్గరకు వెళ్దామంటే ఒప్పుకోలేదు రాత్రి రెండు గంటలకు విపరీతమైన గుండె నొప్పి వచ్చింది కన్నీళ్లు తుడుచుకుంటూ జరిగినదంతా చెప్పింది రంగనాయకి

శేషు మాత్రం వదలని నవ్వుతో అట్లాగే చూస్తున్నాడు


డాక్టరుగారు ఏమంటున్నారు?

సిగరెట్‌లు మానేయాలంటున్నారు మంచి ఆహారం తీసుకుంటే సరిపోతుంది ఇది మొదటిసారి కాబట్టి ప్రాణానికి ధోకాలేదు అన్నారు శేషు సమాధానం చెప్పాడు

నేను సీరియస్ అయిపోయాను

ఇంతకీ నువ్వేం నిర్ణయించుకున్నావ్?

భార్య తొలి కోరిక మన్నించటం కనీస ధర్మం కదరా! నీ భార్య మాట ప్రకారం నువ్వు మానేయలేదా? అట్లాగే నేను అలవాటు చేసుకున్నాను ఇప్పుడు మానాలంటే



కుదురుతుందా? అదీగాక అందువల్లనే గుండె నొప్పి వస్తుందని రూలేమైనా వుందా? పొగ త్రాగే వాళ్లందరికి గుండె నొప్పి వస్తే- ఈ భూమి మీద ఇంతమంది వుంటారా? గుండె నొప్పికి సిగరెట్‌కి సంబంధం లేదంటాను

వాడి మాటల ధోరణి చూస్తుంటే నాకు ఆశ్చర్యంగా వుంది

రంగనాయకి మాత్రం ఏడుస్తూ శేషు పాదాల మీద పడి-

నన్ను క్షమించండి ఇప్పుడు నేనే చెప్తున్నాను కదా! మానుకోండి అంటోంది

రంగనాయకిని చూస్తుంటే ఓ ప్రక్క దిగులు-

మరో ప్రక్క కోపం-

లోకంలో ఎక్కడైనా భర్తకున్న చెడ్డ అలవాట్లను మాన్పించే భార్యలుంటారు కానీ లేని అలవాట్లను నేర్పించే భార్యలుంటారా? ఒకవేళ వున్నా దాని ఫలితం ఎట్లా ఉంటుందో తలుచుకుంటేనే భయంగా వుంది

రంగనాయకి మాత్రం ఇంతగా వూహించి వుంటుందా? వూహించి వుంటే అలాంటి కోరిక కోరి వుండేదా?

శేషు ప్రక్కనే కూచొని చిన్నగా అన్నాను

శేషు! నీకు చెప్పే అంతటి వాన్ని కాదు- ఇల్లాలి తొలి కోర్కె తీర్చావు కదా! మలి కోర్కె కూడ తీర్చరా? గాద్గికమైన నా గొంతులోని ఆప్యాయత వాన్ని కదిలించినట్లుంది

ప్రేమగా నా చెయ్యి నిమురుతూ-

రాత్రే నిశ్చయించుకున్నానురా మరెప్పుడూ సిగరెట్ ముట్టకూడదని అన్నాడు స్థిరంగా

ఆనందంతో రంగనాయకి కళ్లు తళుక్కుమన్నాయి

తృప్తిగా శేషు వంక చూశాను

నీకు ఇష్టమే కదూ భార్య వంక చూస్తూ నవ్వేడు శేషు

నన్ను క్షమించండి అంది రంగనాయకి.

ఆ ఒక్క మాటలో కోటి అర్థాలు స్ఫురించాయి- నాకు □

సీరియల్

# డి.ఎస్.పి.విజయ్

## ఆమూరి సావిత్రి



(గత సంచిక తరువాయి)

రాత్రి తెల్లవార్లూ నిద్ర లేదు విజయ్‌కి

కాపు సారాముఠా కోసం మాటు వేసి గాలించి వాళ్ళని పట్టుకోటం వన్‌టౌన్‌లో ఒక షాపు ఓనర్‌కీ కస్టమర్‌కీ జరిగిన సంఘర్షణ తీవ్రరూపం దాల్చి, ఆ కస్టమర్ వెళ్ళినట్టే వెళ్ళి తన తరఫు వాళ్ళతో మూకుమ్మడిగా వచ్చి షాపు మీద పడటంతో చెలరేగిన గలాటాకి అక్కడ శాంతి భద్రతలు అదుపు తప్పటంతో జోక్యం చేసుకుని దోషుల్ని అరెస్ట్ చెయ్యటం

ఈ గొడవలతో తెల్లారి పోయింది

చాలా అలసటగా ఉంది విజయ్‌కి వేడి నీళ్ళతో స్నానం చేసి వచ్చేసరికి అప్పటికే ఫ్రెష్‌గా తయారయిన నానీ స్వచ్ఛంగా నవ్వుతూ చాక్లెట్ అందించాడు

తెల్లని బట్టలతో దేవదూతలా ఉన్న నానీని చూడగానే విజయ్‌లో స్తబ్దత సగం ఎగిరి పోయినట్లయింది

పొద్దున్నే చాక్లెట్ ఇచ్చావెందుకు నానీ?' నవ్వుతూ అడిగాడతను

ఈరోజు నా బర్త్‌డే అంకుల్' అన్నాడు నానీ!

ఈజిట్! హాపీ బర్త్‌డే టూయూ అని పాడుతూ నానీని చేతుల మీద ఎత్తుకుని కిందికి దించాడు విజయ్

థాంక్యూ అంకుల్ అంటూ విజయ్ చెయ్యి పట్టుకుని బెడ్‌రూంలో కెళ్ళాడు నానీ

టిఫిన్ చేశావామ్మా?

మనిద్దరం చేద్దాం

రామూని అక్కడికే కాఫీ టిఫినూ తెమ్మని నానీతో కలిసి తీసుకుని బద్ధకంగా పడుకున్నాడు విజయ్ కళ్ళు మూతలు పడుతున్నాయతనికి

అంకుల్? పొద్దున్నే మళ్ళీ నిద్రపోవటం మంచిది కాదుగా? మరి మీరిప్పుడు పడుకున్నారేం? అన్నాడు నానీ

నేను రాత్రంతా నిద్రపోలేదు గదమ్మా మరి అన్నాడు విజయ్

రాత్రంతా మేలుకుని ఉంటే ఆరోగ్యం పాడవుతుందట

ఎవరు చెప్పారు?

మమ్మీ! నేను ఎగ్జామ్స్ టైంలో నైటవుట్ చేస్తానంటే మమ్మీ ఒప్పుకునేదికాదు తెల్లవారు జామున లేచి మళ్ళీ చదువుదుగాని అనేది

ప్రతి పుట్టినరోజుకూ మమ్మీ నాదగ్గర కొచ్చేదంకుల్! నాచేత స్వీట్ తినిపించేది ఆ రోజంతా నేనూ మమ్మీ కలిసే ఉండేవాళ్ళం నేను కాన్వెంటు మానేసి ఆరోజు మమ్మీతో ఉండేవాడిని

చివ్వున తలతిప్పి చూశాడు విజయ్

కళ్ళలో తిరుగుతున్న నీటిని బుగ్గ మీదకు జారనివ్వకుండా ఉండటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు వాడు విజయ్ మనసంతా దేవినట్లయింది

నానీ తప్పుకదమ్మా పుట్టినరోజు పూట నువ్విలా ఏడిస్తే ఆ సంగతి మమ్మీకి తెలిస్తే ఎంత బాధ పడుతుంది?' ఏడవకమ్మా!' వాడిని దగ్గరకు తీసుకుని వెన్ను నిమురుతూ లాలనగా అన్నాడు విజయ్

బలవంతాన వెక్కిళ్ళు ఆపుకుంటూ విజయ్‌గుండెల్లో మొహం దాచుకుని ఒక చెయ్యెత్తి అతని మెడచుట్టూ వేశాడు నానీ

ఆ చేతిని మృదువుగా నిమురుతూ ఉండిపోయాడు విజయ్ కొంత సేపటికి వాడు తేరుకున్నాడు

నానీ! రంగారావు నీకు తెలుసామ్మా? మమ్మీ నువ్వూ ఉన్నప్పుడు ఎప్పుడయినా మీ ఇంటి కొచ్చేవాడా? అన్నాడు విజయ్

అపుడు వాడు నాకు తెలీదంకుల్ నేను వైజాగ్‌లో చదువుకునే వాడిని మమ్మీ విజయవాడలో ఉండేది నేను కూడా మమ్మీ దగ్గరేవుండి చదువుకుంటానని ఏడిస్తే ఒద్దనేది

మమ్మీ నేనేమడిగినా చేస్తుంది కానీ తనదగ్గరే నన్ను ఉంచుకోమంటే మాత్రం ఒప్పుకునేది కాదు నేను ఏడిస్తే మమ్మీకూడా ఏడిచేది

అందుకే నేను అస్సలు ఏడవను మమ్మీ నాదగ్గర్నుంచి వెళ్ళిపోయేటప్పుడు ఏడు పొచ్చినా ఆపుకుంటాను తనెళ్ళిపోయాక ఏడుస్తాను

ప్రతి ఫెస్టివల్‌కి నా పుట్టినరోజుకీ మమ్మీ వైజాగ్ వచ్చేది ఆ ఒక్కరోజూ నాతో ఉండేది హాలిడేస్‌కు కూడా నన్ను విజయవాడ రావొద్దనేది తనే వచ్చి రెండు రోజులుండేది

రెండు నెలల క్రితం మమ్మీ నన్ను విజయవాడ తీసుకురమ్మందని చెప్పి, రంగారావు మనుషులు నన్ను తీసుకొచ్చి దాచేశారు విజయవాడ తీసికెళ్ళలేదు మమ్మీ కావాలని ఏడ్చి మారాం చేస్తే కొట్టారు అప్పుడు చూశాను రంగారావుని వాళ్ళు పిల్చిస్తే తెలిసింది

మొదట నన్ను ఎవరింట్లోనో ఉంచారంకుల్ వాళ్ళు చాలా చెడ్డవాళ్ళు ఎప్పుడూ నన్ను కొట్టేవాళ్ళు లిసన్స్ పోతాయి వైజాగ్ పంపమంటే పంపరు మమ్మీదగ్గరకు తీసికెళ్ళమంటే తీసికెళ్ళరు

ఓరోజు నేను ఎవరూ చూడకుండా బస్టాండుకు పారిపోయి విజయవాడ బస్సుగురించి ఎంక్వయిరీ చేస్తుంటే వాళ్ళొచ్చి పట్టుకుని నన్ను ఎన్ని దెబ్బలు కొట్టారని!

తరవాత నన్ను తెచ్చి, మీరు చూసిన చోట ఉంచారు ఆ రంగారావు గాడుట్టి రాస్కెల్

వాళ్ళు మమ్మీ గురించి ఏదో మాట్లాడుకునే వాళ్ళు నేను వినటానికి ప్రయత్నించే వాడిని గానీ నాకు అంత అర్థమయ్యేదికాదు నన్ను విననిచ్చే వాళ్ళుకాదు

మమ్మీ నాకోసం బాగా ఏడుస్తోందని నవ్వుకునే వాళ్ళు

నాకు తెలుసంకుల్ ఆ వెధవే మమ్మీని కూడా విజయవాడ నుంచి ఎత్తుకొచ్చి ఎక్కడో దాచేసి ఉంటాడు

తను నాకోసం ఏడుస్తూనే ఉండి ఉంటుంది

మమ్మీకి నేనంటే ఎంత ఇష్టమో!

అంకుల్? మీరెప్పుడు విడిపిస్తారు మమ్మీని?

ఈ పన్లన్నీ రంగారావే చేస్తున్నాడని మీకు తెలుసుగా? వాడిని పట్టుకుని

జరిగిన కథ– 13 కొత్త ఎం డి శ్రీధర్ సౌందర్యను పెళ్ళి చేసుకుంటానని మోసగించి బ్లాక్‌మెయిల్ చేసి వదిలించు కోవడానికి ప్రయత్నిస్తాడు పగ తీర్చుకునేందుకై సౌందర్య డి ఎస్ పి విజయ్‌ను కలిసి వివరాలు చెపుతుంది శ్రీదర్‌కు బ్లూస్టార్‌కు సంబంధం ఉందని విజయ్‌కు తెలుస్తుంది శ్రీధర్‌ను ఒక ఎత్తుగడ ద్వారా పడగొట్టి అరెస్టు చేసి శిక్ష వేయిస్తాడు విజయ్ మీద రంగారావు కోపం పెరిగి పోతుంది సౌందర్యకు విజయ్ ఉద్యోగం చూపిస్తాడు

అరెస్ట్ చేసి జైల్లో పారేస్తే మమ్మీగురించి చెపుతాడుగా? ఎందుకరెస్ట్ చెయ్యటల్లేదు? అన్నాడు నానీ అమాయకంగా

నిజమే! వాడు నేరస్థుడని ఖచ్చితంగా తెలిసినా వాడి గూండాయిజాన్ని కళ్ళారా చూసినా అనుభవించినా రంగారావు లాంటి వాళ్ళను అరెస్ట్ చెయ్యాలంటే ఎన్ని అడ్డాలో ఎన్నిరూల్సో వాడిని విడిపించటాని కెందరు పెద్దల జోక్యాలో

వీటన్నిటి ముందూ రాజ్యాంగం లా ఎన్ని మెలికలు పడి తేలిపోతాయో ఆ పసి మనసుకేం తెలుసు?

లా' కూడా గొప్పవాళ్ళ గుప్పెట్లో బందీ

వీళ్ళని బంధించటానికి ఓర్పు నేర్పు బలిష్ఠమైన సాక్ష్యాధారాలు ఇంకా ఇంకా చాలా కావాలి

ఇందుకోసమే తను అహర్నిశలూ శ్రమిస్తున్నాడు

నానీ కర్థమయే భాషలో తను రంగారావు నెందు కరెస్ట్ చెయ్యలేదో చెప్పి త్వరలో నే మీ మమ్మీని విడిపిస్తానని విజయ్ వాగ్దానం చేశాక నానీ మనసు కాస్త కుదుట పడింది

తరవాత తన స్కూల్ కబుర్లు గేమ్స్ అన్నిట్లో తను ఎలా ఫస్ట్ వచ్చేవాడో – వాళ్ళ మమ్మీ ఎంత మెచ్చుకునేదో వర్ణించి చెప్పి అంకుల్? నాకు లెసన్స్ పోతున్నాయి గదా? నన్ను వైజాగ్ పంపెయ్యరూ?! అన్నాడు నానీ

నువ్విప్పుడు వైజాగ్ వెడితే రంగారావీసారి నిన్ను బ్రతకనివ్వడు కొన్నాళ్ళు నువ్విక్కడే ఉండాలి నీకేమేం బుక్స్ కావాలో రాసివ్వు రామూ తెస్తాడు ఇంట్లోనే చదువుకో అర్థం కానివి నన్నడుగు చెపుతాను అన్నాడు విజయ్

ఓ కే నేను చదువులో వెనకపడితే మమ్మీ ఫీలౌతుంది

మీ డాడీలా నువ్వు కూడా చాకులాంటి వాడివి అంటుంది మమ్మీ


ఇప్పుడిలా డల్‌గా అయిపోతే బాధ పడదూ?

అన్నట్లు మీడాడీ ఎక్కడుంటారు?

తెలీదు

ఏం పేరు?

తెలీదంకుల్



# డి. ఎస్. పి. విజయ్

మీ మమ్మీ చెప్పలేదూ?

"లేదు అలా అడిగితే ఏడుస్తుంది మా మమ్మీని ఏడిపించే ప్రశ్నలు నేనెప్పుడూ వెయ్యను

ఎంత తియ్యనిదా తల్లీ కొడుకుల బంధం!

పాపం వైజయంతి! ఈ పసివాడి కోసం ఎంత అలమటిస్తోందో ఆమె జీవితంలో ఎన్ని విషాదకరమైన మలుపులో!

ఇంకా చాలా కొద్ది రోజులు

అంతే! తరువాత మనందరం ఒక చోటికి చేరుకుని ఒకటయిపోతాం

అయినా జయా? ఎక్కడ నువ్వు ఎక్కడ రంగారావు!

నువ్వు వాడి చేతికెలా చిక్కావు!?

ఈ విషయం తలుచుకున్నప్పుడల్లా విజయ్ మనసు బాధతో కుమిలిపోతుంటుంది

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

జగదీష్ తమ్ముడు మురళీధరరావు ఇంద్రాపూర్ సబిన్స్పెక్టర్‌గా వచ్చాడు అతను యువకుడు ఉత్సాహ వంతుడు విజయ్ అంటే అతనికి మొదట్నుంచీ గౌరవం రాగానే అతను విజయ్ ఇంటి కొచ్చాడు

"నువ్వు బ్రహ్మచారివే గదా? ఒక్కడివీ వేరే ఉంతటమెందుకు? నాతో పాటు ఇక్కడే ఉండు' అన్నాడు విజయ్ అభిమానంగా

ఒద్దుసార్ ఒక డి ఎస్ పి ఒక ఎస్ ఐ కలిసి ఒకే ఇంట్లో ఉంటే అసహజంగా ఉంటుంది నేను వేరే ఉంటాను అన్నాడు మురళి

అసహజమేముంది ఇందులో? జగదీష్ తమ్ముడు నాకూ తమ్ముడే అన్నదమ్ములిద్దరూ అంతరాలు తేడా ఉందని విడివిడిగా ఉంటారా? ఇక్కడే ఉండు అని విజయ్ ఎంత చెప్పినా మురళీ మృదువుగా తిరస్కరించాడు తరుచుగా విజయ్ ఇంటి కొచ్చి నానీతోనూ విజయ్ తోనూ గడుపుతూ ఉండేవాడు కానీ తను మాత్రం విడిగానే ఉండే వాడు మురళి


★ ★ ★ ★

తన వాళ్ళను ఉపయోగించకుండా విజయ్ మీద దెబ్బతీసే మార్గాన్నన్వేషిస్తున్నాడు రంగారావు

"పోనీ వాడిని మర్డర్ చేయిస్తే? జీప్‌లో వెడుతుండగా దిగేటప్పుడో ఎక్కేటప్పుడో కాల్చి చంపేస్తే?" అన్నాడు ఎమ్ ఎల్ ఎ ధర్మారావు

అలా ఒద్దు స్థానికంగా వాడు మంచి పలుకుబడి సంపాదించాడు మనం త్వరపడగూడదు ఎక్కడో నేర్పుగా ఇరికించి మట్టు పెట్టాలి"

"వాడు స్థానికంగా అంత బలపడటం మంచిదికాదు ముఖ్యంగా నాకు చాలా దెబ్బది పోనీ ఇందుకు స్టూడెంట్సుని ఉపయోగించుంటే? వాళ్ళయితే తేలికగా మన ట్రాప్‌లో పడి అక్షరాలా మనం చెప్పినట్టు చేస్తారు




ఏదో ఒక ప్లాన్ వేసి వాళ్ళను బాగా రెచ్చగొడితే ఆ ఆవేశాన్ని, అవివేకాన్ని మనం వాడుకోవచ్చు

ఈ మధ్యన ఏ అల్లర్లూ గొడవలూ లేక స్టూడెంట్స్ కూడా డల్‌గా ఉన్నారు వాళ్ళు పుంజుకునేలా చేసే పూచీ నాది"

గుడ్ ఐడియా! మనరాజేందర్‌ని ఉపయోగించుకోండి"

ఓకే నేనేం చేస్తానో మీరే చూద్దురు గాని ఈ దెబ్బతో వాడి పని క్లోజయిపోతుంది అన్నాడు ధర్మారావు

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

శ్రీధర్ అనే స్టూడెంట్ తన పుట్టినరోజు సందర్భంగా పార్టీ అరేంజ్ చేశాడు బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన గారాబు తనయుడతను అతని ఫ్రెండ్ మధు

పేరుకు తగినట్టు స్వీట్‌గా ఉండడు మధు చిన్న సైజు గూండాలా రఫ్‌గా ఉంటాడు

స్టూడెంట్సంతా శ్రీధర్ రూంలో తింటున్నారు తాగుతున్నారు మోటుగా ఉండేజోక్స్ వేసుకుని అందులో ఆనందాన్నసుభవిస్తున్నారు తమ క్లాస్‌లో ఉండే అమ్మాయిల అందాలు వర్ణించుకుంటున్నారు ఇంగ్లీష్ సినిమా కథలు చెప్పుకుంటున్నారు

ఆపార్టీకి రాజేందర్ కూడా వచ్చాడు అతను మధు ఫ్రెండు శ్రీధర్‌కు కూడా కాస్త పరిచయముంది

మధుకి డ్రింక్ చెయ్యటం ఎక్కువగా అలవాటు లేదు ఆరోజు రాజేందర్ ప్రత్యేకంగా బలవంతం చేసి అతనితో తాగించాడు

రూంలో డ్రాప్ చేస్తానని రాజేందర్ మధుని స్కూటర్ మీద ఎక్కించుకుని బయల్దేరాడు

బీటు కానిస్టేబుల్ వాళ్ళని ఆపి రాంగ్ సైడున వెడుతున్నారని మందలించాడు

రాంగ్‌సైడా గాడిదగుడ్డా పోనీ ఎహే! ముద్దగా అన్నాడు మధు

స్కూటరాపేసి మధూవేపు నుంచి ఒక్కోపుల్లా వేస్తున్నాడు రాజేందర్

రోడ్డు మీ బాబు గాడి సొత్తనుకున్నారా ఇష్టం వచ్చినట్టు వెళ్ళటానికి?" కోపంగా అన్నాడు కానిస్టేబులు

బాబుగాడు గీబుగాడని పేలావో తొక్కు తీచి పోతుంది జాగ్రత్త నిజానికిది నీ బాబుగాడిది కూడా కాదుగా?

ఏం? నాలుక్కాలాల పాటిలా రోడ్డును కాపలా కాసుకుని బ్రతకాలని లేదా?" అన్నాడు మధు

నువ్వు ముందు పోలీస్‌స్టేషన్‌కి పద

నీ దిక్కున్న చోట చెప్పుకో నేనురాను

తన చెయ్యి పట్టుకుని ముందుకు నడవ బోతున్న కానిస్టేబుల్ చేతిలో నుంచి చెయ్యి లాక్కుని అతన్ని తోపు తోశాడు మధు.

ముందుకు తూలి పడబోయి కష్టమ్మీద ఆపుకున్న కానిస్టేబుల్‌కి పిచ్చికోప మొచ్చేసింది

ఖబడ్దార్ ముండా కొడుకులు! తప్పు చేసింది చాలక ఎంత పొగరు!

లాఠీతో మధూని రెండు అంటించి స్టేషన్‌కి లాక్కు పోయాడు కానిస్టేబుల్

సరిగ్గా ఇందుకోసమే ఎదురు చూస్తున్న రాజేందర్, నడుస్తున్నట్లే నడుస్తూ హఠాత్తుగా వెనుతిరిగి స్కూటరేసుకుని రివ్వున వెళ్ళిపోయాడు

"ఎందుకు? ఎందుకు పట్టుకు పోయారు వాడిని?" అన్నాడు శ్రీధర్

పార్టీ జరిగే చోట ఇంకా స్టూడెంట్స్ ఉన్నారు

"మందు కొట్టాడని వాడిని బాగా బాది మరీలాక్కెళ్ళాడు అన్నాడు రాజేందర్

"తాగాడని కొట్టాడా? ఆ ముండాకొడుకు మాత్రం తాగి డ్యూటీ చెయ్యటల్లా?

ఇక్కడేమన్నా ప్రొహిబిషనుందా?

ప్రభుత్వమే స్వయంగా సారాయి దుకాణాలు నడి రోడ్డు మీద తెరిచి తాగండిరా కొడకల్లారా అంటుంటే పట్టి కల్లు తోసెయ్యటానికి మధ్యలో వీడెవడు?"

# నాకు నచ్చిన సన్నివేశం

డి. ఎస్ పి విజయ్‌కి వింధ్య అనే అమ్మాయి టీ' ఇస్తూ, ఇక్కడి స్థానికుల దగ్గర మీరింత ఇమేజ్ ఎలా సంపాదించ గలిగారు?' అని అడుగుతుంది

"రద్దీగా ఉన్న రోడ్డుమీద ఇద్దరు స్కూటరు వాలాలు ఎదురెదురుగా వస్తూ సడన్‌గా ఆగిపోయి నేలమీద



కాలు ఆనించుకొని తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. నేనా ప్రాంతంలో వెడుతుంటే వాళ్ళని చూసి "అక్కడేమయినా సరదాగా పెళ్ళి విశేషాలు మాట్లాడుకుంటున్నారా? అందుకనువైన స్థలం ఇదికాదు. వెంటనే ఇద్దరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళండి" అని హెచ్చరిస్తాను. ఇలా కూడా అనొచ్చు.


"ఏం? కళ్ళు నెత్తికెక్కాయా? రోడ్డు మీ బాబుగాడి సొత్తనుకున్నారా? ఇడియట్స్! ఎవరి దార్న వాళ్ళెళ్ళక పోతే, బొక్కలో తోయిస్తాను." అనొచ్చు.

కాని నేను అనవసరమైన చోట అధికారాన్ని అహాన్ని ప్రదర్శించను అంటాడు విజయ్. ప్రజల పట్ల పోలీసుల ప్రవర్తన ఎలా ఉండాలో తెలియ జేసే ఈ సన్నివేశం నాకు బాగా నచ్చింది.

–ఎన్. సరోజని, ఒంగోలు

* * *

'విజయ్ మారువేషంలో గోగినేని పల్లికి వెళ్ళి, రంగారావు గురించి సమాచారం సేకరించడం కోసం విజయ్ ఎదుర్కొన్న సమస్యలని నిజంగా మా కళ్ళ ముందు జరుగుతోందా?? అన్నట్లు రచించారు రచయిత్రిగారు. విజయ్ రంగారావుని ఓడించి, అండర్ గ్రౌండ్‌లోకి ప్రవేశించి వైజయంతికోసం వెదికితె ఆమెకు మారుగా, వైజయంతి కొడుకు నానిని చూడటం... అతనిని రంగారావు బంధీ నుంచి తప్పించి,



వైజయంతికి అప్పజెప్పడం కోసం బిలంలోకి దూకి, ఈదుకుంటూ చెంచుగూడెం చేరి, అక్కడి చెంచులకి కృతజ్ఞతలు చెప్పి వారి సహాయంతో గోగినేనిపల్లికి వస్తుంటే ఫారెస్ట్ జీప్‌లో రేంజర్ కనబడటం, అక్కడ నుంచి అతని సాయంతో ఇంటికి వెళ్ళి నానిని జాగ్రత్తగా చూస్తుండటం... రచయిత్రిగారి రచనా శైలి ప్రతి అక్షరంలోనూ నిండి ఉంది. ఈ సన్నివేశం నా మనస్సులో ముద్ర వేసుకు పోయింది.


చామర్తి సాయిగంగాధర్,
ముత్యాలంపాడు, విజయవాడ

* * *

రంగారావుకి చెందిన భూగృహం నుంచి విజయ్ నానీతో సహ తప్పించుకొని, 'బిలం'లోకి దూకేయడం, నానా బాధలు అనుభవించి తిరిగి ఇంద్రాపూర్ చేరడం – ఈ ముఖ్య సన్నివేశము (లు) నాకు బాగా నచ్చాయి. నిజం చెప్పొద్దూ.... రచయిత్రి తన రచనా పటిమను ఇక్కడ చాలా బాగా ప్రదర్శించారు. ఆ సన్నివేశాన్ని చదువుతున్నప్పుడు థ్రిల్లింగ్‌గా, ఎగ్జైట్‌మెంట్‌గా, టెర్రిఫిక్‌గా ఉంటుంది మనకు!

విజయ్ నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్! అతను తన వృత్తి ధర్మంలో ఎంతగా ఇన్‌వాల్వ్ అయ్యాడూ అంటే 'నానీ'ని కాపాడటం కోసం, తన విధి నిర్వహణ కోసం కాస్త ఆధారం దొరగ్గానే నానీతో సహా ఎటువంటిదో తెలియని బిలంలోకి దూకేసాడు!! 'డూ ఆర్ డై' అన్నది అతని సిద్ధాంతం! విజయ్ బతుకుతాడా? లేదా?? – అనే టెన్షన్‌లో మనం ఆసక్తిగా చదువుతాము.

విజయ్‌ని 'అదృష్టం' వరించింది. దుర్గంధపు నీరు పోయి మంచినీరు ఉన్న ప్రదేశంలోకి ఈదుకుంటు వస్తాడతను – 'నానీని రక్షించాలి – వాడిలో



నవ్వులు పూయించాలి' అని విజయ్ ప్రయత్నం.

ఇక్కడ విజయ్ 'డ్యూటీ మైండెడ్ పర్సన్' అని తెలుస్తుంది. విజయ్‌లా అందరూ ఉద్యోగపు బాధ్యతలు నెరవేర్చాలని రచయిత్రి ఉద్దేశం కావచ్చు. పోలీసు వారిపై గల అసహ్యభావాన్ని రచయిత్రి ఈ సన్నివేశం ద్వారా పోగొడతారు.

–టి. శశిధరకుమార్,
తిరువూరు (కృష్ణా) □

---

"స్కూటర్ రాంగ్ సైడు కొస్తుంటే. పట్టుకున్నానంటూ ప్లేటు ఫిరాయిస్తాడు వాళ్ళ కడ్డేముంది? కేసుల్లేకపోతే పదో పరకో దండుకోవచ్చుని ఇలాంటి వేషాలేస్తుంటారు

మీస్టూడెంట్స్ ఇలాంటి వాటిని అడ్డుకో లేక పోతే మాలాంటి వాళ్ళగతేమిటి? ఇవ్వాళ మధూ అయ్యాడు రేపు మీరవుతారు

తగిన పాఠం చెప్పకపోతే ఆ పోలీసుల జులుం మరీఎక్కువవుతుంది ఇందుకు మీరే సమర్థులు

సాధ్యమైనంత వరకూ వాళ్ళను రెచ్చగొట్టి వదిలాడు రాజేందర్

అవసరమైతే మీ వెనుక మన ఎమ్ ఎల్ ఎ గారుండనే ఉంటారు మీకు తెలుసుగా ఆయన కూడా అన్యాయాన్ని సహించరు అందులో స్టూడెంట్సంటే ఆయనకు చచ్చేంత అభిమానం

రాజేందర్ మాటలు వినగానే స్టూడెంట్స్‌లో ఉత్సాహం ఉద్రేకం పెల్లుబికి వచ్చాయి

దారిలో రూముల్లోనూ కాలేజీల్లోనూ ఉన్న స్టూడెంట్స్‌ని కూడా కలుపుకుని ఊరేగింపులా బయల్దేరారు ఇంకా పోలీస్స్టేషన్‌కు చేరుకోనే లేదు ఇంతలో అడుగో! వాడే మనమధుని కొట్టి అరెస్ట్ చేసింది అన్నాడు రాజేందర్

అంతే! అందరూ కలిసి ఆ కానిస్టేబుల్‌ని పట్టుకున్నారు

ట్రాఫిక్ ఆగి పోయింది జనమంతా గుమిగూడారు

అది వన్‌టౌన్ ఎస్ ఐ మురళీధర్రావు పరిధిలోది

వార్త అందిన వెంటనే క్షణాల మీద అక్కడకు చేరుకున్నాడు మురళీ.

స్టూడెంట్స్ మధ్యలో ప్రాణభయంతో విలవిల్లాడు తున్నాడు కానిస్టేబుల్ అప్పటికే అతని ఒంటినిండా దెబ్బలు

"ముందా కానిస్టేబుల్‌ని వదలండి ఇంత చిన్న విషయానికి మీరంతా ఏకమయి ఒక్క వ్యక్తి నలా నడి బజార్లో పెట్టి హింసించటం అమానుషం తప్పు అతనిదే అయితే అతన్ని శిక్షించటానికి మేమున్నాం


ఇంతటి అనాగరికత సహజంగా మీలో లేదని నాకు తెలుసు ఎవరో మీ వెనకున్నారు వాళ్ళు మమ్మల్నిలా రెచ్చగొట్టి మీ ఉద్రేకాన్ని ఉపయోగించుకుని ప్రయోజనం పొందుతారు సఫరయ్యేది మీరూ మేమూ

నామాటవిని అతన్నొదిలియ్యండి అసలేం జరిగిందో తెలుసుకుని కానిస్టేబుల్ పట్టు కెళ్ళిన స్టూడెంటును ఒదిలేస్తాం అంటూ మురళీ స్టూడెంట్స్‌కి నచ్చచెపుతున్నాడు

చాటు నుంచి రాజేందర్ విసిరిన రాయి .మురళీ నుదుటికి బలంగా తగిలింది క్షణాల్లో అతని పచ్చని ముఖం నెత్తురు చారికలతో మలినమయింది

స్టూడెంట్స్ ప్రవాహంలా విరుచుకుపడుతున్నారు వాళ్ళలో కలిసి పోయి ఉన్న రాజేందర్ తాలూకు గూండాలు కనీ కనపడకుండా విన్యాసాలు చేస్తున్నారు ముఖ్యమైన వాళ్ళని గాయపరుస్తున్నారు

లాఠీ చార్జి జరుగుతోంది



# డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎమ్ ఎన్ సి నర్సాపురం

నాకు ఎనిమిది సంవత్సరముల క్రితం తలకు చిన్నదెబ్బ తగిలి బొప్పి కట్టినది ఆ బొప్పి పెరిగి గత ఎనిమిదేళ్ళుగా అలానే వున్నది దీని వలన నాకేమైనా ప్రమాదమా? ఆపరేషన్ చేస్తే నయమవుతుందా?

ఈ బొప్పి 'పెరిగి' అలానే ఎలాఉంటుంది బహుశా పెరిగి ఉండదు దీనివల్ల ఏ ప్రమాదము లేదు దీనికి ఆపరేషన్ అవసరం ఉండదు

ఆర్ కె పి గుంటూరు

నా వయస్సు 24 సంవత్సరములు పండ్లు చాలా కొద్దిగా ఎత్తుగా వుండి ఖాళీ లేకుండా వరుసగా వుంటే క్లిప్పులు వేయించుకోవచ్చునా? లేదా? తెలుపగలరు క్లిపులు ఎన్ని నెలలు వుంచు కోవాలి?

క్లిప్పులు వేయించుకునే అవకాశం ఉంది మీరు మీ ఊళ్ళో ఉన్న దంతవైద్యులను కలవండి ఎన్ని నెలలు ఉంచుకోవాలన్నది పంటికీ, పంటికీ ఉన్న ఖాళీని బట్టి ఉంటుంది ఈ విషయాన్ని దంతవైద్యులే ప్రత్యక్షంగా పరిశీలించి నిర్ధారణ చెయ్యవలసి ఉంటుంది

వై ఎస్ మండపేట

నాకు 16 14 సంవత్సరముల పిల్లలు వున్నారు నాకు బహిస్టు 20 రోజులకే వస్తుంది బ్లీడింగ్ కూడా అతి తక్కువగా వుంటుంది కొన్ని మందులు వాడినా సరిఅవలేదు

మీరు వెంటనే నిపుణులైన గైనకాలజిస్టుకి చూపించి "డిస్ఫన్క్షనల్ యూటిరైన్ బ్లీడింగ్ కోసం తగిన పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది డాక్టర్లు ముందుగా డి అండ్ సి చేసి బయాప్సీ పరీక్షానంతరం, హార్మోన్లుగాని ఇతర మందులు గాని వాడి చికిత్స చెయ్యటం జరుగుతుంది రోగ నిర్ధారణ గాకుండా మందులు వాడటం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు

సి ఎస్.ఏలూరు

మాకు పెళ్ళయి 9 సంవత్సరములయినది పెళ్ళయిన 3 4 సంవత్సరముల వరకు మెన్సెస్ క్రమపద్ధతిలో రాలేదు ఒక్కసారి ఏడాదిపాటు అవలేదు అందువల్ల ఫారిన్ నుండి 'పార్లడాల్' అనే టాబ్లెట్లు వాడాను వాడిన రోజులలోనే మెన్సెస్ వచ్చి నెల తప్పినాను మా బాబుకి రెండున్నర సంవత్సరములు ఇంత వరకూ తిరిగి బహిస్టు అవలేదు బాబు సంవత్సరంన్నర నాదగ్గరే పాలు త్రాగాడు పాలు మానిపించి సంవత్సరము అయినా మెనసస్ రాలేదు ఒళ్ళు గూడా వస్తున్నది డైట్ కంట్రోల్ చేస్తున్నాను ఇ పి ఫోర్ట్ ఇంజక్షన్లు చేయించుకున్నాను అయినా బహిస్టు రాలేదు

మీరు మెడికల్ కాలేజీలలో గాని, ఇతర చోట్ల గాని ఉన్న నిపుణులైన లేడీ డాక్టర్ల సలహా పొందటం చాలా అవసరం మీ ఉత్తరాన్ని బట్టి మాత్రమే రోగ నిర్ధారణ చెయ్యటం కష్టం □

## డి. ఎస్. పి. విజయ్

పరిస్థితి అదుపు తప్పటంతో విజయ్ కూడా అక్కడికి చేరుకున్నాడు అప్పటికే రక్తసిక్తమైన శరీరంతో స్పృహ తప్పి పోతున్న మురళీని, గుంపులో కురికిన విజయ్ చేతులతో పట్టుకుని అతి కష్టం మీద జీప్ వరకూ తీసుకు రాగలిగాడు విజయ్‌కి కూడా గాయాలయాయి మురళీని లోపల పడుకో బెట్టి ముందు సీట్లోకి రాబోతున్నాడు విజయ్

సి ఐ గొంతులో నుంచి ఒక వికృత మైన కేక వెలువడింది వెంటనే అతని చేతిలో రివాల్వర్ పేలింది రెండో చెయ్యి అతి లాఘవంగా విజయ్‌ని వెనక్కి లాగింది ఒక గుండు దూసుకెళ్ళి విజయ్ పక్కకు లాగ బడటంతో ఇంకో వ్యక్తికి తగిలి నేలకూలాడు సి ఐ పేల్చిన గుండు విజయ్ మీదికి గురి పెట్టి కాల్చినవ్యక్తి చేతికి తగిలింది విజయ్ బెబ్బులిలా అటు దూకాడు రివాల్వర్ గురిపెట్టి అప్పటికే జనమంతా విజయ్‌కీ ఆ వ్యక్తికీ అడ్డుగా తోసుకొచ్చెయ్యటంతో వాడు పారి పోయాడు రాజేందర్ వాడిని నేర్పుగా తప్పించేశాడు

అదనపు పోలీసు బలగం రావటం కాల్పులు ప్రారంభమవటంతో కొద్ది సేపట్లోనే పరిస్థితి అదుపులోకొచ్చింది

ఇలాంటి దారుణమైన పథకం వేసిన ధర్మారావు అతని మనుషులు చెక్కు చెదరకుండా హాయిగా ఉన్నారు

అమాయకులు అమాయకంగానే నేల కూలారు

మురళీ ప్రాణాపాయ స్థితిలో హాస్పటల్లో ఉన్నాడు రెస్ట్ లెస్‌గా విపరీత మైన టెన్షన్‌గా ఉంది విజయ్‌కి

అతనికేమయినా జరిగితే తను జగదీష్ మొహం చూడగ్గలడా?

నో! అలా జరగ్గూడదు! జరగ్గూడదు! అనుకుంటున్నాడు ఉద్రేకంగా

అతనికి బ్లడ్ ఎక్కించాలి ఆ గ్రూప్ బ్లడ్‌లేదు అన్నాడు డాక్టర్

మీరూ నీరసంగానే ఉన్నారు ఒద్దు అని డాక్టర్ అడ్డు పడబోయినా వినలేదు విజయ్ తమ ఇద్దరి బ్లడ్ ఒక గ్రూప్ కావటమే అదృష్టం అనుకున్నాడతను

* * * *

మురళీ కోలుకుంటున్నాడు

ఇప్పుడు తమ ఇద్దరి లోనూ ఒకేరక్తం ప్రవహిస్తోంది

ఇలా అనుకుంటే కాస్త నవ్వొస్తున్నా ఒక ఆత్మీయతా భావం ఇద్దరి మనసులనూ ఒకేలా తాకింది

డామిట్! ప్రతిసారి చేతికి చిక్కినట్లే చిక్కి మాయమయిపోతున్నాడు!

థూ! వాడిలో సమర్థత పెరుగుతున్నకొద్దీ మనవాళ్ళు చవట వెధవల్లా తయారవుతున్నారు మన ప్లాన్లూ అలాగే ఏడుస్తున్నాయి విసుగ్గా అన్నాడు ధర్మారావు

నోరెత్తకుండా తలదించుకు నిలబడ్డాడు రాజేందర్

ఇంకొక్క ఛాన్స్ అనబోయి ధర్మారావు మొహం చూసి ఆగిపోయాడు

ఇదేం చింతపిక్క లాటకాదు మళ్ళీ మళ్ళీ పోసుకుని ఆడటానికి, ఒక ప్లాన్ వేసి, దాన్ని అమలు జరపాలంటే ఎంత రిస్క్ తీసుకోవాలి ఎంత టెన్షన్ అనుభవించాలి ఎంతమూల్యం చెల్లించాలి

ఛత్! మీ మొహాలు నాకు చూపించకండి శివమెత్తినట్లు అరిచాడు ధర్మారావు

మెల్లిగా కదిలి అవతలికెళ్ళి పోయాడు రాజేందర్

అలాంటి అవమానం పొందటం అది మొదటి సారి

ఎర్రగా కందిన అతని మొహంలో ఓ పైశాచికమైన ఆలోచన మెరిసింది

దీన్ని తన సొంత రిస్క్ మీద అమలు జరిపి ఈ రాజేందర్ సత్తా ఏమిటో చూపించాలి ధర్మారావుకి

అవమానించిన నోటితోనే అభినందన పరంపరలందుకోవాలి

రాజేందర్ కళ్ళు క్రూరంగా జ్వలిస్తున్నాయి ఆక్షణంలో అతని మొహం చూసిన ఎవరికైనా వెన్ను జలదరించక మానదు ! (ఇంకా వుంది)


తరతరాల సంప్రదాయం
చేనేత పట్టు సోయగం
కనుల ముందు ఆనందం
మేలి మెరుగు శృంగారం.
మేలిమి బంగారు మేని
సొగసులకు అపరంజి ఆప్కో
వస్త్రాలు మేలు!
కలికి కులుకుల కాంతలందరిలో
ఆశలను చిగురించు ఆప్కో పట్టు
వస్త్రాలు!
ఆప్కో
చేనేత
20%

## సాంఘిక శీర్షిక

# చిన్నారి బాలల దీనగాథలు

పసితనం నుండి పిల్లలను క్రమశిక్షణ పేరుతో క్రూరంగా హింసించి, తల్లి తండ్రులంటే పిల్లలకు భయాన్ని కల్గించకూడదు ఉపాధ్యాయులు తల్లి తండ్రులు పిల్లలతో స్నేహంగా వుంటూ మంచి మాటలతో వారిలో సత్ప్రవర్తన కలిగించాలి అలాచేసినపుడు 'చిన్నారిబాలల దీనగాథలు వుండవు 'చిన్నారిబాలల చిరునవ్వులు తప్ప

–ఎల్ ఉమారఘు,
హైదరాబాద్

* * *

## క్రమశిక్షణ శిక్షయితే.....

అర్థరాత్రి అందరూ మంచి నిద్రలో వున్నాం లక్ష్మిగారూ! లక్ష్మి గారూ! ఎవరో తలుపు దబదబా బాదుతున్నారు ఈసమయంలో ఎవరొచ్చారబ్బా అని విసుక్కుంటూ వెళ్ళి తలుపుతీసారు మా మమ్మి

ప్రక్కింటి ఆంటీ ఏడుస్తూ మా సుజనీకి ఏమైందో తెలియదు పిచ్చి దానిలా ప్రవర్తిస్తూంది నాకు చాలా భయంగావుంది మీ రొక్కసారి రండి" అన్నారు

సుజనీకి ఏమైంది? మమ్మీకంటే ముందు నేను పరుగుతీసాను. ఇల్లంతా చిందర వందర చేసేసింది. పల్చటి నైటీలో వుంది రికార్డర్‌లోంచి భక్తిగీతాలు వస్తున్నాయి విసుగ్గా ఆఫ్‌చేసి యిటు తిరిగింది అమాయకంగా నిర్మలంగావుండే సుజని కళ్ళు ఎర్రగా ఉబ్బి, భయంగావున్నాయి. నన్ను చూడగానే హాయ్ ఉమా! చాల బోర్‌గావుంది ఈ భక్తిగీతాలు వినలేకచస్తున్నా నీదగ్గర సాటర్‌డే నైట్ ఫీవర్' కేసెట్ వుంటే యివ్వు." అంది

ఉలిక్కిపడ్డాను వాట్! సుజనీకి సాటర్‌డే నైట్ ఫీవర్ కేసెట్ వుందని తెలుసా అసలు!

పారిస్ ఐ లవ్యూ పిక్చర్ కెళ్దామని నా ఫ్రెండ్స్ అంటున్నారు అవునూ! నా బోయ్ ఫ్రెండ్ గురించి నీకు తెలుసా?" అడిగింది సుజని

అమ్మో! భయంగా ఒకడుగు వెనక్కివేసాను

నిద్రలోంచి ఉలిక్కిపడి లేచిందండీ అప్పట్నుంచీ యిలా పిచ్చి పిచ్చిగా మాట్లాడుతోంది ఏడుస్తూ చెప్పారు జైనమ్మగారు.

ఆవిడకు 35 ఏళ్ళుంటాయి. భర్త పోయి ఏడేళ్ళవుతుంది. సోషల్ వర్కర్‌గా చేస్తూ, పవిత్రమైన జీవితం గడుపుతుంది. ఆవిడ మతాన్ని, సాంప్రదాయాన్ని చాలా గౌరవించే మనిషి. తన కూతురు కూడా అలా వుండాలని, అందరిలో మంచిగా, మన్ననగావుండి గౌరవం తెచ్చుకోవాలని ఆవిడ ఆకాంక్ష. అందుకే సుజనిని చాల కఠినంగా, పురాతన పద్ధతుల్లో పెంచుతుంది.

సుజని లేవగానే ఏ యే పనులు చేయాలో ఆవిడే చెబుతుంది. ఆడపిల్ల అణకువగా, మర్యాదగా, మెల్లని స్వరంతో మాట్లాడాలి. బిగ్గరగా నవ్వకూడదు. స్నేహితులు ఒకరో, యిద్దరో ఆవిడ ఎంపికచేసిన వారే వుండాలి. వేసుకునే బట్టలు కూడా ఆవిడే నిర్ణయిస్తుంది. ఏ పనిచేసినా తల్లి అనుమతి తీసుకోవాలి. రోజూ ప్రార్థనలు చేయాలి. ఆదివారం చర్చికి వెళ్ళితీరాలి. ఆమె చెప్పినట్లుకాక కాస్త అటూయిటూ అయినా నిర్దాక్షిణ్యంగా అన్నం, నీరు యివ్వకుండా . తలుపులువేసి బంధించి, శిక్షించేది.


అటువంటి సుజని తల్లి ముందు ఈ రోజిలా ప్రవర్తిస్తుంటే నమ్మలేకపోయాము. పెద్దగా కేక



విన్పిస్తే ఉలిక్కిపడ్డాను. సుజని టేబుల్ వెయిట్ తో వాళ్ళమ్మను కొట్టి తిడ్తోంది. ఈ గొడవకు అందరూలేచి చాల జనం పోగయ్యారు ఎవరో ఫోన్ చేస్తే డాక్టరు వచ్చి మత్తు ఇంజక్షన్ యిచ్చి, సుజనిని పడుకోబెట్టారు

డాక్టర్ రిపోర్టులో సుజని ఆరోగ్యం బాగుగానే వున్నదని సైకియాట్రిస్ట్‌కు చూపించమని తేల్చారు


ఇరుగుపొరుగు స్కూలులో పిల్లలందరు ఒకరకంగావుంటే తను యింకోరకంగా వుండాల్సివచ్చేది కాదని చెప్పే ధైర్యంలేదు స్కూల్లో పిల్లల హేళన భరించాల్సివచ్చేది తల్లి అంటే చిన్నప్పట్నుంచీ విపరీతమైన భయం చివరకు తేలిందేమిటంటే 'హిట్లర్‌లాంటి వాళ్ళమ్మ ఆంక్షలతో సుజనకి మతి చాంచల్యం కలిగిందని




## ప్రగతికి పట్టుకొమ్మలు

బాలలు జాతి ఔన్నత్యానికి మణిదీపికలు భావి ప్రగతికి పట్టుగొమ్మలు కాని పూలచెండ్లవలె ప్రకాశించవలసిన బాలలు లేబ్రాయంలోనే వాడి, మోడువారి పోతున్నారు ఆదిలోనే వారి భవిష్యత్తు అడుగంటిపోతోంది. అనేక దురాగతాలకు దుర్మార్గాలకు బలి అవుతున్నారు ఈ వైఖరి నుండి వారిని రక్షించి బాలల అభ్యున్నతికి పాటుపడే దృష్ట్యా కేవలం జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడ 'యునిసెఫ్' వంటి సంస్థలు కృషి చేస్తున్నాయి.

ఈ అత్యాచారాలకు కారణాల మాటకొస్తే అవి కోకొల్లలు. ముఖ్యంగా పేదరికం. పురుడులోనే పాలకు పాక పీకి పందిరేసే పిల్లల్ని మనం చూస్తున్నాము కుటుంబ నియంత్రణను పాటించక పోవటం



వల్ల, 'నారు పోసినవాడు నీరు పొయ్యడా' అనే కుళ్ళిన సాంప్రదాయాలను విడనందువల్ల జనన రేట్లు ఎక్కువై, అభివృద్ధి చెందిన వైద్య విధానం వల్ల మరణాల రేట్లు తగ్గి జనాభా అధికమై దేశ అభివృద్ధికి ఒక జటిల సమస్య అయింది పుట్టిన పిల్లలు పొట్ట గడవడం కోసం చిన్నతనంలో నే ఏదో ఒక పనికి పోవడం జరుగుతోంది చైల్డ్ లేబర్ చట్టరీత్యా నేరమయినా కడుపులో ఆకలి నేరాలను ఖాతరు చెయ్యడం లేదు అలా పనిలో చేరిన వీరు పనికి తగిన వేతనం పొందక వెట్టిచాకిరీతో పెట్టుబడిదారుల పద ఘట్టనల క్రింద నలిగిపోతున్నారు గ్లాస్, బాంగిల్స్, మందుగుండు ఫ్యాక్టరీలలో పనిచేసే పిల్లలు నిరంతరం మృత్యువు పొటపడడమో, వికలాంగులు కావడమో జరుగుతోంది. తల్లిదండ్రుల నిరాదరణకు గురయిన పిల్లలు వ్యభిచార గృహాల్లోను, మద్యపానశాలల్లోను డ్రమ్మతూ అనేక



నేరాలకు కారణభూతులగుచున్నారు నిర్బంధ ఉచిత విద్య అనాథ శరణాలయాల వంటి సంస్కరణలు ప్రభుత్వపరంగా సన్నగిల్లినందున బాలల ప్రగతి మరింత హీనమై పోయింది


రేపటి పౌరులై జాతి కీర్తిని ఇనుమడింపజేసే ఈనాటి బాలలపై జరిగే అత్యాచారాలను ఎదుర్కోడానికి ఇటు ప్రభుత్వం అటు ప్రైవేటు సంస్థలు ముందంజ వేయాలి ప్రతి కుటుంబం పరిమిత కుటుంబాన్ని పాటించాలి పిల్లల సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి బాలల పురోగతికి పాటుపడాలి ఇక ప్రభుత్వం బాలల సంస్కరణార్థమై అనేక సంక్షేమ చట్టాలను చేపట్టాలి నిర్బంధ ఉచిత విద్య జరగాలి •బాల నేరస్తులను శిక్షించడం మాని వృత్తి విద్యలలో శిక్షణనిచ్చే విధంగా జువెనెల్' కోర్టులు తీర్పులివ్వాలి సర్టిఫైడ్ స్కూల్స్, చిల్డ్రన్ హోమ్స్, బోర్స్టల్ స్కూల్స్, చిల్డ్రన్ వెల్ఫేర్ బోర్డులు బాలల పురోభివృద్ధికి కృషి చెయ్యాలి. చైల్డ్ వెల్ఫేర్ చట్టం బాగా అమలు జరిగి బాల కార్మికుల పట్ల అమానుషంగా వ్యవహరించే వారిని శిక్షించాలి.

ఈ ఏడాది జనవరి 15న మన కేంద్ర కార్మిక మంత్రి పి ఏ. సంగ్మా 'నేషనల్ చైల్డ్ లేబర్- పాలసీ'ని ప్రకటిస్తూ బాలల సంక్షేమానికి, పురోభివృద్ధికి కృషి జరగాలన్నారు అలా జరిగిననాడే మన పిల్లల తాత బాపూజీ, బాలల చాచా నెహ్రూజీగారి ఆశయాలు సిద్ధిస్తాయి. మన ఆశలు నెరవేరుతాయి.

-స్నేహమణి
గుండ్లూరు (కడప)

* * *

# పిల్లలు క్రమశిక్షణ



రవి వళ్ళు జ్వరంతో సలసల కాగిపోతున్నది మూలుగుతున్న రవి మధ్య మధ్య పెద్దగా ఏడవడం, కలవరించడం చూచి డాక్టరు అన్నాడు "బాబు బాగా భయపడినట్టున్నాడండీ అందుకే జ్వరమొచ్చింది ఇదిగో ఈ మందులు తెచ్చి వాడండి తగ్గి పోతుంది మందులు వ్రాసిన ప్రిస్క్రిప్షన్ రవి తండ్రి చేతికిచ్చి వెళ్లాడు డాక్టరు

చూశావా? పసివాడు వాడికేమి తెలుసు? నీ క్రమశిక్షణ కాదుగాని వాడిని చావబాదుతున్నావు. ఇంకెప్పుడూ యిలా చేయకు" మందలింపుగా అంటూ మందుల చీటీతో బయటకు నడిచాడు రవి తండ్రి

అవును తనెంత కఠినురాలు? తన చిన్నారితండ్రిని ఎలాకొట్టాను, వాడికి జ్వరం రావడానికి నిజంగా నేనే కారణం వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ రవి నుదుట తడిగుడ్డతో అద్దుతోంది రవి తల్లి.

రవి తల్లిలాంటి వాళ్ళు చాలా మంది తమ పిల్లలను క్రమశిక్షణతో పెంచాలన్న ధ్యేయంతో చీటికిమాటికీ చావబాదుతూ కసురుకుంటూ అనవసరంగా బయపెడుతూ వారి లేత మనసులను గాయపరుస్తుంటారు ప్రక్క వాళ్ళింట్లో యివ్వకుండానే బిస్కెట్ తిన్నాడనో వాళ్ళ యింట్లో వున్నబొమ్మే కావాలని ఏడిచాడనో లేక చుట్టాలింటికి వెళ్ళినప్పుడు ఏదో కావాలని పేచీపెట్టాడనో యిలా దేనికోదానికి పిల్లలపై కోపం తెచ్చుకుని కొడుతూవుండే తల్లులను మనం చూస్తూనేవుంటాము. అలా ఆ చిన్నారులను చావబాదినంతమాత్రాన వాళ్ళకు తాము చేసిన తప్పేమిటో ఎందుకు తమ తల్లి తమపై కోప్పడుతుందో తెలియదుకదా! పిల్లలు మనకు యిష్టంకాని రీతిలో ప్రవర్తించినపుడు చూసీచూడనట్టు హుందాగావుండి ఇంటికి వచ్చాక వారికి అలా చేయగూడదని నచ్చ చెప్పాలి అంతేగాని యిష్టంవచ్చినట్టు కొట్టి వారిని దారిలో పెట్టాలనుకొంటే ఒక్కోసారి అది బెడిసికొట్టి పిల్లలు మొండివారుగా మారినా ఆశ్చర్యపోనక్కరలేదు పిల్లలను మొదట విపరీతంగా భయపెట్టి వాళ్ళు యిళ్ళువదలి పారిపోయాక నిన్నేమీ అనము రా బాబూ అంటూ కనబడుటలేదు శీర్షికలతో మనం ఎన్నో ప్రకటనలను దినపత్రికలలో చూస్తూనేవుంటాము ఇంటికి తిరిగివచ్చిన ఆ పిల్లలు ప్రతిదానికీ తల్లి దండ్రులను బెదిరించడానికి అలవాటుపడిపోతున్నారు కనుక తల్లిదండ్రులు పిల్లల మనస్తత్వాన్ని అర్థంచేసుకుంటూ వాళ్ళలో క్రమశిక్షణకు మంచి అలవాట్లకు పునాది వేయాలి ప్రతిదానికీ దండనం దశగుణం బవేత్ అని దండననే అమలుచేయకుండా లాలించో బుజ్జగించో వాళ్లకి మంచి అలవాట్లు క్రమశిక్షణ నేర్పే ప్రయత్నం చేయాలి అలాగని పిల్లలకసలు భయం పెట్టకుండా వదిలేయమనికాదు వీలైనంత వరకు దండనజోలికి పోకుండానే మంచి మాటలతో వారిలో క్రమశిక్షణ పట్ల మంచిఅలవాట్లు అలవరచుకోవడం పట్ల శ్రద్ధపెరిగేలా ప్రయత్నం చేయాలి

–ఐ శారదా ప్రియదర్శిని,
ఇలపావులూరు(ప్రకాశం) □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చిన్నారి బాలల దీన గాథలు

రచన పంపిన వారి పేరు : ....................................................


పూర్తి చిరునామా : ....................................................

....................................................

....................................................

పిన్‌కోడ్ :

# సాంకేతిక నైపుణ్యంలో తమకు గల 34 సంవత్సరాల ఖ్యాతిపై హెచ్ ఎమ్ టి ప్రసరిస్తోన్న క్రొత్త కాంతి




హెచ్. ఎమ్. టి గడియారాలకు, ట్రాక్టర్లకు, యంత్ర పరికరాలకు, సి.ఎన్.సి. యంత్రాలకు నాణ్యతలో ఖచ్చితత్వంలో గల అంతర్జాతీయ ఖ్యాతికి హెచ్ ఎమ్ టి బల్బులు మరియు ట్యూబులు ప్రతిబింబాలు

హెచ్ ఎమ్ టి ల్యాంపులోని ప్రతి భాగమూ హెచ్ ఎమ్ టి వారే తయారు చేస్తారు ఇవి 75 అతి కరినమైన నాణ్యత పరీక్షలకు గురై మీ డబ్బుకు మరింత విలువ నిస్తాయి

అందుకే, హెచ్ ఎమ్ టి బల్బులు మరియు ట్యూబులను ఎన్నుకోండి అవి తమ పేరుకు తగ్గట్లు గా చిరకాలం మన్నుతాయి

hmt

బల్బులు
మరియు
ట్యూబులు

పటిష్ఠమైనవి విశ్వసనీయమైనవి

hmt
Lamps

మీ జీవితంలో వెలుగు.

MAA (S) HMT C2 TEL 87

# వ్యక్తిగతం

## రక్తబంధం కన్న రాజకీయమే మిన్న



రాజకీయాల ముందర రక్తబంధాలు నిలవవని ఇదివరకు చాలాసార్లు రుజువైనటువంటి విషయమే శ్రీ ఎస్.సి.శుక్లా విషయంలో మరోసారి రుజువవుతున్నది. శ్రీ శ్యామచరణ్ శుక్లా మధ్యప్రదేశ్‌కు మాజీ ముఖ్యమంత్రి. శ్రీ వి. సి. శుక్లాకు అన్న. ఆయన గత ఏడు సంవత్సరాలుగా కాంగ్రెస్ (ఐ) నుంచి దూరంగా ఉన్నారు. కాని ఇప్పుడు తమ్ముడు కాంగ్రెస్ (ఐ) నుంచి బైటపడి శ్రీ వి. పి. సింగ్‌తో చేతులు కలుపుతున్నాడని చూశాక ఆయన మళ్ళీ క్రియా శీలంగా కాంగ్రెస్ (ఐ)లో ప్రవేశించదలచుకున్నారు. ఈ వ్యవహారంలో శ్రీ ఉమాశంకర్ దీక్షిత్ మంతనాలు నడుపుతున్నారు. ఈ మధ్యనే శ్రీ ఎస్. సి. శుక్లా శ్రీ వి. పి. సింగ్‌ను విమర్శించడం, ఆయన సతీమణి శ్రీ రాజీవ్‌గాంధీని పొగడుతూ మాట్లాడడం చూస్తే ఈ వార్తలు నిజమేననిపిస్తున్నది. మొత్తానికి శుక్లా సోదరులలో ఎవరో ఒకరు కాంగ్రెస్ (ఐ)లో క్రియా శీలంగా ఉంటారన్న మాట.......

## నిందితులకు రాజలాంఛనాలు!



తమ శతఘ్నులను భారత దేశానికి అమ్మేందుకు లంచాలు చెల్లించారని స్వీడన్‌కు చెందిన ఎ. బి. బోఫోర్స్ సంస్థపై వచ్చిన ఆరోపణలకు జవాబు చెప్పుకోవడానికి ఆ సంస్థ అధ్యక్షుడు పెర్ ఓవ్ మోర్‌బెర్గ్ ఢిల్లీకి వచ్చారు. సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు లార్స్ గోత్లిన్ కూడా ఆయనతో పాటు వచ్చారు. ఒక నేరారోపణ చేయబడి, సంజాయిషీ ఇచ్చుకునేందుకు వచ్చిన మోర్‌బెర్గ్‌తో మామూలు నిందితుని లాగా కాక చాలా ముఖ్యమైన ప్రభుత్వ అతిథిగా ప్రభుత్వం వ్యవహరించింది. ఇంతా చేస్తే పార్లమెంటరీ సంఘం ముందర వాంగ్మూలంలో అనేక ప్రశ్నలకు ఆయన జవాబు చెప్పేందుకు నిరాకరించారు. వ్యాపార పరమైన రహస్యాలను కాపాడ వలసి ఉన్నదని తప్పించు కున్నారు. మొత్తానికి ఆయన అందజేసిన సమాచారంలో ముఖ్యమైనవి, లంచాలందిన మూడు కంపెనీల పేర్లు. లంచంగా ఇచ్చినది ఇదివరకు తెలిసిన దానికంటె చాలా ఎక్కువ....

## అదృశ్యమై తిరిగి వచ్చిన నిర్మలారావు!



దేశరాజధానీ నగరంలో రక్షణ దుర్లభ్య మనడానికి గతంలో ఆధారాలెన్నో ఉన్నాయి. ఇప్పుడు శ్రీమతి నిర్మలారావు అపహరణ ఇంకా భయానక మైన ఉదాహరణగా నిలుస్తుంది. ఆంతరంగిక వ్యవహారాల శాఖ మంత్రి బూటాసింగ్‌కు రక్షకదళంగా ఉన్నటువంటి నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా పని చేస్తున్న శ్రీ వి. పి. రావు భార్య శ్రీమతి నిర్మలారావు. ఆమె వయసు 35 సంవత్సరాలు. ముగ్గురు బిడ్డల తల్లి. సెప్టెంబర్ 16న ఆమె అదృశ్యమయింది. ఆ రోజే ఆమె భర్తకు ఫోన్ చేసి తనను పంజాబ్ తీవ్రవాదులు అపహరించుకు పోయారని చెప్పింది. సంభాషణ సగంలోనే ఫోన్ కట్ అయి పోయింది. రెండు రోజుల తర్వాత తిరిగి వచ్చి ఆమె ఆ మూడు రోజుల పాటు దుండగులు తనను మొదట ఢిల్లీలోని ఒక పెద్ద భవనానికి, తర్వాత మధురలో ఒక ఇంటికి తీసుకు వెళ్ళారని, మధుర నిర్బంధంలో ఒక స్త్రీ చేసిన సాయంతో బైట పడ్డానని చెప్పింది. ఈ కథనం నమ్మదగినదిగా లేదని పోలీసులు అంటున్నారు.....

## ఫోన్ ద్వారా పరిపాలన!



తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ ఎం. జి. రామచంద్రన్ ఆగస్ట్ మొదటి వారంలో వార్షిక చెకప్ కోసం అమెరికా వెళ్ళారు. గత సంవత్సరం ఆయన తమిళనాడులో లేనప్పుడు జరిగినట్టుగా ముఠా తగాదాలు ఇప్పుడు జరగడం లేదు. ఎందుకంటే వేల మైళ్ళ దూరం నుంచె ఆయన తమిళనాడు రాజకీయాల మీద ఒక కన్నేసి ఉంచారు. దాదాపు ప్రతి రోజూ ఆయన మద్రాసుకు ఫోన్ చేసి పరిస్థితి తెలుసుకుంటున్నారు. సలహాలు, సూచనలు ఇస్తున్నారు. పాలనా వ్యవహారాలలో మాత్రమే గాక జయంతి, వర్ధంతి సందేశాలకు కూడ ఆయన ఈ టెలిఫోన్ సంబంధాన్ని వాడుకుంటున్నారు. సెప్టెంబర్ 15న తిరిగిరావలసి ఉన్నప్పటికీ ఒక సారి ఆయన శ్రీమతికి జరిగిన శస్త్ర చికిత్స కారణంతో, మరోసారి మనుమరాలి పెళ్ళి కారణంతో ఆయన తిరుగు ప్రయాణం వాయిదా పడింది. "అమెరికా నుంచి మన ముఖ్యమంత్రి అతి చిన్న విషయాలతో సహా మొత్తం పాలన కొనసాగించ గలిగినప్పుడు మంత్రివర్గమంతా దండగ కాదా?" అని కొంతమంది అనుకుంటున్నారు. ఇంతకూ ఎం. జి. ఆర్. చెప్పినట్టుగా ప్రతిరోజూ ప్రచారమవుతున్న ఆదేశాలు ఆయనవి అవునో కాదో ఎవరికీ తెలియదు. ఆ విషయం తమని మాత్రం అడగవద్దని ఎ డి ఎం కె పార్లమెంటు సభ్యుడొకరు అన్నారట!......

## సారా దుకాణాలకు మంత్రిణి సమర్థన



కేరళలో మార్క్సిస్టు పార్టీ నాయకత్వాన ఉన్న ప్రభుత్వానికీ, ఆ పార్టీకే చెంది నటువంటి విద్యార్థి సంస్థ ఎస్. ఎఫ్. ఐ. కి మధ్య ఘర్షణ మొదలయింది. విద్యా సంస్థలకు, ప్రార్థనా మందిరాలకు దగ్గరలో సారాదుకాణాల ఏర్పాటుకు ఎక్సైజ కమిషనర్లకు అధికారం ఇస్తూ ప్రభుత్వం ఒక ఆదేశం జారీ చేసింది. ఆ ఆదేశానికి వ్యతిరేకంగా ఎస్. ఎఫ్. ఐ. ఆందోళన ప్రారంభిస్తే, ఎక్సైజ్, పరిశ్రమల మంత్రి శ్రీమతి కె. ఆర్. గౌరి అక్షర లక్షలు విలువ చేసే ప్రకటనలు చేశారు! సారా వ్యాపారంలో ఉన్న లక్షలాది మంది కార్మికులను ప్రభుత్వం పరిరక్షించవలసి ఉన్నదని, కొత్త ఆదేశాన్ని పాటించకపోతే కేరళలో ఒక్క సారా దుకాణం కూడా నడిచే పరిస్థితి ఉండదని ఆమె అన్నారు. మరి ఆ కార్మికులకు ప్రత్యామ్నాయ వృత్తి చూపడం మంచిదా? సారా దుకాణాలు కుప్పలుగా ఎక్కడ పడితే అక్కడ తెరచుకోవడానికి అనుమతి ఇవ్వడం మంచిదా? మార్క్సిస్టు మంత్రిణిగారికి ఈ ప్రశ్నలు తట్టనట్టులేదు...... □

# ఆనందబాష్పాలు

సూర్యప్రసాదరావు

"అన్నార్తులకు పిడికెడు బియ్యం వెయ్యండమ్మా!

కట్టు గుడ్డలేని సోదరులకు పాత చొక్కాలుంటే యివ్వమ్మా!

మీరేమి యిచ్చినా పుచ్చుకుంటాం ఓ పాత బనీను పాంట్ షర్ట్ లుంగీ చీర గౌను పిల్లల చొక్కా ఏదైనా సరే సంతోషంగా పుచ్చుకుంటాం

'ఏమీ లేదనుకుంటే మీరు యీపూటకు వండుకునే బియ్యంలో ఓపిడికెడు వెయ్యండి

భోం చేసి నాలుగు రోజులైంది కప్పుకోడానికి ఓ చీరలేదు ఓ చొక్కా లేదు దయచూపించండమ్మా

దైన్యం మూర్తీభవించిన గద్గదస్వరాలు విషాదం గూడు కట్టుకొన్న పరిశుభ్రమైన వదనాలు

అడుక్కొంటున్నది వారికోసం కాదని ప్రతీ ఒక్కరికీ తెలిసి పోతుంది , వారిని చూస్తుంటే ఖరీదైన దుస్తులు టక్ చేసిన షర్ట్‌లు పాలిష్ చేసిన బూట్లు పాలిఎస్టర్ చీరలు హైహీల్స్ చెప్పులు

వరద బాధితుల సహాయనిధికోసం ప్రతీగుమ్మం ముందు జాలిగా దీనంగా తామే వరద బాధితులమనే దైన్యంగా జోలి చాచి అడుగుతున్న వారంతా ఇరవై సంవత్సరాల లోపు వారే!

సూర్యుడు యింకా ఉదయించక ముందే ఆ గ్రామంలోకి అడుగు బెట్టారు సహాయ సేకరణా పథకం క్షణాల్లో సిద్ధమైంది ఇరవై మంది విద్యార్థులున్న ఆ బ్యాచీకి నలుగురు అధ్యాపకులు పర్య వేక్షకులు. ఆగ్రామంలోకి ప్రవేశించడం ఆలస్యం . మొట్ట మొదట ఆ అధ్యాపకులు ఆ గ్రామ ప్రముఖునివద్దకు వెళ్ళారు విషయం వివరించారు తమకు తోడుండవలసిందిగా అభ్యర్థించారు తమను గ్రామానికి పరిచయం చేయమన్నారు

అబ్బే! మాగ్రామంలో ఏమొస్తుందండీ మూడు సంవత్సరాల నుండీ పంటలు లేవు మేమే కరువులో ఉన్నాము మాకెవరైనా యిస్తే తీసుకుంటాం

అది నిజమే కావొచ్చుండీ! కానీ ఆ బాధితులకు పిడికెడు మెతుకులు లేవు కట్టుకోవడానికి గోచి తప్ప లేదు మనకున్న దానిలోనే మనం సాయం చేయవచ్చు ప్రతీ యింటి ముందు మా విద్యార్థులు 'బిచ్చ' మెత్తుతారు ఎంత వస్తే అంత తీసుకు వెళ్తాం మీరు 'ఊ' అనండి అదేచాలు మీరు మాతో వస్తే మరీ సంతోషం

నాకంత తీరిక ఎక్కడి దండీ పార్టీ మీటింగ్‌కు యింకో అరగంటలో హాజరవ్వాలి మీరు 'అడుక్కుంటామంటే' నాకు అభ్యంతరమేముంటుంది? మీ యిష్టం!

ఇంతలో లెక్చరర్ల శాంక్షన్ అందుకొని బయట వెయిట్ చేస్తున్న విద్యార్థులు బ్యానర్ గోనె సంచులతో సహా . లోపలికి వచ్చారు

మీ వంతు తృణమో పణమో మీరూ యివ్వండి

ఒరే రంగన్నా! అమ్మగారినడిగి పాత బట్టలుంటే తెచ్చి యివ్వు

బియ్యం ఏమయినాపెట్టండి

చెప్పాను గదా? మేమే కరువులో ఉన్నామని' త్రిబుల్ఫైవ్ సిగరెట్ అంటించాడా విలేజ్ వి ఐ పి

ఎంతో దూరం నుండి వచ్చిన వాళ్ళకు 'టీ' నీళ్ళయినా యిద్దామన్న సద్బుద్ధి కలుగ లేదు

రంగన్న యిచ్చిన పనికి రాని నాలుగు పాత బట్టల్ని తీసుకొని అగ్రామంలో కార్యక్రమానికి ఉపక్రమించారు

గ్రామంలోకి ప్రవేశించే ముందు టౌన్‌లో త్రాగిన టీ నీళ్ళే! యింకా ఆహారం లేదు క్రమేపీ సూర్యుడు నెత్తి మీద కొస్తున్నాడు క్రమంగా నిండుతున్న గోనె సంచులు

నాలుగు బ్యాచీలుగా విడిపోయి గ్రామం నలు మూలల్లో సేకరిస్తున్న విద్యార్థులు

చెమటకు బట్టలు తడిసిపోతున్నాయి ముఖాలు జిడ్డోడుతున్నాయి ఎఱ్ఱని ఎండలో ఎండ కన్నెరుగని కన్నెలు సైతం జాతీయ సేవ చేస్తున్నారు

కనిపించిన ప్రతీ మనిషికీ వరద సృష్టించిన బీభత్సం వివరిస్తున్నారు జరిగిన నష్టాల అంచనాలు చెబుతున్నారు అడ్రెస్‌ల ఆచూకీ అందని వాళ్ళ గురించి ఆలోచింప చేస్తున్నారు

పెదవి విరిచి వెళ్ళిపోయే వారు కొందరు

చెవులప్పగించి వినే వాళ్ళు కొందరు

'అయ్యో పాపం ఎంత అన్యాయం జరిగింది లిప్ సింపతీతో దాటి పోయేవారు కొందరు

ఒక్కక్షణం తటపటాయించకుండా తృణమో , పణమో . యిచ్చి వెళ్ళి పోయే వారు కొందరు

ద్రవీ భూత హృదయంతో వాళ్ళతో బాటు తాము కూడా కొన్ని యిళ్ళు తిరిగి తగిన సహాయం చేయమని' అర్థించేవారు కొందరు

విద్యార్థులు, విద్యార్థినులు అడిగే విధానానికి స్పందించే వాళ్ళే ఎక్కువ కొన్ని యిళ్ళు బియ్యం వేశాయి కొన్ని మిర్చియిచ్చాయి పప్పో చింతపండో తాము కలిగింది పెట్టక పోవడం లేదు పాతగుడ్డలతో బాటు క్రొత్త బట్టలు యిచ్చిన మధ్య తరగతి మందహాసులు సైతం లేక పోలేదు

క్రమేపీ గోనె సంచులు నిండుతున్నాయి

కానీ . తిరిగే వారి ఆకలీ దాహం తీరడం లేదు

కొంచెం దాహం యిప్పించండమ్మా ఓ డాబా యింటి ముందు అప్పటికీ ఓ విద్యార్థి అడిగాడు

చేయి వీలుకాదు వెళ్ళు తలుపు తెరవకుండానే సమాధానం

ఎలా విన్నారో, ప్రక్కనున్న పూరింటి నుండి ఓ చెంబుతో చల్లని నీరు గ్లాసులు దాహంతో నున్న వాళ్ళకు అమృతంలా వుంది ఆప్యాయంగా యివ్వబట్టేమో

ఇంతలో ఆ యింటావిడ బయటకు వచ్చింది

బాబూ! ఓ పది నిమిషాలు ఆ వేప చెట్టు క్రింద కూర్చోండి మంచం వేస్తాం కొంచెం టీ నీళ్ళతో గొంతు తడుపు కుందురుగాని

మీకెందుకమ్మా! అంత శ్రమ! మా దారిన మేం పోతాంలే!

ఫరవాలేదు బాబూ! మీరు శ్రమ పడడం లేదూ మాలాంటి వాళ్ళ కోసం. ఒక్క పది నిమిషాలు టీ తయారౌతుంది

చల్లని వేపచెట్టు నీడ ఐదు గంటల వారి శ్రమకు ఐదు నిమిషాల్లో మరువ చేసింది పదినిమిషాలు ఆట విడుపు యిష్టాగోష్ఠి!

టీ అద్భుతంగా ఉంది ఆప్యాయత ఆకులతో కాచింది గదా! వారి నుండి శలవు తీసుకొని మళ్ళీ కార్యక్రమం మొదలు పెట్టారు

సమయం ఒంటి గంట కావొస్తుంది

ఓ బ్యాచీకి సంబంధించిన విద్యార్థి రొప్పుతూ వస్తునాడు

ఏమయ్యా ఏమయింది?

అక్కడ . భోజనానికి అందరినీ రమ్మంటున్నారుసార్! వంటలు తయారైపోయాయి

'ముందు మీరేమయినా ఆర్డర్ యిచ్చారా

లేదుసార్! ఓ యింటి ముందు తొమ్మిది గంటలప్పుడు అడిగారు ' మీరెంత మందని' లెక్క చెప్పాను ఈ పూట మాయింట్లోనే అందరికీ భోజనం అన్నారు వంటలయిపోయాయి భోజనానికి రండి' అని కబురు

అన్ని బ్యాచీల వాళ్ళు అక్కడే కలుసుకున్నారు

మీరేమేమి సేకరించారంటే మీరేమేమి సంపాదించారంటూ ఉత్సాహంగా ప్రశ్నలూ సమాధానాలూ

ఆ గృహస్థు ఆహ్వానంతో అందరూ కాళ్ళు చేతులు కడుగు కొని యింట్లోకి ప్రవేశించారు

మట్టి గోడల మీద సున్నంపూత మట్టి నేల అయినా శుభ్రంగా అలికి ముగ్గులు పెట్టి వుంది ఇంటివారు ఒకటో రెండో . పీటలు వేయగలిగారు అందరూ నేల మీదే చదికిల బడి పోయారు.




విస్తరాకులలో వడ్డన జరిగిపోతోంది

పప్పు కూర పులుసు చారు ఆవకాయ పెరుగు భోజనం షడ్రసోపేతంగా వుంది

భోజనాలై పోవడంతో అందరూ ఆకులు ఎత్తివేయడానికి సిద్ధపడుతున్నారు

దయచేసి ఎవరూ ఆకులు తీయకండి వాటిని నేను ఎత్తించి వేస్తాను

ఇంటి యజమాని మాటలు అందరికీ ఆశ్చర్యం కలిగించాయి పల్లెల్లో యిలా జరగడం విశేషమే!

మా ఎంగిలాకులు మీరు తీసి వేయడం ఓ విద్యార్థి నసిగాడు

ఫరవాలేదు బాబూ! భోజనం చేసిన తరువాత ఆకులు తిన్న వారి చేత ఎత్తించి వేస్తే అన్నదాన ఫలం దక్కదు ఫలం గురించి కాకపోయినా మీ లాంటి వాళ్ళకు భోజనం పెట్టిన తృప్తి ఉండదు అందుకని దయచేసి ఎవరూ ఆకులు తీయకండి

అందరూ చేతులు కడుగుకొని సేదదీరేసరికి మరో అరగంట అయన ముకుళిత హస్తాలతో అందరికీ వీడ్కోలు చెప్పాడు

ఆ గ్రామస్తుల ఆప్యాయతకూ ఆదరణకూ చంద్రశేఖర్‌కు మొదటి సారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి

ఐదు గంటలకు కార్యక్రమం పూర్తయింది చుట్టు ప్రక్కల రెండు మూడు కిలో మీటర్ల పరిధిలో నాలుగు గ్రామాలున్నాయి ఆ గ్రామాల వివరాలు సేకరించడానికి అధ్యాపకులు వెహికల్స్ మీద బయలుదేరారు మిగిలిన విద్యార్థుల బాధ్యతంతా చంద్రశేఖర్‌కు అప్పచెప్పి

చంద్రశేఖర్ ఒక సామాన్య విద్యార్థి మధ్య తరగతి క్రిందిస్థాయి ఆర్థిక పరిస్థితి కష్టపడి పనిచేసే రకం ఏరకమైన కార్యక్రమమైనా చిత్తశుద్ధిగా అమలు పరిచేవాడు ప్రతీ విషయానికీ అతనేముందు అతని చొరవ చురుకుదనం యిట్టే పదిమందిని ఆకర్షిస్తుంది అడగక పోయినా అతనికే ప్రాధాన్యం యిస్తారు

లెక్చరర్లు సర్వే పూర్తి చేసుకొని తిరిగి వచ్చేసరికి

చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఓ విచిత్రమైన కార్యక్రమం అమలు జరిగింది

' సార్ మీరు అటు వెళ్ళగానే మేం మా దగ్గరున్న డబ్బాలకు కాగితాలు అతికించాం డబ్బా మూలో రూపాయి బిళ్ళ పట్టేంత రంధ్రం చేశాం

మన గ్రామం స్టేజీ యీరూట్‌లో అత్యంత కీలకమైంది యిక్కడ అన్ని బస్సులూ ఆగుతాయి ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో సహా

ప్రతీ బస్‌లోకీ భ్యాచీల వారీగా ఎక్కేవాళ్ళం ఎవరికి తోచిన డబ్బు వాళ్ళు వేసేవాళ్ళు

ఒకరు అర్ధరూపాయి వేస్తే మరొకరు రూపాయి

ఒకరు రెండు మరొకరు ఐదు పది రూపాయలు వేసిన వాళ్ళు కూడా ఉన్నారు

ఎవరయ్యా యీపథకం చెప్పింది?

ఇంకెవరు సార్! మన చంద్రశేఖర్

ఐదు గంటల నుండి ఎనిమిది గంటల వరకూ వ్యర్థమయ్యే కాలాన్ని యీ విధంగా మలిచి సహాయ సేకరణ చేసి నందుకు అనేక అభినంధనలు

ఆ చీకటిలోనే రోడ్ ప్రక్కనే టార్చ్‌లైట్ వెలుగులో డబ్బాలు తెరిచి లెక్క పెడిత మూడు వందల రూపాయలు గంటకు వంద! అప్పటి ప్పుడు కవర్లలో పెట్టి వాటిని సీల్ చేసి సంతకాలు తీసుకున్నారు

జాతీయ సేవా శిబిర స్థలం నిర్జ్యయమై పోయింది భారీ ఎత్తున సేకరించిన బియ్యం, పప్పు, చింతపండు, పాత దుస్తులు, విరాళాలతో కొన్ని దుస్తులు, గ్లాసులు, కంచాలు, గిన్నెలతో మూడు లారీలు బయలు దేరాయి పదిమంది లెక్చరర్లు, నూట యాభై మంది విద్యార్థులు వాళ్ళలో చంద్రశేఖర్ ఉంటాడన్నది జగమెరిగిన సత్యం!

వరద తాకిడికి గురియైన 'గౌరీనాధపురం' లారీలు చేరుకున్నాయి రోడ్డు ప్రక్కన నున్న ఆ గ్రామానికి అప్పటికే అధికార అనధికారులు సహాయం

# ఆనంద బాష్పాలు

అందజేస్తున్నారు వరదలాగా అందరి సహాయం ఆగ్రామాన్నే ముంచెత్తుతోంది

అందరినీ లారీలు దిగవద్దని ఆదేశించి చంద్రశేఖర్, మరో విద్యార్థితో లెక్చరర్లు ఆ గ్రామం లోకి ప్రవేశించారు

తమ ననుసరించిన గ్రామ పెద్దలు జరిగిన నష్టాలను ప్రత్యక్షంగా వివరిస్తున్నారు గ్రామం మొదటే జనం కనిపించింది మోకాలి లోతు విస్తరించిన బురదతో గ్రామ వీధులు ఓ ప్రక్క జనం నడవడం చేత ఏర్పడిన కాలిబాట నింగిని చూచే ఎలక్ట్రిక్ స్తంభాలు కొన్ని భూమిని ముద్దు పెట్టుకునే ప్రయత్నంలో సఫలీకృతం చెందాయి నేల మీద పారాడుతున్న కరెంట్ తీగలు బలహీన మైన చెట్లన్నీ కూలిపోయాయి నేలమట్టమయిన పూరిళ్ళు

పదిమంది సైతం అతికష్టం మీద ఎత్తగలిగే ఓ చెట్టు మాను అలవోకగా వరదలో కొట్టుకు వచ్చి ఓ పెంకుటింటి కప్పు ఎక్కి కూర్చుంది మరో పెంకుటిల్లు తన మీద పూరి గుడిసె కప్పు కప్పుకొంది. బలమైన చెట్లపై కొమ్మల మధ్య దాచుకున్న గ్రామస్తుల సామాన్లు నీటిలో మునిగి పోవడం చేత పూర్తిగా మాడిపోయిన చెట్లు చెట్ల కొమ్మల చివర మిఠాయి పొట్లాల్లా వ్రేళ్లాడుతున్న గడ్డి పరకలూ భూమ్మీద కుప్పలు పోసిన గడ్డి కుప్పలు నింగి కెగిరి కరెంట్ తీగలు యిళ్ళకప్పులూ అందుకున్నాయి

వీధిలోకి కొట్టుకొచ్చి కుళ్ళు వాసన కొడుతున్న మిర్చి బస్తాలు ధాన్యం బస్తాలు ఎన్నో దినసంబరాల మూటలు

ప్రకృతి సృష్టించి వెళ్ళిపోయిన ఆ భయానక బీభత్స దృశ్యం చంద్రశేఖర్ గుండెను కలచి వేసింది ఊరి చివరి వరకూ వెళ్ళి వచ్చారు ఊరికి దూరంగా రెండు కిలో మీటర్ల దూరంలో పిల్ల కాలువలా నెమ్మదిగా ఒదిగొదిగి ఏమీ తెలియని అమాయకురాలిలా గోదావరి దానిని చూస్తోంటే యింత బీబత్సాన్ని సృష్టించింది. యీగోదావరేనా అని అనుమాన మొస్తుంది

తమతో బాటు వచ్చిన ఆ వూరి పెద్దలు సలహా యిచ్చారు

బాబూ! రోడ్డు ప్రక్క గ్రామ మవడం చేత అందరూ యీ ఊరికే సహాయం చేస్తున్నారు అందరూ యిక్కడకే వస్తున్నారు దూరంగా పది హేను కిలో మీటర్ల దూరంలో గంగాదరపురం వుంది ఇంతవరకూ ఒక్కరూ అక్కడకు వెళ్ళలేదు పదమూడు కిలో మీటర్లు నడిచి వెళ్ళాలి మోకాలి లోతు బురద! మీరు అక్కడకు వెళ్తే వాళ్ళను ఆకలి బాదల నుండి విముక్తులను చేసిన వాళ్ళవుతారు

అంతదూరం వెళ్ళగలుగుతామా సందేహం కలిగింది

ఆలోచించుదాం లారీలు వదలి పెట్టిన ప్రదేశానికి తిరిగి వస్తున్నారు

మాకు యివ్వకుండా తిరిగి వెళ్తారో ? నా కొడకల్లారా అంటున్నాడు ఒకడు ఎదురుపడి

'పోనీరా వీళ్ళిమన్నా మనకు సంవత్సరమంతా పెడతారా ప్రక్కవాడు అన్నాడు

"పెట్టినా పెట్టక పోయినా, నాయాల్ది యిక్కడ ఆగిన సరుకు యిక్కడ దిగాల్సిందే' త్రాగి వదరుతున్న వాళ్ళను చూచి గ్రామపెద్దలన్నారు

ఇదండీ వరస! ఎవరో ఒకళ్ళు రోజూ ఏదో యిస్తూనే వున్నారు ఇచ్చిన రెండు కిలోల బియ్యంలో ఓకిలో అమ్ముకుంటాడు దానితో ఓ వంద పుచ్చుకుంటాడు అదీ వాడి పని

అందరూ యిలాగే తయారయ్యారా

దాదాపు మెజారిటీ యింతే బాబూ!

అయితే మమ్మల్నిపుడేం చేయ మంటారు?

తక్షణం గంగాధరపురం వెళ్ళి పోవడమే సర్ చంద్రశేఖర్ సమాదానం చెప్పాడు


మరుక్షణంలో లారీలు గంగాధరపురం వైపు సాగిపోయాయి

నాలుగు కిలో మీటర్ల దూరంలో గెస్ట్‌హౌస్ అక్కడి నుండి అందరూ కాళ్ళకు బుద్ధి చెప్పాల్సిందే సూర్యుడు మెల్లగా పశ్చిమానికి జారి పోతున్నాడు సామాన్లన్నిటినీ గెస్ట్ హౌస్‌లో దింపి లారీలు వెనుకకు మరలాయి ఆరాత్రికి అక్కడే విశ్రాంతి

భోజనాలయ్యాయి కొన్ని గంటలు ఆటవిడుపు

మరునాడు ఉదయం తొమ్మిది గంటలు! నలుగురు లెక్చరర్లు మరో యిద్దరు విద్యార్థులతో గంగాదరపురం బయలుదేరారు సర్వే చేయడానికి!

గౌరీనాధపురంలో హెచ్చరికలన్నీ బాగా జ్ఞాపకం ఉన్నాయి ఏడుగురూ పాంటులు విప్పి లుంగీలు కట్టారు బాగ్ బాగేజీలు చంకన బెట్టారు తలా ఒక పొడవాటి గడను సంపాదించారు అక్కడ నుండే మొదలు ఎగుడు దిగుడులూ గుట్టలూ!



ఇరుప్రక్కలా దట్టమైన అడవి మోకాలి లోతు బురద! ప్రక్కన సన్నగా కాలిబాట

కొంత దూరం పోయేసరికి కాలి బాట కూడా అదృశ్యమై పోయింది ఇక బురద నుండే వెళ్ళాలి ముందుగా చంద్రశేఖర్ దారి తీశాడు గడను బురదలోకి దించాడు లోతు ఎక్కడ తక్కువ వున్నదీ తెలుసుకోవడానికి తక్కువ లోతు ప్రదేశంలో కాలు మోపాడు అడుగులు కొలుచుకుంటూ నడక సాగించాడు సరదాగా కబుర్లు చెప్తూ సాగిపోయే వాళ్ళకు పెద్దకష్టం అనిపించ, లేదు ఆ పదమూడు కిలో మీటర్ల బురద యాదడాన్కి!

గంగాధరపురం కనుచూపు మేరలో కొచ్చింది వరదకు గురియైన ప్రాంతాల ప్రజలంతా అక్కడే తల దాచుకుంటున్నారు దాదాపు పది వేల మంది పాకలు పందిళ్ళతో కాలక్షేపం టేకు చెట్లు ఎక్కువగా పెరిగే ఆ ప్రాంతంలో ఆ చెట్ల ఆకులే వారి యింటి కప్పులు

చంద్రశేఖర్ తనను తాను నమ్మలేకపోయాడు ఎక్కువ భాగం అక్కడకు వలస వచ్చిన వాళ్ళంతా గిరిజనులు శరీరం మీద గోచీ తప్ప అచ్చాదన లేని అమాయకులు నాగరికత కొద్ది కొద్దిగా విస్తరించడం చేత అక్కడ వరి సాగు జరుగుతుంది పుగాకు . వరి మిర్చి యివీ వాళ్ళ పంటలు ఎత్తైన ప్రదేశమవడం చేత పూర్తిగా ముంపుకు గురికాలేదు పక్కా యిళ్ళు ఐదో పదో ఉంటాయి

# చెల్లీ! దీపం వెలిగించు

చీకటి కడుపును చించే చిరుదీపం నీ ముంగిట
నిర్భయముగ వెలిగించు నిర్మలాత్రంతో చెల్లీ!

నీ దీపం మాతృకగా నిఖిల ప్రపంచాన కోట్ల
పుత్రిక లుదయించాలి పుడమి కడుపు చల్లగా

మలినాత్ములు రణదాహులు వెలిగించిన దీపాలతో
పుడమి తల్లి మేన కాక పుట్టి ఉడికి పోతున్నది

చెల్లీ! నీలా నిర్మల చిత్తులు కావాలి ప్రజలు
వెలిగించే దీపావళి వేడుక కూర్చాలి ధరకు

పుడమితల్లి కాళతీరి పులకరించి నవ్వుతుంది
ఆ నవ్వుల తెలివెన్నెల అక్షయమై నిలుస్తుంది

—సూర్యదేవర రవికుమార్

ఓ పందిరి క్రింద వాళ్ళకు ఆశ్రయం దొరికింది పైన టేకు ఆకుల కప్పు మూడు మంచాలతో అధ్వన్న కావాలి ఆ రాత్రికి ఆ గ్రామస్థులదే ఆతిథ్యం.

అందరూ నిద్రపోయినా . చంద్రశేఖర్‌కు నిద్ర పట్టలేదు ఆ ఊరిలో చూచిన పరిస్థితులు అతని ఆలోచనలు గోచీలు తప్పితే లేని దుస్తులు సూర్యచంద్రుల కాంతితో నిత్యకాపురం పెలి కాప్పర్‌లు జార విడిచే పాట్లాల మీద జీవనం కడుపు నిండా తిని ఎంత కాలమైందో చంద్రుని కోసం ఎదురు చూచే చకోర పక్షులు స్వాతి చినుకు కోసం నిరీక్షించే ముత్యపు చిప్పలూ క్షణకాలం జ్ఞాపకం వచ్చాయి అన్నం మెతుకుల కోసం ఆ అభాగ్యుల ఎదురు చూపులకు

ఎపుడు నిద్ర పట్టిందో సూర్యుని కిరణాలు తట్టి లేపడం ఆలస్యం చంద్రశేఖర్ ఒక్కడే రెండెడ్ల బళ్ళను మాట్లాడుకొని గెస్ట్ హవుస్ చేరుకున్నాడు

భోజనాలయాయనిపించి సమీకరించిన సహాయాన్ని బళ్ళకెత్తించాడు అందరు కూడా ఎన్నో ఆటంకాలు

బండికి అరవైరూపాయలివ్వండి

మేము తెచ్చినవన్నీ మీ గ్రామస్థులకు పంచడానికేనయ్యా

అయితే మాత్రం మేము బండిని ఊరికే ఎందుకు తోలాలి


మీ గురించే గదయ్యా మేమంతా కష్టపడేది

మా పొట్ట కూటికి మేం కష్టపడొద్దా బాబూ!

అరవైరూపాయలంటే చాలా ఎక్కువ అంత డబ్బు కూడా లేదు

'పోనీ డబ్బు లేకపోతే బియ్యం కొలిచి యివ్వండి '

# ఈ వేమన పద్యాలు




కడలిజూడ నలయి కడుచోద్యమై యుండు
మనసు జూడ భ్రమలు మతిగి యుండు
పరము జూడ మనసు పడుపాటు దట్టురా
విశ్వదాభిరామ వినుర వేమ

ఇక తప్పదనిపించింది సరేనని సామాన్లు బళ్ళ కెత్తించారు - బళ్ళు బయలుదేరాయి త్రోవ ఎలాంటిదో తెలిసింది చంద్రశేఖర్‌కే కనుక అతనే ముందు నడుస్తున్నాడు

మధ్యలో నడుం, వరకూ వచ్చే బురద! మనుషులైతే ప్రక్కదారిన వెళ్తారు గానీ బళ్ళు అదీ బరువున్న సామానులున్న బళ్ళు

అంత లోతు గుంటలోంచి బళ్ళను నెట్టందే బళ్ళు పైకి వెళ్ళవు. యువశక్తి ముందుకు అడుగు వేసింది 'దానికి చైతన్యం కలిపించింది చంద్రశేఖర్ అంత లోతును కూడా బళ్ళు సునాయాసంగా అధిగమించాయి

దారిలో మోకాలి లోతు ఏరు హాయిగా అందులో

## ఆనందబాష్పాలు

కాళ్ళు, చేతులూ మొహం కడుక్కున్నారు చుట్టూ పచ్చని ప్రకృతి కల్తీలేని ఆహ్లాదకరమైన గాలి వారి శ్రమదానానికి వింజామరలు వీస్తోంది సూర్యుడు పశ్చిమానికి చేరే సమయానికి బళ్ళు గంగాధరపురం చేరుకున్నాయి

టెంట్లు వేయడం పెట్రోమాక్స్ లైట్లు వెలగడం వంటలు తయారవడం క్షణాల్లో జరిగిపోయాయి

'నిద్ర సుఖం ఎరుగదనే' సామెత నిజమైంది అలసిపోయిన అందరికీ కళ్ళు తెరిచే సరికి తూర్పు తెలతెలవారుతోంది

కూలి పోకుండా మిగిలిన ఓ పెంకుటింటిని ఆశ్రమంగా చేసుకున్నారు

ధాన్య వస్త్ర దాన కార్యక్రమం మొదలైంది

ఆ గ్రామ ముఖ్యునిచే కార్యక్రమం ప్రారంభం చేయబడింది

బారులు తీరి నిలుచున్న గోచీలు ఒక ప్రక్క

చిరికి పోయిన చీరల బారు మరొక ప్రక్క చిన్న చిన్న గోచీలూ చిన్న నగ్నదేహాలూ మరో ప్రక్క అందరూ క్యూలో ఉండేటట్లు చూచే బాధ్యత వలంటీర్లది

ముచ్చటగా మూడు క్యూలు ముంచు కొచ్చిన ఆపద నుండి కొంచెం సేద దీరడాన్కి! ముంచిన గోదావరి బాధల నుండి ఓ దరి చేరడాన్కి!!

బస్తాలు తెరవబడ్డాయి ఐదు కిలోలు సరిపోయే రెండు గిన్నెలు ఎంచబడ్డాయి గ్రామ పెద్దల సహకారంతో కుటుంబాల వారీగా క్యూలో జనం విభజింపబడ్డారు

ఆడవాళ్ళ క్యూలో బియ్యం చీరె అన్నం వండుకునే గిన్నె

మగవాళ్ళ క్యూలో ఓ ధోవతి పళ్ళెం గ్లాసు చింతపండు వగైరా సంభారాలు

చిన్నపిల్లల క్యూలో సేకరించిన చిన్నపిల్లల దుస్తులు వారి కోసం కొన్న బిస్కెట్లు

నెమ్మదిగా క్యూలు జరుగుతున్నాయి అందుకున్న ఐదు కిలోల బియ్యానికి అయిదు రెట్ల ఆనందం చీరా ధోవతులు మిగిలిన వానికి నూటికి రెండు వందల శాతం సంతోషం అందరి ముఖాలలో ముప్పిరి గొనడం చంద్రశేఖర్‌కు కనిపించింది

ఎంత సల్లని చేతులు బాబూ? మీరొక్కరే యిన్నాళ్ళకు మాకు కడుపు నిండా బువ్వెడు తున్నారు

ఎంత సల్లని సూపులు బాబూ! కప్పుకోడానికి ఓ చీర యిచ్చారు

ఎంత సల్లని మనసులు బాబూ! గిన్నె, కంచం యిచ్చారు

ఎంత సల్లని మధుసులు బాబూ! మా మీన యింత జాలి సూపిస్తున్నారు

మీరు మడుసులు కాదు బాబూ! మీ కడుపున పుట్టినా మీ ఋణం తీర్చుకోలేము

ముకుళించిన ఎండిపోయిన హస్తాలు ఓ వైపు

దగ్గరకు చేరిన రెండు పగిలిపోయిన గాజుల చేతులు ఓ వైపు

నమస్కరిస్తోన్న చిన్నారి చేతులో వైపు

పేరు పేరునా వీడ్కోలు తీసుకొంటుంటే

తడి ఆరిపోయిన ఆ కాళ్ళల్లో అనాలోచితంగా ఆవరించిన చెమ్మను చూస్తోంటే చంద్రశేఖర్ కళ్ళ వెంట గిర్రున నీళ్ళు తిరిగాయి!

చెక్కిళ్ళ మీద నుండి జారబోయే ఆ నీటి బిందువులను అతడు తుడుచుకోలేదు

అవి అమూల్యమైన ఆనంద బాష్పాలు! ఆణి ముత్యాలు!!

**అంకితం :మా శీలం సిద్ధారెడ్డి అండ్ జ్యోతి కళాశాల జాతీయ సేవకులకు!** □

# వారఫలం

## 23-10-1987 శుక్రవారం నుండి 29-10-1987 గురువారం వరకు

★ **మేషం** దూరబారాల నుండి మిత్రులు యిల్లు చేరగలరు వ్యాపారరీత్యా అనుకూల సమయం జాయింటు వ్యాపారమైనా సుగమంగా జరుగుతుంది దన వసతి ఏర్పడుతుంది అనుకూల మిత్రులు చేరుతారు స్త్రీలకు కళారంగాన మేలు ఉద్యోగాన మెరుగు

★ **వృషభం** సుఖశాంతులు, ఉద్యోగరీత్యా అనుకూలం ధనరీత్యా అనుకూలం అలా యిలా తిరుగుతూ వస్తువులు పోగొట్టుకుంటారు జాగ్రత్తగా ఉండాలి ఉత్తరాల మూలంగా అనేక విషయాలు గ్రహిస్తారు స్త్రీలకు నగలు కొనుగోలు చేయటానికి వాహనం సమకూర్చుకొనుటకు మేలైన వారం

★ **మిదునం** వారఫలం ఉత్తమం, అంటే 'అర్థం డబ్బురీత్యా యిబ్బంది లేదు జరుగవలసిన పనులు సానుకూలం కాగలవని వృత్తియందు వికాసమున్నదని, కార్యానుకూలత గలదని కోర్టు' వ్యవహారాలున్నా బాధకరాలు కావని బావం స్త్రీలకు: శుబ ప్రస్తావనలు ఆరోగ్యరీత్యా అనుకూలం బంధు సమాగమానికి ఆస్కార సమయం

★ **కర్కాటకం** వారమంతా మీకు అనుకూలమే అంటే ధన విషయంగా ఎలాంటి లోటు లేదని యిప్పట్లో రాదని గ్రహించాలి వయసు మీరిన వారు ఆరోగ్యరీత్యా జాగ్రత్త పడవలసిన అగత్యం ఉన్నది ఈ రాశి స్త్రీలకు, ఆరోగ్య బంగమే కాక కొందరకు శస్త్ర చికిత్సా బయం' కూడ రావచ్చు స్త్రీలకు కుటుంబానందం, వృత్తిరీత్యా అనుకూలం వస్తు సేకరణకు అవకాశం స్వల్పాదాయం గల వారం

★ **సింహం** చేసిన ప్రయత్నాలు చాలుననిపిస్తుంది రాజకీయవాదులు చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోతారు వ్యాపారం కొనసాగించటం న్యాయం లాబదాయకం రచనా రంగాన మీకు అనుబవమున్నా కళా వ్యాసంగాన పరిచయమున్నా లాభించే సమయం స్త్రీలకు: చుట్టు ప్రక్కల గొడవలు రావచ్చు, గ్రహించండి

★ **కన్య** శని గురు, రవి గ్రహానుకూల కాలం వారం వారం అనుకూలంగా ధనాదాయకంగా, మిత్ర వర్గదాయకంగా ఉండటం గ్రహించగలరు విదేశాల నుండి బంధువర్గమో మిత్ర వర్గమో రానున్నది కళారంగాన అనుకూల మార్పు కొందరకు రానున్నది.

స్త్రీలకు శుబ వార్తా శ్రవణం వృత్తియందనుకూలం

★ **తుల** ధనధాన్య వస్తు వసతికి అనుకూల కాలం మధ్య వయస్కులకు మరీ బాగుండనున్నదని గ్రహించాలి వ్యవహారరీత్యా అనుకూలం ఉద్యోగమందు కొందరు 'ప్రమోషన్' ఆశించే అవకాశం గల వారం స్త్రీలకు సుబా మర్యాద, పత్రికానుకూల సమయం

★ **వృశ్చికం** ప్రయాణాలు సాగించినా అబీష్టం నెరవేరదు కృషియందు శ్రద్ధాసక్తులు చూపవలసిన సమయం గ్రహబలం అనుకూలం కానప్పుడు ఎవరేం చేస్తారు ఏ పనులు సాధింపబడతాయి ఏ అవకాశం లభిస్తుంది స్త్రీలకు దనాదాయం ఆశింప వీలు లేదు కృషియందు రాణింపు గలదన వీలుకాదు శాంతం భూషణం

★ **ధనుస్సు** రాజకీయరంగాన మేలు సమకూడదు వృధా యత్నాల వలన ఎలాంటి లాభం రాదు ప్రయాణాలకు అనుకూలం గాదు గనులందు 'ఫాక్టరీ' లందు కృషి చేసే వారికి అనుకూలం చిత్ర నిర్మాతలు ధైర్యం చేయదగిన సమయం గాదు స్త్రీలకు: కృషియందు రాణింపు లేదు అనుకున్న విధంగా డబ్బు అందిరాదు

★ **మకరం** శనిగ్రహం మిమ్ము ఆశీర్వదించ నున్నాడు లాబ స్థానమందలి అనుకూలత అనందదాయకం ఉద్యోగరీత్యా మేలైనసమయం వస్తు వాహన సేకరణకు అనుకూలమున్నది విశిష్టాదరణ సమయం ఉపక్రమించే పనులకు నిరాటంకంగా సాగిపోండి స్త్రీలకు: ఉత్తముల స్నేహం రాజకీయానందానికి అవకాశం

★ **కుంభం** వ్యాపారరీత్యా మేలైన వారం రచనా రంగాన మేలున్నది మాటకు విలువ చేకూరుతుంది సభా గౌరవం కొందరకు పత్రికా ఖ్యాతి కొందరకు లభించుటకు అవకాశమున్నది శుభానుకూల సమయం స్త్రీలకు రాజకీయంగా అనుకూలం ఉద్యోగరీత్యా కొందరు ప్రమోషన్ ఆశించవచ్చు

★ **మీనం** అనుకూల వారం 'రాహు గురువులు' సహాయపడనున్నారు గ్రహాశీస్సులున్నాయి అంటే దైవబలం గలదని అర్థం నూతన వస్తు సేకరణకు, సినీరంగాన ప్రసిద్ధి నందుటకు అవకాశం గల వారం స్త్రీలకు: సకల విధాలా మేలే బంధుమిత్ర సహాయం, 28 29 తా లందు ధనాదాయం

**విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి**






### కార్టూన్లు పంపేవారికి మనవి

కార్టూన్లతోపాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరు పెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ–3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6 నుంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, నేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు ఉండదు కార్టూన్లు 'టపా'లో పోయినా, దారి తప్పిపోయినా సంపాదకుని బాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్లు పంపేవారు కవరుమీద ఆ సంచిక పేరు ఉదహరించాలి. ఈ కార్టూన్లకి కూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

—సం.

# నిత్య నూతన సీరియల్




(గతసంచిక తరువాయి)

మరల సంవత్సరము తిరిగి వచ్చెను పురపాలక సంఘము ఎన్నికలు జరిగెను ఎన్నికలు వ్యాది వంటివి ఒకటి వ్యాధి వచ్చిన మరొకని కే చికిత్స చేయించిరో రెండవవాడు వానిని విచారించి అదే చికిత్స చేయించుకొనును బెజవాడ గుంటూరు మొదలైన పట్టణముల నీ యెన్నికలు సందర్భము లన్నియు చంద్రారెడ్డి ప్రభృతులిరుంగుదురు ఛంద్రారెడ్డికి ప్రత్యర్థిగా రామేశ్వరము నిలువబడెను ఎన్నికలు పది రోజులున్నవనగనే ప్రతి యింటికిని పోయి ముప్పురును బీద విద్యార్థులు వారము చెప్పుకొనునట్లు చెప్పుకొని వచ్చిరి ఎన్నికలు నాల్గు రోజులున్నవనగా రెడ్డియు రామేశ్వరముగారును మోటారుల మీద తిరిగిన వారు తిరిగినట్లే యుండిరి జమీందారుగారికి రామేశ్వరముగారు గెలువవలయునని ఉన్నది గ్రామములో పురపాలక సంఘముతో మార్పు వచ్చినది కోటకు మునుపున్న గౌరవము లేదు జనులందరును దాము పూర్వము జమీందారునకు ఆశ్రితుల మనుకొనుచుండిరి పురపాలక సంఘము వచ్చినంతనే జనులు స్వతంత్రుల మైతిమనుకొని చంద్రారెడ్డినే ఎక్కువ గౌరవించుచుండిరి అందు చేత తన పెద తల్లి కొడుకే తదధ్యక్షుడైనచో జమీందారీ గౌరవము మరి కొంత నిలుచును అందుచేత ఎట్లయినను రామేశ్వరమును గెలిపించవలయునని ఒకనాడు రాత్రి పేట పేటకు స్వయముగా పోయి ప్రతి యింటను జెప్పి వచ్చెను జమీందారు తమ యిండ్లు కిట్లు వచ్చుట ప్రజలందరుకు ఏదో పెద్ద గౌరవము జరిగినట్లుండి రామేశ్వరము నెడల సదభిప్రాయము చాల మందికి లేకపోయినను నతనికేయిచ్చుటకు నిశ్చయించిరి

చంద్రారెడ్డి చూచెను తనకు పరాజయము నిశ్చయమన్నట్లు తోచెను గొంగళిలో తినుచు వెంట్రుకలు లెక్క పెట్టుకొనుటయేల అన్నట్లు ఎన్నికల కెక్కనే రాదు ఎక్కిన తరువాత జయమునకు కావలసిన సర్వ ప్రయత్నములను చేయనే వలయును వెనుదీయరాదు చంద్రారెడ్డి చక్కని మేధావి ఓటునకు ఎన్ని రూపాయలయినను వెచ్చింప నిశ్చయించెను కూలి నాలి చేసికొని బ్రతుకు వారికి కొంత సాహాయ్యము చేసినట్లు లగును అధ్యక్షతయున్న మృగతృష్ణికా ప్రవాహమునకై పరుగెత్తుచున్న రెడ్డికి సదసత్తులు లాబ నష్టములు తెలియలేదు అట్లే అని పది వేల రూపాయలు క్రుమ్మరించెను నాల్గవ నాడు చంద్రారెడ్డియే యెన్నుకొనబడెను రామేశ్వరము తనకది పరాబవముగా తలంచి, రెడ్డి తనకు విరోధిగా భావించి అతనితో మాటాడుట మానివేసెను మరల కొన్నాళ్ళలో అద్యక్షుని ఎన్నికలు జరిగెను చంద్రారెడ్డి మరల పది వేలు క్రుమ్మరించెను

క్రిష్టముసు పండుగలు వచ్చెను శశిని రంగారావులు చెన్నపురి చేరిరి చెన్నపురిలో ఈ జమీందారు కొన్న పెద్ద సౌధము నానుకొని కొన్ని ఎకరముల స్థలము నెరాబా అమ్మకమునకు రాగా గడిచిన యేడు రంగారావుగారు దానిని లక్ష రూపాయలిచ్చి కొనెను చాల చవుకగా వచ్చినది ఆ స్థలములో చావడులు వేయించి గుఱ్ఱములను పెంచుచుండెను గుఱ్ఱములు రాజరీవి నెరపుటకు కాదు గిండీ పందెముల కొరకు గుఱ్ఱముల మీద లక్ష రూపాయలు వ్యయము చేసెను అరేబియా నుండి యేబది వేల ఖైదు గుఱ్ఱములను గొని నాలుగు వేలు బజానా యిచ్చి తెప్పించెను అవి చెన్నపురి హార్బరులోనికి వచ్చెను ఆ సంగతి రాచరికము వారికి తెలిసెను వారు దానిని నిషేధించిరి రంగారావుగారు తన బజానా వదలుకొని గుఱ్ఱములను సొంత ఖర్చుల మీద అరేబియా చేర్చవలసి వచ్చెను గిండీ పందెములకు పది ఇంగ్లీషు గుఱ్ఱములను గొని సాకించెను సాకు వాడు ఒక యాంగ్లేయుడు అతనికి పందెములు నాలుగు నెలలున్న వనగా నాలుగు నెలలు నాల్గు రెండు వేల జీతమిచ్చి ఉంచుకొనవలెను మొదటి సంవత్సరము రంగారావుగారికి గిండీ పందెములలో రెండు లక్షలు లాబము వచ్చెను అయన చాల సంతోషించెను

శశిని క్రమ క్రమముగా సుబ్బన్న పేటలో ఉండుటకే యిచ్చగించెను ఆమెకు రంగారావన్నచో బహిః ప్రాణముగ ఉండెను మొదట అతని పెండ్లి ఆడునపుడు ధనము కొరకే పెండ్లి ఆడెను హిందూ దేశము పోయి చూడవచ్చును గదా అని పెండ్లి ఆడెను తన తలిదండ్రులు పేద వారు వారికి తన బారము తగ్గును వారికి తృణమో పణమో పంపించుచుండ వచ్చునని పెండ్లి ఆడెను రంగారావుగారు లండనులో పెద్ద హొటలులో విడిసెను సుసానీ పరువు గల యింట పుట్టినది లండనుకొక కొను దూరములో ఉన్న ఒక పల్లెటూరిలో ఆమె తలి దండ్రులుండిరి వారు పూర్వము తమకు గల కొద్ది పొలములో బంగాళా దుంపలు, ఓట్సు ధాన్యమును పండించుకొని జీవించుచుండిరి

సుసానీకి అన్నగార్లిద్దరున్నారు వారిద్దరు ఆక్సుఫర్డులో చదువుటకు వారికున్న ఆస్తి కొంచెము అయిపోయినది అన్నలు విద్యాదికులై వారి బ్రతుకులు వారు బ్రతుకుచుండిరి తలిదండ్రులు వృద్ధులై సుసానీ వారికి పోషణ చేయవలసి వచ్చెను వారికి మిగిలిన దొక యిల్లు ఒక ఆవును ఆ ఆవు పాలమ్మి ఎట్లో ఒకట్లు బ్రతుకుచుండుడని తాను లండనుకుబోయి ఆర్జించి తెత్తునని బయలుదేరెను లండనన్నచో ఆమె స్వర్గమనుకొన్నది లండనులో అడిగిన మాత్రాననే ప్రతి వారు వారమునకు నూరు పౌన్లు జీతమిత్తురనుకొన్నది పొరుగు వారి వద్ద నాలుగు

జరిగిన కథ 28–రంగారావుగారు బార్య పోయిన తరువాత ఇంగ్లాండు పోయి ఒక దొరసానిని తెచ్చి వివాహం చేసుకుంటాడు పురపాలక సంఘంవారు ప్రజలపై ఎక్కువగా పన్నులు వేస్తారు ధర్మారావు హరప్పనాయనికి చదువు చెప్పడానికి కోటలోనికి రోజూ వెడుతూ ఉంటాడు గుండేటికి వరద వచ్చి సుబ్బన్నపేటను ముంచెత్తుతుంది పంటలన్నీ నాశనం అవుతాయి పసిరికకు జబ్బు చేస్తుంది ధర్మారావు పుష్కరాలకి బెజవాడ వెడతాడు కేశవరావు గారి మరణానంతరం జాతీయ కళాశాలకు గట్టి దెబ్బ తగులుతుంది హరప్పనాయడు తెలుగులో మంచి ప్రవేశాన్ని సంపాదిస్తాడు గవర్నరుగారు పురపాలక సంఘ బవనాన్ని ప్రారంబిస్తారు చంద్రారెడ్డిని నాలుగు తలల పాము చేలో నిలదీస్తుంది దేవదాసి హరప్పను మొదటిసారిగా చూస్తుంది ధర్మారావు కళాశాలలో జరిగే అవకతవకలకు కోపగించుకుంటాడు




విదియందెక్కువ శ్రద్ధ అక్కఱ లేకపోయెను అతడామె పల్లెటూరిదిగా కనిపించుట చేత వెనుకకు పిలిచి నేత్రములతో నీవు పల్లెటూరి పిల్లవా అనెను సుసానీ మంచి సుకుమారమైన హృదయముగల స్త్రీ ఆమె అతని పలుకరించిన రీతికి దేహ చాలనమున తిరస్కరణ కనబరచి హోటలులోనికి పోయెను ఒక గది తీసికొని బోజనము చేసి ఆమె రాత్రి అంతయు అచట నిద్రించెను బోజనమునకు నిద్రకు మరునా డుదయమున చేసిన బోజనమునకునై ఖర్చు కాగా ఆమె చేతిలో కొన్ని పైసలు మాత్రమే మిగిలెను ఆమె హోటలదికారిని కలిసికొని నేనీయూరు దనము సంపాదించుటకు వచ్చితిని నాకేమైన ఉద్యోగము సంపాదించి పెట్టగలవా? అని అడిగెను అతడు

పౌండ్లప్పు తీసి రెండున్నర పౌండ్లు ఖర్చు పెట్టుకొని లండను చేరెను స్టేషనులో దిగి ఎచ్చటికి పోవలెనో తెలియలేదు ప్రొద్దు క్రుంకు వఱకు ట్రాముల మీద, అకలికి మిగిలిన అర పౌండును ఖర్చుయ్యెను రాత్రికి నిదుర ఎచట పోవలయునో తెలియలేదు ఒక పెద్ద సౌదము చూచి అది యేమిటని రోడ్డు ప్రక్క నిలుచున్న రక్షక బటులను అడిగెను అతడు పైనుండి క్రిందికామెను బరికించి చూచి అది పెద్ద హోటలని చెప్పెను ఆమె అటు పోవుచుండెను అప్పటికి కొంచెము ప్రొద్దు పోయి నగరము చివరి బాగమున ఉన్న ఆ స్థలమున జనుల రాకపోకలు తగ్గెను అందుచే రక్షకభటునకు తన

బుజములెగుర వేసి వెడల్పెక్కువయు పొడుగు తక్కువయు నైన మొగము నం దర గజము వెడల్పున్న నోరు నవ్వినట్లు రెండు పెదవులు దగ్గఱకు నొక్కి గజము పొడుగున దీర్ఘీకరించి తల యెత్తి చూచెను ప్రక్కనెవరో ఇద్దరు యువకులు నిలిచి ఆమె వంక చూచుచుండిరి ఆమె హోట లదికారి మాటాడకపోవుట చేత వెడలిపోబోవు చుండెను అతడు కుడి చేతి తర్జనితో రమ్మని పిలిచి దూరముగా ఒక గది చూపించి అచ్చటికి పొమ్మని తల యూపెను ఆమె వెనుక ముందాడి అతడు చూపించిన గది వద్దకు పోయి తలుపు తట్టెను లోనికి రా' అని స్త్రీ కంఠ ధ్వని ఒకటి వినిపించెను ఆమె లోనికి పోయెను ఒక నలుబదియైదేండ్ల స్త్రీ ఒడలంతయు ఎఱ్ఱగా ఉన్నది ముఖమునందున్నత

జాతి సంభవ లక్షణములు లేవు చంకల వఱకు బనియనొకటి తొడిగెను జుట్టు కత్తిరించి ఉండెను ఒక నిలువుటద్దములో చూచి జుట్టు దువ్వుకొను చుండెను

సుసానీని చూచినంతనే 'యనుంగు పిల్లా! ఏమి కావలయు నని అడిగెను ఆమె 'యీ ఊర ధనము సంపాదించుటకు వచ్చితిని ఏదైన ఉద్యోగము వాంఛించుచున్నాను హోటలధికారి మిమ్ము చూపించెను' అనెను ఆమె మొగము పొడుగు చేసి, కను రెప్పలు పైకెత్తి, నోరు గుండ్రముగా పెట్టి 'హు' కీచు గొంతుతో పెద్ద కూత కూసి, ఏదో దుర్వార్తము వచ్చునట్లు కన్ను గిలిపెను సుసానీ ప్రాణము నీరసించిపోయెను ఆమె పరిదీనయై "నే నందుకు రాలే"దనెను వృద్ధురాలిట్టి సమాధాన మెన్నడును వినలేదు ఆ సమాధానముతో అంత పరిదీన ముఖ మెన్నడును గన లేదు అందుచే ఆమె హృదయములో గలగిపోయెను కను బొమలు వంచి, రెప్పల క్రిందుగా ఆమె వంక చూచుచు వృద్ధురా"లేమి కావలె" అన్నది 'మర్యాదగా సంపాదించవలయును అన్నది సుసానీ వృద్ధురాలి అన్నగారొకడు ఐలంగ్టనులో పెద్ద హోటలు నడుపు చుండెను అతని హోటలులో నానా దేశముల నుండి ధనవంతులు వచ్చి దిగుచుందురు మంచి శీలము కలిగిన పరిచారిక ఒక రతనికి కావలయునట లండనులో నున్న కన్యలొక రోజుందురు రెండవ రోజుడాయించుచుందురు వారికి మనస్సు నిలకడ లేదు ఆ వృద్ధురాలుత్తరము వ్రాసి, తన అన్నగారికి చూపించుమని సుసానీని పంపించెను ఐలింగ్టను పోవుట కెంత అగునని సుసానీ ప్రశ్నించెను వృద్ధురాలు రెండు పెన్నీలగునని చెప్పెను సుసానీ దగ్గఱ డబ్బు చాలును ఆమె పోయి హోటలు దారుకాయుత్తరము చూపగా అతడు వారమునకు పౌండు చొప్పున జీతమిచ్చెదనుందువా" అనెను సుసానీకేమియు తోచలేదు తానింత దూరము వచ్చినది నెలకు నాలుగు పౌండ్లు సంపాదించుటకా నాలుగు పౌండ్లు అప్పే తెచ్చెనే! రాత్రి యించుమించుగా ఒక పౌండు ఖర్చయ్యెను తానొక

# వేయిపడగలు


రాత్రి ఖర్చు చేసినంత ఒక వారమునకు సంపాదించుటనా సుసానీ దిగాల పడి చూచెను యజమాని "ఏమట్లు చూచెదవు" అనెను సుసానీ 'నేను నాలుగు పౌండ్లు అప్పు తెచ్చితిని రెండున్నర పౌండ్లు రైలు ఛార్జి అయ్యెను మిగిలిన పౌను రాతిరి మీ చెల్లెలున్న హోటలులో ఖర్చైనది నేను నెలకు నాలుగు పౌండులు సంపాదించినచో నా అప్పెట్లు తీరును? నా తల్లిదండ్రులకేమి పంపింతును నేనేమి తిందును?" అనెను యజమాని "అంత పేదదానవు రాత్రి హోటలులో ఏల దిగితివి? పది పెన్నీలకెవరైన భోజనము పెట్టి యుందురే!" అనెను ఆమె నాకు తెలియదు అనెను యజమాని "నీకు నాల్గు పౌండ్లిక్కువన్న మాట లండనులో సామాన్యముగా రెండు పౌనులే యిచ్చెదరు నీవు పల్లెటూరి పిల్లవు అమాయకు రాలవు దుశ్శీలవతి లేవు అందుచే ఇంత యిత్తునంటిని భోజనమునకు నీకు ఖర్చుండదు నీ యిష్టమైనచో ఉండుము లేనిచో లే"దనెను సుసానీ విచారించి చేయునది లేక ఒప్పుకొనెను

సుసానీ ప్రవేశించిన మరునాడే రంగారావుగారు లండను పోయి ఆ హోటలునందే దిగెను ఆమె ప్రత్యేకముగా అతని పరిచర్య కొఱకే నియమించ బడెను ఆయన తన కట్టిక పరిచారిక నిచ్చినచో వారమున కొక పౌండెక్కువ యిచ్చెదననెను సుసానీ మీద అకారణ దయ కలిగిన ఆ హోటలు యజమాని అందులో సగము సుసానీకే యిత్తుననిచెప్పెను నూతనాతిథి హిందూ దేశస్థుడనియు జమీందా రనియు తెలిసినంతనే సుసానీ మనస్సులో ఒక విచిత్రమైన మార్పు జరిగెను హిందూ దేశములో నడుచుచున్నప్పుడు గూడ వీథులలో కాళ్ళకు నవరసులు, రత్నములు తగులునని ఆమె వినెను అచ్చటి రాజులు, జమీందారులు మేడలు బంగారముతో కట్టెదరని వినెను అట్టి ధనవంతు లలో ఒకనికి తాను దైవికముగా పరిచారికగా ఏర్పడుట తన భావి బాగ్యోదయ సూచకమను

కొనెను చాల మంది హిందువులు ఇంగ్లాండు వచ్చి ఇంగ్లీషు కన్యలను వివాహమాడిరని తన్మూలమున ఆ కన్యలు ధనవంతులైరని ఆమె పూర్వము విని ఉండెను

మరునాడు ప్రొద్దున సుసానీ రంగారావు గదిలోనికి పోయెను రంగారావామెను చూచెను ఓడలోగాని, రైలులోగాని, తాను చూచిన యూరపియను స్త్రీల వలె గాక సుసానీ భిన్నముగా కనబడెను ఆమె ధరించిన యుడుపులు ఆమె ముఖ లక్షణములు, ఆమె వినయము కొంత హైందవత్వ మును ధ్వనించెను సుసానీ అధునాతన నాగరకత సంపూర్ణముగా వికసించని ఇంగ్లీషు పల్లెటూరి పిల్ల ఈ నాగరకత విజృంభింపక మునుపాంగిలేయ స్త్రీలును కొంతవఱకు భారత దేశ స్త్రీలవలెనే ముగ్ధలు, వినయవతులు కాబోలు! రంగారావు జేన్ఆస్టెను వ్రాసిన "పెర్సుఏషన్" అన్న నవల చదివెను అందులోని కథానాయికకు, భారత దేశములోని ఒక మహా కావ్య నాయికకు తత్త్వములోనేమి బేదమున్నది? రంగారావునకు సుసానీ ఎడల సమాదరణ కలిగెను నాలుగైదు రోజులు సుసానీ రంగారావులు మాటాడలేదు అయిదవనాడు సుసానీ 'టీ' కలుపుచుండెను రంగారావు 'రోజును టీలో పాలు వేయుట లేదు మేము పాలు లేకుండ త్రాగలే"మనెను సుసానీ 'పంచదార కూడ ఎక్కువయే కావలయు"ననెను అని పరిచారికా మర్యాదోల్లంఘనము జరిగినదేమో అని సిగ్గుపడెను రంగారావా మాటకు నొచ్చుకొనక ఒక విలాపాంగము సుసానీ మీద ప్రసరింపజేసెను సుసానీ నిలువెల్ల సిగ్గయ్యెను వారము రోజులు గడచుసరికి వారిరువురు పరిహాసము లాడుకొనుట చమత్కారముగా ప్రసంగించుట ఆరంభించిరి ఆమె పరిచారికగానే ఉన్నది దైవికముగా ఒకనాడు గదిలో బయటకు వచ్చుచున్న సుసానీయు లోనికి పోవుచున్న రంగారావుగారును బరిష్వంగమునకు తగినంత సమీపమునకు వచ్చిరి సుసానీ వెనుకకు తగ్గెను రంగారావు లోనికి పోయి తలుపు దగ్గరగా వేసెను సుసానీ మొగములో గాంభీర్య రేఖ తరుముకొని వచ్చి రంగారావునకు దిగ్భ్రాంతి కల్పించెను ఆమె దారిని ఆమె పోయెను మరునాడు సుసానీ మరల టీ కలుపుచుండెను రంగారావు "అది నాకువల"దనెను సుసానీ "ఎందుచేత?" అనెను రంగారావు మొగము వంచెను సుసానీ ప్రక్కగా అతని వంక చూచెను ఇద్దరి కనులును కలిసినవి సుసానీ మందహాసము చేసెను అతడును మందహాసము చేసెను

ఆనాడు సాయంకాలమున సుసానీ ప్రక్క దులిపి వేయుచుండగా రంగారావు "ఈ దేశము నుండి నేనొక స్త్రీని భార్యగా నా దేశమునకు తీసికొని పోయెదను" అనెను సుసానీ తల యెత్తి రంగారావు వంక చూచెను ఇద్దరు ఒకరి వంక ఒకరు గంభీరముగా చూచుకొనిరి చూచుచు చూచుచు సుసానీ పకాలుమని నవ్వెను రంగారావును పకాలుమని నవ్వెను ఆ మరునాడు రాత్రికి వంద



# వేయిపడగల నేపథ్యం



## శ్రీనాథుడి సీసం

7

వేయిపడగలు నాటికి దేశమంతా సత్యాగ్రహాలు స్వదేశీ ఉద్యమాలు సహాయ నిరాకరణాలు, లాఠీలు జైళ్ళు, ఆ మహా సమర యోధుల్లో ఆంధ్ర దేశంలో కొడాలి ఆంజనేయులు గారొకరు ఆయన గాంధీజీ అనుచరుడు

ఆయనా మా నాయనగారూ జంట కవులుగా- సత్యాంజనేయ కవులుగా- ఆ రోజులలో చాలా కవిత్వం చెప్పారట వేయిపడగలులోని రాఘవరావు పాత్ర, నాటికి ఎనభై పాళ్ళు ఆ కొడాలి ఆంజనేయులుగారే!

" 'మహాత్ముని అని లేని సేన పడిపోయిన వాని కొడాలి ఆంజనేయుని మును నాకు ప్రియ మిత్రము సంస్మరించెదన్" అని అన్నాడు కల్ప వృక్షంలో

"సంస్మరించెదన్" అనే మాటకి ఇవ్వాళ- ఈ సంస్మరణ సభల వలన చచ్చిపోయిన వాళ్ళి గుర్తు చేసుకోవడం అనే అర్థం వచ్చేసింది దీనిలో కల్పవృక్షం బాల కాండ వ్రాసే నాటికే కొడాలి ఆంజనేయులుగారు పోయినాడని చాలా మంది దురభిప్రాయపడుతూ ఉంటారు అది పొరపాటు ఆయన మా నాయనగారి తరువాత (అనగా 1976 తరువాత) పోయినాడు మా నాయనగారు పోయినప్పుడు వచ్చి మమ్మల్ని ఓదార్చాడు, మేమాయన నోదార్చాం

ఆయన అసలే లొడితెడు మనిషి సన్నగా పొట్టిగా ఉండేవాడు దానికి తోడు నిత్యం- లాఠీలు జైళ్ళు! మా నాయనగారు ఆరడుగుల విగ్రహం నిత్య యోగాభ్యాస వ్యాయామముల చేత దృఢమైన శరీరం గలవాడు ఇద్దరూ కలిసి ఒకనాడు తిరువూరు తాలూకాలోని గంపలగూడెంలో ఏదో సభకి వెళ్ళి వస్తున్నారట

దారిలో ఆంజనేయులుగారు "ఏమిటి! ఇందాక సభలో శ్రీనాథుడి గురించి అల్లా మాట్లాడావు? శ్రీనాథుడు లేకపోతే సీసం ఏమైపోయేది? అన్నాడట

ఏమీ అయ్యేది కాదు నిక్షేపంలా ఉండేది" అన్నాడట మా నాయనగారు

"నోర్ముయ్!" అన్నాడట మా ఆంజనేయులు బాబాయి

'ఏడిశావులే! అట్టే వాగక నడు! అసలు శ్రీనాథుడు లేకపోతే సీస పద్యమంత దౌర్భాగ్య దశకు వచ్చి ఉండేదే కాదు అన్నాడట మా నాయనగారు

ఈ మాటతో తిక్క రేగిన మా ఆంజనేయులు బాబాయి, లాగి ఓ లెంపకాయ పీకాడట మా నాయనగారిని అంతే! ఒక్క క్షణం సృష్టి ఆగిపోయ నట్టనిపించిందట యిద్దరికీ! మా నాయనగారు కాస్సేపు పరమ కోపంగా చూసి వేగంగా ముందు నడవసాగాడట మా ఆంజనేయులు బాబాయి వెనక దాదాపు పరిగెట్టడం మొదలు పెట్టాడట

కొంత దూరం వెళ్ళాక- మధ్యలో ఓ చిన్న వాగు ఉంది అది అడ్డం వచ్చింది వాగు ప్రవహిస్తోంది ఈత వచ్చిన మా నాయనగారు నీళ్ళల్లోకి దిగాడు ఆంజనేయులుగారికి ఈత రాదు పైగా అప్పటికే బాగా చీకటి పడింది

"నన్నిక్కడ ఒదిలేసి చావమంటావా?" అని అరిచాడాయన. చద్దామనే కొట్టావా యిందాక?' అని ఈయన! తర్వాత మిత్రులిద్దరూ వాళ్ళ తిప్పలేవో వాళ్ళు పడ్డారు

అదే స్థితిని- సందర్భం వచ్చి, దరిదాపు యథాతథంగా; ధర్మారావు, రాఘవరావుల మధ్య జరిగినట్లుగా వ్రాశాడట మా నాయనగారు

(ఇంకా ఉంది)

-విశ్వనాథ పావని శాస్త్రి

---

పొందులు సుసానీ తలిదండ్రులకు తంతి ద్వారా పంపించెను ఎవరి మతము వారు నిలుపుకొను నట్లు పరస్పరమంగీకరించి సివిలు మ్యారేజి చేసికొనుటకు నిశ్చయించిరి తన వెంట హిందూ దేశమునకు వచ్చి అచట నుండిననే తాను వివాహమున కంగీకరింతునని రంగారావు గారు పట్టు పట్టుటచే సుసానీ అంగీకరించెను వచ్చిన రెండు వారములలోనే నూత్న పరిచారిక తన్ను వదలిపోవుచున్నందుకు హోటలు యజమాని విచారపడెను గాని, పేద పిల్లకు సుసానీ కదృష్టము పట్టినదని సంతోషించెను సుసానీ ఒక వారము లండనులో నుండి తరువాత తన గ్రామము పోయి తల్లిదండ్రులకు వర్తమానము చెప్పి ఒప్పించి ప్రతి యేడాదియు సాలునకు మూడు వందల పొండ్లు వారిద్దరికీ పంపింతునని చెప్పి మరి కొంత ధనమిచ్చి మరల మూడేండ్లకు తలిదండ్రులను దర్శించుటకు వత్తునని వాగ్దానము చేసి, రెండే వారములలో వచ్చి రంగారావును కలిసికొనెను ఇద్దరును హిందూ దేశమునకు కదలి వచ్చిరి వచ్చినతోడనే రంగారావు గారికి చెన్న నగరములో యూరోపియను సంఘమునందు గౌరవము హెచ్చయ్యెను పెద్ద పెద్ద అధికారులందరు సుసానీ ద్వారా రంగారావునందు గౌరవము కలవారైరి సుసానీకి పల్లిటూరు నందున్నంత ప్రేమ పట్టణములందుండదు పెద్ద పెద్ద అధికారులందరును సుసానీతో వచ్చి మాటాడుదురు ఆమెకు వారందరు ఎప్పుడు వదలిపోదురా అని యుండును ఆమె సహజముగా ఏకాంత మభిలషించును సుబ్బన్నపేటలో తాను తన భర్తయు చెన్నపురిలో నిత్య మతిథుల రాకచే టీపార్టీలచే శాంతియనునది ఉండదు సుబ్బన్న పేటలో కోటలో దానే దొరసాని రంగారావును తానే పరిచారికలు గూడ రారు సౌధాగ్రభాగమును ఎక్కి ఊరు నాల్గు వైపుల చూచును ఈ దేశమునందలి సూర్యోదయములు సూర్యాస్తమయములు ఆమెకు అమితానందకరములుగా ఉండెను సుసానీ చిత్రకారిణి ఆమె గీచిన చిత్రములన్నింటిలో సూర్య చంద్రోదయాస్తమయములే యెక్కువ ఆమె పియానో మీద కొంత రమ్యముగానే వాయించగలదు కోటలో పియానో కొని పెట్టెను దాని మీద తానే వాయించు కొనును- తానే సంతోషించుకొనును చెన్నపురి పోవుట యందలి ఆకర్షణ ఇది యొక్కటియే ఆమెకు టీపార్టీలలో తాను వాయించినప్పుడెల్ల చెన్నపురిలోని దొరలందరు మెచ్చిరి ఆ మెచ్చుదల ఆమె హృదయమున కాహ్లాదకారిగా ఉండెను చెన్నపురిలో నామె 'హృదయాహ్లాద హేతు విది ఒక్కటియే సుబ్బన్నపేటలో ఆమె కానంద కారణములు చాలా ఉన్నవి ఏకాంతము దొరసానితనము తన భర్తయు, తాను స్వేచ్ఛగా ఉండగలుగుట బహు జనులు చేత కొలువు, సౌధాగ్రబాగ వాసము, సుబ్బన్నపేట ఆమె హృదయా దర్శమును ఫలింపజేసినది

ఆమె సర్వ కాలముల యందు రంగారావుతో కలసి ఉండుటయే వాంఛించును అతడామెకు ప్రాణముల కన్న ప్రాణమైనాడు తాను దారిద్ర్య మహా సాగరమున కొట్టుకొని పోవుచుండగా ఉద్ధరించి శ్రీగిరి ఎక్కించినవాడతడు ఆమె కృతజ్ఞతామయమూర్తి!

రంగారావు ఆదర్శములన్నియు సుసానీలో ఫలించెను ఆమె హిందూ దేశమునందలి భార్యల వలె సేవకురాలు భర్తను దైవముగా కొలుచు నదియు కాదు ఇతర దేశముల యందలి కొందరు భార్యల వలె భర్తకు భర్తయు కాదు యూరపియను సంఘము నందు కూడ ఆమె ప్రవర్తన హైందవుడైన తన కసూయాజనకముగా ఉండదు తన్నామె మిక్కిలి ప్రేమించును తన దేశాచారములకు విరుద్ధముగ వున్నను రంగారావామె నొక పని చేయవద్దనునా ఆమె చేయదు వరదలు వచ్చినపు డామె పోయి పిట్టను కొట్టి తెచ్చినపుడు తమ మర్యాద కది భంగకరమని రంగారావు వారించెను ఆమె అంతే మరల సుబ్బన్న పేటలో తానట్లు చేయలేదు అతడును ఆమె యిష్ట ప్రకారమే నడచును సుసానీ రాక ముందు నిత్యము చెన్నపురి వదలనివాడు సుసానీ వచ్చిన తరువాత సుబ్బన్నపేటలోనే ఎక్కువ కాలము నివసించుట ఆమె మూలముననే

ఈ దేశము వచ్చిన తరువాత ఆమెకు చాల సంగతులు తెలిసినవి రంగారావు రాజ్యమునకు అధికారియైన కుమారుడున్నాడు అతడు విచిత్ర మైన పురుషుడు సుబ్బన్నపేట మంటిగడ్డలో పుట్టినవాడు తన భర్త తన వ్యవహారములు తాను చూచుకొనక దివానునకును బంధువులకును


# వేయిపడగలు

వదలి పెట్టును చెన్నపురిలో అధికారుల ప్రాపకము కొరకు చాల ధనము వ్యయపరచును గిండీ పందెములు నేత్రానందకరముగా నున్నను ధన వ్యయ మామెకు గిట్ట లేదు అందుచేత ఆమె ఎరత సేపటికిని సుబ్బన్నపేటలో ఉండుటకే వాంఛించెను పందెములైన మరునాడే యిర్వురును సుబ్బన్న పేటకు వచ్చిరి కోటలో కాలు పెట్టిన ప్రతిసారియు చెన్నపురి నుండి వచ్చిన మొదటి రోజున ఆమె వలన రంగారావు మహానంద మనుభవించుచుండెను రంగారావుతో ఆమె గిండీ పందెములు వలదని చెప్పెను అతడు రెండు లక్షలు లాభము చూపించి ఆమె వాక్యమునకు ప్రతి వాక్యము చెప్పెను పేటకు వచ్చినంతనే ఆమె ప్రాతః కాలమున చిత్రములు వేయును పన్నెండు గంటలకు భోజనము చేసి, కొంతసేపు విశ్రమించి, కొంత సేపు పియానో వాయించి, సాయం వేళ షికారు పోయి, రాత్రియగు సరికి మరల ఇంటికి వచ్చును ఆమె హరప్పను ఎప్పుడును కలసికొనుటకు ప్రయత్నించదు అతనిని దూరముగా చూచి తాను దూరముగా పోవును హరప్ప ప్రస్తావన ఎన్నడును చేయదు

సుసానీకి పల్లెటూరి జీవనమునందే ఎక్కువ అభిమానమైనను పాశ్చాత్య నాగరికతయందభిలాష మెండు దుస్తులు వేసికొనుటలో మత సంప విషయములలో పాశ్చాత్య పద్ధతులే నాగరిక పద్ధతులని ఆమె అభిప్రాయము హరప్పయందలి సగము వైముఖ్యమునకు హరప్ప పోవు తెలుగు పోకడలే సగము కారణము సంక్రాంతి పండుగ వచ్చెను ఊరిలో సంస్థల లెక్కల తనిఖీలు మరల జరిగెను జాతీయ కళాశాల లెక్కలు మరల దోష సహితముగానే ఉండెను ఏదో పాక చెడిపోయినదని మరమ్మతు చేయింతురు మరొక చోట చేయించి నచో నూట యేబది రూపాయలగును దానికే కళాశాలలో ఐదు వందలగును వాసములు వంద బజారులో నాలుగు రూకలకిత్తురు పదునారు రూకలకని వ్రాసియుండును కొన్ని కొన్ని చోట్ల జమకు, ఖర్చులకు లగించదు చిల్లర ఖర్చు నూరు రూపాయలని ఉండును 'చిల్లర ఖర్చేమిటి, నూరు రూపాయ లేమి"టని అడుగగా సంగయ్య "ఏదో యైనదండి, ఇప్పుడు జ్ఞాపకమా'" అనును అడిటరు ఏడి చీటులున్నచో చూపించుమనును అతడు "ఇప్పుడు కనబడునటండి? ఎక్కడ పోయినవో!" అనును

క్రొత్త అధ్యక్షుని తెచ్చినగాని యీ వ్యవహారము కుదుట పడదని చంద్రారెడ్డి విచారించెను రామ చంద్రరాజు తన పక్షమే రాధాకృష్ణయ్యను కూడ కలుపుకొనవలయునని ఊహించెను ఎన్నికలలో రామేశ్వరమునకు తాను ప్రత్యర్థినని రాధాకృష్ణయ్య తన యందు విముఖుడేమో అని తలంచెను ఒకనాడు రాదాకృష్ణయ్యతో చంద్రారెడ్డి జాతీయ కళాశాల వ్యవహారము బాగుగా లేదు అనెను రాదాకృష్ణయ్య "అవునండీ కళాశాలలో ధర్మారావు గారిని బాధ పెట్టుచున్నారట" అనెను రాధా కృష్ణయ్యగారి సౌముఖ్యము తెలిసికొని చంద్రారెడ్డి పాలనా సంఘములో క్రొత్త వానిని తెచ్చుటకు తీర్మానము గెలిపించవచ్చునని ఊహించెను

మార్చిలో పాలనా సంఘ సమావేశము జరిగెను చంద్రారెడ్డి ప్రస్తుతము చెప్పబడుచున్న యింగ్లీషుకన్న ఎక్కువ యింగ్లీషు పిల్లలకు కావలయుననియు చరిత్ర ఆర్థిక శాస్త్రము రాజకీయము చక్కగా చెప్పనగాని కళాశాలలోని విద్యార్థులు సరియైన లాభము పొందలేరనియు, అందుచే చరిత్రలో ఎమ్ ఎ ప్యాసయిన ఒక నూతనోపాధ్యాయుని, తీసికొని రావలయుననియు, అట్టివాడు వంద రూపాయలైననీయనిచో రాడనియు, కళాశాలలో ఉన్న ఉపాధ్యాయులందరి కన్న ఎక్కువ జీతమిచ్చుచు అధ్యక్ష పదవి యీయకున్న శోభ లేదనియు చెప్పి తీర్మానము పెట్టి మరు సంవత్సరమున అట్టి వానిని తెచ్చునట్లు తీర్మానము చేసి పాలనా సంఘ సభలో గెలిపించెను దీనికి వ్యతిరేక మొక్క శఠగోపాచారియే అతడొక్కడు కాదన్నను తక్కిన ముప్వురు అవుననిరి నాగేశ్వరరావుగారు సమావేశమునకు




రాలేదు ఈ వార్త విని నారాయణరావుగారు మహోగ్రుడైపోయెను ఆయన ఉగ్రత పైకి రాదు గుండెలోననే ఉండును "కానీయండి కళాశాల బాగుపడవలసినదే ఏదైనను బాగుపడుట మంచిదే కదా!" అనెను అందరు అది సాధుత్వమే అనుకొనిరి ధర్మారావిశడేదో కుతంత్రముల కెత్తుచున్నాడని ఊహించెను

ఆ వేసవిలో తాలూకా బోర్డు అధ్యక్ష పదవి ఎన్నికలు జరిగెను రామేశ్వరముగారొక అభ్యర్థి అతనికి దమ్మిడీ వ్యయము లేదు వ్యయమంతయు జమీందారుగారు పెట్టుకొనును గెలుపోటములే తనవి లాభమతనిది, నష్టము వచ్చెనా జమీందారు గారిది నెలనాళ్ళు తాలూకా అంతయు, న్యూయార్కులో ఆకాశమున వాయు విమానములు తిరిగినట్లు సుబ్బన్నపేట తాలూకాలో భూమి మీద మోటారులు తిరిగెను పేటలో తాలూకాఫీసు కట్టి, రిజిస్ట్రారు ఆఫీసు పెట్టి నాలుగేండ్లయ్యెను మ్యాజిస్రేటు, తహసీల్దారు సబ్ ఇన్స్పెక్టరు, సబ్ రిజిస్ట్రారు రాజాగారి కళాశాలాధ్యక్షుడు, హైస్కూలు హెడ్మాష్టరు చంద్రారెడ్డి- వీరందరున్నతోద్యోగులు పేట గణాచారి వేయిపడగల పాము' పాడినప్పటిది కాదు, నాల్గు పడగల పాము చంద్రారెడ్డిని మెట్ట చేలలో నిలువ వేసినప్పటిది

మోటారులు తాలూకా అంతయు కుక్కల వలె తిరిగెను నెల నాళ్ళయిన తరువాత రామేశ్వరముగా రెన్నికలలో గెలుపొందెను ఆయన గౌరవార్థము చంద్రారెడ్డిగారు టీపార్టీ చేసెను రామేశ్వరమునకు చంద్రారెడ్డి యందున్న వైషమ్యము నాటితో పోయెను చంద్రారెడ్డి వేసిన ఎత్తు రామేశ్వరమున కందలేదు గ్రామస్థులతనికి స్వాగతపత్రమిచ్చిరి-

"మీరు విద్యావంతులు మీ విద్యాఫలము తాలూకా ప్రజలనుభవించి సుఖింతురుగాక!" అని పత్రములో ఒక వాక్యము- రామేశ్వరముగారు ప్రైమరీయైనను బరీక్ష యీయలేదు

'మీరు ప్రభువులు మీ చల్లని పాలనలో ప్రజలు సుఖింతురని మేమాశించుచున్నాము" అని మరియొక వాక్యము రామేశ్వరముగారొక సామాన్యులైన రైతు బిడ్డ రంగారావుగారి పెద తల్లి కుమారు డగుటచే అయినచో ప్రభువు కావలయును అది యిప్పటి ప్రభుత్వమేమో!

తమరు రూపజిత మన్మథులు మహా పరాక్రమ శాలులు అని రెండు వాక్యములు- ఇది కావ్య ధోరణి-


ఇట్టి వినతిపత్రములకు స్వాగత పత్రములకు దేశమున చాల కవులుందురు వారిని పోయి యే పెత్తనదారుడో మిక్కిలి వినయముతో వ్రాయించి తెచ్చును అవి చదువుదరు ఆ వ్రాసినతనికి వ్రాయించుకొన్న వారు స్తోత్రము తప్ప మరొక్కడు చేయకూడదని తెలిపి అట్లు వ్రాయించుకొని వత్తురు తహసీల్దారులు, కలెక్టరులు, మున సబులు, ఇన్స్పెక్టరులు బదిలీ చేయబడిపోవు వారు పోదురు వచ్చు వారు వత్తురు అజాగళస్తన ప్రతిమాన గౌరవ ప్రతిపత్తి కలిగిన పద్య రత్న

ప్రజాపాలన నిర్వహిస్తున్న ప్రభువులు యుక్తా యుక్త విచక్షణ కలిగి ఉండాలే కాని, తమ శక్తి సామర్థ్యాలను దుర్వినియోగం చేసి, అమాయకులయిన సత్పురుషులను హింసించకూడదు అలా హింసిస్తే - తర్వాతి సన్నివేశాలను గమనించి పశ్చాత్తాప పడవలసి వస్తుంది భగవంతుని దృష్టిలో ప్రభువులు- ప్రజలు అనే భేదం లేదు అందరికీ ఒక్కటే న్యాయం

తాళ్ళపాక అన్నమయ్య సాళువ నరసింహరాయల కాలంలో ఉన్నవాడు ఆ ప్రభువీయన కీర్తనలు విని ముగ్ధుడయే వాడు అన్నమయ్యగారిని తన ఆస్థానానికి పిలిపించి ఘనంగా సత్కరించేవాడు ఒకనాడు అన్నమయ్య శృంగార రసపరంగా భగవంతునిపై చక్కని కీర్తన రచించి గానం చెయ్యగా నరసరాయలు తన్మయుడై అట్టి కీర్తనను ఒక దానిని తనపై చెప్పవలెనని కోరగా, అన్నమయ్య దానికి సమ్మతింప లేదు భగవంతుని విడిచి, ఇతరులపై కీర్తనలను చెప్పనని ఖండితంగా చెప్పే సరికి ప్రభువుకు ఆయనపై తీవ్రంగా కోపం కలిగి, బంగారు సంకెళ్ళను చేతులకు తగిలించి అన్నమయ్యను బంధించాడు అన్నమయ్య దేవుని ప్రార్థిస్తూ ఒక కీర్తన చెప్పగా, ఆ సంకెళ్ళు విడిపోయి రాజుతో పాటు అందరికీ ఆశ్చర్యం కలిగించాయి నరసరాయలు తన తప్పు తెలిసికొని అన్నమయ్యను క్షమాపణ వేడుకొన్నాడు

ఇట్టిదే మరొక సంఘటన.

## ధర్మపథం ప్రభుత్వసాంస్కృతి




శ్రీరామ భక్తాగ్రణి అయిన తులసీ దాసుకు శ్రీరాముడు ప్రత్యక్ష మవుతూ ఉంటాడని ప్రసిద్ధి ఈ సంగతి అక్బరు ఫాదుషా చెవిని కూడా పడింది తులసీ దాసు పయి అక్బరు చక్రవర్తికి ఆదరాభి మానాలు' మెండు "నీకు శ్రీరాముడు ప్రత్యక్షమగునుకదా! ఆయన దర్శనం నాకుకూడా కలిగేటట్లు చెయ్యి" అని ఆయన తులసీదాసును కోరాడు "శ్రీరాముడు తన భక్తులకు ప్రత్యక్షం కావచ్చును కాని భక్తుల సలహాపయి యితరులకు ప్రత్యక్షంకాడు ఆయనపై ప్రగాఢమైన భక్తి కలవారికే ఆయన దర్శనం లభిస్తుంది నేనేమీ చెయ్య లేను " అన్నాడు అక్బరు కోపించి "నీవు తలిస్తే ఈ పని చేయించగలవు ఆయన దర్శనం చేయించే వరకూ నీకు నిర్బంధశిక్ష విధిస్తున్నాను " అని అతనికి ఖైదు శిక్ష విధించాడు తులసీదాసు శ్రీరాముణ్ణే ప్రార్థించి, తన స్థితి మొరపెట్టుకోగా, ఎక్కడి నుంచో వేలకొలది కోతులు వచ్చి రాజధానిని అల్లకల్లోలం చేశాయి ప్రజలు వాటి బాధ పడలేక ఫాదుషాతో మొరపెట్టుకున్నారు తులసీదాసు నిర్బంధమే దీనికి కారణమై ఉంటుందని కొందరు తెలుపగా, ఫాదుషా తులసీ దాసును చూచి "ఈ వానర సంక్షోభం ఏమిటి" అని అడిగాడు "మీకు శ్రీరాముని దర్శనం కావాలి కదా! ఆయన ముందుగా తన సైన్యాన్ని పంపి ఉంటాడు ఆ తర్వాత ఆయన దర్శనం లభిస్తుందేమో!" అని అన్నాడు అక్బరు తన తప్పును గ్రహించి, అహంకారం విడిచి తులసీదాసును క్షమాపణ కోరాడు

–బులుసు వేంకట రమణయ్య

ములు వాక్య విన్యాసములు తెలుగులో పరిచయము కలిగిన కుళ్ళువాంధ్ర ప్రాణము తీయబడి, వ్రాయించబడి, వారికి గౌరవము సేయు సభలలో చదువబడును ఆ పద్యములు చదువు చుండగా అందునొక్క మాటకైన అర్థము తెలియని సభా సదులు రేగు చెట్టు క్రింద గ్రుడ్డి వాని వలె తలలాడింతురు చదివినవాడు సంగీతముతో చదివెనా కరతాళధ్వనులు చేయుదురు చదివినవాడు తప్పులు లేకుండు ఎన్నడును చదువడు పద్యములు వ్రాయించి తెచ్చిన వారు పద్యమునర్థమగునట్టివరు చదువుదురా అని విచారించరు ఎవడో సంగీతము పాడుననుకొన్న వానిని తెచ్చి వాని చేత ఇట్టి పద్యములు చదివింతురు వినతి పత్రములు చదివింతురు ఈ పత్రములలో ఈ పద్యములలో ప్రతి కఠోరుడును మృదువు. ప్రతి రావణాసురుడును రాముడు. హిరణ్య కశిపుడు ప్రహ్లాదుడు; దుఃఖియైన జనము సుఖి

ఒక యిల్లద్దెకు పుచ్చుకొని అందు తాలూకా బోర్డు ఆఫీసు పెట్టిరి వేరేదానికి సౌధ నిర్మాణము చేయవలయునని ప్రయత్నములు సాగుచుండెను రామేశ్వరముగారు తదధ్యక్ష పదవి సంపాదించుటకు పాతిక వేలు ఖర్చు పెట్టిరి అది మరల సంపాదించుటకు ఎట్లా అని విచారించ ఆరంభించెను మొదట పాతిక వేలూరకే యిత్తునన్న జమీందారుగారు గెలిచిన తరువాత తన డబ్బు తనకిమ్మనెను ఇది సుసానీ చేసిన పని అని రామేశ్వరముగారి ఊహ

పట్టాభిషేకమునకు తెచ్చిన ఎలక్ట్రిసిటీ ప్లాంటు ఎండ కెండి, వానకు తడిసి కోట శిథిల భాగము నందొక చిన్న యింటిలో ఉండెను పోయిన దంతయు పోగా అందులో కొంత పనికి వచ్చునని ఊహ తోచినది సినిమా పెట్టినచో ధనము కొంత రావచ్చును దీని మూలమున పెట్టుబడిలో కొంత తగ్గవచ్చును. రామేశ్వరముగారు చెన్నపురి చుట్టును దిరిగి, సినిమా పెట్టుటకు' కావలసిన ప్రయత్నములన్నియు చేసెను ఊరికి దక్షిణమున రేకులతో పెద్ద హాలు వేయించెను మూడు నెలలలో సినిమాకు తగిన ప్రయత్నములన్నియు జరిగెను పురపాలక సంఘము వారి అనుజ్ఞ వచ్చినగాని సినిమాలాడుటకు వీలు లేదు

(ఇంకా ఉంది)

# దూరదర్శనం
## లత



### మాల్గుడి డేస్

ఆర్ కె నారాయణ్ వ్రాసిన ఈశ్వరన్ – అనే కథ ఆధారంగా నాటిక ఈశ్వరన్ పరీక్ష పాసవనందుకు తండ్రి తిడితే బైటికి వస్తాడు – ఆ రోజు ఫలితాలు తెలిసే రోజు ఈశ్వరన్‌కి పేపరు చూడటం భయం తను తప్పుతాననే అనుమానంతో సినిమా చూస్తాడు అందులో ఒక రాజకుమారుడు గుర్రం మీద ఏరుదాటతాడు – ఆఖరిసారి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకొని కాలేజీ కెళ్ళి లిస్టు చూస్తే అందులో తను ప్యాసయినాడు ఆ ఆనందంలో సినిమాలో రాజకుమారుడి లాగా ఏరుదాటబోయి అందులో పడి చనిపోతాడు సినిమాల బాడ్ ఎఫెక్టు ఇలా ఉంటుందని రచయిత అభిప్రాయం అయి ఉండాలి

### రామాయణం

ఈ వారం రామాయణం సగం అయినాక కరెంటు వచ్చింది మండోదరి వద్దన్నా వినకుండా పొలస్త్యుడు మారీచుడు నీతి చెప్పినా వినకుండా మారీచ మృగాన్ని సీత మీద ప్రయోగిస్తాడు లక్ష్మణుడు వద్దన్నా రాముడు ఆ మృగాన్ని తేవటానికి బయలుదేరతాడు సంభాషణలు చాలా బాగున్నాయి స్వర్ణమృగం ప్రకృతిలో ఉండదని లక్ష్మణుడు అంటే భగవంతుడి సృష్టిలో ఏదీ అసంభవం లేదని శ్రీరాముడంటాడు ఈ తడవ ప్రతి మాటా వాల్మీకి రామాయణంలోదే (మనకి దొరికిన) రామాయణం ఇక నుంచి సీతాయాశ్చరితం – ఇది చూడగలుగుతున్న మనం అదృష్టవంతులం

### హమ్ హిందూస్తానీ

ఒక అరడజను జంటలు – డాక్టర్ దగ్గరకి వస్తారు మొగవాళ్ళకి బ్లడ్ ప్రెషర్ అనే వంకతో నర్సింగ్ హోమ్‌కి వచ్చి భార్యలు గర్భవతులని తెలుసుకుంటారు పూర్ డైరెక్షన్ – పనికి మాలిన డైలాగులు – అర్ధరహితమైన సీన్లు – ఏమీ బాగా లేదు అనేక భాషల ఆడవాళ్ళు గర్భవతులవటమే హమ్ హిందూస్తానీ కథ ఇంతవరకూ అందరికీ రెండు నెలల కడుపేనా? అని డాక్టరు సేవకుడు అడిగి ప్రసవించే టైము చెపుతాడు పిల్లల్ని పుట్టి భాషా భేదాలు లేవని ఋజువు చేస్తాడా? ఏమో మరి

* * * * *

ఎమ్ వి రమణమూర్తి గారి గాత్ర సంగీతం ముప్పయి ఏళ్ళ పాతదని కాబోలు ఒక పాటతోనే సరిపుచ్చారు

### మనోరంజన్

కిందటి వారం కర్నూలు వెళ్ళటం వలన మొదటి భాగం చూడలేక పోయినాను – ఈ వారం రెండో భాగం – సినిమారంగంలో చాలా మందికి వాళ్ళ చుట్టూ తిరిగే రచయితలంటే పడదు వాళ్ళని తేలిగ్గా చూస్తారు రచయితలూ ఎక్స్ట్రాలూ – ఓడిపోయిన డైరెక్టర్లూ చాలా తేలికగా చూడబడతారు – మదన్ అనే రచయిత పదిహేను సంవత్సరాలుగా ఫీల్డు వెంట తిరుగుతున్నాడు అతని కలలూ రేపు అనే దాని మీద ఆశా అతన్ని నిలబెడుతున్నాయి ఆఖరికి ఇంటి యజమాని వెళ్ళకొడతాడు అయినా ఆశ చావదు ఫుట్‌పాత్ మీద నిలబడి రేపు నాది అనగలడు కథా సంవిధానం బాగుంది మామూలుగానే టైటిల్సు వేగంగా వెళ్ళినయ్

### తెనాలి రామకృష్ణ

రాయలవారి తల్లి మామిడి పళ్ళ కోసం కలవరిస్తూ మరణించి నందున ఆమె అబ్దీకం నాడు బంగారు మామిడి పళ్ళు దానమిస్తాడు రాయలు రామకృష్ణుడు తన తల్లికి వాతలు ఇష్టమని చెబితే ఇద్దరు తప్ప అందరూ పారిపోతారు ఇది తాతాచార్యుల కుట్ర అని బైట పెడతాడు రాయలముందు కథ పాతది అయినా బాగుంది జనంలో ఇది పాపులర్ కథ

### బి. ఆర్ చోప్రా సమర్పించిన బహదూర్ షా జాఫర్

చక్కని కవి తన రాచరికం అంతరించిందనీ చదరంగంలో రాజులాగా ఉన్నాననీ ఆయన జౌఖ్ అనే కవితో అంటాడు కాని అంతః పుర కుట్రలు మొగలాయీ దర్బారుకు మామూలే ఒకరాణి పెద్ద కొడుకుని కాదని తన కొడుక్కి పట్టం కట్టాలనుకుంటుంది ఈ వార్త కుట్ర దారులైన వ్యక్తులు ఇంగ్లీషు ఛండాలురకు చేరుస్తారు బహదూర్‌షా స్నేహితుడైన ఒక మౌల్వీని ఫిరంగి మూతికి కట్టి చంపేస్తారు తుచ్ఛులు – అలా అనిపించటంలోనే ఈ నాటిక సక్సెస్ అయిందని వేరే చెప్పనవసరం లేదు

### స్వయంకృతం

రచన డి వి రమణమూర్తి దైలు స్నేహను కల్పిన మతిమరుపు మనిషీ మూర్ఖుడూ అయిన ఒకాయన అరటిపండు తిని తొక్క పారేసి తనే జారి పడతాడు ఇదిలోగడ ఒక సారి వచ్చింది ఏమంత గొప్ప నాటికని మళ్ళీ ప్రసారం చేస్తున్నారో అర్థం కావటం లేదు– దీని తరువాత భాగం వచ్చేవారంట

### ఆశ్చర్య దీపక్

ఇది సగం అయినాక కరెంటు వచ్చింది మధ్యంతర ఐశ్వర్యం వల్ల ప్రియురాలూ దానితో విదేశీ యాత్రలూ మొదలు పెడతాడు భార్య పుట్టింటికి వెడుతుంది ఈజీ మనీ వల్ల మనుషుల్లో మార్పు ఎలా వస్తుంది అన్నది బాగా చూపించాడు ఏమయినా ఇది బాగున్న నాటిక అసంభవమే కావచ్చును, అందంగా ఉంది

ప్రథమ ప్రతిశ్రుతి– ఆశాపూర్ణాదేవి నవల ఆధారంగా నాటిక – ఇందులో స్త్రీ విద్య ఆ రోజుల్లో ఎంత రివల్యూషనో చెప్పబడ్డది రామేశ్వరి బాగా నటిస్తున్నది కాని, కొత్త కొత్త పాత్రలు ఎవరో ఖంగారుగా, ఉంది ◻

"మనోరంజన్"లో ఒక దృశ్యం



# హైదరాబాద్ నోట్ బుక్

## అనంత కవితలు ఆవిష్కరణ :—

శ్రీ పటేల్ అనంతయ్య గారు సజ్జనులు, సాహిత్య పాంథులు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రారుగాను, రాష్ట్ర ప్రభుత్వ బేక్‌వర్డ్ క్లాసెస్ ఫైనాన్స్ కార్పొరేషన్ జనరల్ మేనేజరుగా ఉన్నారు షావి, గాలిబ్, సఫీ ఇక్బాల్ మీర్, దర్ద్ ఖాయం యఖీన్, హస్రత్, హాషిం, అక్తర్ ఆదిలీ, ఉర్ఫాజ్, హాలీ, అసి యాస్ చక్‌బస్త్ సాహీర్ ఠక్కర్ అలాహాబాద్, ముసఫి, బేదార్, రియాజ్, అస్గర్, ముఖ్దూమ్, ఖుమార్, దిల్ ఫైజ్, మోమిన్, జఫర్, మాయల్ ఇన్‌షా రూమి అవీస్, అబీర్, జలీల్ అసద్, జోష్ నజీర్ అక్బరాబాదీ మున్నగు వారి గజల్‌లను అనువదించి గజల్ గీతికలు అనే పేరుతో ఆరు సంవత్సరాల క్రితం ఒక సంకలనం ప్రచురించారు కథలు పిల్లల నాటకాలు, రేడియో గేయాలు వ్రాశారు ఇవన్నీ సహృదయుల ప్రశంసలు అందుకున్నాయి ఇప్పుడు అనంత కవితలు అనే స్వతంత్ర కవితా ఖండికల సంకలనం ప్రచురించారు దీనిలో కవి, కాలం – కవి నేరం కాని బేరం విప్లవం,తీస్మాత్ జాగ్రత ధర్మం, ప్రజాస్వామ్య ధర్మం, శుభాకాంక్షలు, ఆమె రోదన, ఉచితం, కాలం, అతని వాదన అనే పన్నెండు శీర్షికలున్నాయి శ్రీ అనంతయ్య రచనలో సునిశితమైన హాస్యం మనస్సుకు నాటే వ్యంగ్యం ఉన్నాయి

వీధిలోకి రాయి విసరడం కాదు విప్లవం  
విరోధికి గోయి తీయడం కాదు విప్లవం,  
గొంతు చించుక అరవడం గగ్గోలు చేయడం,  
ఊకదంపుడు ఉపన్యాసం ఉద్రేకంతో  
ఉచ్చరించడం కాదు విప్లవం  
బీటలు వారిన గుండెలలో  
తోటలు నాటు – అది విప్లవం  
ఆకలి లోకం వానికి  
అధికారం అప్పజెప్పు అది విప్లవం

అని శ్రీ అనంతయ్య విప్లవానికి నిర్వచనం చెప్పారు ఉచితం అనే శీర్షికలో ఆయనలోక వృత్తాన్ని చక్కగా దుయ్యబట్టారు

తిరుపతి తీర్థానికి వెలితే తిండి ఉచితం,  
కోడి పులావుతో కొత్తిమీర ఉచితం,  
ఫుట్‌పాథ్‌పై పూజాస్థలాల నిర్మాణం ఉచితం  
పాడి పశువులకు పట్నంలో నడిరోడ్డే ఉచితం  
కవిగారిని కలిశావా చవిజూపే సుత్తి ఉచితం  
హైదరాబాద్ నగరంలో హైబ్రిడ్ దోమలు ఉచితం  
పరాయి వాళ్ళ గోడలన్నీ ప్రచారాల  
వ్రాతలకే ఉచితం,  
సినిమాల్లో పెట్టుబడికి సిల్క్‌స్మితా ఉచితం

అబ్బా ఎన్ని ఉచితం! అన్నీ ఉచితం ఇలా చక్కని వ్యంగంతో నల్లేరుపై బండిలా సాగిన అనంత కవితలు ఆవిష్కరణ సెప్టెంబర్ 27 న శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషా నిలయంలో జరిగింది ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించిన శ్రీ త్రిపురనేని సుబ్బారావు ఆవిష్కర్త శ్రీ తిరుమల రామచంద్ర సమీక్షకులు డాక్టర్ అక్కిరాజు రమాపతిరావు డాక్టర్ వి వి ఎల్ నరసింహారావు అనంత కవితల లోని విశేషాలను వివరించి, కవిని ప్రశంసించారు కవిశ్రీ అనంతయ్య ఈ కవితా సంకలనాన్ని తమ మిత్రులు బహుభాషా రసజ్ఞులు అయిన శ్రీ కోపల్లె వెంకట రమణారావుకు అంకితమిచ్చారు ఆయన కవిని సత్కరించారు కవిత కృతజ్ఞత తెలుపుతూ తమ కవితా వ్యాసంగాన్ని వివరించారు నిర్వచన సుందర కాండను రచించినది ప్రచురణ కావాలని తెలిపారు

## సన్నద్ధ సమాజం – జేఠ్ మలానీ సూచన :—

శ్రీ రామ్ జేఠ్‌మలానీ సెప్టెంబర్ 29న మదీనా పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసిన సభలో మతం – రాజకీయాలు అనే విషయమై ప్రసంగిస్తూ, ప్రజాస్వామ్యం మనుగడకు సమాజం నిత్య జాగరూకతతో వుండాలని, అది ప్రజాస్వామ్యం మనుగడకు ప్రధానమైన షరతని అన్నారు మనదేశం స్వతంత్రమైనప్పుడు, పాశ్చాత్య విద్యావంతులైన మన **నాయకులు** పాశ్చాత్య ప్రజాస్వామ్య సంస్థల ప్రభావంతో ప్రజాస్వామ్య పద్ధతి ప్రభుత్వ వ్యవస్థను అంగీకరించక తప్పింది కాదు ప్రజాస్వామ్య ప్రభుత్వం ఇతర ప్రభుత్వ వ్యవస్థల కన్నా భిన్నమైంది ఈ వ్యవస్థలో ప్రజలు ప్రజల కోసం ప్రజాహితాలను చూడవలసి వుంటుంది ప్రజాస్వామ్యంలో విద్యావ్యాప్తి విశేషంగా జరుగుతుంది గనుక ప్రభుత్వ దైనందిన వ్యవహారాలను విద్యావంతులు సన్నిహితంగా జాగరూకతతో పరిశీలించాలి కాని, భారతదేశ ప్రజాస్వామ్యంలో ఉన్న మూల లోపం విద్యావంతులు అర్హత గల వారు అయిన ప్రజలు అలాటి జాగరూకతతో ప్రవర్తించక పోవడమే కనుకనే మన రాజకీయ నాయకులు తమను వోటిచ్చి అధికారానికి పంపిన ప్రజలను విస్మరించి, వారికిచ్చిన వాగ్దానాలను మరచి పోతున్నారు తాము వోటు చేసిన తర్వాత ఐదేళ్ళ పాటు నిద్ర పోవచ్చునని ప్రజలు భావిస్తే ఎన్నుకోబడిన వ్యక్తిని అవినీతిపరుడు కావడానికి అవకాశమివ్వడమే అంతేకాక ప్రతి మతమూ ఉపదేశించే సన్మార్గ భావనను కోల్పోవడం వల్ల రాజనీతిజ్ఞులు కలుషితులై, అవినీతిపరులై, స్వార్థపరులవుతున్నారు మత భావనతో మిళితమైన జ్ఞానమే దేశ సమస్యలను పరిష్కార మార్గం భారతీయ ముస్లిములు ఇస్లాం పాఠాలు విస్మరించి విద్యార్జన విషయంలో పెడ మొగం పెడుతున్నారు ఇస్లాం సిద్ధాంతం ప్రజాస్వామ్యమే అయినా ఇస్లామిక్ దేశాలలో ప్రజాస్వామ్యం లేదు మహమ్మద్ ప్రవక్త సందేశాలను దురుపయోగం చేస్తున్నా, విద్యావంతులైన ముస్లిములు ఏమీ పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగానే వుంది సమాజం ఉనికికి మతం నైతికమైన పునాది అయినా, నేడు మతం విభేదాలకు కారణమయింది మతం ప్రజలను ఏకం చేయాలి గాని, విడదీయరాదు మనం మతంతో ఉత్తేజితులమై, జ్ఞానంతో ముందుకు పోవాలి – అన్నారు శ్రీ రామ్ జేఠ్‌మలానీ, సెప్టెంబర్ 28 వ తేదీన ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం సమావేశంలో ప్రసంగిస్తూ, యువకులు తాము నమ్మిన రాజకీయ పక్షాల యెడల భక్తి శ్రద్ధలతో ప్రవర్తించడం మంచిదే అయినా జాతి ప్రయోజనాల సమస్య ఏర్పడినప్పుడు జాతి ప్రయోజనం ముఖ్యమని హెచ్చరించారు ఈ సందర్భంలో ఆయన ఆస్కార్ వైల్డ్ చెప్పిన వృద్ధులు ప్రతి దానిని అంగీకరిస్తారు, నడి వయస్సు వారు ప్రతి దానిని సంశయిస్తారు యువకులు ప్రతి దానిని తెలుసుకుంటారు – సూక్తిని ఉదాహరిస్తూ, యువకులు మధ్య వయసు వారి వైఖరిని – అన్నిటినీ సంశయించే వైఖరిని – అవలంబించాలని హితవు చెప్పారు


ఇటీవల కుమారి యద్దనపూడి పద్మజ కుమారి జి అలకానంద (నాట్యాచార్య శ్రీ నటరాజ రామకృష్ణగారి శిష్యురాండ్రు) ధనలక్ష్మి బ్యాంక్ వారి వజ్రోత్సవాలలో హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభయందు ఆంధ్ర నాట్య ప్రదర్శన చేసిన సందర్భంగా తీసిన చిత్రం



## సంస్కృత భాషణ శిబిరాలు :—

సంస్కృత భాషణ శిబిరాలను జంటనగరాలలో

## గడుసులోకం —బాబు




## హైదరాబాద్ నోట్‌బుక్

28 కేంద్రాలలో సెప్టెంబర్ 24 నుంచి 10 రోజుల పాటు సంస్కృత బాషా ప్రచార సమితి నిర్వహించింది ఈ సమితికి విశ్వసంస్కృత ప్రతిష్ఠాన్ ఆంధ్రప్రదేశ్ శాఖ తిరుపతి సంస్కృత ప్రచార పరిషత్తు తోడ్పడ్డాయి ఈ శిబిరాలలో దాదాపు 2000 మంది సంస్కృత సంబాషణను నేర్చారు సంస్కృత భాషా ప్రచారిణీ సమితి కులపతి ఆచార్య డాక్టర్ పుల్లెల శ్రీ రామచంద్రుడు పత్రికా ప్రతినిదులతో ముచ్చటిస్తూ తమ సమితి పది సంవత్సరాలుగా సరళ సంస్కృత పరీక్షలు నిర్వహిస్తూ లక్ష మందికి పైగా సంస్కృతం నేర్పిందన్నారు ఈ సమితి అధ్యక్షులు శ్రీ జి పుల్లారెడ్డి కార్యదర్శి శ్రీ సి హెచ్ వి సుబ్రహ్మణ్యం ఈ శిబిరాల సమాప్త్యుత్సవం రామచంద్రాపురం బి హెచ్ ఇ ఎల్ కమ్యూనిటీ సెంటర్‌లోను నల్లకుంట శంకర మఠంలోను అక్టోబర్ 3 వ తేదీన జరిగింది

## ఉపశ్రుతి –

మా మిత్రుడైన ఒక ప్రముఖ పత్రికా రచయిత, నేను తెలుగు పత్రికల సాహిత్య సేవను గురించి వ్రాసిన వ్యాసం బాగు లేదన్నారండీ – అన్నాను మిత్రులు శ్రీ సెట్టి ఈశ్వరరావుతో అయన అంతేలెండి ఆయన తప్పులను ఒప్పులు చేయలేడు గాని ఒప్పులను తప్పులు చేయగల – అన్నారు శ్రీ ఈశ్వరరావు చలోక్తిగా

## ఉత్తరాలు

(4 వ పేజీ తరువాయి)

## సీరియల్స్

మా అభిమాన రచయిత్రి సువర్ణాకన్నన్ గారి కలం నుంచి వెలువడుతున్న సీరియల్ మంజీర నాదం చాలా బాగుంది. వారం వారం వేయికళ్ళతో ఎదురు చూసేలా ఉంటుంది ఇంత మంచి సీరియల్ అందించి పాఠకులను ఆనందింప చేస్తున్న రచయిత్రికి నా హృదయపూర్వక అబినందనలు

శ్రీమతి పర్వతనేని వరలక్ష్మి నూజెళ్ల

★ ★ ★

వేయిపడగలు చాలా ఆసక్తికరంగా ఉంది మంజీరనాదం సీరియల్ సూపర్బ్ రేపటి మహిళ' సీరియల్ అనూహ్యమైన మలుపులతో కొనసాగుతోంది

మహమ్మద్ రఫీ, మాదవ కాశీబుగ్గ

## కథలు

రాజేంద్రప్రసాద్ రజనీల ముఖచిత్రంతో వెలువడిన సంచికలో 'లోతు తెలియని ఆదర్శం కథ చదివాను గజపతిరావుగారు తమ స్కూటరు మీద బలవంతంగా ఎక్కించుకున్న 'స్త్రీ ఎవరనేది చెప్పకుండా కథ చివరికంటా మంచి సస్పెన్స్ కీపప్ చేయటం చ లా బాగుంది

–వక్కలంక రామారావు అనపర్తి

## వ్యాసాలు

రాజేంద్రప్రసాద్, రజని ముఖచిత్రాలంకరణతో ముస్తాబై వచ్చిన ఆంద్ర సచిత్ర వారపత్రిక అత్యంతాకర్షణీయంగా వుంది సిద్ధ క్షేత్రం తిరుమల వ్యాసంలో అనేక విషయాలు తెలుసుకున్నాము

–పి వి రామనాదరావు
రేణుకాభవాని (మదిర)

## ధర్మపథం

25–1 అక్టోబరు అం స వారపత్రికలోని ఉత్తముడు – సామాన్యుడు ధర్మపథం' బాగుంది ఉత్తముడే కష్టనష్టాలను ఓర్చుకోగలడు సామాన్యుడు అందుకు విరుద్ధం అని 'బులుసు వేంకటరమణయ్య గారు చక్కగా వివరించారు.

–ఆర్ శ్రీను ప్రసూన బలిజేపల్లి

## న్యూఢిల్లీలేఖ

రాజేంద్రప్రసాద్ రజనిల ముఖచి[illegible] వెలువడిన ఆంద్రసచిత్ర వారపత్రిక బాగుంది మనమే బోఫోర్స్ వెంటపడ్డామా? జయదుబాషి గారి న్యూఢిల్లీలేఖలో బోఫోర్స్ గురించి చాలా [illegible] వివరించారు

నాగండ్ల వెంకటేశ్వరరావు రమేష్
అమ్మాపాలెం

## శీర్షికలు

వ్యక్తిగతం ద్వారా ఎందరినో మాకు పరిచయం చేస్తున్నారు. ఈ శీర్షిక విజ్ఞాన దాయకంగానూ, ఆసక్తిదాయకంగానూ వుంటున్నది


దామెర్ల గీత నెల్లూరు

★ ★ ★

25-9 87 సంచికలో దూరదర్శనంలో లతగారు ప్రధాని ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భంగా అన్న గారిని గురించి రాసింది అక్షరాలా సత్యం ఒక నగ్నసత్యం ధైర్యంగా రాసినందుకు అభినందిస్తున్నాను

కె రామారావు హైదరాబాద్ ☐

Printed and Published for Nageswara Rao Estates Private Ltd, by S Nageswara Rao, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada - 520 003 Acting Editor, M Madhava Rao, Chief Editor S. Radhakrishna.
Phones Business 61247, 61248, 75569 Editorial 75667



జీవం ఉట్టిపడేలా చేసే లిరిల్ తాజాదనం.
Liril
THE FRESHNESS SOAP
Liril
లిరిల్
తాజాదనపు సబ్బు
వళ్లు పులకరింపజేసే నిమ్మకాయల తాజాదనంతో.
LINTAS LR P 54 2720



# న్యూఢిల్లీ లేఖ

డా. జయ్ దుబాషి

# మన రాజకీయ వ్యవస్థలోనే లోపం ఉన్నదా?

నేను 103 మందిని లెక్క పెట్టాను. ఔను అక్షరాల నూట ముగ్గురు భద్రతా సిబ్బందిని ఇవాళ ఉదయం నా కార్యాలయానికి వెళుతూ లెక్కించాను. అంతమందీ ఉన్నది నా ఇంటికీ, ప్రధాన మంత్రి ఇంటికీ మధ్యనున్న రెండు మైళ్ళ దూరంలో మాత్రమే. ఆ భద్రతా సిబ్బంది ఎక్కడ బడితే అక్కడ కనబడ్డారు. కొందరు ఇసుక బస్తాల వెనుక, కొందరు చెట్ల చాటున, పొదల చాటున, కనీసం ఒకరినైనా అశోకా హోటల్ సమీపంలో ఉన్నటువంటి ఎత్తయిన చెట్టు కొమ్మల్ల మీద కూచుని ఉండగా కూడా చూశాను. ఆ హోటల్ రేస్ కోర్స్ రోడ్డులోని ఐదో నెంబరు ఇంటి నుంచి కొన్ని ఫర్లాంగుల దూరంలో ఉంది. ఆ ఇంట్లోనే ప్రధాన మంత్రి నివసిస్తారని మీకూ తెలుసనుకుంటాను. ఒక చోట స్టెన్ గన్‌లు, రైఫిళ్ళూ పట్టుకున్న పది మందిని చూశాను. వాళ్ళ ముందు నుంచి కదిలి పోతుండగా నా కొక భావం కలిగింది. మన మంత్రులను రక్షించడానికి అంత మంది సాయుధ వ్యక్తులు – అందుల్లోనూ బహుశా చాల బంది సైన్యం నుంచి తీసుకొచ్చిన వాళ్ళు – అవసర మవుతున్నారంటే, అటువంటి మంత్రులను అధికారంలోకి తీసుకొస్తున్నటువంటి మన రాజకీయ వ్యవస్థ లోనే ఏదో లోపం ఉండి ఉంటుందని నాకనిపించింది.

ప్రపంచంలో కెల్లా బహుశా అతి శక్తివంతమైనటువంటి ప్రభుత్వానికి అధినేతగా ఉన్న రొనాల్డ్ రీగన్ తనకు భద్రతగా వందలాది మందిని నియమించుకుని ఉంటారని మీరనుకోవచ్చు. కానీ రెండు నెలల క్రితం వైట్ హౌస్‌లో నేను ఆయనను కలిసినప్పుడు ఆయనకు రక్షణగా ఒక డజను మందికన్నా ఎక్కువ లేరు. వాళ్ళలో కూడా ఐదుగురో ఆరుగురో సాయుధంగా ఉన్నారు. వైట్ హౌస్ లోకి ప్రవేశించడం చాలా సులభం. అనుమతి పత్రాలు అక్కర్లేదు. పార్లమెంటు సభ్యులో, మంత్రులో వ్రాసి ఇచ్చేటటువంటి పరిచయ పత్రాలక్కర్లేదు. మీరు చేయవలసిందల్లా అక్కడున్న క్యూలో చేరిపోయి వైట్‌హౌస్ సింహద్వారం వరకూ నడుస్తూ పోవడమే. అక్కడ మిమ్మల్ని మామూలుగా విమానాశ్రయాల్లో పరీక్షించినట్టుగా మెటల్ డిటెక్టర్‌లతో పరీక్షించి భవనంలో తిరగనిస్తారు. ఒక గంటలోపల మీరు ఆ భవన మంతా తిరిగి బైటపడి ఒక టాక్సీ పట్టుకుని ఇంటికి వెళ్ళిపోవచ్చు.

మన ప్రధానమంత్రి ఇంటి దగ్గర క్యూలేమీ లేవు, ఎందుకంటే ప్రత్యేకంగా అనుమతి ఉంటే తప్ప ఎవరినీ లోపలికి ప్రవేశించనివ్వరు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి శంకరరావు చవాన్ బిగ్‌బాస్‌ను చూడకుండానే ఐదుసార్లు వెనక్కి వెళ్ళి పోవల్సి వచ్చింది. రాజీవ్‌కు ఆయనను చూడడానికి తీరిక లేకపోయింది. తన స్వంతమనిషిని, అందులోనూ బొంబాయికి పంపించక ముందు తన హోం మంత్రిగా ఉన్నటువంటి వ్యక్తిని చూడడానికి రాజీవ్‌కు వ్యవధి లేదంటే ఆ మహానుభావుడి దర్శనం కోసం ఇతరులు ఎంతెంతకాలం వేచి చూస్తున్నారో నాకు తెలియదు!

ప్రధానమంత్రి ఇంటి చుట్టూరా ఉన్న ప్రాంతం ఢిల్లీ మొత్తం మీద, కచ్చితంగా దేశం మొత్తం మీద సంపన్న మైన ప్రాంతం. మీరక్కడికి వెళ్ళిన ప్రతిసారీ డజన్ల కొద్దీ కార్మికులు అక్కడ ఏదో ఒక దాన్ని మరమ్మతు చేస్తూ కనబడతారు. అక్కడ ప్రతీదీ శుభ్రంగా, తీర్చి దిద్దినట్టుగా ఉంటుంది. ఆ ప్రాంతం చూస్తే ఎవరైనా అసలు తను భారత దేశంలోనే ఉన్నానా లేదా అని ఆశ్చర్య పోతారు. అక్కడి రోడ్లను సంవత్సరం పొడుగునా కొత్తగా వేస్తూనే ఉంటారు. ఒకసారి కొత్త సిమెంటు పొర పరుస్తారు. ఒకసారి ఫుట్‌పాత్‌ల మీద కొత్త పెంకులు పరుస్తారు. బంగళాల చుట్టూ కొత్త, వింతయినటువంటి ఇనుప కంచెలు నాటుతారు. దేశంలో కెల్లా బహుశా అతిచిన్న దయినటువంటి ఢిల్లీ మునిసిపల్ కమిటీకి బడ్జెట్ మాత్రం బహుశా చాలా పెద్దది. అది 500 కోట్ల రూపాయలకన్న ఎక్కువ. హైదరాబాద్ వైశాల్యంలో పదో వంతుకు కూడా మించని ప్రాంతం కోసం ఇన్ని నిధులున్నాయి. ఇదంతా కూడా ఓ పుంజీడు మంత్రుల కోసం మాత్రమే. ఎందుకంటే ఈ కమిటీ న్యూఢిల్లీ నగరం మొత్తం పట్ల శ్రద్ధ వహించదు. ఒక చిన్న ప్రాంతానికే పరిమితమవుతుంది. దాని పాలకవర్గంలో ఎన్నుకోబడిన సభ్యులు లేరు.

మరి ఆ ఇతర ప్రాంతాలెట్లా ఉంటాయి? నేను ప్రధాన మంత్రి ఇంటి నుంచి కొన్ని మైళ్ళ దూరంలో నివసిస్తుంటానని ఇదివరకే చెప్పాను. కాని ఇప్పటికే అక్కడ పాత ఢిల్లీలోకన్నా ఎక్కువ మురికి వాడలున్నాయి. ఎవరైనా సరాసరి వచ్చి ఇక్కడ ఫుట్‌పాత్ మీద గుడారం వేసుకొని బతుకు వెళ్ళదీయవచ్చు. ఎవరూ పట్టించుకోరు. మునిసిపల్ కమిటీ పర్యవేక్షణలో ఉన్నటువంటి ప్రాంతాన్ని వదిలివస్తే మీ ఇష్టారాజ్యంగా మీరుండవచ్చు. వేసవికాలమంతా మేం గంటలకొద్దీ విద్యుచ్ఛక్తి లేకుండా గడిపేసాము. పట్టించుకున్న వాళ్ళు లేరు. కాని ప్రధానమంత్రి ఇంట్లో విద్యుచ్ఛక్తి లేకుండా ఉన్నటువంటి ఒక్క సందర్భాన్నయినా నేను చూడలేక పోయాను. నేను ఆ ఇంటి ముందునుంచి రోజూ కనీసం రెండు సార్లు,

(73 వ పేజీ చూడండి)

